సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 40

బుధవారం 25-10-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'



దక్షిణాఫ్రికా ధమాకా

వరల్డ్‌కప్‌లో బంగ్లాదేశ్‌పై 149 పరుగుల తేడాతో గెలుపు - 12లో



మూడో అతిపెద్ద ఆర్థిక శక్తి

2030 నాటికి 7.3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా భారత్ - 13లో



ఒక్కరోజులో 704 మంది బలి

ఇజ్రాయెల్ సైన్యం 24 గంటల వ్యవధిలో 400 వైమానిక దాడులు చేయగా.. 704 మందికి పైగా పాలస్తీనియన్లు మరణించారు.

వివరాలు 6లో ▸



సన్నిహిత అధికారికి 'కేబినెట్' హోదా

ప్రభుత్వ సర్వీస్ నుంచి వీఆర్‌ఎస్ తీసుకున్న అధికారి పాండ్యన్‌కు ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్ కేబినెట్ మంత్రి హోదా ఇచ్చారు.

వివరాలు 6లో ▸



అరగంటలో 158 కార్లు ఢీ

అమెరికాలోని లూసియానాలో దట్టమైన పొగ వల్ల అరగంటలో 158 వాహనాలు ఢీకొని.. ఏడుగురు మృతి చెందారు.

వివరాలు 6లో ▸



దివికేగిన దిగ్గజం

భారత క్రికెట్ స్పిన్ బౌలింగ్ దిగ్గజం బిషన్ సింగ్ బేడీ అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. పలువురు ప్రముఖులు నివాళులర్పించారు.

వివరాలు 12లో ▸

విప్లవాన్ని వివరిద్దాం

రేపటి నుంచి రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ 'సామాజిక సాధికారత' బస్సు యాత్ర

గత 53 నెలల సామాజిక విప్లవాన్ని, సంక్షేమాభివృద్ధిని వివరించనున్న నేతలు

- ఉత్తరాంధ్రలో ఇచ్ఛాపురం, కోస్తాలో తెనాలి, రాయలసీమలో శింగనమలలో ఒకేసారి ప్రారంభం
- ప్రతి రోజూ 3 చోట్ల ఒక్కో నియోజకవర్గంలో యాత్ర; ఒక్కో ప్రాంతంలో బహిరంగ సభ
- ఎమ్మెల్యే లేదా నియోజకవర్గ సమన్వయకర్త సారథ్యంలో డిసెంబరు 31 వరకూ యాత్ర
- గడిచిన 53 నెలల్లో సామాజిక న్యాయానికి చిత్తశుద్ధితో కొత్త అర్థం చెప్పిన సీఎం జగన్
- సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ రూపంలో పేదల ఖాతాల్లోకి రూ.2.38 లక్షల కోట్లు
- ఇందులో 75 శాతం నిధులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఖాతాల్లోకే
- ప్రత్యక్ష నగదు బదిలీయేతర పథకాల ద్వారా పేదలకు మరో రూ.2.33 లక్షల కోట్లు
- స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి ఇప్పటిదాకా రాష్ట్రంలో 4 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు
- ఇందులో 2.07 లక్షల ఉద్యోగాలు గడిచిన 53 నెలల్లోనే... అంటే 50 శాతానికి పైనే
- అందులో 80 శాతం ఉద్యోగాలు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకే.. కేబినెట్ నుంచి నామినేటెడ్ వరకూ సింహభాగం పదవులు ఆ వర్గాలకే
- వైఎస్ జగన్ చిత్తశుద్ధితో చంద్రబాబుకు పోలికే లేదంటున్న సామాజికవేత్తలు



సాక్షి, అమరావతి: వైఎస్సార్ సీపీ 'సామాజిక సాధికార యాత్ర' గురువారం ఉత్తరాంధ్రలో ఇచ్ఛాపురం, కోస్తాలో తెనాలి, రాయలసీమలో శింగనమల నియోజకవర్గాల్లో ఒకే సారి ప్రారంభం కాబోతోంది. ఈ మూడు ప్రాంతాల్లోనూ రోజుకు ఒక్కో నియోజకవర్గం చొప్పున యాత్ర కొనసాగుతుంది. యాత్రలో భాగంగా ఆ నియోజకవర్గంలో సభనూ నిర్వహిస్తారు. అంటే రోజూ మూడు ప్రాంతాల్లో మూడు సభలు. స్థానిక ఎమ్మెల్యే లేదా నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త సారథ్యంలో

మిగతా 2వ పేజీలో ▶

1న జనసేన, టీడీపీ ఉమ్మడి మేనిఫెస్టో

ఆ తర్వాత ఇంటింటికీ ప్రచారం ప్రారంభిస్తాం

- చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారు.. సాంకేతిక సమస్యలు చూపుతూ బెయిల్ రాకుండా అడ్డుకుంటున్నారు
- ఆయనకు ధైర్యాన్ని ఇవ్వడానికే రాజమహేంద్రవరంలో భేటీ
- ఇరు పార్టీల సమన్వయ కమిటీ తొలి భేటీలో పవన్ కళ్యాణ్

- వివరాలు 3లో



మీడియాతో మాట్లాడుతున్న పవన్ కళ్యాణ్. చిత్రంలో నారా లోకేశ్ తదితరులు


బాబు కోసం పుట్టిన పార్టీ జనసేన



- సున్నా సున్నా కలిసినా, హెచ్చించినా సున్నానే
- పవన్ కళ్యాణ్ టీడీపీతో విడిపోయింది ఎప్పుడు..?
- చంద్రబాబు అరెస్టు అక్రమమా?
- కాపులపై చంద్రబాబు పెట్టిన కేసులు అక్రమం కాదా?
- రాష్ట్రానికి టీడీపీ తెగులు పట్టుకుని చాలా కాలమైంది
- ఈ తెగులుకు త్వరలో అంతిమ సంస్కారం
- జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ధ్వజం

- వివరాలు 3లో

ఫ్యాక్ట్ చెక్



బీమాతో రైతులకు ధీమా కనిపించడంలేదా?

- వాస్తవాలు తెలుసుకోకుండా రామోజీ విషపు రాతలు
- ఖరీఫ్–2023 సీజన్ కోసం అక్టోబర్ 31 నాటికి ఈ–క్రాప్ నమోదు
- సామాజిక తనిఖీ, గ్రామ సభల ద్వారా తుది జాబితా ప్రదర్శన
- అన్ని పనులు సక్రమంగా సాగుతున్నా కూడా ఈనాడు బురద రాతలు

10లో

న్యూస్‌రీల్

బంగాళాఖాతంలో తీవ్ర తుపాను



బంగాళాఖాతంలో తీవ్ర తుపాను కొనసాగుతోంది. ఇది బుధవారం వేకువజామున తుపానుగా బలహీనపడి బంగ్లాదేశ్‌లోని చిట్టగాంగ్ సమీపంలో తీరాన్ని దాటుతుందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. దీనికి 'హమూన్'గా నామకరణం చేశారు.

వివరాలు 6లో ▸

తిరుమలలో ఘనంగా పార్వేట ఉత్సవం



తిరుమలలో 9 రోజులపాటు జరిగిన శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. సోమవారం బంగారు తిరుచ్చి ఉత్సవం, చక్రస్నానం నిర్వహించారు. మంగళవారం మలయప్పస్వామి వారి పార్వేట ఉత్సవం ఘనంగా జరిగింది.

వివరాలు 5లో ▸

కొత్తగా 40 డిప్యూటీ కలెక్టర్ పోస్టులు

ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

- అతి త్వరలో 44 మంది తహశీల్దార్లకు డిప్యూటీ కలెక్టర్లుగా చాన్స్
- ఇప్పటికే 63 డిప్యూటీ కలెక్టర్ పోస్టుల మంజూరు, ఆ మేరకు పదోన్నతులు
- ఆరు నెలల కాలంలోనే 107 డిప్యూటీ కలెక్టర్ పోస్టులు
- తహశీల్దార్లుగా 370 మంది డిప్యూటీ తహశీల్దార్లకు అవకాశం
- గతంలో ఎవరూ చేయని మేలును ప్రభుత్వం చేసిందంటున్న ఉద్యోగ సంఘాలు



సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో ఎప్పటికప్పుడు కొత్త పోస్టుల మంజూరుతో వీఆర్‌ఏల నుంచి తహశీల్దార్ల వరకు పదోన్నతులు దక్కుతున్నాయి. తాజాగా రెవెన్యూ శాఖలో కొత్తగా 40 డిప్యూటీ కలెక్టర్ పోస్టులు మంజూరయ్యాయి. ఈ మేరకు ఇటీవల ప్రభుత్వం జీవో ఎంఎస్ నంబర్ 973 జారీ చేసింది. దీంతో అతి త్వరలో రాష్ట్రంలో 44 మంది తహశీల్దార్లకు

మిగతా 3వ పేజీలో ▶

నిజం గెలిచింది.. బాబు జైలుకెళ్లారు

- అనేక కుంభకోణాల్లో అడ్డంగా దొరికిన చంద్రబాబు
- ఓటుకు కోట్లు కేసుతో హైదరాబాద్ నుంచి అమరావతికి మకాం
- అమరావతి పేరుతో అక్రమాలు
- స్కిల్ స్కామ్, ఫైబర్‌నెట్, ఇన్నర్ రింగ్ రోడ్డు, అసైన్‌మెంట్ భూముల పేరిట అక్రమాలు
- టిడ్కో ఇళ్లు, తాత్కాలిక నిర్మాణాల పైనా ఐటీ దృష్టి.. స్కిల్ స్కామ్‌లో ఆధారాలతో దొరికి జైలుకెళ్లిన బాబు
- ఇప్పట్లో బయటకు వచ్చే అవకాశాల్లేవు
- యువగళం యాత్ర ఆపేసి ఢిల్లీకి వెళ్లిపోయిన నారా లోకేశ్
- భువనేశ్వరిని ముందు పెట్టి 'నిజం గెలవాలి' అంటూ యాత్ర
- మామూలుగా చనిపోయిన వారిని టీడీపీ జాబితాలో వేశారని విమర్శలు

3లో

వైఎస్సార్‌సీపీ కార్యకర్త దారుణ హత్య

పల్నాడు జిల్లా జంగమహేశ్వరపురానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త కూనిరెడ్డి కృష్ణారెడ్డి(32)ని పులిపాడు గ్రామం వద్ద టీడీపీ నేతలు కాపుకాసి కత్తులు, వేట కొడవళ్లతో విచక్షణారహితంగా నరికి చంపారు. నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

- వివరాలు 3లో

ఇదండీ సంగతి



సీఎం ఎవరుకారో నిర్ణయిస్తే చాలు! ఎందుకంటే అందరూ సీఎం అభ్యర్థులే!!

మురికికూపాలు.. సుందర జలాశయాలుగా..

పట్టణాల్లోని 196 చెరువులకు పునరుజ్జీవం

- మొదటి దశలో 101, రెండో దశలో 95 సుందరీకరణ
- రూ.522 కోట్లతో జలాశయాలకు కొత్తందాలు
- మున్సిపాలిటీల్లో వరద నష్టాన్ని తగ్గించి ఆహ్లాదాన్ని పంచేలా మార్పులు
- రక్షణ కంచె, వాకింగ్ ట్రాక్‌లు, లైటింగ్, ఓపెన్ జిమ్‌లు, పిల్లలకు ప్లేస్టేషన్లు ఏర్పాటు
- మొదటి దశలో ఇప్పటికే 50 జలాశయాల పనులు పూర్తి
- మిగిలినవి దాదాపు 80 శాతం పూర్తిచేసిన ఏపీ గ్రీనింగ్ కార్పొరేషన్
- దీంతో పట్టణాలకు ఈ చెరువులు సహజ రక్షణ వలయాలుగా నిలుస్తాయంటున్న నిపుణులు

2లో



నాడు



నేడు

గతంలో కలుషిత నీళ్లు, పిచ్చి మొక్కలతో నిండి ఉన్న విశాఖ జిల్లా గాజువాక సమీపంలోని అక్కిరెడ్డిపాలెం చెరువును అభివృద్ధి చేస్తున్న దృశ్యం

ప్రస్తుతం ఎంతో ఆహ్లాదకరంగా కనిపిస్తున్న ఈ చెరువు విశాఖ గాజువాక సమీపంలో ఉన్న అక్కిరెడ్డిపాలెం చెరువు. దాదాపు 23 ఎకరాలున్న ఈ జలాశయంలో స్థానికులు గతంలో చేపలు పెంచుకునేవారు. అయితే, విశాఖపట్నంలో పరిశ్రమల నుంచి వచ్చే కలుషిత జలాలు చెరువులో కలుస్తుండడంతో 30 ఏళ్లుగా పాడుబడిపోయింది. హైవేను ఆనుకుని ఉండడంతో సాయంత్రమైతే చెరువు గట్లు అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రమయ్యేవి. కబ్జాకోరులూ కన్నేశారు. పునరుజ్జీవ పథకంలో భాగంగా గ్రీనింగ్ కార్పొరేషన్ రూ.1.45 కోట్లతో అద్భుతంగా తీర్చిదిద్దుతోంది.

క్లుప్తంగా...

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి
సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: తెలుగువారందరికీ సీఎం వైఎస్ జగన్ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. 'చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి. అదే స్ఫూర్తితో మీరు కూడా విజయాలు సాధించాలని, ఆ దుర్గాదేవి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ, తెలుగు వారందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను' అంటూ సీఎం జగన్ మంగళవారం ట్వీట్ చేశారు.

రేపు తూర్పుగోదావరి జిల్లాలో సీఎం పర్యటన

సాక్షి, అమరావతి: సీఎం వైఎస్ జగన్ గురువారం తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సోదరుడు విజయ్‌గణేశ్ మోహన్ వివాహ రిసెప్షన్‌కు సీఎం హాజరుకానున్నారు. ఇందుకోసం గురువారం ఉదయం 10.15 గంటలకు తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరి రాజానగరం మండలం దివాన్‌చెరువుకు సీఎం చేరుకుంటారు. డి.బి.వి.రాజు లే-అవుట్‌లో నిర్వహించే విజయ్ గణేశ్ వివాహ రిసెప్షన్‌కు హాజరవుతారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి తాడేపల్లిలోని తన నివాసానికి చేరుకుంటారు.

కొత్తగా 11 రహదారులకు ఎన్‌హెచ్ హోదా

సాక్షి, అమరావతి: ఏపీలో 688 కి.మీ. మేర 11 రహదారులను జాతీయ రహదారులు (ఎన్‌హెచ్)గా కేంద్రం గుర్తించింది. రాష్ట్రంలో 20 రహదారులను ఎన్‌హెచ్‌లుగా ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర రవాణా, జాతీయ రహదారుల శాఖకు ఈ ఏడాది ప్రారంభంలో ప్రతిపాదించింది. ఆ మేరకు ఆ 20 రహదారులను 2 విడతల్లో ఎన్‌హెచ్‌లుగా ప్రకటించేందుకు కేంద్రం సుముఖత వ్యక్తం చేసింది. తొలి దశలో 688 కి.మీ.మేర 11 రహదారులను ఎన్‌హెచ్‌లుగా గుర్తించగా..వాటిలో రాయలసీమలో 8, కోస్తాలో 3 రహదారులున్నాయి. ఈ మేరకు ఆ రహదారుల విస్తరణ, అభివృద్ధికి నిధులు కేటాయించనుంది. రెండో దశలో ఈ ఏడాది చివరి నాటికి మిగిలిన 9 రహదారులనూ ఎన్‌హెచ్‌లుగా గుర్తించనుంది. తొలి దశ కింద బేస్తవానిపేట-ఒంగోలు, భీమవరం-తాడేపల్లిగూడెం, పటు్నరు-కోలార్(కర్ణాటక), అనంతపురం జిల్లాలోని ఎన్‌హెచ్ 67పై ఆంజనేయస్వామి జంక్షన్-కర్ణాటక సరిహద్దు వరకు, రాయచూర్ సమీపంలోని చేలూరు-తనకల(కర్ణాటక), పెనుగొండ-పావగడ (కర్ణాటక), తుమకూరు-వేపరాళ్ల, గుత్తి-కొతలం, నరసాపురం-రాజోలు, సబ్బవరం-మల్కనగిరి(ఒడిశా), పలాస-పద్మాపూర్ (ఒడిశా) రహదారులకు జాతీయ హోదా కల్పించింది.

రాష్ట్రంలో రెండు లెదర్ పార్కులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రెండు లెదర్ పార్కుల ఏర్పాటుకు చర్మకార ఉత్పత్తుల పారిశ్రామికాభివృద్ధి సంస్థ (లిడ్‌క్యాప్) కసరత్తు ముమ్మరం చేసింది. ఇందుకోసం కృష్ణా జిల్లా జి.కొండూరు, ప్రకాశం జిల్లా యదవల్లిని ఎంపిక చేసింది. రెండు లెదర్ పార్కులను ఏర్పాటు చేసేందుకు రూ.12కోట్లు మంజూరయ్యాయి. లెదర్ పార్కుల్లో చర్మకార ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇవ్వడంతోపాటు ముడిసరుకు సమకూర్చ నున్నారు. వీటితోపాటు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, కృష్ణా, గుంటూరు, కర్నూలు, అనంతపురం జిల్లాలతో పాటు తిరుపతిలో ఇప్పటికే ఉన్న లిడ్‌క్యాప్ స్థలాల్లో పార్కులను అభివృద్ధి చేసి శిక్షణా కేంద్రాలుగా తీర్చిదిద్దే ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ఈ సెంటర్ల ద్వారా యువతకు శిక్షణ ఇవ్వడంతోపాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మురికికూపాలు.. సుందర జలాశయాలుగా..

పట్టణాల్లోని 196 చెరువులకు పునరుజ్జీవం





ఈ ఫొటోలో కనిపిస్తున్నది గుంటూరు మున్సిపాలిటీలోని అంకిరెడ్డి పాలెం చెరువు. దాదాపు 12 ఎకరాలకు పైగా ఉన్న ఈ చెరువు ముప్పై ఏళ్ల క్రితం వరకు తాగునీటిని అందించింది. ఆ తర్వాత ఎవరూ పట్టించుకోకపోవడంతో మురుగునీరు, జారిపోయిన గట్లు, ముళ్ల చెట్లతో నిండిపోయింది. దీనినిప్పుడు ఏపీ అర్బన్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ కొత్తగా తీర్చిదిద్దుతోంది. పటిష్టమైన గట్లు, సెంట్రల్ లైటింగ్, వాకింగ్ ట్రాక్ నిర్మాణంతో సందర్శకులకు నిలయమైంది. పక్కనే ఓపెన్ జిమ్, పిల్లలకు ప్లే స్టేషన్ సైతం ఏర్పాటుచేస్తున్నారు. వచ్చేనెలలో అందుబాటులోకి తీసుకొస్తున్నారు.



శ్రీ సత్యసాయి జిల్లా హిందూపూర్‌లోని అభివృద్ధి చేస్తున్న సూరపుకుంట చెరువు

చెరువుల అభివృద్ధి ఇలా..

- మురుగుతో నిండిపోయిన జలాశయాలను శుద్ధి చేస్తారు.
- గట్లను పటిష్టం చేయడం, వీలైనంత ఎక్కువగా పచ్చదనాన్ని అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే పార్కుల్లా తీర్చిదిద్దుతారు.
- గట్లపై వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం, చుట్టూ రక్షణ కంచె ఏర్పాటుచేస్తారు.
- ఓపెన్ జిమ్, పిల్లలకు ప్లే స్టేషన్ వంటి సౌకర్యాలను కల్పిస్తారు.
- ఆక్రమణలు జరగకుండా చుట్టూ రక్షణగా ఇనుప కంచె వేస్తున్నారు.

(నానాజీ అంకంరెడ్డి, సాక్షి ప్రతినిధి)

నిర్లక్ష్యానికి నిలయాలుగా.. అపరిశుభ్రతకు ఆలవాలంగా.. కాలుష్యపు కాసారాలుగా మారిన పట్టణాల్లోని చెరువులకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త రూపు తీసుకొస్తోంది. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా చూడముచ్చటగా అభివృద్ధి చేస్తోంది. పార్క్ వాతావరణం, గట్లపై వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం, చుట్టూ రక్షణ కంచె, ఓపెన్ జిమ్, పిల్లలకు ప్లే స్టేషన్ వంటి సౌకర్యాలను ఏర్పాటుచేస్తోంది. వరద నీరు సరైన మార్గంలో అందులోకి చేరేలా, నిండిన తర్వాత ఎలాంటి ఆటంకం లేకుండా బయటకు వెళ్లేలా తీర్చిదిద్దుతున్నారు. ముఖ్యంగా మురుగు నీరు వాటిల్లోకి చేరకుండా అడ్డుకట్ట వేస్తున్నారు.

మొదటి దశలో 101 జలాశయాలను, రెండో దశలో మరో 95 చెరువులను సుందరీకరించే పనిని ఏపీ అర్బన్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ (ఏపీయూజీబీసీ) ఇప్పటికే చేపట్టింది.

రాష్ట్రంలోని చెరువులను పునరుద్ధరించి, తిరిగి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలోని 123 పట్టణ స్థానిక సంస్థల్లో (యూఎల్బీలు-అర్బన్ లోకల్ బాడీలు) 196 చెరువులను ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా అభివృద్ధి చేస్తోంది. ఇందుకోసం రూ.522 కోట్లను వెచ్చిస్తోంది. మొదటి దశలోని 101 జలాశయాల్లో ఇప్పటికే 50 చెరువుల్లో సుందరీకరణ పనులు దాదాపు పూర్తిచేశారు. ఆయా పనులకు అవసరమైన ప్రణాళికను పురపాలక శాఖ రూపొందించి, ఇప్పటికే అమలుచేస్తోంది. ఈ నవంబర్ నాటికి అందుబాటులోకి తీసుకొస్తోంది. మొదటి దశలోని చెరువుల్లో సగం చెరువుల పనులు పూర్తిగా, మిగతావి దాదాపు 80 శాతం పూర్తయ్యాయి.

వరద నష్టాన్ని నివారించేలా మార్పులు..

వరదలు వచ్చినప్పుడల్లా పట్టణాల్లో వీధులు నీట మునగడం పరిపాటిగా మారి, ప్రజా జీవనానికి తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ నేపథ్యంలో.. కేంద్ర ప్రభుత్వం సైతం పట్టణాల్లోని చెరువులను అమృత్ 2.0 పథకంలో అభివృద్ధి చేస్తోంది. ఇదే క్రమంలో ఏపీలోని పట్టణ జలాశయాలకు సైతం రాష్ట్ర ప్రభుత్వం కొత్తరూపు తీసుకొచ్చేందుకు నడుంబిగించింది. మొదటి దశలోని 101 చెరువులను రూ.189.07 కోట్లతోను, రెండో దశలో 95 చెరువులకు రూ.332.97 కోట్లతోను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ ప్రాజెక్టులో చెరువులను వినియోగంలోకి తీసుకొచ్చి, వరద నీరు సరైన మార్గంలో అందులోకి చేరేలా, నిండిన తర్వాత ఎలాంటి ఆటంకం లేకుండా బయటకు వెళ్లేలా చెరువులను అభివృద్ధి చేస్తున్నారు. ప్రధానంగా వర్షపు నీరు తప్ప మురుగునీరు చెరువుల్లోకి చేరకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే వాటిల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి, మురుగును శుద్ధిచేసి నీటిని స్వచ్ఛంగా మారుస్తున్నారు. జలాశయాల గట్లను రాళ్లతో పటిష్టం చేసి గట్లపై మొక్కలు నాటుతున్నారు. దీనివల్ల వరదలు సంభవించినప్పుడు ఆయా పట్టణాలకు ఈ చెరువులు సహజ రక్షణ వలయాలుగా నిలుస్తాయని నిపుణులు చెబుతున్నారు.

తాగునీటి చెరువులుగా మార్పు



జలాశయాల పునరుజ్జీవంలో మొదటి విడతగా 101 చెరువులను తీసుకున్నాం. ఇవి సుమారు 5 వేల ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. వీటిలో 50 జలాశయాల పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయి. ప్రతి చెరువును శుద్ధమైన నీటితో ఉండేలా ప్రక్షాళన చేయడంతో పాటు, గట్లను పటిష్టం చేసి, పార్కులు, వాకింగ్ ట్రాక్, సెంట్రల్ లైటింగ్, ఓపెన్ జిమ్, పిల్లలకు ఆట స్థలం, వస్తువులతో పాటు చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేస్తున్నాం. పట్టణంలో కురిసిన వర్షపునీరు చెరువులోకి చేరేలా.. అక్కడ నుంచి బయటకు వెళ్లేలా ఇంజినీరింగ్ పనులు చేస్తున్నాం. తాగునీటి చెరువులను సైతం అభివృద్ధి చేస్తున్నాం. నవంబర్‌కి మొదటి దశ చెరువుల అభివృద్ధి పనులు పూర్తిచేస్తాం.

– బొమ్మిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఏపీయూజీబీసీ ఎండీ

స్థలాల రేట్లు పెరిగాయి



ఈ ఊరిలో ఇక్కడే పుట్టి పెరిగాం. ఈ చెరువు నీటితోనే గ్రామం దాహం తీర్చుకునేది. కానీ, గత 30 ఏళ్లుగా నిరుపయోగంగా మారిపోయింది. ఊరు గుంటూరులో కలిసిపోయినా ఇటువైపు ఎవరూ వచ్చేవారు కాదు. ప్రభుత్వం ఈ చెరువును పార్కులా మారుస్తుండడంతో చుట్టుపక్కల స్థలాల రేట్లు పెరిగాయి. చుట్టూ వెంచర్లు కూడా వస్తున్నాయి. వచ్చే ఐదేళ్లల్లో ఈ ప్రాంతమంతా కొత్త పట్టణంగా మారిపోతుంది.

– అప్పిరెడ్డి, అంకిరెడ్డిపాలెం (గుంటూరు)

మా ప్రాంతానికి ఐకాన్



గతంలో ఈ చెరువులో చేపలు పెంచేవాళ్లం. కలుషిత నీరు చేరడంవల్ల చేపలు చనిపోతుండడంతో మానేశాం. వాకింగ్‌కు భారత్ హెవీ ప్లేట్స్ అండ్ వెజెల్స్ లిమిటెడ్ (బీహెచ్‌పీవీ)కి వెళ్లాల్సి వస్తోంది. కానీ, ఇప్పుడు మా చెరువును ప్రభుత్వం అభివృద్ధి చేస్తుండడంతో ఇకపై వాకింగ్‌కు, పిల్లలు ఆడుకునేందుకు ఎక్కడికీ వెళ్లక్కర్లేదు. ఈ ప్రాంతానికి ఇప్పుడీ చెరువు ఐకాన్‌లా మారుతోంది.

– వి.వెంకటరమణ, అక్కిరెడ్డిపాలెం (విశాఖ)

ఆక్రమణలు తొలగించి ఆహ్లాదకరంగా..



విశాఖపట్నం లంకెలపాలెం చెరువు మూడెకరాలకు పైగా ఉండేది. 20 ఏళ్లుగా పట్టించుకోకపోవడంతో ఆక్రమణలు పెరిగిపోయి అసాంఘిక పనులకు అడ్డాగా మారిపోయింది. ఇన్నేళ్లకు అధికారులు ఆక్రమణలను తొలగించి అద్భుతంగా మారుస్తున్నారు. గతంలో వాకింగ్‌కు స్టీల్ ప్లాంట్‌కు వెళ్లేవాళ్లం. ఇప్పుడు ఈ చెరువు గట్టుపైనే చేస్తున్నాం. జిమ్, పార్కు కూడా అభివృద్ధి చేస్తున్నారు.

– సాలపు విజయకుమార్, లంకెలపాలెం (విశాఖపట్నం)

బోటింగ్ కూడా పెడుతున్నారు



హిందూపూర్‌లోని 113 ఎకరాల సూరపుకుంట చెరువు గత నెల వరకు గట్లు అడవిలా, పాములు, పందులకు నిలయంగా ఉండేవి. నీరు కూడా మురికిగా ఉండేది. అధికారులు పదిరోజుల్లో ఎంతో మార్పు తీసుకొచ్చారు. ఇప్పుడు చెరువు గట్టుపై వాకింగ్ చేస్తున్నాం. అధికారులు బోటింగ్ పెట్టాలని కూడా నిర్ణయించారు. బెంగళూరు, ఎలహంకలో ఇలా చెరువుల అభివృద్ధిని చూశాను.

– సింగిరెడ్డిపల్లి ప్రసాదరెడ్డి, హిందూపూర్

విప్లవాన్ని వివరిద్దాం

▶ మొదటి పేజీ తరువాయి

ఈ యాత్ర జరుగుతుంది. రాష్ట్రంతోపాటు ఆ నియోజకవర్గంలో సంక్షేమాభివృద్ధి పథకాలు, పదవుల పంపకంలో గతంలో ఎన్నడూ లేని రీతిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేసిన ప్రయోజనాన్ని ఈ యాత్ర ద్వారా ఆయా వర్గాలకు చెందిన మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలు వివరిస్తారు. గత ప్రభుత్వ హయాంలో సంక్షేమాభివృద్ధి పథకాలు, పదవుల పంపకంలో చంద్రబాబు చేసిన సామాజిక ద్రోహాన్ని.. టీడీపీ సర్కార్ అవినీతి, అక్రమాలు, దాష్టీకాలను ప్రజలకు గుర్తు చేస్తారు. సీఎం వైఎస్ జగన్ పేదల పక్షాన నిలిస్తే.. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, ఎల్లో మీడియాతో జట్టుకట్టి పెత్తందారీ వ్యవస్థకు దన్నుగా ఎలా నిలుస్తున్నారన్నది చూపిస్తారు. పేదల పక్షాన నిలిచిన సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీని గెలిపించాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరిస్తారు. వైఎస్సార్సీపీ గెలిచిన నాటి నుంచీ రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి నాలుగు కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఈనెల 9న విజయవాడలో నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల సభలో సీఎం వైఎస్ జగన్ చెప్పారు. ఆ నాలుగింట్లో.. గురువారం నుంచి డిసెంబరు 31 వరకు జరిగే ఈ యాత్ర ఒకటి.

ఇదీ... సామాజిక న్యాయం అంటే

సామాజిక న్యాయంలో వైఎస్ జగన్ దార్శనికతను ఇపుడు దేశం మొత్తం ప్రశంసిస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సంక్షేమ పథకాలతో ఆర్థికంగా చేయూతనిచ్చి పేదరికం నుంచి గట్టెక్కించడం ద్వారా ఆర్థిక సాధికారత.. అమ్మ ఒడి, విద్యాదీవెన వంటి పథకాలతో ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడం ద్వారా విద్యా సాధికారత.. నామినేటెడ్ నుంచి కేబినెట్ వరకూ సింహభాగం పదవులు ఇచ్చి పరిపాలనలో భాగస్వామ్యం ఇవ్వడం ద్వారా రాజకీయ సాధికారత.. సంక్షేమ పథకాల నుంచి పదవుల వరకూ మహిళలకు పెద్దపీట వేయడం ద్వారా మహిళా సాధికారతకు కృషి చేస్తుండటాన్ని



సామాజిక వేత్తలూ ప్రశంసిస్తున్నారు.

- సామాజిక న్యాయమనేది తమ నినాదం కాదని, తమ విధానమని నిరూపిస్తున్న వైఎస్ జగన్... ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 95 శాతాన్ని అమలు చేసి చూపించారు. ఇప్పటిదాకా 99.5 శాతం హామీలను అమలు చేసి... దేశ చరిత్రలోనే ఎన్నికల మేనిఫెస్టోకు కొత్త నిర్వచనం ఇచ్చారు.
- సంక్షేమ పథకాల కింద... ఒక్క పైసా అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి ఇప్పటిదాకా రూ.2.38 లక్షల కోట్లను జమ చేశారు. ఇందులో 75 శాతం నిధులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చేరాయి. నగదు బదిలీ కాకుండా ఇతర పథకాల ద్వారా రూ.2.33 లక్షల కోట్ల ప్రయోజనాన్ని చేకూర్చారు.
- నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేసిన సీఎం వైఎస్ జగన్.. పేద పిల్లలు ప్రపంచంతో పోటీ పడేలా ఇంగ్లీషు మీడియం బోధనను ప్రవేశపెట్టారు. అమ్మ ఒడి, గోరుముద్ద, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు విద్యా సాధికారత సాధించడానికి మార్గం సుగమం చేశారు.
- వైఎస్సార్ ఆసరా, చేయూత వంటి పథకాల ద్వారా ఆర్థికంగా తోడ్పాటును అందించి.. కేబినెట్ నుంచి నామినేటెడ్ వరకూ పదవుల్లో మహిళలకు పెద్దపీట వేసి మహిళా సాధికారతకు మార్గం వేశారు.

రాజ్యాధికారంలో సింహభాగం వారికే...

- 2019 ఎన్నికల్లో 50 శాతం ఓట్లు సాధించి.. 151 శాసనసభ స్థానాలు (86.28 శాతం), 22 లోక్‌సభ స్థానాల్లో (88 శాతం) వైఎస్సార్‌సీపీ విజయ ఢంకా మోగించింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన జగన్... తొలి మంత్రివర్గం నుంచే సామాజిక విప్లవానికి శ్రీకారం చుట్టారు. 25 మందితో ఏర్పాటు చేసిన కేబినెట్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన 14 మందికి (56 శాతం) స్థానం కల్పించారు. రాజ్యాధికారంలో సింహభాగం వాటా ఇచ్చారు.
- ఐదుగురు డెప్యూటీ సీఎంలను నియమిస్తే.. అందులో నలుగురిని (80 శాతం) ఆ వర్గాల నుంచే నియమించారు.
- శాసనసభ స్పీకర్‌గా బీసీ వర్గాలకు చెందిన తమ్మినేని సీతారాం, శాసనమండలి ఛైర్మన్‌గా రాష్ట్ర చరిత్రలో తొలి సారిగా ఎస్సీ వర్గానికి చెందిన కొయ్యే మోషేన్ రాజు, మండలి డిప్యూటీ ఛైర్‌పర్సన్‌గా మైనార్టీ వర్గానికి చెందిన మహిళ జకియా ఖానంకు అవకాశమిచ్చారు.
- 2022, ఏప్రిల్ 11న పునర్‌వ్యవస్థీకరణ ద్వారా 25 మందితో ఏర్పాటు చేసిన మంత్రివర్గంలో సామాజిక న్యాయం చేయడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మరో అడుగు ముందుకేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల వారికి ఏకంగా 17 మందికి (70 శాతం) మంత్రివర్గంలో స్థానం కల్పించారు.
- టీడీపీ అధికారంలో ఉన్న ఐదేళ్లలో రాజ్యసభకు బీసీ వర్గానికి చెందిన ఒక్కరిని కూడా పంపించలేదు. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర కోటాలో 8 స్థానాలు ఖాళీ అయితే.. అందులో నలుగురు బీసీలను (50%) సీఎం వైఎస్ జగన్ రాజ్యసభకు పంపారు.
- ఇక శాసనమండలిలో వైఎస్సార్‌సీపీకి 43 మంది ఎమ్మెల్సీలు ఉంటే.. ఇందులో 29 మంది(68 శాతం) బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారే. 2014–19 మధ్య అధికారంలో ఉన్న టీడీపీకి 48 ఎమ్మెల్సీ స్థానాలు దక్కితే.. అందులో కేవలం 18 పదవులు (37 శాతం) మాత్రమే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారికిచ్చారు చంద్రబాబు. ఏమీ చెయ్యకుండా కూడా మీడియా బలంతో చెలామణి అయిన చంద్రబాబుకు అసలు సామాజిక న్యాయం గురించి మాట్లాడే హక్కుందా? రాజ్యాధికారంలో.. పరిపాలనలో సింహభాగం వాటా ఇవ్వడం ద్వారా తన చిత్తశుద్ధితో సామాజిక న్యాయానికి కొత్త అర్థం చెప్పిన సీఎం వైఎస్ జగన్‌తో బాబుకు పోలికెక్కడ?

▶ ఒకరేమో ఎస్సీల్లో పుట్టాలని ఎవరైనా కోరుకుంటారా అంటూ ఆ వర్గాన్ని హేళన చేసే నాయకుడు. మరొకరేమో ఆ వర్గానికి ఉప ముఖ్యమంత్రి, శాసనమండలి ఛైర్మన్.. రాష్ట్ర హోంమంత్రి వంటి పదవులిచ్చి గౌరవించిన నేత.

▶ ఒకరేమో న్యాయం చేయాలని అభ్యర్థించిన నాయీ బ్రాహ్మణులను తోకలు కత్తిరిస్తానంటూ.. మత్స్యకారులను తోలుతీస్తానంటూ బెదిరించిన నాయకుడు. మరొకరేమో కేబినెట్ నుంచి నామినేటెడ్ వరకూ పదవుల్లో, సంక్షేమాభివృద్ధి పథకాల్లో సింహభాగం బీసీలకే ఇచ్చిన నేత.

▶ ఇదే... మౌలికంగా చంద్రబాబు నాయుడికి, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఉన్న తేడా. అసలు ఎస్సీలను హేళన చేసి, బీసీలను బెదిరించి తన సామాజిక వర్గానికే, తన లాబీయిస్టులకే రాజ్యసభ పదవుల్లో అగ్రభాగం కట్టబెట్టిన చంద్రబాబుకు.... అధికారంలోకి వచ్చాక వైఎస్సార్‌సీపీకి దక్కిన రాజ్యసభ పదవుల్లో 50 శాతాన్ని బీసీలకే ఇచ్చిన జగన్‌తో పోలికే లేదు. బీసీలంటే వెనుకబడిన వర్గాలు కాదు రాష్ట్రానికి వెన్నెముక అంటూ చాటిచెప్పిన జగన్‌కు దరిదాపుల్లో కూడా లేని నాయకుడు చంద్రబాబు. అలాంటి చంద్రబాబు సైతం తనకున్న మీడియా బలంతో అన్నివర్గాలకూ న్యాయం చేస్తున్నట్లుగా కొన్నాళ్లు చెలామణి కాగలిగారు. కాకపోతే రోజులు మారి.. ఎప్పటికప్పుడు జనాలకు నిజాలు తెలుస్తున్నాయి.

▶ ఇదిగో... ఇలా వాస్తవాలు వివరించే క్రమంలోనే గత 53 నెలలుగా సీఎం జగన్ చేస్తున్న సామాజిక న్యాయాన్ని.. 2014–19 మధ్య చంద్రబాబు చేసిన సామాజిక ద్రోహాన్ని ప్రజల ముందు పెట్టడానికి 'సామాజిక సాధికారత యాత్ర' మొదలు కాబోతోంది. గురువారం నుంచి రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో ఒకే సారి వైఎస్సార్ సీపీ ఈ బస్సుయాత్రకు శ్రీకారం చుడుతోంది.

▶ చంద్రబాబుకు ఎన్నికల ముందు మాత్రమే జనం కనిపిస్తారు. అందుకే ఆయన శంకుస్థాపనలు చేసినా, పదవులిచ్చినా, జీవోలిచ్చినా అన్నీ ఎన్నికలకు నాలుగైదు నెలల ముందు మాత్రమే జరుగుతాయి. అది కూడా కొన్ని కాగితాలపైనే!!. 2014లో గెలిచిన చంద్రబాబు... 2019 ఎన్నికలకు రెండు నెలల ముందు మాత్రమే ఎస్టీకి తన కేబినెట్లో స్థానమిచ్చారు. గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేసిందీ అప్పుడే. గత ఎన్నికలకు రెండునెలల ముందు వరకూ ముస్లింలకు సైతం చంద్రబాబు కేబినెట్లో స్థానం లేదు. కానీ వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తన ప్రభుత్వం ఏర్పాటవుతూనే ఎస్టీలకు ఉపముఖ్యమంత్రి స్థానాన్నిచ్చారు. ముస్లిం వర్గానికి చెందిన వ్యక్తిని సైతం ఉప ముఖ్యమంత్రిని చేయటంతో పాటు ముస్లిం మహిళను శాసనమండలి ఛైర్‌పర్సన్‌గా నియమించారు. సంక్షేమాభివృద్ధి పథకాల నుంచి కేబినెట్-నామినేటెడ్ వరకూ ఆ వర్గాలకు పెద్దపీట వేశారు. అంతేకాదు!! కోడలు మగ పిల్లాణ్ణి కంటానంటే అత్త వద్దంటుందా? అంటూ మహిళల పుట్టుకనే హేళన చేసింది చంద్రబాబయితే... హోంమంత్రిగా, శాసనమండలి ఛైర్‌పర్సన్‌గా మహిళలను నియమించడమే కాక కేబినెట్ నుంచి నామినేటెడ్ వరకూ వారికి సింహభాగం పదవులిచ్చి, ఆసరా, చేయూత వంటి పథకాలతో ఆర్థికంగా తోడ్పాటునందిస్తున్నది వైఎస్ జగన్. సామాజిక న్యాయంలో వీళ్లకసలు పోలిక ఉందా?

స్థానిక సంస్థల్లోనూ సామాజిక సాధికారత..

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ వర్గాలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ సీఎం వైఎస్ జగన్ ఉత్తర్వులు జారీ చేస్తే.. దానిపై హైకోర్టులో టీడీపీ నేతలతో చంద్రబాబు కేసులు వేయించారు. దాంతో బీసీలకు రిజర్వేషన్లు 24 శాతానికి తగ్గాయి. టీడీపీ కుట్రలు చేసిన రిజర్వేషన్లు తగ్గించినా.. పార్టీపరంగా 34 శాతం కంటే ఎక్కువే ఇస్తానని సీఎం వైఎస్ జగన్ ప్రకటించారు. ఆ మేరకే స్థానిక సంస్థలలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారికి సింహభాగం పదవులిచ్చారు.

- రాష్ట్రంలో 648 మండలాలకు ఎన్నికలు జరిగితే... 637 మండలాల్లో వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించింది. ఇందులో 237 మండల పరిషత్ అధ్యక్ష పదవులను బీసీలకు(38 శాతం) ఇచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారికి ఎంపీపీ పదవుల్లో 67 శాతం ఇచ్చారు.
- 13 జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవులలో ఒక్క బీసీలకే 6 (46 శాతం) ఇచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు కలిపి ఏకంగా 9 జడ్పీ ఛైర్మన్ పదవులు(69 శాతం) ఇచ్చారు.
- రాష్ట్రంలో 14 మున్సిపల్ కార్పొరేషన్లలో వైఎస్సార్‌సీపీ విజయం సాధించింది. 14 మేయర్ పదవుల్లో బీసీలకు ఏకంగా 9 పదవులు (64 శాతం) ఇచ్చారు సీఎం వైఎస్ జగన్. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను కలుపుకుంటే 14 కార్పొరేషన్ మేయర్ పదవులకుగానూ 12 పదవులు (86 శాతం) వారికే ఇచ్చారు.
- 87 మున్సిపాల్టీలలో ఎన్నికలు జరిగితే.. అందులో 84 మున్సిపాల్టీలలో వైఎస్సార్‌సీపీ విజయం సాధించింది. ఇందులో 44 మున్సిపల్ ఛైర్మన్ పదవులను బీసీలకు(53 శాతం) ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలవర్గాలకు కలిపి 58 మున్సిపల్ ఛైర్మన్ పదవులు(69 శాతం) ఇచ్చారు.

చట్టం చేసి మరీ నామినేటెడ్ పదవులు..

నామినేటెడ్ పదవుల్లో 50 % బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల వారికి రిజర్వేషన్ చేస్తూ చట్టం చేసి మరీ ఆ వర్గాలకు పదవులిచ్చారు సీఎం వైఎస్ జగన్. నామినేటెడ్ పదవుల్లో 50 శాతం ఆ వర్గాలకు రిజర్వేషన్ చేస్తూ చట్టం చేయడం దేశంలో ఇదే తొలిసారి.

- 196 వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్లను నియమిస్తే... అందులో బీసీలకు 76 పదవులు (39 శాతం) ఇచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు కలిపి 117 పదవులు(60 శాతం) ఇచ్చారు.
- వివిధ ప్రభుత్వ కార్పొరేషన్లలో 137 ఛైర్మన్ పదవులలో 53 పదవులు (39శాతం) బీసీలకే ఇచ్చారు. ఇక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను కలుపుకుంటే 137 పదవుల్లో 79 పదవులు(58 శాతం) ఆ వర్గాలకే ఇచ్చారు.
- 137 ప్రభుత్వ కార్పొరేషన్ పదవులకు సంబంధించి... 484 నామినేటెడ్ డైరెక్టర్ పదవులుంటే అందులో 201 పదవులు బీసీలకు(41 శాతం) ఇచ్చారు. ఇక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను కలుపుకుంటే 484 పదవుల్లో 280 పదవులు (58 శాతం) ఆ వర్గాలకే ఇచ్చారు.
- బీసీ వర్గాలకు ప్రత్యేకంగా 56 కార్పొరేషన్లు, ఎస్సీలకు ప్రత్యేకంగా 3 కార్పొరేషన్లు, ఎస్టీలకు 1 కార్పొరేషన్ ఏర్పాటు చేసి.. వాటికి ఆ వర్గాల వారినే ఛైర్మన్లుగా నియమించారు. ఆ కార్పొరేషన్లలో ఆయా వర్గాలకు 684 డైరెక్టర్ పదవులూ ఇచ్చారు. ఆలయ బోర్డులు, ఆలయ ఛైర్మన్ పదవుల్లో సగభాగం బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకే ఇచ్చారు. దాదాపుగా 7,006 ఆలయ బోర్డు మెంబర్ల పదవుల్లో 3,503... అంటే సగం బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకే ఇచ్చారు.
- రాష్ట్రంలో స్వతంత్రం వచ్చిననాటి నుంచీ ఇప్పటిదాకా 4 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తే... అందులో గత 53 నెలల్లో భర్తీ చేసినవే 2.07 లక్షలు. సగానికన్నా ఎక్కువైన ఈ ఉద్యోగాల్లో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకే 80 శాతం దక్కాయి. అదీ.. సామాజిక న్యాయానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇస్తున్న విలువ.

క్లుప్తంగా...

పవన్‌కళ్యాణ్‌కు డబ్బు వైరస్

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం: జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌కు డబ్బు వైరస్ పట్టుకుందని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ విమర్శించారు. సోమవారం రాజమహేంద్రవరంలో పవన్‌కళ్యాణ్ చేసిన విమర్శలపై మంత్రి స్పందించారు. తాడేపల్లిగూడెంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రజల ఆరోగ్యాన్ని సీఎం జగన్ కాపాడుతున్నారని చెప్పారు. చివరకు దీనిపై కూడా దుష్ప్రచారం చేస్తున్న ప్రతిపక్ష నేతలకు ఏ వైరస్ సోకిందో అర్థం కావడం లేదన్నారు. కాపు సామాజిక వర్గాన్ని తాకట్టుపెట్టే విధంగా పవన్ ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. పవన్‌కు పట్టిన డబ్బు వైరస్‌ను పోగొట్టే మందు.. 2024 ఎన్నికలేనని చెప్పారు.

నిజం గెలిస్తే బాబు జీవితాంతం జైల్లోనే: మంత్రి రోజా



తిరుమల: నిజం గెలవాలని నారా భువనేశ్వరి గట్టిగా పూజలు చేస్తున్నారని, నిజం గెలిస్తే బాబు జీవితాంతం జైల్లోనే ఉండాల్సి ఉంటుందని రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా పేర్కొన్నారు. తిరుమల శ్రీవారిని మంగళవారం మంత్రి రోజా దర్శించుకున్నారు. ఆలయం వెలుపల ఆమె మాట్లాడుతూ.. మరో 30 సంవత్సరాలు ఏపీకి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉండాలని స్వామివారిని ప్రార్థించానన్నారు. తాము కూడా నిజం గెలవాలని పూర్తిస్థాయిలో దేవుని కోరుకుంటున్నామని, నిజం గెలిస్తే బాబుతో పాటు ఆయన సతీమణి సైతం జైలుకెళ్లే ఆస్కారం ఉందని చెప్పారు. భువనేశ్వరి నిజం గెలవాలని కోరుకుంటే సీబీఐ విచారణ కోరాలని సూచించారు. జనసేన, టీడీపీ సమన్వయ సమావేశం పాడుతా తియ్యగా సెలక్షన్లలా ఉందన్నారు. రోజాతో పాటు సినీనటి రవళి శ్రీవారిని దర్శించుకున్నారు. దీనికి ముందు టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

చంద్రబాబును చంపేస్తున్న తమ్ముళ్లు!

సాక్షి తిరుపతి: బహిరంగ సభలు, మీడియా సమావేశాల్లో మాట్లాడుతూ.. టీడీపీ అధినేత చంద్రబాబు చనిపోయాడంటూ వ్యాఖ్యలు చేయడం ఆ పార్టీ నేతలకు పరిపాటిగా మారింది. శ్రీకాళహస్తిలో సోమవారం టీడీపీ మాజీ మంత్రి అమరనాథ రెడ్డి నిర్వహించిన మీడియా సమావేశంలో ఏకంగా చంద్రబాబు చనిపోయారంటూ వ్యాఖ్యానించారు. అదేవిధంగా ఇటీవల టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సైతం ఇదే తరహాలో వ్యాఖ్యానించారు. చంద్రబాబు చనిపోయాడంటూ ఆ నేతలు పదే పదే మాట్లాడుతుండడంతో టీడీపీ శ్రేణులు సైతం విస్తుపోతున్నాయి.

సీఎం దిష్టిబొమ్మ దహనం అడ్డుకున్నాడని దాడి

వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడికి గాయాలు

శాంతిపురం(చిత్తూరు జిల్లా): మండలంలోని శివరామపురం పంచాయతీలో సీఎం దిష్టిబొమ్మ దహనం చేస్తున్న తెలుగుదేశం పార్టీ వారిని అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడైన దళితుడిని టీడీపీ నాయకులు చితకబాదారు. నంజంపేట గ్రామానికి చెందిన బాధితుడు మునెప్ప(49) రాళ్లబూదుగూరు పోలీసులకు చేసిన ఫిర్యాదు మేరకు.. సోమవారం రాత్రి నంజంపేటకు చెందిన టీడీపీ వర్గీయులు రోడ్డుపై సీఎం దిష్టిబొమ్మ దహనానికి ఏర్పాట్లు చేశారు. ఆ సమయంలో అటుగా వచ్చిన అదే గ్రామానికి చెందిన మునెప్ప సీఎం దిష్టిబొమ్మ కాల్చడం తగదని హితవు చెప్పాడు. గ్రామంలో ఇలాంటి చర్యలతో విభేదాలు పెరుగుతాయని నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. దీనిపై ఆగ్రహించిన టీడీపీ వర్గీయులు ఆరుగురు కులం పేరుతో దూషిస్తూ మునెప్పపై దాడిచేసి తీవ్రంగా కొట్టారు. దీనిపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త దారుణ హత్య

కత్తులు, వేటకొడవళ్లతో నరికి చంపిన టీడీపీ నేతలు



కృష్ణారెడ్డి (ఫైల్)

గురజాల: వైఎస్సార్ సీపీ కార్యకర్తపై టీడీపీ నేతలు విచక్షణారహితంగా దాడి చేసి నరికి చంపారు. ఈ ఘటన పల్నాడు జిల్లాలో జరిగింది. జంగమహేశ్వరపురం గ్రామానికి చెందిన కూనిరెడ్డి కృష్ణారెడ్డి (32) ఇదే గ్రామంలో వైఎస్సార్‌సీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. సోమవారం రాత్రి ఆయన ఇంటికి వెళ్తుండగా పులిపాడు గ్రామం వద్ద టీడీపీ నేతలు కాపుకాసి కత్తులు, వేటకొడవళ్లతో దాడి చేసి పరారయ్యారు. 26 కత్తిపోట్లు శరీరంపై పడటంతో కృష్ణారెడ్డికి తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. మృతదేహానికి మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నివాళులర్పించారు. గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఫోన్‌లో కృష్ణారెడ్డి కుటుంబీకులతో మాట్లాడి నిందితులను వదిలిపెట్టే ప్రసక్తే లేదని, బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

నిజం గెలిచింది.. బాబు జైలుకెళ్లారు

అనేక కుంభకోణాల్లో అడ్డంగా దొరికిన చంద్రబాబు.. ఓటుకు కోట్లు కేసుతో హైదరాబాద్ నుంచి అమరావతికి మకాం

- అమరావతి, స్కిల్, ఫైబర్‌నెట్, ఇన్నర్ రింగ్ రోడ్డు, అసైన్డ్ భూముల పేరిట అక్రమాలు
- టిడ్కో ఇళ్లు, తాత్కాలిక నిర్మాణాల పైనా ఐటీ దృష్టి
- స్కిల్ స్కామ్‌లో ఆధారాలతో దొరికి జైలుకెళ్లిన బాబు
- భువనేశ్వరిని ముందు పెట్టి 'నిజం గెలవాలి' అంటూ యాత్ర
- బాబు అరెస్టుతో మనస్థాపం చెంది 155 మంది చనిపోయారంటూ ప్రచారం
- బుధవారం నుంచి వారి కుటుంబాల పరామర్శ, సభలు
- మామూలుగా చనిపోయిన వారిని టీడీపీ జాబితాలో వేశారంటూ విమర్శలు
- దాంతో జాబితా బయటపెట్టలేకపోతున్న టీడీపీ
- ఇప్పటికీ షెడ్యూల్, రూట్‌మ్యాప్ కూడా పార్టీ నేతలకే తెలియదు
- ఎక్కడి దాకా? ఎప్పటివరకో తెలియని గందరగోళం

సాక్షి, అమరావతి: అడుగడుగునా కుంభకోణాలతో ప్రజా ధనాన్ని దోచేసి అడ్డంగా దొరికిపోయి జైలులో కూర్చున్న మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆడుతున్న సరికొత్త నాటకం 'నిజం గెలవాలి' యాత్ర. పిల్లనిచ్చిన మామ ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి అధికారాన్ని లాక్కొన్న దగ్గర నుంచి చంద్రబాబు ఎన్నెన్నో డ్రామాలాడారు. ప్రజా ధనాన్ని విచ్చలవిడిగా దోచుకొంటూ, అవినీతి తప్పితే మరే దృష్టీ లేకపోయినప్పటికీ, పైకి విజన్ ఉన్న నాయకుడిగా కలరింగ్ ఇవ్వడంలో ఆయనకు ఆయనే సాటి. వ్యవస్థలను మేనేజ్ చేస్తూ కేసుల నుంచి తప్పించుకుంటున్న ఆయన.. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అడ్డంగా దొరికిపోయి జైలుకు వెళ్లారు. ఫైబర్‌నెట్, అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్, పేదల నుంచి అసైన్‌మెంట్ భూములను కొల్లగొట్టడం వంటి పలు వ్యవహారాల్లోనూ చంద్రబాబు అన్ని నిబంధనలనూ ఉల్లంఘించినట్లు వెల్లడైంది. వీటిపైనా సీఐడీ దర్యాప్తు చేస్తోంది. టిడ్కో గృహాల నిర్మాణం, అమరావతిలో తాత్కాలిక కట్టడాల వ్యవహారంలో కేంద్ర ఆదాయ పన్ను శాఖ పలు అక్రమాలను వెలికితీసింది. తెలంగాణ సర్కారును దెబ్బతీసేందుకు చేసిన 'ఓటుకు కోట్లు' కుంభకోణంలో అరెస్టు నుంచి తప్పించుకొనేందుకు రాత్రికి రాత్రి మకాం హైదరాబాద్ నుంచి అమరావతికి మార్చిన చంద్రబాబు.. ఆ తర్వాత అమరావతి రాజధాని పేరుతో అనేక అక్రమాలకు తెరతీశారు. అదేమంటే.. దాడులు చేయడానికి ఆదాయ పన్ను శాఖ ఎవరు? సీబీఐ ఎవరు అంటూ దర్యాప్తు సంస్థల పైనే హుంకరించేవారు.

అవినీతిలో బాబు 'స్కిల్' ఇది

2014 నుంచి 2019 వరకు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు.. యువతకు ఉపాధి కల్పించే నైపుణ్యాభివృద్ధి ప్రాజెక్టు పేరిట రూ.371 కోట్లు కొల్లగొట్టారు. అందుకోసం జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీకి తెలియకుండా ఆ కంపెనీ ముసుగులో రూ. 3,300 కోట్లతో ఒక నకిలీ ప్రాజెక్టును తెర మీదకు తెచ్చారు. సీమెన్స్ కంపెనీ 90 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులు సమకూర్చాలన్నది ఒప్పందం. ఈ కార్యక్రమంతో తమకు ఎటువంటి సంబంధం లేదని సీమెన్స్ సంస్థ విస్పష్టంగా ప్రకటించింది. ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం తన వాటా నిధులు జీఎస్టీతో కలిపి రూ.371 కోట్లు చెల్లించింది. ఇది తప్పని ఆర్థిక శాఖ అధికారులు చెప్పినా బాబు పట్టించుకోలేదు. ఆ నిధులను ఫోర్జరీ డాక్యుమెంట్లు, షెల్ కంపెనీల ద్వారా తరలించేశారు. వాటిలో రూ.241 కోట్లు చంద్రబాబు పీఎస్ పెండ్యాల శ్రీనివాస్ ద్వారా చంద్రబాబు నివాసానికే చేరినట్లు గుర్తించారు. ఈ వ్యవహారంపై బాబు సీఎంగా ఉండగానే జీఎస్టీ అధికారులు దర్యాప్తు చేశారు. సీఐడీ కేసు నమోదు చేసింది. కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కూడా దర్యాప్తు చేసి, కొందరిని అరెస్టు కూడా చేసింది. ఇటీవల మరింత లోతుగా దర్యాప్తు జరిపిన సీఐడీ అధికారులు.. చంద్రబాబు ప్రమేయాన్ని బట్టబయలు చేశారు. 18 నోట్‌ఫైళ్లపై ఆయన సంతకాలు పెట్టినట్లు గుర్తించారు. అన్ని ఆధారాలతో ఆయన్ని అరెస్టు చేశారు. ఆధారాలు బలంగా ఉండటంతో ఆయన కూడా తాను నేరం చేయలేదని ఏ కోర్టులోనూ చెప్పడం లేదు. ఎంతసేపూ అరెస్టులో సాంకేతిక కారణాలంటూ కింది కోర్టు నుంచి సుప్రీం కోర్టు వరకు వాదనలు వినిపిస్తున్నారు. ఈ వాదనలను కోర్టులు పట్టించుకోవడంలేదు.

ఇన్నర్ రింగ్ రోడ్డు భూదోపిడీ కథ ఇదీ..

అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు (ఐఆర్ఆర్) అలైన్‌మెంట్ ఖరారులో చంద్రబాబు, అప్పటి మంత్రి నారాయణ యథేచ్ఛగా అవినీతికి పాల్పడ్డారు. చంద్రబాబు బినామీ లింగమనేని రమేశ్‌కు చెందిన భూములు, బాబు సొంత కంపెనీ హెరిటేజ్ ఫుడ్స్, మంత్రి నారాయణకు చెందిన భూములను ఆనుకొని వెళ్ళేలా అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు. అదే అలైన్‌మెంట్‌ను సింగపూర్ కన్సల్టెన్సీతో ఖరారు చేయించారు. దాంతో చంద్రబాబు, నారాయణ, లింగమనేని కుటుంబాలు, బినామీల భూముల విలువ అమాంతం పెరిగిపోయింది. క్విడ్ ప్రోకో కింద చంద్రబాబుకు లింగమనేని రమేశ్ కరకట్ట నివాసాన్ని, హెరిటేజ్ ఫుడ్స్‌కు, నారాయణ బినామీలకు భూములు ఇచ్చారు.

అసైన్‌మెంట్ పేరుతో పేదలను దోచిన బాబు బ్యాచ్

అమరావతి ప్రాంతంలో అసైన్‌మెంట్ భూములను దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న పేద రైతులను బాబు బ్యాచ్ భయపెట్టి, వాటి ద్వారా వందల కోట్లు దండుకున్న మోసమిది. అమరావతి పరిధిలో అసైన్డ్ భూములకు ప్రభుత్వం ప్యాకేజీ ఇవ్వదని చంద్రబాబు ప్రభుత్వం తొలుత ప్రచారం చేసింది. దాంతో ఆందోళన చెందిన అసైన్డ్ రైతుల వద్దకు బాబు బ్యాచ్ తమ ఏజెంట్లను పంపింది. అతి తక్కువ ధరకు దాదాపు 617 ఎకరాల అసైన్డ్ భూములు హస్తగతం చేసుకుంది. అనంతరం అసైన్డ్ భూములకు కూడా భూ సమీకరణ ప్యాకేజీ ప్రకటిస్తూ జీవో 41 జారీ చేసింది. భూ సమీకరణ ప్యాకేజీ ద్వారా ఈ బ్యాచ్ రూ.3,737 కోట్లు కొల్లగొట్టింది ఇలా అన్నింటా అడ్డంగా దొరికిపోతున్న చంద్రబాబు.. ఇప్పుడు నిజం గెలవాలంటూ ప్రజల్లో మరో ఎత్తుగడతో వస్తున్నారు. బాబు అరెస్టుతో మనస్థాపం చెంది మృతి చెందారంటూ కొందరు టీడీపీ సానుభూతిపరుల కుటుంబాలను పరామర్శించేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. అసలు వాస్తవమేంటంటే.. నిజం గెలిచింది కాబట్టే ఆయన జైలుకు వెళ్లారు. కానీ, ఆ విషయాన్ని పక్కదోవ పట్టించేందుకు కొత్త డ్రామాకు తెరలేపారు. చంద్రబాబు జైలుకు వెళ్లగానే, ఆయన కుమారుడు లోకేశ్ యువగళం పాదయాత్ర నిలిపివేసి ఢిల్లీకి వెళ్లిపోయారు. ఆయన మళ్లీ పాదయాత్ర చేపట్టే అవకాశాలు కనిపించడంలేదు. చంద్రబాబు ఇప్పట్లో బయటకు వచ్చే అవకాశాలూ కనిపించడంలేదు. దీంతో బాబు సతీమణి భువనేశ్వరితో యాత్ర చేపట్టారు. బుధవారం నుంచి తిరుపతి జిల్లాలో బాబు సొంత గ్రామం నారావారిపల్లె నుంచి యాత్ర ప్రారంభమవుతోంది. భువనేశ్వరి మంగళవారం నారావారిపల్లెకు చేరుకున్నారు. అయితే, ఈ 'నిజం గెలవాలి' అనే కార్యక్రమంలో అన్నీ దాపరికాలే. యాత్ర ప్రారంభానికి ఒక రోజు ముందు కూడా యాత్ర సమాచారం, రూట్ మ్యాప్ వంటివి ప్రజలకే కాదు.. ఆ పార్టీ నాయకులకే తెలియవు. ఇప్పటివరకు షెడ్యూలే విడుదల చేయలేదు. మొదటిరోజు పాకాల మండలం నేంద్రగుంటలో ఒక పరామర్శ, ఆ తర్వాత కుదిరితే ఎక్కడైనా ఒక దళితవాడలో సహపంక్తి భోజనం, సాయంత్రం చంద్రగిరి మండలంలోని ఆగరాల వద్ద బహిరంగ సభకు ఏర్పాట్లు చేశారు. ఆ తర్వాత ఒకటి, రెండు రోజులు చూచాయగా కార్యక్రమాలు గురించి మాట్లాడుకుంటున్నా ఇంతవరకు స్పష్టత లేదు.

పార్టీలోనే అనుమానాలు

ఇప్పటివరకు 155 మందికిపైగా చంద్రబాబు కోసం మృతి చెందారని ఆ పార్టీ ప్రకటించింది. అయితే, వీరంతా బాబు అరెస్టయ్యారన్న బాధతో చనిపోయారన్నది వాస్తవం కాదని ప్రజలకు స్పష్టంగా తెలుసు. . దీనిపై సోషల్ మీడియాలోనూ సెటైర్లు పేలుతున్నాయి. అనారోగ్యం, ఇతరత్రా కారణాలతో చనిపోయిన వారిని చంద్రబాబు కోసం మృతి చెందినట్లు చిత్రీకరిస్తున్నారని సామాన్య ప్రజానీకమూ చెబుతున్నారు. అందువల్లే ముందుగా పేర్లు ప్రకటిస్తే విమర్శలు వస్తాయన్న భయంతోనే జాబితా బయటపెట్టలేదని పార్టీ నేతలు చెబుతున్నారు. ఎవరిని పరామర్శించాలి, యాత్ర ఎక్కడి వరకు, ఎన్ని రోజులు చేయాలన్న విషయాలపై పార్టీ అధిష్టానానికే స్పష్టత లేదు. సాధారణ మరణాలను బాబు అరెస్టుకు ముడిపెట్టి, ఓ తప్పుడు కార్యక్రమాన్ని చేపట్టడం వల్లే ఇప్పుడీ అవస్థలు వచ్చాయని టీడీపీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. ఇప్పటికే చంద్రబాబుకు మద్దతుగా చేపట్టిన కార్యక్రమాలన్నీ విఫలమయ్యాయి. ఈ యాత్ర పరిస్థితి కూడా అలాగే ఉంటే ఏం చేయాలోనని పార్టీలో ఆందోళన నెలకొంది.

ఫైబర్‌నెట్‌లో బాబు 'సెట్టింగ్'

కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన ఫైబర్‌నెట్ ప్రాజెక్టులోనూ బాబు అవినీతి వెల్లడైంది. రూ.330 కోట్ల మొదటి దశ ప్రాజెక్టును తన బినామీ వేమూరి హరికృష్ణకు చెందిన టెరాసాఫ్ట్ కంపెనీకి కట్టబెట్టారు. అప్పటివరకూ బ్లాక్ లిస్టులో ఉన్న ఆ కంపెనీని బ్లాక్ లిస్టు నుంచి తొలగించారు. టెండర్ల టెక్నికల్ కమిటీలో హరికృష్ణకు స్థానం కల్పించారు. ఎల్1 గా వచ్చిన కంపెనీకి కాకుండా టెరాసాఫ్ట్‌కు టెండరు కట్టబెట్టారు. ఇలా చేయడం పరస్పర ప్రయోజనాల నిరోధక చట్టానికి విరుద్ధమని ఉన్నతాధికారులు అభ్యంతరం చెప్పినా బాబు పట్టించుకోలేదు. 80 శాతం ప్రాజెక్టు పనులు నాసి రకంగా చేశారు. అలా కొల్లగొట్టిన నిధుల్లో రూ.144 కోట్లు చంద్రబాబుకు చేరినట్లు గుర్తించారు.

నారావారిపల్లిలో భువనేశ్వరి

చంద్రగిరి (తిరుపతి జిల్లా): నిజం గెలవాలి యాత్ర చేపడుతున్న చంద్రబాబు సతీమణి భువనేశ్వరి మంగళవారం స్వగ్రామమైన నారావారిపల్లికి చేరుకున్నారు. గ్రామదేవత గంగమ్మకు, కులదైవమైన నాగాలమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. బాబు తల్లిదండ్రులు నారా ఖర్జూరనాయుడు, అమ్మణ్ణమ్మల సమాధుల వద్ద నివాళులర్పించారు. సాయంత్రం కొందరు మహిళలు, బంధువులు, పార్టీ నాయకులను కలిశారు. ఆమె బుధవారం నేంద్రగుంటలో మృతి చెందిన కనుమూరి చిన్నబ్బనాయుడు కుటుంబీకులను పరామర్శించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. గురువారం ఉదయం భువనేశ్వరి తిరుపతికి వెళ్తారని, ఆ తర్వాత శ్రీకాళహస్తిలోనూ పర్యటించనున్నట్లు తెలిసింది. భువనేశ్వరి నారావారిపల్లె వచ్చినప్పటికీ, టీడీపీ శ్రేణుల నుంచి స్పందన కనిపించడంలేదు. సొంత ఊరిలోనే నాయకులు, కేడర్ కనిపించకపోవడంతో సీనియర్ నేతలు నిరాశలో ఉన్నారు.

అనారోగ్యంతోనే చిన్నబ్బనాయుడు మృతి..!

తిరుపతి రూరల్: చంద్రబాబు అరెస్టు అనంతరం టీడీపీ సానుభూతిపరులు ఎవరు మృతి చెందినా బాబు జైలుకి వెళ్లడంతో మనస్తాపం చెంది మరణించినట్లు ఆ పార్టీ ప్రచారం చేస్తోంది. వారు ఏ కారణంతో మృతి చెందినా బాబు అరెస్టే కారణంగా చూపెడుతోంది. ఇందుకు పాకాల మండలం నేంద్రగుంటకు చెందిన కనుమూరి చిన్నబ్బనాయుడు (70) మరణమే ఓ ఉదాహరణ. బుధవారం చిన్నబ్బనాయుడు కుటుంబాన్ని నారా భువనేశ్వరి పరామర్శిస్తారని టీడీపీ చెబుతోంది. అయితే, చిన్నబ్బనాయుడు అనారోగ్య కారణాలతోనే మరణించినట్లు స్థానికులు చెబుతున్నారు. టీడీపీ సానుభూతిపరుడైన ఆయన అదే పార్టీకి చెందిన మాజీ జెడ్పీటీసీ సురేష్‌కు స్వయానా పెదనాన్న. ఆయన కొన్నేళ్లుగా సుగర్, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. సుగర్ వ్యాధి ఎక్కువ కావడంతో కాలి వేలు కూడా తొలగించారు. వ్యాధి ముదరడంతో డాక్టర్లకు చూపించినా ఫలితం లేకపోయింది. రెండు నెలలుగా మంచానికే పరిమితమైనట్లు పంచాయతీ సిబ్బంది తెలిపారు. ఈ నేపథ్యంలో గత నెల 24న ఆయన మృతి చెందాడు.

బాబు కోసం పుట్టిన పార్టీ జనసేన

- సున్నా సున్నా కలిసినా, హెచ్చించినా సున్నానే
- పవన్ కళ్యాణ్ టీడీపీతో విడిపోయింది ఎప్పుడు..?
- చంద్రబాబు అరెస్టు అక్రమమా?
- కాపులపై చంద్రబాబు పెట్టిన కేసులు అక్రమం కాదా?
- రాష్ట్రానికి తెలుగుదేశం తెగులు పట్టుకుని చాలా కాలమైంది
- ఈ తెగులుకు త్వరలో అంతిమ సంస్కారం
- జలవనరుల శాఖ మంత్రి అంబటి ధ్వజం



సాక్షి, అమరావతి: చంద్రబాబు కోసమే పుట్టిన పార్టీ జనసేన అని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. సున్నా సున్నా కలిసినా, హెచ్చించినా సున్నానే అవుతుందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పాత కలయికకు రాజమండ్రిలో కొత్త రూపువచ్చిందన్నారు. ఇప్పుడు వీరిద్దరూ కొత్తగా కలిసినట్లు మాట్లాడుతున్నారని.. అసలు వాస్తవానికి వీరిద్దరూ ఎప్పుడు విడిపోయారని ప్రశ్నించారు. ప్రజల సమస్యలపై చర్చించామంటారని, చంద్రబాబు అరెస్టు తర్వాత మాత్రమే సమస్యలు గుర్తొచ్చాయా అని నిలదీశారు. ఇలాంటి కలయికను ప్రజలు హర్షించరని స్పష్టం చేశారు. టీడీపీకి ఏదైనా నష్టం జరుగుతుందనుకుంటే వెంటనే కాపాడటానికి పవన్ వస్తారని మండిపడ్డారు. చంద్రబాబుకు మనోధైర్యం ఇవ్వడం కోసమే తప్ప రెండు పార్టీలు రాజమండ్రి భేటీలో ప్రజల కోసం ఏమీ చర్చించలేదన్నారు. రాష్ట్రానికి తెలుగుదేశం తెగులు పట్టుకుని చాలా సంవత్సరాలైందన్నారు. ఆ తెగులును కాపాడటానికి పవన్ ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఆ తెగులుకు త్వరలో అంతిమ సంస్కారం జరగబోతుందన్నారు. లోపల చంద్రబాబు ఊసలు లెక్కేసుకోవడం, బయట ఉన్న పుత్రుడు, దత్తపుత్రుడు రోజులు లెక్కేసుకోవడం ఇదే తంతు నడుస్తోందని ఎద్దేవా చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం అంబటి మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

చంద్రబాబు పల్లకీ మోయడానికే..

పవన్‌ను టీడీపీ నేతలు అచ్చెన్నాయుడు, యనమల వంటి వారు స్వాగతిస్తుంటే లోకేశ్ ముఖం మాడిపోయింది. నూటికి నూరుపాళ్లు టీడీపీ బలహీనపడిందని పవన్ ఎప్పుడో చెప్పారు. దాన్ని బలోపేతం చేయడం కోసమే ఇప్పుడు టీడీపీ నేతలను కలిశానని ఆయన స్పష్టంగా చెప్పారు. మీరంతా కలిసే వస్తారని మేం మొదటి రోజు నుంచి చెబుతూనే ఉన్నాం. పవన్‌కు సొంత ఆలోచన లేదు. జనసేన కార్యకర్తలతో చంద్రబాబు పల్లకీ మోయించడమే పవన్ లక్ష్యం. బాబుకు బెయిల్ ఇవ్వాలా, వద్దా అనేది న్యాయస్థానాలు నిర్ణయిస్తాయి. దానికి సీఎం వైఎస్ జగన్‌పై ఏడవడం దేనికి? కాపు రిజర్వేషన్ల పోరాటంలో చంద్రబాబు అరెస్టులు చేయిస్తే అవి అక్రమం కాదా? ఆయనను అరెస్ట్ చేస్తే మాత్రం అక్రమమా?

ఏ తప్పూ లేకుండా 42 రోజులు జైల్లో పెడతారా?

చంద్రబాబు తన లేఖలో 'నేను జైల్లో లేను..ప్రజల గుండెల్లో ఉన్నా' అని అంటున్నారు. ఆయన అరెస్ట్ వార్త విని 154 మంది మరణించారనేది ఎంత నిజమో.. ప్రజల గుండెల్లో ఉన్నారనేది కూడా అంతే నిజం. ఈ దేశంలో ఏ తప్పూ లేకుండా 42 రోజులు జైల్లో పెట్టడం సాధ్యమా? బాబు బయట ఉండగానే ఆయన పీఏ శ్రీనివాస్ దేశం దాటిపోయాడు. వ్యవస్థలను మేనేజ్ చేయడంలో దేశంలోనే బాబు నంబర్‌వన్. ఇక లోకేశ్, అమిత్‌షా కలయిక విషయంలో లోకేశ్ బండారమంతా కిషన్ రెడ్డి బయటపెట్టారు. లోకేశ్‌ను అమిత్‌షా రమ్మనలేదని.. ప్రాధేయపడితే తానే లోకేశ్‌కు అపాయింట్‌మెంట్ ఇప్పించానని చెప్పారు. ప్రగల్భాలు పలకడం దేనికి.. అభాసుపాలవ్వడం దేనికి లోకేశ్? పురందేశ్వరి మాత్రం తేలు కుట్టిన దొంగలా మాట్లాడటం లేదు.

పవన్, లోకేశ్ భేటీ అట్టర్ ఫ్లాప్..

టీడీపీ ఇచ్చిన దిష్టిబొమ్మల దహనం పిలుపు, రాజమండ్రిలో పుత్రుడు, దత్తపుత్రుడు భేటీ అట్టర్ ఫ్లాప్. తానేమీ వైఎస్సార్ సీపీకి వ్యతిరేకం కాదు.. వారి విధానాలకే వ్యతిరేకమని పవన్ అంటున్నారు. మరి మేం మాత్రం ఆయనకు వ్యతిరేకమా? పవన్‌కు, మాకూ ఏమన్నా తగాదా ఉందా? అసలు ఆయన విధానం ఏంటి? 2014లో టీడీపీతో కలిసి ముందుకు వెళ్లారు.. 2019లో టీడీపీతో కాకుండా విడిగా పోటీ చేశారు.. ఇప్పుడు మళ్లీ కలిసి పోటీ చేస్తున్నారు.. అందుకే పవన్‌ను ప్యాకేజీ స్టార్ అంటున్నాం.

1న జనసేన, టీడీపీ ఉమ్మడి మేనిఫెస్టో

సాక్షి, రాజమహేంద్రవరం: జనసేన, టీడీపీ ఉమ్మడి మేనిఫెస్టోను నవంబర్ 1న ప్రకటిస్తామని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తెలిపారు. ఆ తర్వాత ఇంటింటికీ ప్రచారం ప్రారంభిస్తామన్నారు. రాజమహేంద్రవరంలో సోమవారం టీడీపీ, జనసేన సమన్వయ కమిటీ తొలి భేటీ జరిగింది. అనంతరం టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌తో కలిసి పవన్ మీడియాతో మాట్లాడారు. మేనిఫెస్టో రూపకల్పనపై యనమల రామకృష్ణుడు, నాదెండ్ల మనోహర్ లోతుగా చర్చలు జరిపినట్లు తెలిపారు. మేనిఫెస్టోలో ఎలాంటి అంశాలు ఉండాలి? ఉమ్మడి పార్టీల ప్రాధాన్యత అంశాలు చర్చకు వచ్చాయన్నారు. జనసేన, టీడీపీ కలయిక కోసం ప్రజలు మూడేళ్లుగా ఎదురుచూస్తున్నారని చెప్పారు. వైఎస్సార్‌సీపీ దాడి చేయని పార్టీ ఏదీ లేదన్నారు. అచ్చెన్నాయుడు నుంచి చంద్రబాబు వరకు అక్రమ కేసులు బనాయించిందని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీకి తాము వ్యతిరేకం కాదని.. ఆ పార్టీ విధానాలకే తాము వ్యతిరేకమన్నారు. మద్యంపై రూ.30 వేల కోట్లు సంపాదించారని ఆరోపించారు. సీపీఎస్‌ను రద్దు చేయకుండా ఉద్యోగులను మోసం చేశారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అనే తెగులు రాష్ట్రానికి పట్టుకుందని.. దీనికి టీడీపీ, జనసేన కలయికే వ్యాక్సిన్ అన్నారు. చంద్రబాబును అక్రమంగా జైల్లో పెట్టారని, సాంకేతిక సమస్యలు చూపుతూ బెయిల్ రాకుండా అడ్డుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఆయనకు ధైర్యాన్ని ఇవ్వడానికే రాజమహేంద్రవరంలో జనసేన–టీడీపీ తొలి భేటీ నిర్వహించామన్నారు.

ఇకపై ఉమ్మడి కార్యక్రమాలు..

జనసేన, టీడీపీ కలయిక రాష్ట్రానికి మేలు చేస్తుందని, రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకెళ్తామని నారా లోకేశ్ తెలిపారు. రెండు పార్టీల ఉమ్మడి సమావేశంలో చంద్రబాబు అరెస్టుకు నిరసన తెలపడం, వైఎస్సార్‌సీపీ అరాచక పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడటం, రెండు పార్టీల కలయికతో అన్ని వర్గాల అభివృద్ధికి సంబంధించి మూడు తీర్మానాలు చేశామన్నారు. 2024లో కచ్చితంగా జనసేన, టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇకపై ఉమ్మడిగా కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. మరో వారం, పది రోజుల్లో దీనిపై స్పష్టత ఇస్తామని చెప్పారు. బీసీలకు అందాల్సిన అనేక రకాల పథకాలను ప్రభుత్వం రద్దు చేసిందని ఆరోపించారు. ప్రభుత్వ వేధింపులతో మైనారిటీ కుటుంబం ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. 34 లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని విమర్శించారు. మిగులు జలాలు సముద్రంలో కలిసిపోతున్నాయన్నారు. రాష్ట్రానికి నాలుగేళ్లల్లో ఒక్క పరిశ్రమ కూడా రాలేదని ఆరోపించారు.

కొత్తగా 40 డిప్యూటీ కలెక్టర్ పోస్టులు

▶ మొదటి పేజీ తరువాయి

డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి లభించనుంది. ఆరు నెలల క్రితం కూడా 63 డిప్యూటీ కలెక్టర్ పోస్టులను ప్రభుత్వం మంజూరు చేసిన సంగతి తెలిసిందే. దీంతో అప్పుడు 63 మంది తహశీల్దార్లు పదోన్నతి పొందారు. వీరంతా ఆయా శాఖల్లో పనిచేస్తున్నారు. అంటే.. 6 నెలల కాలంలోనే ప్రభుత్వం 107 డిప్యూటీ కలెక్టర్ పోస్టుల్ని మంజూరు చేసింది. పోస్టులను మంజూరు చేయడంతోపాటు పదోన్నతుల అంశంలో ఇదొక రికార్డుని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వ శాఖల్లో డిప్యూటీ కలెక్టర్ల స్థాయి అధికారుల అవసరం ఎక్కువ ఉన్నా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. తమ శాఖల్లో డిప్యూటీ కలెక్టర్ల అవసరం ఉందని, వారిని తమకు డిప్యుటేషన్‌పై పంపించాలని వివిధ శాఖలు గత ప్రభుత్వాన్ని కోరాయి. అదే సమయంలో చాలామంది అధికారులు పదవీ విరమణ చేయడంతో డిప్యూటీ కలెక్టర్ల కొరత ఇంకా ఎక్కువైంది. దీంతో రెవెన్యూ శాఖ గత ప్రభుత్వాన్ని పదే పదే కోరడంతో నామమాత్రంగా కొన్ని పోస్టులు మంజూరు చేసింది. దీంతో ఆయా శాఖల్లో అవసరాల మేరకు అధికారులు లేక ఇబ్బందులు ఏర్పడ్డాయి.

ఇప్పటివరకు మూడు విడతల్లో మంజూరు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వివిధ ప్రభుత్వ శాఖల వినతులను పరిగణనలోకి తీసుకుని ఇప్పటివరకు మూడు విడతల్లో కొత్తగా డిప్యూటీ కలెక్టర్ పోస్టుల్ని మంజూరు చేసింది. అధికారంలోకి వచ్చిన కొద్దికాలానికే మొదట 20, ఈ ఏడాది రెండు విడతలుగా 107 పోస్టుల్ని మంజూరు చేసింది. తాజాగా మంజూరైన 40 డిప్యూటీ కలెక్టర్ పోస్టులకు సంబంధించి సీనియారిటీ జాబితా కూడా సిద్ధమైంది. త్వరలో దాన్ని విడుదల చేయనున్నారు. ఈసారి 44 మంది (మంజూరైన పోస్టులకి 10 శాతం అదనంగా నియమిస్తారు) తహశీల్దార్లు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతి పొందనున్నారు. ఉద్యోగుల సర్వీస్ అంశాల విషయంలో గతంలో ఏ ప్రభుత్వం చేయనంత మేలును ఈ ప్రభుత్వం చేసిందని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు కొనియాడారు.

వేలాది పోస్టుల మంజూరుతోపాటు పదోన్నతులు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విడతల వారీగా 370 తహశీల్దార్ పోస్టులు కొత్తగా మంజూరయ్యాయి. దీంతో అంతే సంఖ్యలో డిప్యూటీ తహశీల్దార్లకు తహశీల్దార్లుగా పదోన్నతులు లభించాయి. అలాగే వెయ్యి మందికిపైగా సీనియర్ అసిస్టెంట్లు.. డిప్యూటీ తహశీల్దార్లు అయ్యారు. అదేవిధంగా 670 మంది కంప్యూటర్ అసిస్టెంట్లను రెవెన్యూ శాఖలో కొత్తగా నియమించారు. సీనియర్ అసిస్టెంట్ల కోసం నిర్వహించిన పదోన్నతుల్లో వీఆర్‌వోలకు 40% కేటాయించడంతో వేలాది మంది వీఆర్‌వోలకు లబ్ధి చేకూరింది. అలాగే ప్రభుత్వం ఇచ్చిన అవకాశంతో 3,600 మంది వీఆర్ఏలు వీఆర్‌వోలు అయ్యారు. సర్వే సెటిల్‌మెంట్, భూరికార్డుల శాఖలోనూ 30 ఏళ్ల తర్వాత అవకాశం కల్పించడంతో వందలాది మందికి లబ్ధి కలిగింది. కొత్త పోస్టుల మంజూరు, పదోన్నతుల విషయంలో గతంలో ఎప్పుడూ లేనివిధంగా రెవెన్యూ శాఖను ప్రభుత్వం బలోపేతం చేసింది.

టీడీపీ ఇక గెలవదు..

- ఆ నేతలు పగటి కలలు మానాలి
- వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి
- రేపటినుంచి వైఎస్సార్ సీపీ బస్సు యాత్రలు



సాక్షి, అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు 2024లో సీఎం అవుతారని కొందరు టీడీపీ నేతలు కంటున్న కలలు కల్లలవుతాయని వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్లమెంటరీ పార్టీ నేత వేణుంబాక విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన తాడేపల్లిలో ఓ ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో వాస్తవ రాజకీయ పరిస్థితులను బాబు అభిమానులు గమనించాలని సూచించారు. సుదీర్ఘ చరిత్ర ఉన్న డీఎంకేకు, మామను వెన్నుపోటు పొడిచి లాక్కున్న టీడీపీకి నక్కకు.. నాగలోకానికి ఉన్నంత తేడా ఉందని తెలిపారు. ప్రజా ఉద్యమాల్లో రాటుదేలిన పోరాట యోధుడు, గొప్ప రచయిత అయిన కరుణానిధికి, కుప్పం ఎమ్మెల్యే నారా చంద్రబాబుకి మధ్య పోల్చడం హాస్యాస్పదమని పేర్కొన్నారు.

గెలుపే లక్ష్యంగా సామాజిక సాధికార యాత్ర..

రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా సామాజిక సాధికార యాత్ర పేరుతో బస్సు యాత్రలు చేయాలని వైఎస్సార్‌సీపీ సంకల్పించిందని విజయసాయిరెడ్డి తెలిపారు. ఓ వైపు ప్రభుత్వ కార్యక్రమాలను నిర్వహిస్తూనే.. మరోవైపు పార్టీ పరమైన కార్యక్రమాల నిర్వహణకు సీఎం వైఎస్ జగన్ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశారని వివరించారు. ఈ నెల 26వ తేదీ నుంచి ఉత్తరాంధ్రలోని ఇచ్ఛాపురం, కోస్తాంధ్రలోని తెనాలి, రాయలసీమలోని శింగనమల నియోజకవర్గాలలో బస్సు యాత్రలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. తొలి విడతలో నవంబర్ తొమ్మిదో తేదీ వరకు యాత్రలు కొనసాగుతాయని వివరించారు. గడిచిన నాలుగున్నరేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, సీఎం జగన్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ఈ యాత్రల్లో వివరిస్తారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఈ యాత్ర కొనసాగుతుందని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు.

భార్యాభర్తల ముఖాముఖి పోరు

రాజస్తాన్‌లోని దాంతా రామ్‌గఢ్‌లో విచిత్ర పరిస్థితి

జైపూర్: రాజస్తాన్‌లో అసెంబ్లీ ఎన్నికల గడువు దగ్గరపడుతున్న వేళ రాజకీయ సమీకరణాలు చిత్రవిచిత్రంగా మారుతున్నాయి. శికార్ జిల్లా దాంతా రామ్‌గఢ్ నియోజకవర్గంలో వేర్వేరు పార్టీల నుంచి భార్యాభర్తలు ముఖాముఖి తలపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. అల్వార్ జిల్లాలోని రామ్‌గఢ్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే షఫియా జుబేర్‌కు బదులుగా ఆమె భర్త, మాజీ ఎమ్మెల్యే జుబేర్‌ఖాన్‌కు టికెట్టివ్వాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. 200 మంది సభ్యులున్న రాజస్తాన్ అసెంబ్లీకి నవంబర్ 25వ తేదీన పోలింగ్ జరగనున్న విషయం తెలిసిందే. పీసీసీ మాజీ చీఫ్, దాంతా రామ్‌గఢ్ నియోజకవర్గం నుంచి ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన నారాయణ్ సింగ్ కుటుంబం దశాబ్దాలుగా కాంగ్రెస్‌లో కొనసాగుతోంది. ఆయన కొడుకు వీరేంద్ర సింగ్ 2018లో దాంతా రామ్‌గఢ్ నుంచి కాంగ్రెస్ తరఫున బరిలోకి దిగారు. వీరేంద్ర సింగ్ భార్య రీటా చౌదరి ఆగస్టులో జననాయక్ జనతా పార్టీ(జేజేపీ)లో చేరారు. ఆ పార్టీ ఆమెను రాష్ట్ర మహిళా విభాగం ప్రెసిడెంట్‌గా నియమించింది. తాజాగా రీటా చౌదరికి దాంతా రామ్‌గఢ్ టికెట్టిచ్చింది. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రీటా చౌదరి దాంతా రామ్‌గఢ్ నుంచి కాంగ్రెస్ టిక్కెట్ ఆశించారు. కానీ కాంగ్రెస్ పార్టీ ఆమె భర్త వీరేంద్ర సింగ్‌కు టిక్కెట్టిచ్చింది. అప్పటి నుంచి ఆమె ప్రజల మధ్య తిరుగుతూ పేరు సంపాదించుకున్నారు. అనూహ్యంగా ఆమె జేజేపీలో చేరడం, తాజాగా ఆ పార్టీ ఆమెకు టికెట్టివ్వడం జరిగిపోయాయి. వచ్చే ఎన్నికల్లో తన గెలుపు ఖాయమని ఆమె ధీమా వ్యక్తం చేస్తున్నారు. భర్త వీరేంద్ర సింగ్ కూడా పోటీకి దిగే అవకాశముందన్న వార్తలపై ఆమె స్పందిస్తూ.. 'నేను దీనిపై ఏమీ మాట్లాడాలనుకోవడం లేదు. ప్రజలు మార్పు కోరుతున్నారన్నది మాత్రం వాస్తవం'అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మళ్లీ తనకే అవకాశమిస్తుందని భావిస్తున్నానని వీరేంద్ర సింగ్ చెప్పారు.

భార్యకు బదులు భర్తకు అవకాశం: అల్వార్ జిల్లాలోని రామ్‌గఢ్ నియోజకవర్గం సిట్టింగ్ ఎమ్మెల్యే షఫియా జుబేర్. ఆమె భర్త జుబేర్ ఖాన్ ఇదే స్థానం నుంచి 1990, 1993, 2003 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచారు. తాజాగా కాంగ్రెస్ పార్టీ షఫియాకు బదులుగా జుబేర్‌కు టికెట్ ప్రకటించింది. ఈ నిర్ణయంపై షఫియా హర్షం వ్యక్తం చేశారు. పార్టీ మంచి నిర్ణయం తీసుకుందని చెప్పారు. కలిసి పనిచేసి, భారీ మెజారిటీతో విజయం సాధిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ తనకు టికెట్ నిరాకరణపై ఆమె స్పందించేందుకు నిరాకరించారు.



ప్రతిదానిలో ఏదైనా మంచిని చూడటానికి
మీ మనస్సుకు శిక్షణ ఇవ్వండి.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 25 అక్టోబర్ 2023

తటస్థతకు తూట్లు పొడవొద్దు!

పాలనా ప్రక్రియలో పాలుపంచుకునే ఉన్నతాధికార వర్గం ఆ ప్రక్రియలో పెనవేసుకుని వుండే రాజకీయ పార్శ్వానికి ఎప్పుడూ దూరంగా ఉంటుంది. ప్రజాస్వామ్య మూలస్తంభాల్లో ఒకటైన కార్యనిర్వాహక వ్యవస్థ (ఎగ్జిక్యూటివ్)లో మంత్రులతోపాటు ఉన్నతాధికారవర్గం కూడా భాగస్వామే. ప్రభుత్వాలు మారినప్పుడల్లా మంత్రులు మారతారు. కానీ ఉన్నతాధివర్గం మాత్రం శాశ్వతం. అందుకే పాలనాపరమైన విధి నిర్వహణ వేరు... రాజకీయ ప్రచారం వేరు అనే స్పృహ అధికార యంత్రాంగానికి ఎప్పుడూ ఉంటుంది. సివిల్ సర్వీసు నిబంధనలు సైతం ఉన్నతాధికారులు రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనటానికి అంగీకరించవు. కానీ కేంద్ర ప్రభుత్వం ఇటీవల జారీచేసిన ఒక సర్క్యులర్ ఆ విభజనను కాస్తా మటుమాయం చేస్తోంది. గత తొమ్మిదేళ్లలో సాధించిన ప్రగతిని ప్రచారం చేసేందుకు సీనియర్ అధికారులు దేశంలోని 765 జిల్లాలకూ, ఆ జిల్లాల్లోని 26 కోట్ల 90 లక్షల గ్రామాలకూ తరలివెళ్లాలని ఆ సర్క్యులర్ నిర్దేశించింది. జాయింట్ సెక్రటరీ, డైరెక్టర్, డిప్యూటీ డైరెక్టర్ స్థాయి ఉన్నతాధికారులు ఈ యజ్ఞంలో పాలుపంచుకోవాలట. వీరికి రథ్ ప్రభారీస్ (ప్రత్యేక అధికారులు)గా నామకరణం చేశారు. కేంద్రంలోని రక్షణ మంత్రిత్వ శాఖ సహా అన్ని శాఖలూ ఈ మాదిరి సర్క్యులర్‌నే విడుదల చేశాయి. రక్షణ శాఖ ఈ నెల 9న జారీ చేసిన ఉత్తర్వు మరింత విడ్డూరమైనది. వార్షిక సెలవుల్లో వెళ్లే సైనికులు తమ తమ సెలవుల్లో 'సైనిక దూతలు'గా ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలని ఆ ఉత్తర్వు పిలుపునిచ్చింది. నవంబర్ 20 మొదలుకొని జనవరి 25 వరకూ 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర' పేరుతో దీన్ని కొనసాగించాలన్నది సర్క్యులర్ సారాంశం. సరిగ్గా ఈ తేదీల మధ్యనే తెలంగాణ, రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికలుంటాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించాక, ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చాక ఇలాంటి యాత్రలు ఎంతవరకూ సమంజసమన్న సంగతలావుంచి... అసలు ఉన్నతాధికార వర్గం ఈ మాదిరి ప్రచారకర్తలుగా పని చేయటం సరైనదేనా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

పథకాల గురించి అందరికీ తెలిసేలా అవసరమైన ప్రచార ఉపకరణాలను సంసిద్ధపరచుకోవటం ఏ ప్రభుత్వానికైనా అవసరం. అందుకోసమే ప్రభుత్వంలో సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఉంటుంది. ఆ శాఖ ప్రభుత్వ పథకాల సమాచారాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్తుంది. తమ ప్రభుత్వమే మరో దఫా అధికారంలో కొనసాగేందుకు కావలసినదంతా చేస్తుంటుంది. ఇందుకు బడ్జెట్‌లో కేటాయింపులుంటాయి. తమది ప్రపంచంలోనే అత్యధిక కార్యకర్తలున్న రాజకీయ పార్టీ అని బీజేపీ చెప్పుకుంటుంది. ఆ పార్టీకి నోరున్న రాజకీయ నాయకుల లోటు కూడా లేదు. వీరందరినీ కాదని ప్రభుత్వ పథకాలనూ, వాటి ద్వారా సాధించిన ప్రగతినీ ప్రచారం చేసేందుకు ఉన్నతాధికార వర్గాన్ని దించాలనటంలో ఆంతర్యమేమిటన్నది అంతుపట్టని విషయం. కార్యకర్తలు, నాయకుల కంటే ఈ అధికారులకే విశ్వసనీయత ఉంటుందని పాలకులు అనుకుంటున్నారా? 'అధికారులు కేవలం ప్రభుత్వ కార్యాలయాల్లోని కుర్చీలకు అతుక్కుపోవాలా? తాము రూపొందించిన పథకాల ప్రభావం క్షేత్ర స్థాయిలో ఎలా ఉందో తెలుసుకోవద్దా?' అంటూ బీజేపీ నేతలు చేస్తున్న తర్కం అర్థరహితమైనది. అలా తెలుసుకోవటానికీ, అవసరమైన మార్పులు చేసుకోవటానికీ పకడ్బందీ వ్యవస్థ అమల్లో ఉంది. రాష్ట్రాల్లో ప్రభుత్వాలున్నాయి. అవసరమైన సమాచారాన్ని సత్వరం పొందేందుకు ఎన్నో మార్గాలున్నాయి. ప్రభుత్వ పథకాల సమాచారం ప్రజలందరికీ అందించటానికి, అవి కేవలం లక్షిత వర్గాలకు మాత్రమే చేరేలా, దుర్వినియోగానికి తావులేకుండా చేయటానికి ఎన్నో నిబంధనలు అమల్లోకొచ్చాయి. కానీ ఉన్నతాధికారులే స్వయానా ప్రచారకర్తలుగా మారాలనడం, అందువల్ల మాత్రమే ప్రజలంతా అన్నీ తెలుసుకోగలుగుతారనడం సమంజసం కాదు. ఈ క్రమంలో ఉన్నతాధికార వర్గం రాజకీయాలను అంటించుకుంటే పాలనావ్యవస్థకుండే తటస్థతకు జరిగే నష్టం తీవ్రమైనది. వచ్చే ఎన్నికల్లో మరోసారి అధికారాన్ని కైవసం చేసుకోవడం ఎలాగన్నది కార్యనిర్వాహక వర్గంలోని మంత్రులకు సంబంధించిన ప్రశ్న. అదే వ్యవస్థలో భాగస్థులైన ఉన్నతాధికారవర్గం పాలనా ప్రక్రియ సజావుగా సాగటానికి, పాలకుల విధానాలూ, వారి పథకాలూ లక్షిత వర్గాలకు చేరేలా చేయటం వరకూ పూచీ పడుతుంది. అంతకుమించి ఏం చేసినా దానికి రాజకీయ మకిలి అంటుతుంది.

బ్రిటిష్ వలస పాలకుల హయాంలో ఉన్నతాధివర్గం పని... కేవలం శాంతిభద్రతలను పర్యవేక్షించటం, ఖజానాకు ఆదాయం సమకూర్చటం మాత్రమే! కానీ స్వాతంత్ర్యం వచ్చాక అదంతా మారింది. సంక్షేమ రాజ్య భావన బలపడటంతో జాతీయ స్థాయిలోనూ, రాష్ట్రాల స్థాయిలోనూ పాలకుల సంక్షేమ విధానాల అమలు, ప్రణాళికాబద్ధ అభివృద్ధి ఉన్నతాధికార వర్గం ప్రధాన కర్తవ్యాలయ్యాయి. రాజకీయ అస్థిరత అలుముకున్న దశలో కూడా ఉన్నతాధికార వ్యవస్థ తటస్థంగా వ్యవహరిస్తూ రాజకీయ నాయకత్వానికి అవసరమైన సలహాలిస్తూ పాలన సజావుగా సాగేందుకు దోహద పడుతోంది. సివిల్ సర్వీసు అధికారులు ఎట్టిపరిస్థితుల్లోనూ రాజకీయాల్లో లేదా మతసంబంధ అంశాల్లో తలదూర్చరాదని ఈ సర్వీసు పథ నిర్దేశకుడైన స్వర్గీయ సర్దార్ పటేల్ హితవు చెప్పారు. అందుకు పూర్తి భిన్నంగా పోయి పాలనావ్యవస్థకూ, సైనిక వ్యవస్థకూ రాజకీయ మకిలి అంటించి మన పొరుగునున్న పాకిస్తాన్ చివరికెలా అఘోరించిందో కనబడుతూనే ఉంది. అందువల్ల ఉన్నతాధికార గణాన్ని ప్రచారకర్తలుగా ఉరికించాలన్న సంకల్పాన్ని కేంద్రం విడనాడాలి. దాని తటస్థతను కాపాడాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు
ఆశ్వయుజ మాసం., తిథి: శు.ఏకాదశి ఉ.10.24 వరకు
తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** శతభిషం ప.12.26 వరకు
తదుపరి పూర్వాభాద్ర, **వర్జ్యం:** సా.6.23 నుండి 7.54 వరకు,
దుర్ముహూర్తం: ప.11.20 నుండి 12.09 వరకు,
అమృత ఘడియలు: రా.3.21 నుండి 4.33 వరకు.

సూర్యోదయం : 5.59
సూర్యాస్తమయం : 5.31
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

బాధితుల గోడు వినేదెవరు?

అభిప్రాయం



డా॥ మహ్మద్ హసన్

ఒకప్పుడు ప్రపంచంలో తన కంటూ ఒక చిరునామా లేని జాతి అది. అనేక రకాలుగా చరిత్రలో అవమానాలూ, బాధలూ ఎదుర్కొని చివరికి పాలస్తీనియన్ల చెంతకు చేరింది. తాము ఉండడానికి కాసింత స్థలం అడిగింది. తమ పవిత్ర గ్రంథం ఆ ప్రాంతం తమ పూర్వీకులదని చెబుతోందనీ, అందువల్ల ఈ ప్రాతం తమదేననీ పేచీపెట్టి పాలస్తీనియన్లతో కయ్యానికి దిగింది. అమెరికా వెన్నుదన్నుతో ఐక్యరాజ్యసమితి చేత తాను ఆక్రమించుకున్న ప్రాంతాన్ని 1947లో ఒక దేశంగా ప్రకటింపజేసుకొంది. ఆ జాతే యూదు జాతి. వారిదేశమే 'ఇజ్రాయెల్'. ఇక ఆతిథ్యం ఇచ్చి మోసపోయిన అరబ్ ప్రజలు మాత్రం 'పాలస్తీనా' పేరుతో ఉన్న అతి చిన్న ప్రాంతానికి పరిమితమై అనేక అగచాట్లు పడుతూ ఇజ్రాయెల్‌పై దాడులకు దిగుతున్నారు.

మానవాళిని పట్టి పీడిస్తున్న యుద్ధాలు మానవత్వాన్ని మట్టుపెడుతున్నాయి. జంతు దశ నుంచి నాగరికత కలిగిన ఆధునిక మానవునిగా ఎదిగిన మానవుడు తాను అభివృద్ధి చేసుకున్న ఆయుధాలు, శాస్త్ర విజ్ఞానంతో తన అభివృద్ధిని తానే నాశనం చేసుకొంటున్నాడు. ఇందుకు తాజా ఉదాహరణ ఇజ్రాయెల్-పాలస్తీనా మధ్య చెలరేగిన ప్రస్తుత యుద్ధం. ప్రపంచంలో ఏ యుద్ధం జరిగినా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అమెరికా వంటి అగ్రరాజ్య హస్తం ఉండడం మామూలయ్యింది. ఇజ్రాయెల్‌ను మొదటి నుంచీ అమెరికా అన్ని విధాలా వెనకేసుకొస్తోంది. అమెరికా, దాని మిత్రదేశాలు పాలస్తీనాను భౌగోళికంగా గుర్తించకుండా కేవలం ఇజ్రాయెల్‌ను మాత్రమే ఒక దేశంగా గుర్తిస్తూ 1948లో ఐక్యరాజ్య సమితితో ప్రకటన చేయించటం అగ్నికి ఆజ్యం పోసినట్లయింది.

ఇజ్రాయెల్‌తో పాటుగా పాలస్తీనాను కూడా భౌగోళికంగా గుర్తించి ఉంటే ఈ యుద్ధం జరిగేదే కాదు. వారి నిర్లక్ష్య ఫలితమే నేడు ఇజ్రాయెల్-పాలస్తీనా యుద్ధం. ఇజ్రాయెల్ రిపబ్లిక్ అయిన తర్వాత పాలస్తీనియన్లు ఇజ్రాయెల్‌పై యుద్ధం ప్రకటించటం అనంతరం పాలస్తీనా ఓడిపోవటం జరిగింది. అయితే అప్పటినుంచీ పాలస్తీనా ప్రజల్లో అసంతృప్తి, ఆవేశం, అస్థిరత గూడు కట్టుకోవడం క్రమంగా పెరిగింది. దీంతో అవకాశం దొరికినప్పుడల్లా పాలస్తీనా తిరుగుబాటు దారులు ఇజ్రాయెల్‌పై దాడిచేసి హింసకు పాల్పడుతున్నారు. అందులో భాగమే ఇటీవల వందలాది రాకెట్లను ప్రయోగించి ఇజ్రాయెల్‌ను బెంబేలెత్తించిన ఘటనను చూడాలి.

1948లో ఇజ్రాయెల్ ఏర్పడిన వెంటనే పాలస్తీనాకు మద్దతుగా ఐదు అరబ్ దేశాలు ఇజ్రాయెల్‌పై యుద్ధానికి దిగాయి. కాని, ఇజ్రాయెల్ అరబ్ దేశాలపై విజయం సాధించింది. ఐక్యరాజ్య సమితి పాలస్తీనా సమస్యను ప్రపంచ శాంతి భద్రతల సమస్యగా పరిగణించి పరిష్కరించకపోవటం చారిత్రక తప్పిదంగా చెప్పుకోవాలి. తమ సొంత భూభాగంలోనే ఒక మూల పరాయి వాళ్లుగా జీవించవలసి రావడం, గాజాను దాటాలంటే ఇజ్రాయెల్ అధికారుల అనుమతి తీసుకోవలసి ఉండడం, తనిఖీల పేరుతో పాలస్తీనియన్లను ఇజ్రాయెల్ సైన్యం ఇబ్బంది పెట్టడం, తమ ఆంక్షలను ధిక్కరిస్తే అమానవీయంగా చంపివేయడం, ఇళ్లను కూల్చడం వంటి అనేక అంశాలు స్వతంత్ర పాలస్తీనా కోరికను మరింత బలపడేలా చేసింది. గాజాలోని ''అల్ అక్సా'' మసీదులోకి వెళ్ళాలంటే కూడా ఇజ్రాయెల్ పోలీసుల అనుమతి తీసుకొని రావాల్సి ఉండటం పాలస్తీనియన్లకు అత్యంత బాధ కల్గిస్తున్న విషయం.

ఈ క్రమంలోనే 'పాలస్తీనా లిబరేషన్ ఫ్రంట్', 'పాపులర్ ఫ్రంట్ ఫర్ ది లిబరేషన్ ఆఫ్ పాలస్తీనా', 'పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్' వంటి సంస్థలు ఆవిర్భవించాయి. యాసర్ అరాఫత్ నేతృత్వంలో (1969–2004) ఇజ్రాయెల్-పాలస్తీనా మధ్య 1993, 1995లలో



శాంతి ఒప్పందాలు కుదిరాయి. దీంతో 1994లో ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి ఇత్జాక్ రాబిన్, ఆ దేశ విదేశాంగ మంత్రి షిమన్ పెరెస్, పాలస్తీనా విమోచనా సంస్థ నాయకుడు యాసర్ అరాఫత్‌లకు నోబెల్ శాంతి బహుమతి సంయుక్తంగా లభించింది. అయితే 1995లో రాబిన్ హత్యకు గురయ్యాడు. అనంతరం జరిగిన పరిణామాల్లో 2004లో యాసర్ అరాఫత్ అనుమానాస్పదంగా మరణించాడు. ఫలితంగా సమస్య మళ్ళీ మొదటి కొచ్చింది. రెండు వైపులా రైట్ వింగ్‌కు చెందిన వారు సమస్యను ప్రస్తుత స్థితికి సాగదీస్తూ వచ్చారు.

ఇజ్రాయెల్ – పాలస్తీనా సమస్యను రెండు ప్రాంతాల మధ్య మత ఘర్షణలుగా చూడడం సరికాదు. పాలస్తీనియన్లు భౌగోళికమైన ఉనికి, అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం చేస్తున్న పోరాటంగా మాత్రమే పరిగణించాలి. 'భద్రతలను కలిగి ఉండటం వలన వ్యక్తిలో ఉద్భవించే మానసిక ప్రశాంతతయే స్వేచ్ఛ' అంటాడు అమెరికన్ రాజకీయవేత్త మాంటెస్క్యూ. ఇక్కడ పాలస్తీనీయన్లు అభద్రతాభావానికి గురైన సందర్భంలోంచి వచ్చినదే నేటి 'హమాస్' సంస్థ. 'ఆరు భద్రతా మండలి తీర్మానాల'నూ, 1993 పాలస్తీనాతో జరిగిన ''ఓస్లో'' ఒప్పందాన్ని కూడా ఇజ్రాయెల్ తుంగలో తొక్కింది. పైగా ఐక్యరాజ్యసమితిలోని వీటో అధికారం కల్గిన దేశాల మద్దతుతో తరచుగా ఇజ్రాయెల్ పాలస్తీనియన్లను ఉగ్రవాదం పేరుతో వేధించటం, చంపటం, పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించటం చేసింది. పాలస్తీనాతో ఘర్షణ తలెత్తిన దాదాపు ప్రతిసారీ ఎంతో కొంత వారి భూభాగాన్ని ఆక్రమించడం పనిగా పెట్టుకొంది ఇజ్రాయెల్ ఆ విధంగా ఇజ్రాయెల్ తన భూభాగాన్ని విస్తరిస్తూపోయి పాలస్తీనా ప్రజలను కొన్ని మైళ్ల భూభాగానికి పరిమితం చేసింది. అందుకే పాలస్తీనియన్లలో ఇజ్రాయెల్ అంటే విపరీతమైన ద్వేషం! ఆ ద్వేషం మరోసారి ప్రకోపించి ఇజ్రాయెల్‌పై తాజా దాడికి దారితీసింది. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ ఈ సందర్భాన్ని అచ్చమైన రాజకీయ నాయకునిగా తనకు అనుకూలంగా మలచుకొంటున్నాడని విశ్లేషకుల మాట. తనపై ప్రజలలో పెరుగుతున్న అసమ్మతిని పాలస్తీనియన్లపై భీకర యుద్ధం చేయడం ద్వారా తగ్గించి, వారిని మళ్ళీ తనవైపు తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారనేది వారి అభిప్రాయం. యుద్ధం ఎవరి వైపు నుండి మొదలైనా నష్టపోయేది సాధారణ పౌరులే. సంవత్సరాలుగా కష్టపడి నిర్మించుకున్న ఇళ్లు, ఇతర భవనాలూ పేకమేడల్లా కూలుతున్న దృశ్యాలూ, శిథిల భవనాల్లోంచి వినిపిస్తున్న చిన్న పిల్లల, మహిళల, వృద్ధుల హాహాకారాలూ మనసును చలింపజేసే విధంగా ఉన్నాయి.

ప్రపంచ శాంతి కోసం పుట్టుకొచ్చిన ఐక్యరాజ్య సమితి కోరలు లేని సింహం అయినందు వల్లనే ఇవాళ ప్రపంచంలో అనేక చోట్ల అశాంతి, అభద్రతలు రాజ్యమేలుతున్నాయి. ఒక్క ఇజ్రాయెల్ – పాలస్తీనా ప్రాంతమే కాదు... రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, చైనా – వియత్నాం సమస్య, ఉత్తర కొరియా – దక్షిణ కొరియా, చైనా – అమెరికా, ఉత్తర కొరియా – అమెరికాల మధ్య కొనసాగుతున్న వివాదాలూ, అలాగే భారత్ – చైనా సరిహద్దు వివాదం, భారత్ – పాకిస్తాన్ మధ్య కొనసాగుతున్న 'కశ్మీర్' సరిహద్దు వివాదం... వంటివన్నీ ఐక్యరాజ్యసమితి నిష్క్రియాపరత్వం, బలహీనతల కారణంగా భవిష్యత్తులో ఏదో ఒకరోజు అగ్ని పర్వతం బద్దలైనట్లుగా హింసకు దారి తీసేవే అనేది విశ్లేషకుల అంచనా.

2001 సెప్టెంబర్ 11న అమెరికాలోని వరల్డ్ ట్రేడ్ సెంటర్ జంట భవనాలపై జరిగిన దాడి తర్వాత అమెరికా 'అల్ ఖైదా' ఉగ్రవాదులపై యుద్ధం పేరుతో ఒసామా బిన్ లాడెన్‌ను మట్టుబెట్టడం పైకి చూడడానికి బాగానే ఉన్నా ఈ పని చేయవలసింది ఐక్యరాజ్యసమితి. కానీ అమెరికా ఆర్థిక సహాయంపై అధికంగా ఆధారపడి ఉన్న ఐరాస నోరు మెదపకుండా ఉండిపోయింది. అలాగే ఇరాక్ ప్రమాదకర జీవ రసాయన ఆయుధాలు తయారు చేసిందని దానిపై దాడిచేసి పాలకుడైన సద్దాం హుస్సేన్‌ను ఉరితీయించడం వంటి దుశ్చర్యలు సూపర్ పవర్‌గా ఎదిగిన దేశం తన ఇష్టం వచ్చినట్లు చిన్న దేశాలపైనా, ప్రజా ఉద్యమాలపైనా ఉక్కుపాదం మోపిందని చెప్పడానికి ఉదాహరణ. ఐక్యరాజ్య సమితి బలంగా ఉంటే ఇటువంటి సంఘటనలు చోటు చేసుకునేవేనా?

ఇక ఇజ్రాయెల్ – పాలస్తీనా సమస్య దగ్గరకు వస్తే... దీన్ని అత్యంత ప్రాధాన్యం గల అంతర్జాతీయ సమస్యగా అన్ని దేశాలూ పరిగణించాలి. పాలస్తీనాను ఒక దేశంగా గుర్తిస్తే ఐక్యరాజ్య సమితి కొంత వరకూ పాలస్తీనియన్లకు అండగా నిలిచే అవకాశం ఉంది. పది సంవత్సరాల పాలస్తీనా బాలిక నేలమట్టమైన ఇంటి ముందు నిలబడి 'నేను ఏం పాపం చేశాను? ఏం తప్పు చేశాను? నా వాళ్ళందరూ ఇజ్రాయెల్ సైన్యం దాడిలో చనిపోయారు. ఇప్పుడు నా పరిస్థితి ఏమిటి' అని ప్రపంచాన్ని ప్రశ్నించింది. దీనికి ఎవరు, ఏమని సమాధానం చెబుతారు ఆ చిట్టి తల్లికి?

వ్యాసకర్త నల్గొండ ప్రభుత్వ మహిళా కళాశాల అధ్యాపకుడు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



హృదయ మందిరం



అందరికీ దసరా, శుభో బిజోయ, విజయ దశమి శుభాకాంక్షలు! మన హృదయాలు ద్వేషాన్ని, భయాన్ని, నిస్సహాయతను పారద్రోలాలని, ప్రపంచవ్యాప్తంగా చెడుపై మంచి విజయం సాధించాలని ప్రార్థిస్తున్నాను.

– సుహాసినీ హైదర్, ప్రముఖ పాత్రికేయురాలు

అసలు - కొసరు



అఫ్గానిస్తాన్ ఆటగాడు ఇబ్రహీం జద్రాన్ తన మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును పాకిస్థాన్ తమ దేశం నుంచి వెళ్లగొట్టిన అఫ్గానిస్తాన్ శరణార్థులకు అంకితం ఇచ్చాడు. అఫ్గానిస్తాన్ చేతిలో ఓడిన పాక్ క్రికెట్ జట్టుకు ఇది... ఒకే ఆటలో రెండు ఓటములు!

– మిస్టర్ సిన్హా, రాజకీయ వ్యాఖ్యాత


డాక్టర్‌ని నమ్మండి



కమీషన్ల కోసమే డాక్టర్లు టెస్టులు రాస్తారని అనుమానించకండి. తీవ్రమైన ఛాతీ నొప్పితో వచ్చిన ఒక వ్యక్తికి అత్యవసర చికిత్స చేసి ఆ వ్యక్తిని బతికించింది ఎవరంటే... తక్షణం కరొనరీ యాంజియోగ్రఫీ చేయించుకోవాలని 2 నెలల క్రితమే ఆ వ్యక్తికి సిఫారసు చేసిన డాక్టరే! వైద్యునిపై నమ్మకం అనేది మీ వ్యాధికి ప్రథమ చికిత్స వంటిది.

– డాక్టర్ ధ్రువ్ చౌహాన్, ఆరోగ్య కార్యకర్త

నీచమైన సాకు



ఇజ్రాయెల్ ఈ యుద్ధాన్ని ముగించడానికి శీఘ్ర మార్గాన్ని కనుగొనకపోతే, గాజాపై బాంబులు వేస్తూ ఉంటే... హమాస్ దాడి చేసినప్పుడు వారికి లభించిన ప్రజాదరణను వారు కోల్పోతారు. ప్రతీకారం అనేది యుద్ధానికి నీచమైన సాకు. కంటికి కన్ను అనే పిల్లలాటకు మించిన రాజకీయ నాయకత్వం ఇప్పుడు ఇజ్రాయెల్‌కు అవసరం.

– ప్రీతిష్ నంది, ప్రఖ్యాత కవి - జర్నలిస్టు

ఐక్యరాజ్య నిర్మాణం



ఈ ఐక్యరాజ్యసమితి దినోత్సవం (24 అక్టోబర్) నాడు మెరుగైన ప్రపంచాన్ని నిర్మించుకోవాలన్న ఆశకు, సంకల్పానికి కట్టుబడి ఉందామని ప్రతిన పూనుదాం. 79వ వసంతంలోకి అడుగు పెడుతున్న యు.ఎన్.కు వార్షికోత్సవ శుభాకాంక్షలు. ఇక థాయ్‌లాండ్‌కు ఈ డిసెంబరులో యు.ఎన్.లో చేరి 77 ఏళ్లు పూర్తవుతాయి.

– గీతా సభర్వాల్, థాయ్ రెసిడెంట్ కోఆర్డినేటర్


దేశం గుర్తు లేదు!



డొనాల్డ్ ట్రంప్ తన ఎన్నికల ప్రచారంలో.. హంగేరీ ప్రధాన మంత్రి ఓర్బన్‌ను గొప్ప 'టర్కీ నాయకుడు' అని శ్లాఘించారు. "ఒక వ్యక్తి ఉన్నాడు అతను బహుశా ప్రపంచంలోని బలమైన నాయకులలో ఒకరు. అతనే టర్కీ ప్రధాని ఓర్బన్. రష్యాకు స్నేహితుడు..." అని ట్రంప్ ప్రసంగిస్తున్న ఆ వీడియోను దయచేసి ఎవరూ కూడా ఎర్డోగన్‌కు పంపకండి. (ఎర్డోగన్ టర్కీ అధ్యక్షుడు)

– మారియా డ్రుట్స్కా, ఉక్రెయిన్ యూట్యూబర్

పరిపూర్ణ ఉత్సాహం



ఎదుగుతున్నప్పుడు మన జీవితాలు మన చుట్టూ మనం చూసే, అభిమానించే వ్యక్తుల పరిపూర్ణ ఉత్సాహంతో రూపుదిద్దుకుంటాయి. అలాంటి వ్యక్తులలో క్రికెటర్ బిషన్‌సింగ్ బేడీ ఒకరు. క్రీడలు, జీవితం వంటి వాటి గురించి మాకెంతో నేర్పిన మీకు ధన్యవాదాలు సర్. దేవుడు మీ ఆత్మను ఆశీర్వదిస్తాడు.

– షారుఖ్ ఖాన్, బాలీవుడ్ స్టార్

హెచ్చరికను పట్టించుకోవాల్సిందే!

సందర్భం



రాఘవ్ చంద్ర

జోషీమఠ్ మునిగిపోవడానికి, అలాగే సిక్కిం, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో ఇటీవలి వరదలకు హైవేలు కొట్టుకుపోవడానికి చాలా కాలం ముందే, మన పర్వత ప్రాంత పట్టణాలు చాలావరకు వేరే విధంగా 'మునగడం' ప్రారంభమైంది. హిల్ స్టేషన్‌లకు వెళ్లే మార్గాలపై ట్రాఫిక్ జామ్‌లు, చెత్త కుప్పలు, ఇరువైపులా కనిపించే దుకాణాలను ఆ పట్టణాలు 'మునిగి' పోవడానికి తగిన నిదర్శనాలుగా మనం చూడవచ్చు. వాటికి ఉండే బరువు మోత సామర్థ్యాన్ని పక్కన పెడితే హిల్ స్టేషన్‌లను మెరుగ్గా నిర్వహించడానికి ఏం చేయాలో ఆలోచించడం చాలా కీలకం. జోషీమఠ్ క్షీణత, విరిగి పడుతుండే కులుమనాలీ కొండచరియల దృష్ట్యా... లక్షలాది మంది యాత్రికులు, వేల వాహనాలను తీసుకు వెళతారనే అంచనాతో వేలాది కోట్ల ఖర్చుతో నిర్మించిన చార్‌ధామ్ హైవే వంటి ప్రాజెక్ట్‌లను రక్షించడం తక్షణావసరం.

నిర్మాణం దాదాపుగా పూర్తి అయిన ఈ కొత్త పర్వత రహదారి పర్యావరణపరంగానూ సున్నితమైనది. మట్టిని గట్టిగా పట్టి ఉంచే పాత చెట్లను పెకిలించి, డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ చేయడం భూమిని డొల్లబరుస్తుంది. హిమాలయాల దుర్బలత్వం కారణంగా రహదారిని 5.5 మీటర్ల వెడల్పునకు మించి విస్తరించాలా, వద్దా అనే చర్చ ఉన్నప్పటికీ, తగిన భూ వినియోగ ప్రణాళిక, నేల సంరక్షణ... సమర్థమైన హైవే నిర్వహణకు అత్యవసరం. రహదారిపై పూర్తి స్థాయి రాకపోకలు మొదలైన తర్వాత అనూహ్యమైన నిరంతర వాహనాల రాకపోకలకు చెందిన అధిక ఒత్తిడి ఉంటుంది, దీంతో పరిస్థితిని పునరుద్ధరించడం, పరిష్కరించడం అసాధ్యం అవుతుంది. పరిస్థితి అంతవరకు రాకుండా కొన్ని పరిష్కారాలు ఉన్నాయి.

ఒకటి... ప్రభుత్వం టౌన్ ప్లానర్ ఆర్కిటెక్ట్‌ల సహాయంతో మాస్టర్ ప్లానింగ్ చేసేవరకు పర్వత రహదారులకు ఇరువైపులా భూ వినియోగాన్ని స్తంభింపజేయాలి. ఇది చాలా అవసరం, ఎందుకంటే అలైన్‌మెంట్ ప్రకటించిన వెంటనే... హైవే వెంట షాపులు, రెస్టారెంట్లు, దాబాలు, హోర్డింగ్‌లను ప్లాన్ చేయడానికి పెద్ద ఎత్తున ప్రయత్నం జరుగుతుంది. ఇక రోడ్డు పక్కనే ఉండే ప్రయోజనాన్ని పొందడానికి నిర్మాణాలు నేరుగా హైవేకు ఆనుకుని వచ్చే స్థాయి. ఇది ట్రాఫిక్‌ని పెంచి, పర్యావరణానికి నష్టం కలిగిస్తుంది.

రెండు... రహదారికే కాక, రహదారి కోసం గుర్తించిన ప్రాంతం పైన ఉన్న కొండలను స్థిరీకరించడానికి కూడా ఒక ప్రణాళిక ఉండాలి. అలా లేకుంటే మట్టిని బంధించి ఉంచే మొక్కలు, డ్రెస్సింగ్ స్థానభ్రంశం చెందే అవకాశం ఉంది. తరచు కొండచరియలు విరిగి పడవచ్చు కూడా! ఫలితంగా దీర్ఘకాలంలో, భారీ వర్షాల ప్రభావం ప్రమాదకరంగా ఉంటుంది, రహదారి భాగాలు కొట్టుకుపోతాయి. అందుకే సాంకేతిక లక్షణాలు కూడా బలోపేతం కావాలి.

మూడు... పట్టణ కేంద్రాలను, నివాస ప్రాంతాలను హైవే కలుస్తున్న చోట, హైవే ట్రాఫిక్‌ను సిటీ ట్రాఫిక్ నుండి వేరు చేయడం, రెండు వైపులా 20–30 మీటర్ల లోతువరకు భూ వినియోగాన్ని నియంత్రించడం అవసరం. ఎలివేటెడ్ కారిడార్‌లు, సర్వీస్ లేన్ లు, స్లిప్ రోడ్‌లను ప్లాన్ చేసి ట్రాఫిక్ సజావుగా సాగకుండా రూపొందించాలి.

నాలుగు... ప్రయివేట్ భూమిని ప్రీమియంతో నిర్బంధంగా కొనుగోలు చేసినప్పటికీ, పక్క సౌకర్యాలు... అంటే రెస్టారెంట్లు, టాయిలెట్లు, కార్ల మరమ్మతులు, ఇతర సహాయక సేవల కోసం నిర్దేశించిన పాయింట్లను మాస్టర్ ప్లాన్ చేయడం, గుర్తించడం అవసరం. దుకాణాలు, సంబంధిత వినియోగ కేంద్రాలను నోడ్‌ల వద్ద తప్ప ఇతర పాయింట్ల వద్ద నిషేధించాలి. వాహనాలను మరే ఇతర పాయింట్ల వద్దా ఆపడానికి అనుమతించకూడదు.

ఐదవది... నీటి ఎద్దడి, వేగవంతమైన నేల కోత, రహదారిని దెబ్బతీసే మెరుపు వరదలను ఎదుర్కొనేందుకు ప్లాన్ చేయడానికి 20 సంవత్సరాల డేటా అధ్యయనం ద్వారా పర్వత ప్రాంత సమగ్ర లక్షణాల మ్యాపింగ్



చేయాలి. కొండ ప్రాంతాల ప్రత్యేక భద్రతా చర్యలను చేపట్టేటప్పుడు ఈ ప్రాంత కఠినమైన ల్యాండ్ స్లయిడ్ మ్యాపింగ్ సహాయపడుతుంది.

ఆరవది... పక్కనే ఉండే వన్యప్రాణుల హాట్‌స్పాట్‌ల దృష్ట్యా నాయిస్ మ్యాపింగ్ చేపట్టాలి. ప్రమాదాల నివారణ, పాదచారుల భద్రతను పెంపొందించడానికే కాక సహజ వాతావరణానికి అనవసరమైన ఒత్తిడిని తగ్గించడానికి వాహన వేగాన్ని నియంత్రించడం చాలా చాలా ముఖ్యం.

ఏడవది... ట్రాఫిక్ నిర్వహణ కోసం ఒక ఇంటెలిజెంట్ ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌ని ఏర్పాటు చేయాలి, దానితో పాటు బలమైన ప్రయాణికుల సమాచార వ్యవస్థను నిరోధించడానికి హైవేలోని హాని కలిగించే విభాగాల వెంట పరిమిత సంఖ్యలో వాహనాలనే అనుమతించాలి.

ఎనిమిది... ప్రమాదాలను నివారించడానికి, శిథిలాలను తొలగించడానికి పూర్తి సన్నద్ధమైన విపత్తు నిర్వహణ బృందం, హైవే పెట్రోలింగ్ స్థానంలో ఉండాలి. జ్యామితీయ లోపాలను, ఎలక్ట్రిక్ ఫిట్టింగ్‌లలో లోపాలు, క్రాష్-బారియర్ సిగ్నేజ్‌లను సత్వర పద్ధతిలో సరిచేయడానికి హైవేను సరిచేసే సూత్రంపై పని చేయాలి, మొదట మరమ్మతులు చేయాలి. తరువాత ఖర్చులను తిరిగి పొందాలి.

తొమ్మిది... ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించడం ద్వారా వాతావరణ సంక్షోభ వ్యూహాల సందర్భంలో పర్వత రవాణాను డీకార్బొనైజ్ చేయాలి. (మొదటి రెండు సంవత్సరాల్లో వాటిని టోల్‌ల నుండి మినహాయించాలి.) తగిన ఛార్జింగ్ మౌలిక సదుపాయాలను సృష్టించాలి. హిల్ స్టేషన్ సందర్శకులపై ప్రత్యేక సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ ట్యాక్స్ (భూటాన్ లో చేసినట్లు ఎస్‌డీటీ) విధించవచ్చు. డీజిల్, పెట్రోల్ వాహనాలు పొల్యూటర్-పేస్ సూత్రం ప్రకారం అధిక ఎస్‌డీటీని వసూలు చేయాలి.

పదవది... ప్రధాన పర్వత రహదారుల కోసం పర్యావరణ పరిరక్షణ, భద్రత నిర్వహణ కంపెనీని స్థాపించడం మంచిది. టోల్ రాబడిలో ముందుగా నిర్ణయించిన శాతం, ఎస్‌డీటీ, ఇతర పీనల్ లెవీలు ఈ కంపెనీని నిలకడగా ఉంచడానికి నిధులు సమకూర్చాలి.

పర్యాటకుల తీవ్రమైన రద్దీని, సున్నితమైన హిమాలయ భౌగోళికతను దృష్టిలో ఉంచుకుని, హిల్ స్టేషన్‌లు మాత్రమే కాకుండా వాటి విధానాలను కూడా మెరుగ్గా నిర్వహించడం ముఖ్యం. పైన పేర్కొన్న చర్యలన్నీ కూడా సహజ పర్యావరణానికి అయ్యే ఖర్చును తగ్గించగలవు.

వ్యాసకర్త భారత ప్రభుత్వ మాజీ కార్యదర్శి,
'నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా' మాజీ చైర్మన్
('హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

నమస్కార ఫలితం

నమస్కారం... భారతీయ ఆధ్యాత్మిక, సాంస్కృతిక ప్రతీక. ప్రాచీన కావ్యాలలో పెద్దవారికి చిన్నవారు నమస్కరించటం, వారు వీరికి ఆశీస్సులను ఇవ్వటం, అవి నిజంగా జరగటం చూస్తాము. నమస్కారానికి అంతటి శక్తి ఉంది, అంతటి విలువ ఉంది అనేది భారతీయుల నమ్మకం. తల్లితండ్రులు ప్రత్యక్ష దైవాలు. కొన్ని ప్రాంతాలలో ఉదయాన్నే తల్లితండ్రులకు నమస్కరించే పద్ధతి ఉంది.

ఇహ పరాలలో జ్ఞానమే శాశ్వతమని బోధించే వ్యక్తి గురువు. శిష్యుడి ఎదుగుదలను తృప్తిగా ఆస్వాదించే నిస్వార్థ జీవి గురువు. అటువంటి గురువులకు చేసే నమస్కారం, ఆ గురువులు ఇచ్చే ఆశీస్సులు శిష్యుల జీవితానికి పూలబాట వేస్తాయి.

జ్యోతిర్మయం

మిత్రులకు హృదయం దగ్గర, గురువులకు, దేవతా మూర్తులకు నుదురు దగ్గర చేతులు చేర్చి నమస్కరించటం పద్ధతి. గురువులకూ, దేవతలకూ మనస్ఫూర్తిగా నమస్కరిస్తూ ప్రార్థిస్తే అనుకున్నవి సక్రమంగా జరిగిపోతాయంటారు.

మహాభారతంలో ధర్మరాజు అరణ్యవాసం ముగిశాక, ధర్మదేవతను దైవంగా, తండ్రిగా భావించి చేతులు ఫాల భాగంలో చేర్చి నిండు మనసుతో నమస్కరించాడు. నిర్మల భావంతో ధ్యానించి మనసులో ధర్ముని అంతర్దర్శనం చేసుకున్నాడు. ధర్మరాజు నమస్కారంలో నిష్ఠ, శ్రద్ధ, భక్తి ఉన్నాయి. ఆ ధ్యాన ఫలితంగా పాండవులకు అజ్ఞాత వాస రూపాలు ధర్మరాజుకు కంకుభట్టు, అర్జునునికి బృహన్నల, భీమునికి వలలుడు, నకులునికి దామగ్రంథి, సహదేవునికి తంత్రీపాలుడు ఇత్యాది రూపాలు అప్రయత్నంగా వచ్చాయి. కంకుభట్టుకు కమండలం, సన్యాసి ధరించే వస్త్రాలు, మిగతా వారికి, వారికి తగిన వస్త్రాలు, ఆభరణాలు ఎదురుగా కనిపించాయి. వారు వాటిని ధరించి తమ అజ్ఞాత వాస ప్రయాణాన్ని ప్రారంభించారు. ఆ దైవానుగ్రహఫలమే విరటుడు అందరికీ సులభంగా దర్శనం ఇచ్చేటట్లు ప్రజల మధ్య కొలువు తీరి ఉంటాడు.

నిర్మలమైన భక్తి, విశ్వాసాలతో దైవానికి చేసే నమస్కారం సత్ఫలితాన్ని, సత్వర ఫలితాన్ని ఇస్తుంది. కేవలం యాంత్రికంగా, మొక్కుబడిగా, ఒంటిచేత్తో చేసే నమస్కారాల వల్ల ఫలితం ఉండదు.

– డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి

క్లుప్తంగా...

మల్లేశ్వరస్వామి సేవలో హైకోర్టు న్యాయమూర్తి


జస్టిస్ కృపాసాగర్‌కు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి, శివశంకరరావు

పెదకాకాని: గుంటూరు జిల్లా పెదకాకానిలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి వీఆర్‌కే కృపాసాగర్ దంపతులు దర్శించుకున్నారు. మంగళవారం శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానానికి విచ్చేసిన న్యాయమూర్తి దంపతులకు అసిస్టెంట్ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, పాలకవర్గం చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, పాలకమండలి సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. న్యాయమూర్తి దంపతులు స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక అభిషేకం, కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చక స్వాములు, వేదపండితులు వేద ఆశీర్వచనం చేసి స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించి, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

తెనాలిలో రోబోటిక్ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ



తెనాలి: సాయిబాబా సూక్తులు ఆయన నోటి వెంట వినటమంటే భక్తులకు పరమానందమే కదా! అదెలా సాధ్యమంటారా...గుంటూరు జిల్లా తెనాలి మారీసుపేటలోని శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో సాయిబాబా విగ్రహం నుంచి నేరుగా ఆయన సూక్తులనే వింటూ భక్తులు తన్మయత్వానికి లోనయ్యారు. వాస్తవానికి అది రోబోటిక్ విగ్రహం. విశాఖపట్నంలో ప్రత్యేకంగా తయారు చేయించారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రప్రథమంగా ఏర్పాటు చేసిన రోబోటిక్ సాయి విగ్రహం ఇదే కావటం విశేషం! సాయిబాబా మహాసమాధి మహోత్సవం సందర్భంగా ఆలయం పైభాగాన నిర్మించిన మందిరంలో మంగళవారం ప్రతిష్ఠించారు. ఆడియోలో సూక్తులు వినవస్తుంటే సాయిబాబా మాట్లాడుతున్నట్టుగా కళ్లు మూసి, తెరుస్తూ, పెదవుల కదలిక ఉండేలా ఈ విగ్రహాన్ని రూపొందించారు.

అనకాపల్లిలో సోనూసూద్



అనకాపల్లి టౌన్: దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని అనకాపల్లి గవరపాలెంలోని సతకంపట్టు కనకదుర్గమ్మను ప్రముఖ సినీ నటుడు సోనూసూద్ మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. ఆలయ వ్యవస్థాపకుడు పీవీ రమణ, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి పూజలు చేశారు.

28న కాణిపాకం ఆలయం మూసివేత

యాదమరి(చిత్తూరు జిల్లా): ఈ నెల 28వ తేదీన చంద్రగ్రహణం సందర్భంగా కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం, అనుబంధ ఆలయాలు మూసి వేయనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. ఈ నెల 28వ తేదీ శనివారం సాయంత్రం 5 గంటల నుంచి 29వ తేదీ ఉదయం 6 గంటల వరకు మూసివేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే 28వ తేదీ సాయంత్రం స్వామివారి సేవల్లో నిర్వహించే ప్రమాణం, క్షీరాభిషేకం, మహా హారతి, ఊంజల్ సేవ, పవళింపు సేవ, గోపూజ, 29వ తేదీ ఆదివారం ఉదయం సుప్రభాతం, నిజరూప దర్శనం, పంచామృత అభిషేకం నిర్వహించడం లేదని, ఈ సేవలకు సంబంధించి టికెట్లు నిలిపివేయనున్నట్లు వారు తెలిపారు.

మచిలీపట్నంలో శక్తి పటాల ఊరేగింపు

కోల్‌కతా తర్వాత భారీగా ఉత్సవాల నిర్వహణ



మచిలీపట్నం టౌన్: దసరా ఉత్సవాలు అంటే అందరి మదిలో మెదిలేది కోల్‌కతా. అక్కడ ఈ ఉత్సవాలు దేశంలోనే అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. అలాంటి ఉత్సవాలు మన రాష్ట్రంలోని కృష్ణాజిల్లా మచిలీపట్నంలో కూడా జరుగుతాయి. ఈ సందర్భంగా నగరంలోని పలు కాలనీల్లో ఆలయాల వద్ద యువకులు శక్తిపటాలను తయారు చేసి తొమ్మిది రోజుల పాటు ఊరేగిస్తారు. దసరా రోజు రాత్రికి అన్ని ప్రాంతాల్లో ఉన్న శక్తిపటాలను ఊరేగిస్తూ స్థానిక కోనేరు సెంటర్‌కు చేరుకుని జమ్మిపూజ చేసి ముగిస్తారు. ఈ విధంగానే సోమవారం రాత్రి నుంచి శక్తిపటాల ఊరేగింపు ప్రారంభించి మంగళవారం ఉదయం ముగించారు. ఊరేగింపును తిలకించేందుకు నగరవాసులు రాత్రంతా కోనేరుసెంటర్‌లోనే జాగారం చేశారు.

ముగిసిన దసరా ఉత్సవాలు


విజయవాడలో ఊరేగింపుగా తెప్పోత్సవానికి వెళుతున్న కనకదుర్గమ్మ


విశ్వనాథపల్లిలో అద్దంకి నాంచారమ్మ

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ)/కోడూరు/పెందుర్తి/శ్రీశైలం టెంపుల్: ఇంద్రకీలాద్రిపై నిర్వహిస్తోన్న దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం 9వ రోజున దుర్గమ్మ 2 అలంకారాల్లో అభయమిచ్చారు. ఉదయం మహిషాసురమర్దినిగా.. మధ్యాహ్నం శ్రీ రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చారు. మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు అమ్మవారి అలంకరణ మార్పు కారణంగా దర్శనాలను నిలిపివేశారు. 2 రోజుల్లో రికార్డు స్థాయిలో 4 లక్షలకు పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అంచనా. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయం సమీపంలోని యాగశాలలో మహా పూర్ణాహుతిని నిర్వహించారు. సోమవారం రాత్రి ఆది దంపతులకు కృష్ణా నదిలో తెప్పోత్సవాన్ని నిర్వహించారు. దుర్గాఘాట్ వద్ద హంస వాహనంపై శ్రీగంగా పార్వతి (దుర్గ) సమేత మల్లేశ్వర స్వామి వారు తెప్పపై విహరించారు.

8.95 లక్షల మందికి దర్శనం

ఇంద్రకీలాద్రిపై ఈ నెల 15–23 వరకు నిర్వహించిన దసరా ఉత్సవాల్లో 8.95 లక్షల మంది అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ ఈవో కేఎస్ రామారావు తెలిపారు. 14.17 లక్షల లడ్డూలను విక్రయించినట్లు చెప్పారు.

స్వర్ణం, వెండి, పట్టుతో నేసిన చీరలో నాంచారమ్మ

కృష్ణా తీరంలో భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న కృష్ణా జిల్లా కోడూరు మండలం విశ్వనాథపల్లిలోని అద్దంకి నాంచారమ్మ అమ్మవారికి బంగారం, వెండి, పట్టుతో నేసిన చీరను అలంకరించారు. పమిడిముక్కల మండలం మంటాడకు చెందిన పసుపులేటి మణికంఠ వృత్తి పరంగా విదేశాల్లో స్థిరపడ్డాడు. దసరా ఉత్సవాలకు నాంచారమ్మ అమ్మవారికి రూ.2 లక్షలతో బంగారం, వెండితో ప్రత్యేకంగా తయారు చేయించిన చీరను మణికంఠ కుటుంబసభ్యులు సోమవారం ఆలయాధికారులకు అందజేశారు. పట్టుతో పాటు చీర మొత్తం బంగారం, వెండి తీగలతో నేయించారు. ఈ చీరను మూలమూర్తికి అలంకరించారు. బంగారం, వెండి చీరలో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. మణికంఠ కుటుంబీకులను ఆలయ ఈవో పామర్తి సీతారామయ్య సన్మానించారు.

విశాఖ శ్రీశారదాపీఠంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు


అమ్మవారికి హారతి ఇస్తున్న స్వామీజీ

విశాఖ శ్రీశారదాపీఠంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. మంగళవారం విజయదశమి సందర్భంగా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతిలు శమీ వృక్షం వద్ద అపరాజితాదేవిని ఆరాధిస్తూ ప్రత్యేక పూజలు చేశారు. విజయదుర్గ అవతారంలో దర్శనమిచ్చిన శారదాస్వరూప రాజశ్యామల అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కేఎస్ జవహర్‌రెడ్డి శ్రీశారదాపీఠాన్ని మంగళవారం సందర్శించి స్వామీజీల ఆశీస్సులు తీసుకున్నారు. అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపారు. విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నంది వాహన సేవలో ఆది దంపతులు



శ్రీశైలంలో ఆధ్యాత్మికభరితంగా సాగిన దసరా మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. అమ్మవారు నిజరూప అలంకారంలో భ్రమరాంబాదేవిగా దర్శనమిచ్చారు. నంది వాహన సేవలో ఆది దంపతులు విహరించారు. ప్రత్యేక అలంకృతులైన అమ్మవారికి, స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు అర్చకులు, వేదపండితులు ప్రత్యేక వేదికలో ఆశీనులను చేయించి విశేష పూజలు నిర్వహించారు. విజయదశమి రోజున స్వామి అమ్మవార్లకు విశేష పూజలతో పాటు శమీ పూజ చేపట్టారు. అమ్మవారి యాగశాలలో, స్వామివారి యాగశాలలో శాస్త్రోక్తంగా పూర్ణాహుతి నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమంతో శ్రీగిరిలో దసరా మహోత్సవాలు ముగిశాయి. కాగా, సోమవారం రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్వామి అమ్మవార్లకు మంత్రి గుమ్మనూరు జయరాం దంపతులు పట్టువస్త్రాలను సమర్పించారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దంపతులు, దేవస్థాన ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఈవో పెద్దిరాజు పాల్గొన్నారు.

భక్తులకు సంతృప్తికరంగా శ్రీవారి దర్శనం

- అన్ని విభాగాల సమన్వయంతో బ్రహ్మోత్సవాలు విజయవంతం
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి


మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ భూమన

తిరుమల: శ్రీవారి సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా లక్షలాది మంది భక్తులకు సంతృప్తికరంగా శ్రీవేంకటేశ్వరస్వామి దర్శన భాగ్యం కల్పించామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి చెప్పారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వసతి, అన్నప్రసాదం, లడ్డూప్రసాదాలు అందించినట్లు తెలిపారు. భక్తులు మధురానుభూతితో వాహన సేవలు దర్శించుకున్నారని పేర్కొన్నారు. సోమవారం అన్నమయ్య భవనంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సంవత్సరం అధిక మాసం కారణంగా రెండు బ్రహ్మోత్సవాలు నిర్వహించామన్నారు. టీటీడీ, ఆర్టీసీ, పోలీస్ అధికారులు, సిబ్బంది, మీడియా సమన్వయంతో బ్రహ్మోత్సవాలు దిగ్విజయంగా జరిగాయన్నారు. సంకీర్తనలు, నృత్య కార్యక్రమాలు, కళారూపాలు, పుష్పాలంకరణలు, ఎగ్జిబిషన్లు భక్తుల ప్రశంసలందుకున్నాయని పేర్కొన్నారు. ఈసారి ఎక్కువ మంది భక్తులకు దర్శనం కల్పించేందుకు వీలుగా ఆగమ పండితుల అనుమతితో తొలిసారి గరుడసేవను సాయంత్రం 6.30 గంటలకే ప్రారంభించామని.. ఆరోజు సుపథం, వసంత మండపం, మేదరమిట్ట, అన్నదానం కాంప్లెక్స్ ప్రాంతాల్లో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి శ్రీవారి దర్శనం కల్పించామన్నారు. వివిధ భాషల్లో ఆధ్యాత్మిక పుస్తకాలను ఆవిష్కరించినట్లు తెలిపారు. ఎస్వీబీసీలోని నాలుగు భాషల చానళ్ల ద్వారా ప్రతిరోజూ సుమారు 9 గంటల పాటు వాహన సేవలు, ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలను ప్రత్యక్ష ప్రసారం చేశామని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది భక్తులు వీటిని వీక్షించారని పేర్కొన్నారు. కాగా, సాలకట్ల బ్రహ్మోత్సవాల ధ్వజారోహణం రోజున సీఎం జగన్ శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించి.. శ్రీనివాససేతుతో పాటు ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో నిర్మించిన అదనపు హాస్టల్ భవనాలను ప్రారంభించారని గుర్తుచేశారు. అలాగే టీటీడీ ఉద్యోగుల సొంత ఇంటి కలను సాకారం చేసిన సీఎం జగన్‌కు భూమన కృతజ్ఞతలు తెలియజేశారు. మరో 250 ఎకరాలు సమీకరించి ఉద్యోగులందరికీ ఇంటి స్థలాలివ్వాలని ఈవోను, కలెక్టర్‌ను సీఎం జగన్ ఆదేశించారని.. ఇది ఉద్యోగులకు గొప్ప బహుమానమన్నారు. ఈ సమావేశంలో టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, బోర్డు సభ్యులు వెంకటసుబ్బరాజు, యానాదయ్య, దేశ్‌పాండే, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, తిప్పేస్వామి, వెంకట సతీశ్‌కుమార్, అశ్వత్థ నాయక్, నాగసత్యం, జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహ కిశోర్, సీఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'నిజం గెలిచింది'.. అందుకే బాబు జైలుకెళ్లాడు..

- భువనేశ్వరీపై బహుజనుల ధ్వజం
- 1,122వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: అమ్మా భువనేశ్వరీ .. నిజం గెలిచింది కాబట్టే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు జైలు పాలయ్యాడని బహుజన పరిరక్షణ సమితి నాయకులు స్పష్టం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,122వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. తాను అధికారంలో ఉండగా రైతుల పేరుతో హైటెక్ దోపిడీ చేసి రూ.కోటాను కోట్లు దోచుకుంటున్నప్పుడు తమరు వారించి ఉంటే చంద్రబాబుకు జైలు యోగం పట్టేది కాదని ధ్వజమెత్తారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్లస్థలాలిస్తే సామాజిక అసమతుల్యత ఏర్పడుతుందంటూ తప్పుడు కేసులు వేయించిన బాబుకు తగిన శాస్తి జరిగిందన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డు పేరుతో భూ దోపిడీకి పాల్పడి.. వేలాది ఎకరాలు దోచుకున్న విషయం మరిచిపోయారా అని ప్రశ్నించారు. చంద్రబాబు అవినీతికి రక్షగా నిలిచేందుకు..'నిజం గెలవాలి' పేరుతో తమరు యాత్ర చేసినంత మాత్రాన ప్రజలు నమ్ముతారనుకుంటే అంతకన్నా అజ్ఞానం మరొకటి ఉండదని భువనేశ్వరీకి హితవు పలికారు. ఏపీలో నేడు సత్యం, ధర్మం, న్యాయం, నాలుగు పాదాలపై నడుస్తున్నాయనేందుకు అధికారం అడ్డుపెట్టుకుని దోచుకున్న గజదొంగలకు అరదండాలు వేయడమే నిదర్శనమన్నారు. నాయకులు ఈపూరి ఆదాం, మాదిగాని గురునాథం, పులి దాసు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

ద్వారకా తిరుమలలో మాడ వీధులు నిర్మిస్తాం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ వెల్లడి


పట్టు వస్త్రాలను తీసుకెళ్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

ద్వారకాతిరుమల: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి క్షేత్రంలో త్వరలో మాడ వీధులు నిర్మించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. ఆలయంలో జరుగుతోన్న శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మంత్రి కొట్టు స్వామివారికి ప్రభుత్వం తరఫున మంగళవారం పట్టు వస్త్రాలను సమర్పించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన మంత్రికి దేవస్థానం ఈవో వేండ్ర త్రినాధరావు, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారి పట్టువస్త్రాలు, పూలు, పండ్లు శిరస్సుపై పెట్టుకుని ఆలయంలోకి వెళ్లిన మంత్రి, అక్కడ అర్చకులకు వాటిని అందజేశారు. ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఈవో త్రినాధరావు, అనువంశిక ధర్మకర్త ఎస్వీ నివృతరావులు శ్రీవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. మీడియాతో మంత్రి మాట్లాడుతూ.. ద్వారకాతిరుమల క్షేత్ర అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించినట్లు చెప్పారు.

తిరుమలలో ఘనంగా పార్వేట ఉత్సవం

- నూతన మండపంలో నిర్వహణ
- ముగిసిన శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు


పార్వేట మండపం వద్ద పూజల్లో పాల్గొన్న భూమన, ధర్మారెడ్డి

తిరుమల: తిరుమలలో శ్రీ మలయప్పస్వామివారి పార్వేట ఉత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ ఉత్సవం మకర సంక్రాంతి మరుసటిరోజైన కనుమ నాడు జరుగుతుంది. అధికమాసం కారణంగా శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల మరుసటిరోజు కూడా దీన్ని నిర్వహిస్తారు. శ్రీవారి ఆలయంలో ప్రాతఃకాలారాధన పూర్తయిన తరువాత శ్రీమలయప్పస్వామి తిరుచ్చిపై పాపవినాశన మార్గంలో నూతనంగా నిర్మించిన పార్వేట మండపానికి ఊరేగింపుగా చేరుకున్నారు. అనంతరం పంచాయుధమూర్తిగా దర్శనమిచ్చిన శ్రీ మలయప్పస్వామి శంఖం, చక్రంతోపాటు ఖడ్గం, గద, ఈటె, విల్లు, బాణం తదితర ఆయుధాలు ధరించి పారువేటకు వెళ్లారు. స్వామి వారి తరఫున టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డితో పాటు అర్చకులు రామకృష్ణ దీక్షితులు ఈటెను 3 సార్లు విసిరారు. ఆ తరువాత స్వామివారు పార్వేట మండపం నుంచి మహాద్వారానికి వచ్చి హాథీరాంజీవారి బెత్తాన్ని తీసుకొని సన్నిధికి వేంచేయడంతో పారువేట ఉత్సవం ముగిసింది. ఈ ఉత్సవం కారణంగా ఆలయంలో ఆర్జిత సేవలను రద్దు చేశారు.

అన్ని విషయాలను ఆ కోణంలో చూడవద్దు: భూమన

టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ..అత్యంత ప్రాచీనమైన, కూలడానికి సిద్ధంగా ఉన్న పార్వేట మండపాన్ని టీటీడీ అధికారులు అదే రీతిలో పునర్నిర్మించారని చెప్పారు. అయితే, ప్రతీ విషయాన్ని రాజకీయ కోణంలో చూసి విమర్శించడం సరైన చర్య కాదని వ్యాఖ్యానించారు. పార్వేట మండపం చాలా పాతదని, ఇది కూలిపోయే స్థితిలో ఉండగా టీటీడీ చక్కగా పునర్నిర్మించిందని తెలిపారు. టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి మాట్లాడుతూ.. పాత మండపంలోని కళాఖండాలను రికార్డు చేసి యథావిధిగా తిరిగి నిర్మించామని, నూతన మండపం అద్భుతంగా వచ్చిందని చెప్పారు.

వేడుకగా బంగారు తిరుచ్చి ఉత్సవం

శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన సోమవారం నాడు స్వామివారికి చక్రస్నానాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి బంగారు తిరుచ్చి ఉత్సవం వైభవంగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి వారు శ్రీరామ పట్టాభిషేకం అలంకారంలో ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించారు. దీంతో 9 రోజుల పాటు జరిగిన నవరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

27 నుంచి ఏఎంసీ శతాబ్ది ఉత్సవాలు

ఉపరాష్ట్రపతి, గవర్నర్, మంత్రులు రాక


మాట్లాడుతున్న ఆంధ్ర మెడికల్ కాలేజీ సెంటినరీ ఉత్సవాల కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రవిరాజ్

మహారాణిపేట(విశాఖ దక్షిణ): ఆంధ్ర మెడికల్ కాలేజీ శతాబ్ది ఉత్సవాలు ఈ నెల 27 నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఏఎంసీ సెంటినరీ ఉత్సవాల కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రవిరాజ్ తెలిపారు. మంగళవారం ఆంధ్రా మెడికల్ కాలేజీ ఆవరణలో విలేకరులతో ఆయన మాట్లాడారు. 1923 జూలై 19న ఆంధ్రా మెడికల్ కాలేజీని స్థాపించారని, ఈ ఏడాదికి వందేళ్లు పూర్తయిందన్నారు. శతాబ్ది ఉత్సవాలను ఈ నెల 27, 28, 29 తేదీల్లో ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఈ ఉత్సవాల్లో 27న భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్, 28న కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి ఎం.ఎల్ మాండవీయ, రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రులు విడదల రజని, గుడివాడ అమర్‌నాథ్ తదితరులు పాల్గొంటారని వివరించారు. 29న తెలుగు సాహితీ వైభవం కార్యక్రమంతోపాటు రాత్రి మ్యూజికల్ నైట్ ఉంటుందన్నారు. ఈ ఉత్సవాలకు కళాశాలలో చదువుకొని దేశ, విదేశాల్లో ఉన్న మూడు వేల మంది వైద్య విద్యార్థులు హాజరవుతున్నట్టు తెలిపారు. శతాబ్ది ఉత్సవాల సందర్భంగా అసోసియేషన్ సభ్యులు ఏఎంసీకి చెందిన 1.6 ఎకరాల్లో దాదాపు రూ.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న సెంటినరీ ఈ భవనాన్ని ఉప రాష్ట్రపతి ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

విషాదంగా ముగిసిన విహార యాత్ర

- బస్సును ఢీకొన్న సుమో
- ఏడుగురు మృతి..మరో నలుగురికి తీవ్ర గాయాలు
- తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

వేలూరు(తమిళనాడు): విహార యాత్ర విషాదంగా ముగిసింది. బస్సును సుమో ఢీకొని ఏడుగురు దుర్మరణం చెందగా, నలుగురు ఆస్పత్రిపాలైన ఘటన తమిళనాడులో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే... కృష్ణగిరి జిల్లా తెన్‌కలికోట సమీపంలోని కొల్లమంగలం ప్రాంతంలోని ఓ ప్రైవేటు కంపెనీలో అస్సాం రాష్ట్రానికి చెందిన కార్మికులు పనిచేస్తున్నారు. సోమవారం సెలవు రావడంతో కంపెనీలో పనిచేస్తున్న కార్మికులు పుదుచ్చేరికి విహార యాత్రకు సుమోలో వెళ్లారు. సుమోను కొల్లమంగలం ప్రాంతానికి చెందిన పునీత్ కుమార్(23) నడుపుతున్నాడు. విహార యాత్రను ముగించుకొని సోమవారం రాత్రి సొంత గ్రామానికి బయలుదేరారు. సుమో తిరువణ్ణామలై జిల్లా మేల్ సెంగం సమీపంలోని కృష్ణానగర్ వద్ద బెంగళూరు నుంచి తిరువణ్ణామలై వైపు వస్తున్న బస్సును సుమో అతి వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంతో అస్సాం రాష్ట్రానికి చెందిన పంజారాయ్(27), నారాయణన్(32), విమల్(28), సాల్(31), నికాల్(33), ఊతంగరైకి చెందిన గోవిందస్వామి కుమారుడు కామరాజ్(21), పునీత్‌కుమార్(37) మృతి చెందారు. క్రిష్ణప్ప, సుపాన్, మిజోస్ నిర్ది, రాబన్‌కురో తీవ్రంగా గాయపడి తిరువణ్ణామలై ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీనిపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం జగన్ 'పథకాల' అమలు భేష్

ఐఎంఏ మాజీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సమరం


మాట్లాడుతున్న డాక్టర్ సమరం

ఒంగోలు టౌన్: దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలు చాలా బాగున్నాయని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మాజీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సమరం కితాబునిచ్చారు. ఒంగోలులోని ఒక వైద్యశాల ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయనకు సోమవారం రెడ్‌క్రాస్ భవన్‌లో ఆత్మీయ సన్మానం జరిగింది. డాక్టర్ సమరం మాట్లాడుతూ.. ఐఎంఏ జాతీయ అధ్యక్షుడిగా దేశంలోని అనేక రాష్ట్రాలు పర్యటించానని, ఎక్కడా ఇలాంటి అద్భుత పథకాలు అమలు చేయడం లేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యం కోసం అనేక పథకాలను చేపట్టడం ఆహ్వానించదగిన విషయమని చెప్పారు. ఆరోగ్యశ్రీ, జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ మెడిసిన్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లు చాలా మంచి కార్యక్రమాలని తెలిపారు. విద్యాభివృద్ధి కోసం కూడా జగన్ చాలా కృషి చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేతుల మీదుగా వైఎస్సార్ జీవన సాఫల్య అవార్డు తీసుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు. రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రకాష్‌బాబు, ఏఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జె.మణిబాబు, ఏఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ నల్లూరి రాఘవరావు, డాక్టర్ జయశేఖర్, రెడ్‌క్రాస్ మహిళా విభాగం, ఏపీటీసీఏ, లయన్స్ సిటిజన్స్, లయన్స్ లెజెండరీ సభ్యులు పాల్గొన్నారు.

యూట్యూబ్ వీడియోలు చూసి వృద్ధురాలి హత్య

- నగల కోసం ఘాతుకానికి పాల్పడిన విద్యార్థి
- కావలిలో ఘటన..కేసును ఛేదించిన పోలీసులు

కావలి: నిత్యం యూ ట్యూబ్‌లో నేరాలకు సంబంధించిన వీడియోలు చూసి ఉన్మాదిగా మారిన ఓ విద్యార్థి.. ఒక వృద్ధురాలిని దారుణంగా హత్య చేసిన ఘటన శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కావలిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... కావలి పట్టణంలోని జనతాపేట నార్త్‌లోని ప్రధాన వీధిలో ఒక రిటైర్డ్ లెక్చరర్ కుటుంబం నివాసం ఉంటోంది. దంపతులతో పాటు యజమాని అత్త మంచాల రమణమ్మ (85) కూడా వారితో ఉంటోంది. కావలి సమీప గ్రామానికి చెందిన డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థితో రిటైర్డ్ లెక్చరర్‌కు పరిచయం ఉంది. ఆ విద్యార్థి వారి ఇంటి పనులు చక్కబెడుతుంటాడు. ఆదివారం రిటైర్డ్ లెక్చరర్ దంపతులు యథాప్రకారం ఉదయాన్నే వాకింగ్‌కు వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చేసరికి వృద్ధురాలు రక్తపుమడుగులో ఉంది. వెంటనే నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె చనిపోయింది. దీనిపై ఫిర్యాదు అందుకున్న కావలి టూ టౌన్ సీఐ సుధాకర్ విచారణ చేపట్టారు. నిందితుడి ఆనవాళ్లు దొరకడంతో తమదైన శైలిలో విచారించగా అన్ని వివరాలు చెప్పేశాడు. రిటైర్డ్ లెక్చరర్ దంపతులు ఒకరి తర్వాత ఒకరు వాకింగ్‌కు వెళ్లడం గమనించాడు. తన వెంట తెచ్చుకున్న సుత్తితో వృద్ధురాలి తలపై కొట్టడంతో తీవ్ర రక్తస్రావంతో ఆమె కోమాలోకి వెళ్లిపోయింది. ఆమె వంటిపై ఉన్న ఐదున్నర సవర్ల బంగారం తీసుకొని, నేరుగా తన ఇంటికి చేరుకొని దాచిపెట్టాడు. ఆ బంగారాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ దర్యాప్తులో ఆ విద్యార్థికి యూట్యూబ్‌లో నేరాల వీడియోలు చూసే అలవాటు ఉందని, దాని నుంచి ప్రేరణ పొంది హత్యకు పాల్పడ్డాడని తెలుసుకుని పోలీసులు నివ్వెరపోయారు.

సాంకేతిక సమస్యతో 'జన్మభూమి'కి బ్రేక్


దెందులూరులో నిలిచిపోయిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్

దెందులూరు: ఏలూరు జిల్లా, దెందులూరు రైల్వేస్టేషన్ సమీపంలో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ సోమవారం మూడు గంటల పాటు నిలిచిపోయింది. విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న ఈ రైలు దెందులూరు వద్దకు వచ్చేసరికి సాంకేతిక లోపం ఏర్పడింది. మధ్యాహ్నం 12.10 గంటల సమయంలో రైలు నిలిచిపోవడంతో.. సిబ్బంది తనిఖీ చేసి బ్రేక్ పవర్ పైపులు మరమ్మతుకు గురైనట్టు గుర్తించారు. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు వెంటనే అప్రమత్తమై మరో ఇంజిన్‌ను విజయవాడ నుంచి పంపించి దానిని రైలుకు జత చేసి విజయవాడకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో సుమారు మూడు గంటల పాటు రైలు దెందులూరు వద్దే నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వృద్ధులు, చిన్నారులు అసహనానికి లోనయ్యారు.

రామగుండం విద్యుత్ కేంద్రంలో మంటలు

రామగుండం: పెద్దపల్లి జిల్లా రామగుండంలోని 50 ఏళ్ల నాటి బీ–థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఆదివారం అర్ధరాత్రి దాటాక భారీ అగ్నిప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో టర్బయిన్, బాయిలర్ కేంద్రంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రాణాపాయం తప్పింది.

నిప్పురవ్వలు ఎగసిపడటంతో...

రామగుండంలోని బీ–థర్మల్ విద్యుత్ కేంద్రంలో కాలం చెల్లిన పరిజ్ఞానం వినియోగిస్తున్నారు. ఇందులోని మిల్స్ నుంచి బాయిలర్‌లోకి బొగ్గును డంపింగ్ చేస్తుంటారు. ఈ క్రమంలో వివిధ యంత్రాలు, కంట్రోల్ రూం వరకు బొగ్గుపొడి (కోల్‌డస్ట్) వెదజల్లినట్లుగా నిండిపోతూ ఉంటుంది. అయితే బాయిలర్ ప్రాంగణంలో షార్ట్ సర్క్యూట్ జరిగిందని, నిప్పురవ్వలు బొగ్గుపొడిపై పడటంతో మంటలు చెలరేగి సమీపంలోని రబ్బర్ కేబుల్స్‌కు అంటుకొని విద్యుత్ కేంద్రం ట్రిప్ అయిందని అధికారులు తెలిపారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సకాలంలో ఫైరింజన్ ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చిందని చెప్పారు.

క్లుప్తంగా...

చైనా రక్షణ మంత్రి షాంగ్ తొలగింపు

బీజింగ్: రెండు నెలల నుంచి కనిపించకుండా పోయిన రక్షణ మంత్రి జనరల్ లీ షాంగ్‌ఫూను పదవి నుంచి తొలగిస్తున్నట్టు చైనా మంగళవారం లాంఛనంగా ప్రకటించింది. ఆయన అదృశ్యంపై మాత్రం ఎలాంటి వివరణా ఇవ్వకుండా తొలగింపు ప్రకటనకే పరిమితమైంది. అలాగే ఆర్థిక, ఐటీ శాఖల మంత్రులు లియు కున్, వాంగ్ జీ గాంగ్‌లను కూడా తొలగిస్తున్నట్టు పేర్కొంది. వారిద్దరి స్థానంలో కొత్తవారిని నియమించినా, రక్షణ శాఖకు మాత్రం ఎవరి పేరునూ ప్రకటించలేదు. గత మార్చిలోనే కేబినెట్ పునర్ వ్యవస్థీకరణ సందర్భంగా లీ రక్షణ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆగస్టు 29న చివరిసారిగా బయటి ప్రపంచానికి కనిపించారు. చైనాలో ఈ ఏడాది ఇలా అనూహ్య పరిస్థితుల్లో మాయమైన రెండో పెద్ద నేత లీ. గత జూలైలో చైనా విదేశాంగ మంత్రి క్విన్ గాంగ్‌ను కూడా ఇలాగే తొలగించడం తెలిసిందే. ఆయన కూడా నాటినుంచీ కనిపించకుండా పోయారు. అధ్యక్షుడు షిన్‌పింగ్ చుట్టూ ఉన్న అధికార కేంద్రంపై ప్రశ్నలు లేవనెత్తిన రోజుల వ్యవధిలోనే వారికి ఈ గతి పట్టింది. గత చైనా అధినేతలందరి మాదిరిగానే జిన్‌పింగ్ కూడా కేవలం విధేయతకే పెద్ద పీట వేస్తారని చెబుతారు.

గొణుక్కోకండి!

గుజరాత్ హైకోర్టులో జడ్జీల వాగ్వాదం

అహ్మదాబాద్: ఇద్దరు న్యాయమూర్తుల వాగ్వాదానికి గుజరాత్ హైకోర్టు వేదికైంది. న్యాయమూర్తులు జస్టిస్ బీరేన్ వైష్ణవ్, జస్టిస్ మౌనా భట్ ధర్మాసనం సోమవారం ఓ కేసును విచారిస్తున్న సందర్భంగా ఈ ఉదంతం జరిగింది. కేసుకు సంబంధించిన కొన్ని అంశాలపై వారిద్దరూ విభేదించారు. అనంతరం జస్టిస్ వైష్ణవ్ వెలువరించిన తీర్పుతో జస్టిస్ భట్ ఏకీభవించలేదు. దాంతో, 'కావాలంటే మీరు విభేదించండి. ఇప్పటికే ఒక కేసులో మనం విభేదించాం. ఇందులోనూ అలాగే చేయవచ్చు' అని జస్టిస్ వైష్ణవ్ అన్నారు. ఇది కేవలం విభేదించడానికి సంబంధించిన విషయం కాదంటూ జస్టిస్ భట్ ఏదో చెప్పబోగా, 'మరైతే గొణగకండి. విడి తీర్పు వెలువరించండి. మనమిక తదుపరి కేసులు చేపట్టబోవడం లేదు' అంటూ తన స్థానం నుంచి లేచారు. ధర్మాసనం తదుపరి కేసులు ఆలకించబోదని చెబుతూ కోర్టు రూమ్ నుంచి వెళ్లిపోయారు. ఇదంతా కోర్టు రూములోని సీసీ కెమెరాలో రికార్డయింది. గుజరాత్ హైకోర్టులో అన్ని బెంచ్‌లు జరిపే విచారణలూ ప్రత్యక్ష ప్రసారం అవుతున్నాయి. జడ్జిల వాగ్వాదానికి సంబంధించిన వీడియోను కాసేపటికే యూట్యూబ్ నుంచి తొలగించారు. కానీ ఆ వీడియో అప్పటికే సామాజిక మాధ్యమాల వేదికనెక్కి తెగ చక్కర్లు కొడుతోంది.

మణిపూర్ హింసలో బయటి శక్తుల ప్రమేయం!

ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్య

నాగ్‌పూర్: మణిపూర్‌లో చెలరేగిన జాతుల హింస వెనక విదేశీ శక్తుల ప్రమేయముందని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ అనుమానాలు వెలిబుచ్చారు. అక్కడ మెయిటీ, కుకీలు ఎప్పట్నుంచో శాంతియుతంగా సహజీవనం చేస్తున్నారని గుర్తు చేశారు. 'అలాంటి చోట హింస చెలరేగింది. ఇక సద్దుమణుగుతోందనగా ఏదో ఒక రూపంలో మళ్లీ రాజుకుంటూ వస్తోంది. ఒక సరిహద్దు రాష్ట్రంలో ఇలాంటి కల్లోలం, వేర్పాటువాదంతో ఎవరికి లాభం? బయటి శక్తులకే' అని ఆయన అభిప్రాయపడ్డారు. మంగళవారం నాగపూర్‌లో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన దసరా ర్యాలీని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు.

పద్మనాభుని కోసం ఆగిన విమానాలు

తిరువనంతపురం: కేరళలోని విఖ్యాత అనంత పద్మనాభ స్వామి అరత్తు ఉత్సవం సోమవారం తిరువనంతపురంలో వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా సంప్రదాయ ఊరేగింపు అంతర్జాతీయ విమానాశ్రయం రన్‌వే మీదుగా సాగింది. దీంతో విమానాల రాకపోకలను తెల్లవారుజాము నుంచి 5 గంటల పాటు పూర్తిగా నిలిపేశారు. ఊరేగింపు ఆలయానికి చేరిన అనంతరం ఉదయం 9 గంటల నుంచి వాటిని పునరుద్ధరించారు. భారీ వర్షంలోనూ ట్రావెన్‌కోర్ రాజ సంస్థాన వారసుడు శ్రీమూలం తిరునాళ్ రామ వర్మ ముందుండి ఊరేగింపును రన్‌వే మీదుగా కొనసాగించారు. పద్మనాభ స్వామి, నరసింహ మూర్తి, కృష్ణ స్వామి ఉత్సవ విగ్రహాలను ఏనుగులతో వేడుకగా తీసుకెళ్లారు. వాటిని విమానాశ్రయం వద్ద కాసేపు ఆరత్తు మండపంలో ఉంచారు. తర్వాత పవిత్ర స్నానం కోసం బీచ్‌కు తీసుకెళ్లారు. ఈ ఉత్సవం వందలాది ఏళ్ల సంప్రదాయం. 1932లో స్థానికంగా విమానాశ్రయం నిర్మించారు. ఎయిర్‌పోర్ట్ నిర్మించకముందు ఇదే ప్రాంతం మీదుగా ఊరేగింపు జరిగేది. అందుకే ఇప్పటికీ అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

అత్యంత వృద్ధ శునకం 'బాబి' ఇకలేదు



లిస్బన్: ప్రపంచంలోనే అత్యంత వృద్ధ శునకంగా పేరున్న 'బాబి' 31 ఏళ్ల వయస్సులో శనివారం తుదిశ్వాస విడిచింది. పోర్చుగల్‌లోని కాన్క్వెయిరోస్ అనే ఊళ్లో 1992 మే 11న ఈ కుక్క పుట్టింది. అప్పటికి బాబి యజమాని లియోనల్ కోస్టా వయస్సు 8 ఏళ్లే. మంచి ఆహారం, స్వచ్ఛమైన గాలి, అమితమైన ప్రేమ..ఇవే బాబి ఇన్నేళ్లపాటు జీవించడానికి కారణాలని లియోనల్ చెప్పారు. బాబి మొత్తం 31 సంవత్సరాల 165 రోజులపాటు జీవించినట్లు తెలిపింది. బాబి స్వచ్ఛమైన రఫీరో డో అలెంటెజో జాతికి చెందింది. ఈ జాతి శునకాల సగటు ఆయుర్దాయం 10 నుంచి 14 ఏళ్లు.

ఒక్కరోజులో 704 మంది బలి

గాజాపై దాడులు ఉధృతం చేసిన ఇజ్రాయెల్ సైన్యం

- 24 గంటల వ్యవధిలో 400 వైమానిక దాడులు
- ఖాన్ యూనిస్‌లో 100 మంది ఉంటున్న నాలుగు అంతస్తుల భవనం ధ్వంసం
- 32 మంది మృతి.. మరికొందరికి గాయాలు
- యుద్ధంలో 6,487కి చేరిన మృతుల సంఖ్య

రఫా/టెల్‌అవీవ్/న్యూఢిల్లీ: గాజాస్ట్రిప్‌లో హమాస్ మిలిటెంట్లే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం దాడులు మరింత ఉధృతం చేసింది. గత 24 గంటల వ్యవధిలో 400 వైమానిక దాడులు నిర్వహించామని మంగళవారం ప్రకటించింది. బాంబు దాడులతో హమాస్ స్థావరాలను, సొరంగాలను ధ్వంసం చేశామని పేర్కొంది. ఈ దాడుల్లో పలువురు హమాస్ కమాండర్లు హతమయ్యారని వెల్లడించింది. కానీ, ఇజ్రాయెల్ దాడుల్లో గత 24 గంటల వ్యవధిలో 704 మందికిపైగా పాలస్తీనియన్లు మరణించినట్లు పాలస్తీనా ఆరోగ్య శాఖ తెలియజేసింది. వీరిలో 305 మంది చిన్నారులు, 173 మంది మహిళలు ఉన్నారని వివరించింది. సోమవారం రాత్రి ఇజ్రాయెల్ దాడుల్లో ఖాన్ యూనిస్ సిటీలో నాలుగు అంతస్తుల భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో 32 మంది మరణించారు. మరికొందరు గాయపడ్డారు. ఈ భవనంలో 100 మంది నివసిస్తున్నారు. వీరిలో చాలామంది ఉత్తర గాజా నుంచి వచ్చినవారే.

గాజాలో 2,055 మంది చిన్నారులు మృతి

ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో గాజాలో పెద్ద సంఖ్యలో చిన్నారులు మృత్యువాత పడుతున్నారని స్వచ్ఛంద సంస్థలు వెల్లడించాయి. ఈ మారణహోమం ఆపేందుకు అంతర్జాతీయ సమాజం వెంటనే చొరవ చూపాలని కోరాయి. సామాన్య ప్రజల ప్రాణాలు బలి కాకుండా చర్యలు తీసుకోవాలని, కాల్పుల విరమణ పాటించాలని, ఘర్షణకు తెరదించాలని ఇజ్రాయెల్ సైన్యానికి, హమాస్ మిలిటెంట్లకు విజ్ఞప్తి చేశాయి. ఈ నెల 7వ తేదీన మొదలైన ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం మంగళవారం 18వ రోజుకు చేరుకుంది. ఇజ్రాయెల్ సైన్యం దాడుల్లో ఇప్పటిదాకా గాజాలో 5,087 మంది మృతిచెందారని పాలస్తీనా ఆరోగ్య శాఖ వెల్లడించింది. వీరిలో 2,055 మంది చిన్నపిల్లలు ఉన్నారని పేర్కొంది. హమాస్ దాడుల్లో ఇజ్రాయెల్‌లో 1,400 మందికిపైగా చనిపోయారు. మిలిటెంట్ల అధీనంలో 200 మందికిపైగా బందీలు ఉన్నట్లు ఇజ్రాయెల్ అధికారులు చెప్పారు. ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో గాజాలో సాధారణ నివాస గృహాలు, పాఠశాలలు, మసీదులు నేలమట్టమయ్యాయి. ఎటుచూసినా శిథిలాలే కనిపిస్తున్నాయి. గాజాలో 10 లక్షల మందికిపైగా మైనర్లు నిర్బంధంలో చిక్కుకుపోయారని 'సేవ్ ద చిల్డ్రన్' సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. దాడుల్లో వెస్ట్‌బ్యాంక్‌లో 27 మంది బాలలు మరణించారని వెల్లడించింది. ఇజ్రాయెల్ విచక్షణారహితంగా దాడులు చేస్తోందని, చిన్నారుల్ని బలి తీసుకుంటోందని ఆరోపించింది.

ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల్లో సేవలు బంద్

ఇజ్రాయెల్ సైన్యం వైమానిక దాడుల వల్ల గాజాలో క్షతగాత్రుల సంఖ్య నానాటికీ పెరుగుతుండగా, మరోవైపు ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల్లో వైద్య సేవలు నిలిచిపోతున్నాయి. ఇప్పటికే మూడింట రెండొంతుల ఆరోగ్య కేంద్రాలు, ఆసుపత్రుల్లో ఎలాంటి సేవలు అందడం లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) ఆందోళన వ్యక్తం చేసింది. 72 ఆరోగ్య కేంద్రాలకు గాను 46, 35 ఆసుపత్రులకు గాను 12 ఆసుపత్రుల్లో సేవలు పూర్తిగా నిలిచిపోయాయని మంగళవారం ప్రకటించింది. ఔషధాలు, విద్యుత్, ఇంధన కొరత కారణంగా క్షతగాత్రులకు సేవలందించలేకపోతున్నామని పాలస్తీనా ఆరోగ్య శాఖ అంటోంది. ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో కొన్ని ఆరోగ్య కేంద్రాలు దారుణంగా దెబ్బతిన్నాయి. దీనికితోడు ఆసుపత్రుల్లో వైద్య సేవలు నిలిచిపోవడంతో మృతుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉందని డాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గాజాలో ఆరోగ్య వ్యవస్థ అత్యంత అధ్వాన స్థితికి చేరుకుందని ఆరోగ్య శాఖ ప్రతినిధి ఒకరు చెప్పారు.

బందీల సమాచారం ఇవ్వండి

గాజాపై భూతల దాడులకు సిద్ధమవుతున్న ఇజ్రాయెల్ ప్రస్తుతానికి వైమానిక దాడులపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. భూతల దాడులు ప్రారంభమైతే గాజాలో పెద్ద సంఖ్యలో జనం ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. అంతర్జాతీయ సమాజం నుంచి వస్తున్న ఒత్తిళ్లకే హమాస్ మిలిటెంట్లు స్పందిస్తున్నారు. అమెరికాకు చెందిన ఇద్దరు బందీలను ఇప్పటికే విడుదల చేయగా, సోమవారం రాత్రి ఇజ్రాయెల్‌కు చెందిన ఇద్దరు వృద్ధ మహిళలను విడుదల చేశారు. బందీల సమాచారం తెలిస్తే తమకు తెలియజేయాలని సూచిస్తూ ఇజ్రాయెల్ సైన్యం గాజాలో కరపత్రాలు జారవిడిచింది. సమాచారం అందజేసేవారికి ఆపద రాకుండా కాపాడుతామని హామీ ఇచ్చింది.

నిండిపోయిన శ్మశాన వాటికలు

ఇజ్రాయెల్–హమాస్ ఘర్షణ ప్రారంభమైన తర్వాత గాజాలో 14 లక్షల మంది ఇళ్లు విడిచి వెళ్లిపోయారు. వీరిలో దాదాపు 5.80 లక్షల మంది ఐక్యరాజ్యసమితి శిబిరాల్లో ఆశ్రయం పొందుతున్నారు. ఈజిప్టు నుంచి గాజాలోకి ఆహారం, ఇతర సహాయక సామాగ్రిని అనుమతిస్తున్న ఇజ్రాయెల్ పెట్రోల్, డీజిల్‌ను మాత్రం అనుమతించడం లేదు. గాజాలో మరణాల సంఖ్య పెరుగుతుండడంతో శ్మశాన వాటికలు నిండిపోతున్నాయి. ఒకే సమాధిలో ఐదు మృతదేహాలను ఖననం చేస్తున్నారు. పాత సమాధులను తవ్వేసి, కొత్త మృతదేహాలను సమాధి చేస్తున్నారు.



ధ్వంసమైన నుస్సెయిరత్ శరణార్థి శిబిరం వద్ద శిథిలాల్లో చిక్కుకున్న వారి కోసం వెతుకులాట

ఎదగడానికి.. పుస్తకం చాలు!



ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో గాజా మరుభూమిలా తయారవుతోంది. కుప్పకూలిన భవనాల శిథిలాల నుంచి క్షతగాత్రులను రక్షించడంలో కొందరు, ధ్వంసం కాని విలువైన వస్తువుల కోసం వెతికే పనిలో కొందరు నిమగ్నమై ఉంటే... ఈ అమ్మాయి తన పుస్తకాలను వెతుక్కుంది. పుస్తకాలను తన నుంచి ఎవరైనా లాక్కుంటే ఎలా అన్న భయంతో గుండెకు హత్తుకుని కాపాడుకుంది. మనసుకు గాయమైనా పుస్తకాలను చెక్కుచెదరనివ్వలేదు. చదువంటే ఎంత మక్కువో!!

ఇజ్రాయెల్‌కు ఫ్రాన్స్ అధ్యక్షుడు

ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ మంగళవారం ఇజ్రాయెల్ చేరుకున్నారు. ఇజ్రాయెల్‌కు మద్దతు ప్రకటించడానికి వచ్చానని చెప్పారు. ఉగ్రవాదంపై జరుగుతున్న పోరాటంలో ఇజ్రాయెల్ ఒంటరి కాదన్నారు. హమాస్ దాడుల్లో గాయపడిన ఫ్రాన్స్ జాతీయులను, మృతుల కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. అనంతరం ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నెతన్యాహూతో సమావేశమయ్యారు. తనను తాను రక్షించుకొనే హక్కు ఇజ్రాయెల్‌కు ఉందని స్పష్టంచేశారు. పౌరులకు నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఇజ్రాయెల్‌కు సూచించారు. గాజాలో ప్రజల మరణానికి హమాస్ మిలిటెంట్లే కారణమని నెతన్యాహూ నిందించారు. శత్రువులపై యుద్ధం చాలాకాలం కొనసాగే అవకాశం ఉందని సంకేతాలిచ్చారు. ఇజ్రాయెల్‌లో దాడుల్లో గాజాలో ఇప్పటిదాకా తమ కార్యకర్తలు 35 మంది మృతిచెందారని ఐక్యరాజ్యసమితి పాలస్తీనియన్ ఏజెన్సీ ప్రకటించింది.

జోర్డాన్ రాజుకు మోదీ ఫోన్

ప్రధానమంత్రి మోదీ జోర్డాన్ రాజు అబ్దుల్లా–2తో ఫోన్‌లో మాట్లాడారు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం, తాజా పరిణామాలపై చర్చించారు. ఈ యుద్ధంలో సామాన్య ప్రజలు ప్రాణాలు కోల్పోతుండడం పట్ల ఇరువురు నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. గాజాలో హింసాకాండ ఆగిపోవాలని ఆకాంక్షించారు. ఇజ్రాయెల్–హమాస్ మధ్య సమస్యకు సాధ్యమైనంత త్వరగా పరిష్కారం కనుగొనాలని చెప్పారు. ఇందుకోసం చిత్తశుద్ధితో కూడిన ప్రయత్నాలు అవసరమని మోదీ అభిప్రాయపడ్డారు.

బంధించారు.. కర్రలతో కొట్టారు

- గాజా సొరంగంలోకి చేరుకున్నాక బాగానే చూసుకున్నారు
- హమాస్ చెరనుంచి విడుదలైన మహిళ లిఫ్‌షిట్జ్ వెల్లడి



టెల్ అవీవ్: 17 రోజులుగా తమ చెరలో ఉన్న యోచెవెడ్ లిఫ్‌షిట్జ్(85), నురిట్ కూపర్(79) అనే ఇద్దరు మహిళలను హమాస్ మిలిటెంట్లు సోమవారం విడుదల చేశారు. మానవతా దృక్పథంతోపాటు వృద్ధాప్యంలో ఉన్న వారిద్దరి అనారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని విడుదల చేసినట్లు తెలిపారు. స్నేహితులైన వారిద్దరూ ఇజ్రాయెల్–గాజా సరిహద్దులోని కిబుట్జ్ నిర్ ఓజ్ నివాసితులు. మంగళవారం టెల్ అవీవ్‌కు చేరుకున్నారు. మిలిటెంట్ల అధీనంలో తనకు ఎదురైన అనుభవాలను యోచెవెడ్ లిఫ్‌షిట్జ్ మీడియాతో పంచుకున్నారు. 'ఈ నెల 7న మిలిటెంట్లు నన్ను బంధించారు. మోటార్‌బైక్ ఎక్కించుకొని తీసుకెళ్లారు. ప్రతిఘటించినందుకు కర్రలతో కొట్టారు. రోదించినా పట్టించుకోలేదు. గాజాకు బలవంతంగా తరలించారు. ఒక సొరంగంలోకి తీసుకెళ్లారు. భూగర్భంలో సాలెగూళ్లలాంటి సొరంగాలు ఉన్నాయి. మేము వెళ్లేసరికి డాక్టర్లు, వైద్య సిబ్బంది అక్కడున్నారు. తాము ఖురాన్‌ను విశ్వసిస్తామని, ఎలాంటి హాని కలిగించబోమంటూ మిలిటెంట్లు మాతో చెప్పారు. డాక్టర్లు మాకు వైద్య సేవలు అందించారు. కావాల్సిన ఔషధాలు ఇచ్చారు. సొరంగాలు తడిగా, తేమగా ఉన్నాయి. అక్కడ పారిశుధ్య సౌకర్యాలు ఫరవాలేదు. మాకు ఎలాంటి అస్వస్థత కలగలేదు. పరుపులపై నిద్రించాం. మిలిటెంట్లు మొదట్లో గాజాకు తీసుకెళ్లేటప్పుడు హింసించినా అక్కడికి వెళ్లిన తర్వాత మమ్మల్ని బాగా చూసుకున్నారు. ఇజ్రాయెల్–గాజా సరిహద్దులో నిర్మించిన రక్షణ కంచె గురించి చెప్పాలి. లక్షల డాలర్లు ఖర్చుచేసి ఇజ్రాయెల్ సైన్యం ఈ నిర్మించిన ఈ కంచెతో ఉపయోగం శూన్యం. దేశానికి అది ఏమాత్రం రక్షణ కల్పించట్లేదు. అత్యంత ఖరీదైన ఈ ఫెన్సింగ్‌ను మిలిటెంట్లు సులభంగా ధ్వంసం చేసి వచ్చి, మమ్మల్ని అపహరించారు. హమాస్ నుంచి ఎదురవుతున్న ముప్పును ఇజ్రాయెల్ సీరియస్‌గా తీసుకోవడం లేదు' అని లిఫ్‌షిట్జ్ ఆక్షేపించారు. లిఫ్‌షిట్జ్, నురిట్ కూపర్ భర్తలు ఇంకా హమాస్ వద్ద బందీలుగా ఉన్నారు.

విచ్ఛిన్న శక్తులను ఏరేద్దాం

- ఢిల్లీలో దసరా వేడుకల్లో ప్రధాని మోదీ సందేశం
- శ్రీరామ నవమికల్లా అయోధ్యలో రామాలయం పూర్తవుతుందని ప్రకటన



దసరా వేడుకలో విల్లు ఎక్కుపెట్టిన మోదీ

న్యూఢిల్లీ: మత, ప్రాంతీయవాదాలతో దేశాన్ని విభజించాలని చూస్తున్న విచ్ఛిన్న శక్తులను తుదముట్టించాలని ప్రజలకు ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. దసరా సందర్భంగా మంగళవారం ఢిల్లీలో దసరా వేడుకల్లో పాల్గొని అక్కడి వారినుద్దేశించి ప్రధాని ప్రసంగించారు. కేవలం రావణ దిష్టిబొమ్మల దహనానికే పరిమితం కాకుండా, దేశాభివృద్ధిని గాలికొదిలి స్వీయ ప్రయోజనాల సాధనకు తాపత్రయపడే సిద్ధాంతాలనూ దహనం చేయాలని హితవు పలికారు. విభజన శక్తులపై దేశభక్తి సాధించిన విజయంగా దసరాను జరుపుకోవాలన్నారు. విలక్షణ ఇండియా కూటమిని ఉద్దేశించే మోదీ ఈ వ్యాఖ్యలు చేశారని భావిస్తున్నారు. వివక్ష, సామాజిక రుగ్మతలను నిర్మూలించాల్సి ఉందని ఆయన ఈ సందర్భంగా అన్నారు. అయోధ్యలో రామాలయ వచ్చే రామనవమి నాటికి పూర్తవుతుందని ప్రకటించారు. శతాబ్దాల ఎదురుచూపుల తర్వాత రాముడు అయోధ్యలో కొలువుదీరనున్నాడని చెప్పారు. దసరా సందర్భంగా ప్రతి ఒక్కరూ కనీసం పది మంచి పనులు చేస్తామని ప్రతిజ్ఞ చేయాలన్నారు. సామాజికంగా కనీసం ఒక పేద కుటుంబాం పైకి ఎదిగేందుకు చేయూత ఇవ్వాలని హితవు పలికారు. మన సరిహద్దులను ఎలా కాపాడుకోవాలో తమకు బాగా తెలుసన్నారు. 'దసరా నాడు ఆయుధ పూజ జరుగుతుంది. భారత్ ఎప్పుడూ ఆయుధాలను స్వీయ రక్షణకే ఉపయోగిస్తుంది' అని స్పష్టంచేశారు.

తీవ్ర తుఫాన్‌గా హమూన్

భువనేశ్వర్/సాక్షి, విశాఖపట్నం: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్ప పీడనం తీవ్ర తుఫాన్‌గా మారింది. దానికి ఇరాన్ సూచించిన 'హమూన్'అని పేరు పెట్టారు. అయితే ఒడిశాకు దాని వల్ల పెద్ద నష్టమేమీ లేదని వాతావరణ శాఖ పేర్కొంది. ఒడిశా తీరానికి 200 కిలోమీటర్ల దూరం నుంచి బంగ్లాదేశ్ కేసి సాగుతూ మంగళవారం రాత్రికి బలహీనపడింది. బంగ్లాదేశ్‌లో తీరం దాటేసరికి మరింత బలహీనపడుతుందని అధికారులు తెలిపారు. హమూన్ ప్రస్తుతం ఒడిశాలోని పారదీప్‌కు 230 కిలోమీటర్లు, పశ్చిమ బెంగాల్లోని దిఘాకు 240 కి.మీ.ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. దీనివల్ల తీరం వెంబడి గంటకు 85 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో కోస్తాంధ్రలో రానున్న మూడు రోజులు, రాయలసీమలో ఈనెల 29వ తేదీ వరకు పొడి వాతావరణం ఉంటుంది. 28 నుంచి కోస్తాంధ్రలో, 30 నుంచి రాయలసీమలో అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది.

సన్నిహిత అధికారికి కేబినెట్ మంత్రి హోదా

ప్రకటించిన ఒడిశా సీఎం పట్నాయక్



భువనేశ్వర్: ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ సర్వీస్ నుంచి స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన అధికారికి 24 గంటల్లో కేబినెట్ మంత్రి హోదా కట్టబెట్టి, 5టీ విభాగానికి చైర్మన్‌గా నియమించారు. 'ఒడిశా కేడర్ 2000 బ్యాచ్‌కు చెందిన వీకే పాండియన్ అక్టోబర్ 20న పెట్టుకున్న స్వచ్ఛంద పదవీ విరమణ దరఖాస్తుకు అక్టోబర్ 23న ప్రభుత్వ ఆమోదం లభించింది. ఆ వెంటనే పాండియన్‌కు కేబినెట్ మంత్రి హోదా ఇచ్చారు. 5టీ, 'అమ ఒడిశా–నబిన్ ఒడిశా' కార్యక్రమాల చైర్మన్‌గా సీఎం పట్నాయక్ నియమించారు. పాండియన్ ఇకపై నేరుగా సీఎం ఆధ్వర్యంలో పని చేయనున్నారు'అంటూ రాష్ట్ర సాధారణ పరిపాలనా విభాగం ఉత్తర్వులు విడుదల చేసింది. కలహండి జిల్లా ధర్మాగఢ్ సబ్ కలెక్టర్‌గా జాయినయిన పాండియన్ మయూర్‌భంజ్, గంజాం జిల్లాలకు కలెక్టర్‌గా పనిచేశారు. సీఎం పట్నాయక్ సొంత జిల్లా గంజాం. ఆ జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పుడే సీఎంతో పాండియన్‌కు పరిచయం ఏర్పడింది. అనంతరం 2011లో ఆయన్ను తన కార్యాలయం(సీఎంవో)లో వ్యక్తిగత కార్యదర్శిగా నియమించుకున్నారు. అప్పటి నుంచి అక్కడే బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

'అమ ఒడిశా–నబీన్ ఒడిశా' ఏందుకు?

'అమ ఒడిశా–నబీన్ ఒడిశా(మన ఒడిశా–నవీన ఒడిశా)' పథకానికి రూ.4 వేల కోట్లు కేటాయిస్తూ మంగళవారం సీఎం నవీన్ పట్నాయక్ అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం తీర్మానించింది. రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధి, శ్రీ జగన్నాథుని సంస్కృతిని వ్యాపింపజేయడమే ఈ పథకం లక్ష్యం. రాష్ట్రంలోని 6,794 గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతులు, పూరీలోని ప్రఖ్యాత జగన్నాథుని ఆలయంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గుడుల అభివృద్ధికి ఉద్దేశించిన 90 వేలకుపైగా ప్రాజెక్టులను గుర్తించారు.

అరగంటలో 158 కార్లు ఢీ.. ఏడుగురి మృతి



న్యూ ఆర్లియెన్స్: అమెరికాలోని లూసియానాలో దట్టమైన పొగ కారణంగా సంభవించిన భారీ రోడ్డు ప్రమాదంలో ఏడుగురు చనిపోయారు. న్యూ ఆర్లియన్స్‌కు సమీపంలోని ఇంటర్ స్టేట్–55(ఐ–55) రహదారిపై సోమవారం ఉదయం ఘటన చోటుచేసుకుంది. పెద్ద సంఖ్యలో కార్లు ఒకదానినొకటి ఢీకొనడంతో మంటలు కూడా చెలరేగాయి. మొత్తం అరగంటపాటు వాహనాలు ఢీకొనడం కొనసాగింది. ఇలా మొత్తం 158 వాహనాలు ప్రమాదానికి గురయ్యాయి. ఒక కారు వంతెన పైనుంచి నీళ్లలోకి పడిపోయింది. రసాయనాలతో కూడిన ట్యాంకర్ కూడా కార్ల మధ్యన ఇరుక్కుపోయింది. ఈ ఘటనల్లో ఏడుగురు చనిపోగా మరో 30 మంది వరకు గాయాలపాలయ్యారు. ప్రమాదం కారణంగా వాహనాలు కుప్పగా పడ్డాయి. కొన్ని పూర్తిగా నుజ్జయ్యాయి. మంటలు చెలరేగి కొన్ని దగ్ధమయ్యాయి. ప్రమాదంతో 11 మైళ్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది.

నవాజ్ పోటీకి మార్గం సుగమం

ఇస్లామాబాద్: పాకిస్తాన్ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌కు వచ్చే పాక్ సార్వత్రిక ఎన్నికల్లో పోటీకి మార్గం సుగమం అయినట్లుగా కనిపిస్తోంది. గతంలో అల్–అజీజియా కేసులో ఆయనకు పడ్డ ఏడు సంవత్సరాల జైలు శిక్షను అక్కడి పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. మరో మూడు అవినీతి కేసుల్లో రెండు ప్రత్యేక కోర్టులు ఆయనకు బెయిల్ మంజూరు చేశాయి. బ్రిటన్‌లో నాలుగేళ్ల స్వీయ ప్రవాసం అనంతరం ఆయన తాజాగా స్వదేశం తిరిగి రావడం తెలిసిందే. దీని వెనక సైన్యం మద్దతుందని వార్తలొచ్చాయి. అల్–అజీజియా కేసులో 2018లో నవాజ్ షరీఫ్‌కు ఏడేళ్ల శిక్ష పడింది. మూడేళ్ల జైలు జీవితం తర్వాత చికిత్స కోసమని లండన్ వెళ్లిన ఆయన అక్కడే ఉండిపోయారు. దాంతో ఆయనను పారిపోయిన ఖైదీగా ప్రకటించారు.

నేత్రపర్వంగా మైసూరులో దసరా

మైసూరు: కర్ణాటకలో మైసూరు పట్టణంలో దసరా ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన జంబూ సవారీ ఏనుగుల ఊరేగింపు మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రముఖుల పూజలు, వేలాది మంది జనం మధ్య గజరాజులు ప్యాలెస్ నుంచి బన్ని మండపం వరకూ సుమారు 5 కిలోమీటర్లు ఊరేగింపుగా వెళ్లి వచ్చాయి. చాముండేశ్వరి అమ్మవారి విగ్రహంతో కూడిన 750 కిలోల బరువైన బంగారు అంబారీని అభిమన్యు ఏనుగుపై ప్రతిష్టించారు. మరో 13 ఏనుగులకు సీఎం సిద్దరామయ్య, మైసూరు రాజవంశీకులు తదితరులు ప్యాలెస్ వద్ద పూజలు చేసి మధ్యాహ్నం ఊరేగింపునకు నాంది పలికారు. అంతకుముందు, సీఎం సిద్దరామయ్య నంది ధ్వజ పూజలో పాల్గొన్నారు. సాయుధ బలగాల కవాతు, మేళతాళాలు, కళాకారుల ప్రదర్శనలు, 31 జిల్లాకు చెందిన శకటాల నడుమ ఏనుగులు ముందుకు సాగాయి. కర్ణాటక ప్రభుత్వం రాష్ట్ర ఉత్సవం(నాదహబ్బ)గా దసరా వేడుకలను నిర్వహిస్తుంది. 10 రోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటయ్యాయి. వీటిని తిలకించేందుకు విదేశాల నుంచీ జనం తరలివచ్చారు.

మంగళవారం మైసూరు నగరంలో జంబూ సవారీ ఊరేగింపు



సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
బుధవారం । 25 । అక్టోబర్ । 2023


ధార్వాడలో దసరా ఉత్సవాల్లో నృత్యాలు


బెంగళూరు హలసూరు చెరువులో బెంగాలీలచే దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనం

న్యూస్‌రీల్

రూ.1500 కోసం తండ్రి హత్య

తుమకూరు: గుబ్బి తాలూకా కడబ గ్రామంలో తండ్రిని చంపిన కిరాతక కొడుకుని పోలీసులు అరెస్టుచేశారు. రేణుకయ్య (65)ను అతని కుమారుడు రమేశ్ (31) హత్య చేశాడు. పంట అమ్మగా వచ్చిన రూ. 1500 డబ్బుల గురించి గొడవ జరిగింది. ఆ డబ్బులు తనకు ఇవ్వాలని కొడుకు కోరగా తండ్రి ఒప్పుకోలేదు. దీంతో రగిలిపోయిన కొడుకు కత్తితో తండ్రిని నరికాడు. తీవ్ర రక్తస్రావంతో రేణుకయ్య అక్కడికక్కడే కిందపడి మరణించాడు. విషయం తెలిసిన గుబ్బి పోలీసులు అక్కడికి చేరుకుని నిందితుడిని అరెస్టు చేశారు.

నల్ల జెండాలతో నిరసన



మండ్య: రాష్ట్రంలో కావేరి జలాశయాల నుంచి తమిళనాడుకు నీటిని విడుదల చేయడంపై నిరసనలు కొనసాగుతున్నాయి. జిల్లా రైతు హిత రక్షణ సమితి ఆధ్వర్యంలో చేస్తున్న సత్యాగ్రహ దీక్ష 50వ రోజుకు చేరుకుంది. మంగళవారం నల్ల జెండాలు ప్రదర్శించి విజయదశమిని చీకటి రోజుగా అభివర్ణిస్తూ నిరసన తెలిపారు. జేసీ సర్కిల్‌లో గుమిగూడిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సర్ ఎంవీ విగ్రహం ఎదుట దీక్షా శిబిరంలో ధర్నాలో పాల్గొన్నారు.

మళ్లీ మోదీ ప్రధాని కావాలని ప్రార్థించా: శోభా

మైసూరు: మైసూరు దసరా మహోత్సవం కోసం వచ్చిన కెప్టెన్ అభిమన్యు నేతృత్వంలోని గజబృందానికి కేంద్ర మంత్రి శోభ కరంద్లాజే ప్రత్యేక పూజలు చేపట్టారు. నగరంలోని అంబావిలాస్ ప్యాలెస్‌లో గజబృందం, మావటీలు, కాపాలదారులకు అల్పాహార విందులో ఆమె వంటకాలు వడ్డించారు. ఈసారి ఆమె పుట్టినరోజు కూడా కావడంతో ఆమె అభిమానులు ప్రత్యేక కేక్‌ను తయారు చేశారు. మంత్రి మాట్లాడుతూ చాముండేశ్వరి దేవీని దర్శించుకున్నట్లు , మోదీ మరోసారి ప్రధాని కావాలని ప్రార్థించినట్లు తెలిపారు. బీజేపీ రాష్ట్రాధ్యక్షుడి స్థానానికి తన పేరు వినిపిస్తుండడంపై ఆమె స్పందిస్తూ ప్రస్తుతానికి తాను కేంద్ర మంత్రిగా ఉన్నానని, అలాంటి చర్చ అయితే ఏమి జరగలేదని చెప్పారు.

తాగుబోతు డ్రైవర్‌కు దేహశుద్ధి

బనశంకరి: మద్యం మత్తులో కారు డ్రైవింగ్ చేస్తూ వరుస ప్రమాదాలకు కారణమైన డ్రైవరును స్థానికులు చితకబాది పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన నగరంలో మైకోలేఔట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సోమవారం అర్ధరాత్రి మద్యం మత్తులో ఉన్న కారు డ్రైవరు బీటీఎంలే ఔట్ రెండో స్టేజ్‌లో మూడు బైక్‌లను, ఒక కారు ను ఢీకొట్టాడు. జనం కారు డ్రైవర్‌ను పట్టుకుని విచారించగా మద్యం మత్తులో ఉన్నాడని తేలింది. కోపోద్రిక్తులైన జనం అతన్ని చితకబాది ట్రాఫిక్ పోలీసులకు అప్పగించారు. ప్రమాదానికి కారణమైన కారులో వృద్ధ దంపతులు గుడికి వెళ్లి వస్తున్నారు.

యడ్డి నాయకత్వమే మేలు: రేణుకాచార్య

బనశంకరి: బీఎస్.యడియూరప్ప లాంటి లౌకికవాద, సమర్థనేత అవసరమని బీజేపీ రెబెల్, మాజీ ఎమ్మెల్యే రేణుకాచార్య అన్నారు. మంగళవారం దావణగెరెలో ఆయన కేంద్రమంత్రి శోభా కరంద్లాజేకు బీజేపీ రాష్ట్రాధ్యక్ష పదవిని కేటాయించడం ఖాయమైన అంశమై మాట్లాడారు. నాయకత్వం ఎలాంటి తీర్మానం తీసుకుంటుంది అనేది వేచి చూడాలని, రాష్ట్రంలో యడియూరప్ప బీజేపీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేశారని, అలాంటి సెక్యులర్ సమర్ధనేత అవసరమన్నారు. ఆయన నేతృత్వంలో లోక్‌సభ ఎన్నికలను ఎదుర్కోవాలన్నారు. నేను కూడా బీజేపీ రాష్ట్రాధ్యక్ష పదవి రేసులో ఉన్నానని, బీజేపీలో నియంత ధోరణి విడనాడాలని ఎద్దేవా చేశారు. కాగా, అధ్యక్ష పదవి ఇస్తే సంతోషంగా తీసుకుంటానని శోభ మైసూరులో తెలిపారు.

గజరాజులకు అలంకారాలు

మైసూరు: మైసూరు జంబూ సవారీలో పాల్గొన్న కెప్టెన్ అభిమన్యు నేతృత్వంలోని గజ బృందాలు వర్ణాలంకారంతో అందరి దృష్టిని ఆకర్షించాయి. ప్యాలెస్ ఆవరణలోని ఏనుగుల శిబిరంలో గత 20 ఏళ్లుగా నాగలింగప్ప నేతృత్వంలోని కళాకారుల బృందాలు ఏనుగులను అందంగా తీర్చిదిద్దుతున్నారు. చెవులు, కళ్లు, కాళ్లు, దేహాలకు శంఖాలు, చక్రాలు వివిధ రకాల చిత్రాలతో అలంకరించారు. కెప్టెన్ అభిమన్యును విశేషంగా అలంకరించారు. మరోవైపు వివిధ ఏనుగు శిబిరాల నుంచి 14 గజాలు రాగా, అందులో కేవలం 9 మాత్రమే జంబూ సవారీలో పాల్గొన్నాయి. మిగిలిన 5 ఏనుగులకు విశ్రాంతినిచ్చారు. జంబూ సవారీలో 9 ఏనుగులు మాత్రమే పాల్గొనాలనే నిబంధన ఉంది. కొత్త ఏనుగులు కంజన్, రోహిత్, హిరణ్య, లక్ష్మిలకు జంబూ సవారీలో అవకాశం కల్పించలేదు.

జంబూసవారీ.. జనభేరి


మంగళవారం మైసూరులో.. జంబూ సవారీ ఉత్సవం


జన సందోహం మధ్య గజరాజుల ఊరేగింపు


జంబూసవారీ చూడడానికి కిక్కిరిసిన ప్రజలు


శకటాల ముందు కళాకారుల నృత్యాలు

- వైభవోపేతంగా మైసూరు దసరా ఊరేగింపు
- గజరాజుపై చాముండేశ్వరిదేవి అంబారీ
- సీఎం, ప్రముఖుల పూజలు
- జనసంద్రమైన రాచనగరి
- విజయదశమి ఉత్సవాలు సమాప్త

మైసూరు: తొమ్మిది రోజులుగా మైసూరు నగరంతో పాటు రాష్ట్రమంతటా ఉత్సుకత కలిగించిన దసరా మహోత్సవాలు విజయవంతంగా సమాప్తమయ్యాయి. ఈ నెల 15న చాముండేశ్వరి సన్నిధిలో మైసూరు దసరా నవరాత్రులు ఆరంభం కావడం తెలిసిందే. అప్పటి నుంచి వారసత్వ నగరిలో రోజూ వైవిధ్య సాంస్కృతిక, కళా ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. ముహూర్తం ప్రకారం మంగళవారం జంబూసవారీ మహా వేడుకను నిర్వహించారు.

సాయంత్రం 5 గంటలకు ప్యాలెస్ ఆవరణలో.. సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, రాజవంశీకుడు యదువీర్ ఒడెయర్ తదితరులు అభిమన్యు ఏనుగుపై నున్న బంగారు అంబారీలోని చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆపై ఏనుగుల ఊరేగింపు కోలాహలంగా ఆరంభమైంది.

లక్షలాదిగా వీక్షణం

- జంబూ సవారీని వీక్షించేందుకు ప్రజలు పోటీ పడ్డారు. సోమవారం మధ్యాహ్నం నుంచే జంబూ సవారీ ఊరేగింపు జరిగే ప్రాంతంలో స్థలం కోసం పోటీలు పడ్డారు. ఒకరు చేతి రుమాలు, కొందరు దుప్పటి, రాయి, మరికొందరు చాపలు వేసి చోటు రిజర్వ్ చేసుకున్నారు.
- ఊరేగింపును లక్షలాది మంది వీక్షించారు. అధికారికంగా టికెట్ కొన్నవారి కోసం 40 వేల సీట్లను ఏర్పాటు చేశారు. దేశవిదేశాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు.
- మత సామరస్యతకు జంబూసవారీ అద్దం పట్టింది. చామరాజ మోహల్లాలో ఉన్న హజరత్ ఇమామ్ షా వలీ దర్గా వద్ద నుంచి ఏనుగులు వెళ్లాయి. ఆ సమయంలో దర్గా వద్ద ఆపి పూజలు చేసి, సాంబ్రాణి వేసి ఏనుగులకు గంధం పెట్టారు. దర్గా ముఖ్యులు మహమ్మద్ నఖీబుల్లా షా ఖద్రీ పాల్గొన్నారు.
- గజరాజులు బన్ని మంటప వరకు నడిచి అక్కడ పూజల తరువాత మళ్లీ ప్యాలెస్‌కు తిరుగుముఖం పట్టాయి. దారిపొడవునా కళాబృందాలు, శకటాలు, జన సందోహం మిన్నంటింది.
- భద్రత కోసం సుమారు 6 వేల మంది పోలీసులను వినియోగించారు. జంబూ సవారీకి ఉగ్రవాదుల ముప్పు ఉందని నిఘా వర్గాల హెచ్చరికల మేరకు క్షుణ్నంగా తనిఖీలు చేశారు.
- మైసూరు దసరా ప్రచారం కోసం ఏర్పాటు చేసిన సూచక ఫలకాలు, బోర్డులు, ఫ్లెక్సీల్లో ఇంగ్లిష్‌లో రాశారని కొందరు కన్నడ క్రియా సమితి కార్యకర్తలు మసి పూసి నిరసన తెలిపారు.

కన్నుల పండువగా శకటాలు

చారిత్రక జంబూ సవారీ ఊరేగింపులో కన్నడనాడు సంస్కృతీ సంప్రదాయాలు, చరిత్రను చాటేలా శకటాల ప్రదర్శన సాగింది. అన్ని జిల్లాలు, ప్రధాన ప్రభుత్వ శాఖల కలిసి 31కి పైగా శకటాలను రూపొందించాయి. సవారీకి హాజరైన లక్షలాది మంది వీక్షించారు. యునెస్కో గుర్తింపు దక్కిన హొయ్సళ దేవస్థానం, బేలూరు, హళేబీడు, సోమనాథపురం దేవాలయాల స్తబ్ధచిత్రాలు ఆకర్షణగా నిలిచాయి. చంద్రయాన్–3, ఐదు గ్యారంటీల స్కీమ్‌లు కూడా ఏర్పాటయ్యాయి.

అదరహో.. నృత్యాలు

జంబూ సవారీ ఊరేగింపులో జానపద, ఆదివాసీ కళాకారుల ప్రదర్శన ప్రశంసలు అందుకుంది. కళాకారులు తమ కళల సంస్కృతీ సంప్రదాయానికి అనుగుణంగా వేష, భూషణలతో పాల్గొన్నారు. జానపద గేయాలు పాడుతూ సంగీత వాయిద్యాలతో వీక్షకులను అలరించారు. నంది ధ్వజ, వీరభద్ర కుణిత, కుంబు కహళె, డోలు, జూంజ్ పథక్ నృత్యం, కంసాలె, సోమన, కుణిత, నవిలు నృత్యం తదితర నృత్యాలు ఆకట్టుకున్నాయి.


అంబారీలో కొలువైన అమ్మవారు


విశ్వరూప దర్శనం.. ఓ కళాకారుని ప్రదర్శన


ఊరేగింపు మధ్యలో మసీదు దగ్గర పూజ చేస్తున్న దృశ్యం


చివరిరోజు హోరాహోరీగా కుస్తీ పోటీలు


చెరుకు బండితో తయారైన మండ్య జిల్లా శకటం

పులి గోరుకు కటకటాలు

- ధరించినందుకు బిగ్‌బాస్ పోటీదారు సంతోష్ అరెస్టు
- మరికొందరు ప్రముఖులపై ఫిర్యాదులు


వర్తూరు సంతోష్


నటుడు దర్శన్ మెడలోని పులి గోరు (ఫైల్)

యశవంతపుర: పులి గోరును మెడలో ధరించి దర్జా ప్రదర్శించిన బిగ్‌బాస్–10 పోటీదారు వర్తూరు సంతోష్ కటకటాలు లెక్కిస్తున్నాడు. వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద అతన్ని బెంగళూరు అటవీశాఖ అధికారులు అరెస్ట్ చేసి పరప్పన జైలుకు పంపారు. ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అటవీశాఖ అధికారులు బెంగళూరు రాజరాజేశ్వరినగర సమీపంలోని సంతోష్ ఇంటికెళ్లి ఆదివారం రాత్రి అరెస్ట్ చేశారు. జడ్జి ఇంటిలో హాజర్ పరచగా నవంబర్ 6 వరకు రిమాండ్ విధించారు. అతని బెయిలు పిటిషన్‌పై బుధవారం విచారణ జరుగుతుంది.

వర్తూరుకు చెందిన సంతోష్ వ్యవసాయ కుటుంబానికి చెందినవాడు. హళ్లికార్ జాతి ఎద్దులను సాకుతున్న సంతోష్ ఎద్దుల పోటీలలో పాల్గొని పేరు సంపాదించి బిగ్‌బాస్ పోటీలకు వెళ్లాడు. చట్ట ప్రకారం నిజమైన పులి గోర్లు ధరించడం నేరం. ఈ కేసులో నేరం రుజువైతే 3 నుంచి 7 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా పడే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

దర్శన్, వినయ్ గురూజీలపై ఫిర్యాదు

ఇదే మాదిరిగా పులి గోర్లు ధరించే ప్రముఖ నటుడు దర్శన్‌కు చిక్కులు తప్పేలా లేవు. సంతోష్ కేసు నేపథ్యంలో సినీ, టీవీ రంగాల్లో అనేక మంది పులి గోర్లను వేసుకున్నవారి ఫోటోలు వైరల్ అవుతున్నాయి. వీరిలో పేరు గాంచిన ఆధ్యాత్మికవేత్త వినయ్ గురూజీ, నటుడు దర్శన్‌లపై సర్వ సంఘటన ఒక్కూట అధ్యక్షుడు శివకుమార్ అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. వారిద్దరినీ విచారించాలని కోరారు. ఇద్దరిపై అటవీశాఖ అధికారులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ముందు ముందు ఏం జరుగుతుందోనని ఇద్దరి అభిమానుల్లో కలవరం మొదలైంది.

మూడిగెరెలో ఇద్దరి అరెస్ట్

వెండి గొలుసుకు పులి గోరును వేసుకొని తిరుగుతున్న ఇద్దరిని చిక్కమగళూరు జిల్లా మూడిగెరెలో అరెస్ట్ చేశారు. సతీశ్, రంజిత్‌లు పులిగోరు వేసుకొని తిరుగుతున్నట్లు తెలిసి పట్టుకున్నారు. పులిగోర్లను అమ్ముతున్న ఇద్దరు పరారయ్యారు.

వ్యాపారిని కిడ్నాప్ చేసి.. చితకబాది



శివాజీనగర: నగరంలో రామమూర్తి నగర పోలీస్ స్టేషన్ వ్యాప్తిలో అభిలాష్ దామోదరన్ అనే వ్యాపారిని అనే కోమల మహిళ ఆర్థిక గొడవలతో కిడ్నాప్ చేయించింది. వీరిద్దరూ కలిసి వ్యాపారం చేస్తుండేవారు, అందులో రూ.1.5 కోట్ల విషయమై గొడవ జరుగుతోంది. ఈ నేపథ్యంలో 20న రాత్రి సంపిగెహళ్లిలో అతని ఇంటి వద్ద కోమల, సందీప్, గోపాల్, భాస్కర్‌తో పాటు 8 మంది బృందం కిడ్నాప్ చేసి, రామమూర్తి నగరలోని గోదాములో ఉంచారు. అతన్ని చాకు, పిస్టల్‌తో బెదిరించి రూ.50 లక్షలు ఇవ్వాలని కోరారు. తలపై బీరు బాటిల్‌తో బాదారు. బాధితుడు డబ్బు ఇచ్చేది లేదని చెప్పడంతో భార్య, తండ్రికి వీడియో కాల్ చేసి వారి ముందే చావబాదారు. దుండగులు భోజనానికి వెళ్లిన సమయంలో అక్కడ ఉన్న ఒక ఫోన్ ద్వారా బాధితుడు అభిలాష్ పోలీసులకు ఫోన్ చేసి చెప్పాడు. వెంటనే అభిలాష్‌ను కాపాడి నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. కోమల సహా కొందరు నిందితులు పరారీలో ఉండగా, కేసు విచారణలో ఉంది.

ఢిల్లీలో కుమార రహస్య భేటీ!

శివాజీనగర: జేడీఎస్ రాష్ట్రాధ్యక్షుడు హెచ్‌డీ కుమారస్వామి ఢిల్లీలో బీజేపీ నాయకులతో రహస్యంగా భేటీ అయినట్లు తెలిసింది. ఆయన ఈ నెల 22న ఢిల్లీలో ఉన్నట్లు చెబుతున్నారు. ఆ రోజు కేంద్ర కాషాయ పెద్దలను కలిసి రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో పొత్తు, సీట్ల పంపిణీ గురించి చర్చించినట్లు తెలిసింది. అయితే దీనిపై బీజేపీ, జేడీఎస్ నుంచి దీనిపై ఎలాంటి ప్రకటనలు రాలేదు.

దసరా ఏనుగుకు ప్రసవం

- శివమొగ్గలో ఘటన


పిల్ల ఏనుగుతో ఏనుగులు

శివమొగ్గ: దసరా ఊరేగింపునకు తీసుకువచ్చే ఏనుగులు అన్నీ ఆరోగ్యంగా ఉండాలి. గర్భంతో ఉన్న ఏనుగులను ఉత్సవాలకు తీసుకురాకూడదు. కానీ మరోసారి శివమొగ్గలో అందుకు విరుద్ధంగా జరిగింది. సక్రెబెలు శిబిరం నుంచి కొన్ని రోజుల క్రితం తీసుకొచ్చిన నేత్రావతి ఏనుగు సోమవారం రాత్రి ప్రసవించింది. నేత్రావతి గర్భిణి అనే విషయం తెలియకుండా ఊరేగింపు కోసం ఆ ఏనుగును తరలించడం, రోజూ గంటలకొద్దీ సాధన చేయించడంపై సామాన్య ప్రజలు మండిపడుతున్నారు. సక్రెబెలు వన్యజీవి వైద్యులకు ఆ ఏనుగు నిండు గర్భంతో ఉన్నదని తెలియదా?, అధికారులు కోరగానే పరీక్షించకుండా ఏనుగులు పంపిస్తారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇందులో అటవీ శాఖ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని మండిపడుతున్నారు. ఈ విషయంపై పాత్రికేయుడు టిలెక్స్ రవికుమార్ అటవీ శాఖ మంత్రికి లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం నేత్రావతి, పిల్ల ఏనుగును శివమొగ్గ నగరం నుంచి తిరిగి శిబిరానికి పంపించారు. గతంలో మైసూరులో కూడా ఇదేమాదిరిగా జరిగింది.

ప్యాలెస్‌లో ధూంధాం

- యదువీర్ దసరా పూజలు

మైసూరు: నగరంలోని మైసూరు ప్యాలెస్‌లో రాజ సంప్రదాయం ప్రకారం ఆయుధ పూజను రాజవంశస్తులు యదువీర్ ఒడెయార్ ఘనంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున 5.30 గంటలకు చండీ హోమంతో పూజా కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయి. ఉదయం 6.05 గంటల నుంచి 6.15 గంటల వరకు ప్యాలెస్‌లోని ఆయుధ సామగ్రిని సోమేశ్వర దేవాలయానికి తీసుకొచ్చారు. 7.15 గంటలకు ప్రత్యేక పూజలు చేసి మళ్లీ ప్యాలెస్‌కు తరలించారు. మధ్యాహ్నం 12.20 గంటల నుంచి 12.45 వరకు యదువీర్ ఆయుధ పూజను చేవారు.


ఆయుధాలకు పూజ చేస్తున్న యదువీర్

పూజా కైంకర్యాలను బాల్కనీ నుంచి యదువీర్ భార్య త్రిషిక, కుమారుడు ఆద్యవీర్, రాజమాత ప్రమోదా దేవీ తిలకించారు.


ప్యాలెస్‌లో సందర్శకులకు ఏనుగు పలకరింత


వీక్షిస్తున్న రాజ కుటుంబీకులు

లోన్‌యాప్ దాష్టీకం

- మహిళను బెదిరించి రూ.37 లక్షలు వసూలు

బనశంకరి: లోన్ యాప్‌లో రుణం తీసుకున్న ప్రైవేటు కంపెనీ మహిళా ఉద్యోగిని యాప్ సిబ్బంది బెదిరించి గత మూడేళ్లలో రూ.37.80 లక్షలు దోచేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. బెంగళూరులోని హెణ్ణూరు గార్డెన్ కు చెందిన 33 ఏళ్ల మహిళా అకౌంటెంట్ కేంద్ర సైబర్‌క్రైం పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. వివరాలు.. 2020 కోవిడ్ సమయంలో ఆమె క్యాష్‌లోన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకుని రూ.10 వేలు రుణం తీసుకుంది. తరువాత వడ్డీతో సహా చెల్లించింది. కానీ సైబర్ కేటుగాళ్లు ఆమె మొబైల్‌లో ఉన్న ఫోటోలను సేకరించి బెదిరింపులకు దిగారు. అదనంగా డబ్బు చెల్లించాలని లేకపోతే మీ ఫోటోలను నగ్నంగా మార్చి మీ బంధువులకు, స్నేహితులకు పంపిస్తామని హెచ్చరించారు.

ఇలా మూడేళ్ల నుంచి రూ.37.80 లక్షలను ఆమె నుంచి వసూలు చేశారు. అదే మాదిరిగా ఆమె ద్వారా 72 లోన్ యాప్‌లను డౌన్‌లోడ్ చేయించి నగదును ఆమె బ్యాంక్ అకౌంట్ కు జమచేసిన మళ్లీ వెనక్కి తీసుకుని ఖాతాను దుర్వినియోగం చేశారు. ఆమెను బెదిరించడానికి 44 మొబైల్ సిమ్ కార్డులను వాడారని పోలీసులు తెలిపారు. దుండగుల కోసం గాలింపు చేపట్టారు.

మైసూరులో రైతుల ధర్నా

మైసూరు: ఒకవైపు అట్టహాసంగా మైసూరు దసరా ఉత్సవాలు జరుగుతుండగా, మరోవైపు రైతులు ముట్టడికి యత్నించడంతో ఉద్రిక్తత నెలకొంది. ప్రభుత్వానివి రైతు వ్యతిరేక విధానాలంటూ మంగళవారం బెంగళూరు–మైసూరు రోడ్డులో ఉన్న కొలంబియా ఏసియా సర్కిల్‌లో ఉదయం 9 గంటలకు రాష్ట్ర రైతు సంఘాల ఒక్కోట రాష్ట్రాధ్యక్షుడు కురుబూరు శాంతకుమార్ నేతృత్వంలో రాస్తారోకో జరిగింది. రైతులకు–పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు రైతులను అరెస్టు చేసి వ్యాన్‌లోకి ఎక్కిం సీఏఆర్ పెరేడ్ మైదానికి తీసుళ్లారు.

అరేబియా పాలై ఇద్దరు మృతి

యశవంతపుర: ఉడుపి జిల్లా మురుడేశ్వర విహారయాత్రకు వెళ్లిన ఇద్దరు అరేబియా సముద్రంలో వ మునిగి మరణించారు. సోమవారం బాగలకోట జిల్లాకు బూదిహాళకు చెందిన మంజునాథ్ రమేశ హడపద (25) కుటుంబంతో కలిసి మురుడేశ్వరకు విహారయాత్రకు వెళ్లారు. సముద్రంలో ఈతకు వెళ్లగా అలలకు సముద్రంలో కొట్టుకుపోయి మరణించాడు. మరో ఘటనలో బాగలకోట జిల్లా లోకాపురకు చెందిన కృష్ణప్ప కరియప్ప హరకంగి (18) ధారవాడకు చెందిన నలుగురు స్నేహితులతో కలిసి మురుడేశ్వరకు వెళ్లారు. సముద్ర ఒడ్డున ఆడకుంటూ ఉండగా అలలకు లోపలకు కొట్టుకుపోయి చనిపోయాడు.

క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామిగా చౌడేశ్వరి దేవి



బనశంకరి: దేవీ నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా యలహంక ఓల్డ్‌టౌన్ కొండప్ప లేఔట్‌లో వెలసిన చౌడేశ్వరీదేవి ఆలయంలో వేకువజామున సుప్రభాత సేవ అనంతరం ప్రత్యేక అభిషేకం, పూజలు చేపట్టారు. సాయంత్రం అమ్మవారికి వేంకటేశ్వరస్వామిగా అలంకరణ చేపట్టి ప్రత్యేకపూజలు నిర్వహించి మహామంగళ హారతి నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కుబడులు తీర్చుకున్నారు.

హట్టిలో భూ ప్రకంపనలు

రాయచూరు రూరల్: లింగసుగూరు తాలూకా హట్టి బంగారు గనుల కంపెనీ ప్రాంతంలో భూమి కంపించింది. హట్టి పరిసర ప్రాంతాల్లో హట్టి, వీరాపూర్, వజ్జల గట్టు, నీలోగల్ ప్రాంతాలలో సోమవారం కొన్ని సెకెండ్ల పాటు భూ ప్రకంపనలు కనిపించాయి.

యరమల దొడ్డిలో చిరుత దాడి?



మృతి చెందిన జింక

రాయచూరు రూరల్: మాన్వి తాలుకా యరమల దొడ్డిలో చిరుత కనిపించడంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మూడు రోజుల క్రితం చిరుత జింకతో పాటు మేకలను బలి తీసుకుంది. వెంటనే చిరుతను బంధించాలని స్థానికులు కోరుతున్నారు.

ఈతకు వెళ్లి యువకుడి మృతి

బనశంకరి: విజయదశమి రోజున విషాదం చోటు చేసుకుంది. ఈతకు వెళ్లి యువకుడు నదిలో మృతి చెందాడు. ఈ ఘటన సవనూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. హావేరి జిల్లా సవనూరు తాలూకా కళసూరు గ్రామానికి చెందిన అమోఘహొసమని(17) పండుగ నేపథ్యంలో స్నేహితులతో కలిసి మంగళవారం వరదానదిలో ఈతకు వెళ్లారు. నది మధ్యలోకి వెళ్లిన సమయంలో నీటి ఉధృతికి అమోఘహోసమ కొట్టుకుపోయాడు. సవనూరు అగ్నిమాపకసిబ్బంది, పోలీసులు తీవ్రంగా గాలించి నదిలోనుంచి మృతదేహాన్ని బయటికి తీశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ముగిసిన విజయ దశమి ఉత్సవాలు



అలంకారంలో నగరేశ్వరుడు

రాయచూరురూరల్: దసరా ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. నగరంలోని కిల్లే బృహన్మఠం వెండి అంబా భావాని ప్రతిమకు ప్రత్యేక పూజలు చేశారు. కందగడ్డ మారెమ్మ, ఆలయం, కోటలోని కాళిక ఆలయంలో అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. అదే విధంగా నగరేశ్వరాలయంలో వెంకటేశ్వర స్వామికి రథోత్సవం నిర్వహించారు.

మంగళూరులో హర్భజన్‌సింగ్ సందడి



కార్యక్రమంలో హర్భజన్‌సింగ్

యశవంతపుర: దసర పండుగ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు మిథున్‌రై నేతృత్వంలో మంగళూరు పట్టణంలో ఉర్వా మైదానం పిలిన లికెలో జరిగిన కార్యక్రమంలో భారత మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్, బాలీవుడ్ నటుడు సునీల్‌శెట్టి పాల్గొని సందడి చేశారు. ఈ వీడియోలు సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారాయి. దసరా పండుగ సందర్భంగా పులి వేషాలు ఎంతోగానో అకట్టుకోగా ఆ దృశ్యాలను హర్భజన్‌సింగ్ తన ముబైల్లో బంధించారు. తనను అహ్వానించినందుకుగాను హర్భజన్ సింగ్ మంగళూరు వాసులకు కృతజ్ఞతలు తెలిపారు. విభిన్న సంస్కృతులను చూసి సంతోషం వ్యక్తం చేశారు.

అన్నభాగ్య బియ్యం పక్కదారి

ఆగని అక్రమ దందా
- గోడౌన్లకు చేర్చి అక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు
- రేషన్ బియ్యానికి పాలిష్ చేసి అమ్మకాలు



పాలిష్ చేసి పొరుగు రాష్ట్రాలకు తరలింపు

సాక్షి,బళ్లారి: రేషన్ కార్డుల కోసం వేలాది మంది ఎదురు చూస్తుంటే మరోవైపు టన్నుల కొద్ది బియ్యం పక్కదారి పడుతున్నాయి.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పది కేజీల బియ్యం ఇవ్వాలని భావించింది. అయితే ఒక్కొక్కరికి పది కేజీలు ఇవ్వడం కష్టమని, గతంలో మాదిరిగానే ఐదు కేజీలు ఇస్తూ మిగలిన ఐదు కేజీలకు నగదు వారి ఖాతాలోల వేసేందుకు ప్రయత్నం చేస్తోంది. ఇందులో కొందరికి నగదు బ్యాంకులో పడుతోందని పేర్కొంటున్నారు.

ఇతర రాష్ట్రాలకు చేరవేత :

ఇదిలా ఉంటే ఏటా టన్నుల కొద్ది బియ్య ఇతర రాష్ట్రాలకు తరలిపోతోంది. దీనిపై కేసులు కూడా నమోదువుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా కాకుండా విజయనగర, తదితర జిల్లాల నుంచి కూడా అన్నభాగ్య బియ్యం అక్రమంగా రవాణా జరుగుతోంది. రేషన్‌కార్డుదారులు కూడా సగం మంది నేరుగా అన్నభ్యాగ్య బియ్యం అమ్మకాలు చేయడం వల్ల అక్రమ రవాణాకు దారులు ఏర్పడుతున్నాయి. బళ్లారి జిల్లా ఆంధ్రప్రదేశ్‌కు సరిహద్దున ఉండటంతో చెక్‌పోస్టులు దాటిస్తే ఇతర రాష్ట్రాలకు పెద్ద ఎత్తున లారీల్లో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రేషన్‌కార్డుదారులతో కేజీ బియ్యాన్ని రూ.10లకే కొనుగోలు చేసి వాటికి పాలిష్ చేసి రూ.45 నుంచి రూ.50లకు అమ్మకాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు లబ్ధిదారులు బియ్యాన్ని హోటళ్లకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

లబ్ధిదారుల నుంచి సేకరించిన బియ్యాన్ని రహస్య ప్రాంతాలకు చేర్చి అక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. అక్రమ రవాణాపై దాదాపు 20 కేసులు నమోదయ్యాయి. ఇక్కడ లబ్ధిదారులే బియ్యాన్ని రేషన్‌షాపు యజమానులు, లేదా వారే మార్కెట్‌లో విక్రయించడం గమనార్హం. ఈ దందా పూర్తిగా అడ్డుకట్ట వేయాలంటే ముందుగా రేషన్‌షాపు డీలర్లతోపాటు రేషన్‌కార్డు దారులు కూడా బియ్యాన్ని విక్రయించకపోతే ఎలా పెద్ద ఎత్తున ఇతర ప్రాంతాలకు బియ్యం సరఫరా చేసేందుకు వీలవుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారి మాట్లాడుతూ... రేషన్‌బియ్యం పక్కదారి పట్టకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నామని, పోలీసులు సహకారంతో చెక్‌పోస్టులు వద్ద గట్టి నిఘా పెట్టామని, తమకు అందిస్తున్న సమాచారంతో కూడా దాడులు చేసి అక్రమ రవాణాపై కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు.

యువకుడి దారుణ హత్య

హుబ్లీ: విజయదశమి రోజే వాణిజ్య నగరి హుబ్లీలో గుర్తు తెలియని యువకుడు హత్యకు గురయ్యాడు. మంగళవారం వెలుగు చూసిన ఘటన వివరాలు.. హుబ్లీ శివారు శివల్లి రైల్వే బ్రిడ్జి వద్ద 30 ఏళ్ల గుర్తు తెలియని యువకుడి శవాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. యువకుడి గొంతు ముఖం, శరీరంలో పలు చోట్ల గాయాలు కనిపించాయి. ఘటన స్థలాన్ని పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించారు. అశోక్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

రోడ్డు దాటుతున్న మహిళను బైక్ ఢీకొన్న ఘటన హుబ్లీ కేశ్వపుర సర్కిల్ జైన్ దేవస్థానం వద్ద మంగళవారం చోటు చేసుకుంది. ఘటనలో జోష్నజైన్ తీవ్రంగా గాయపడింది. జోష్న జైన్ పండుగ సందర్భంగా ఆలయానికి వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. హుబ్లీ తూర్పు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఆదిత్య మల్లికార్జున అనే వ్యక్తి బైక్‌తో ఢీకొట్టినట్లు సీసీ కెమెరాలో రికార్డయింది.

భూములు అమ్ముకోవద్దు

- ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్

దొడ్డబళ్లాపురం: త్వరలో కనకపుర తాలూకా బెంగళూరు పరిధిలోకి రానుందని, దీంతో భూములు, ఆస్తుల విలువ 10రెట్లు పెరగనుందని, ఎవ్వరూ తమ భూములను అమ్ముకోవద్దని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సూచించారు. కనకపుర తాలూకా శివనహళ్లి గ్రామంలో మంగళవారం జరిగిన వీరభద్ర స్వామి దేవాలయం పునరుద్ధరణ భూమిపూజ కార్యక్రమంలో డీకే శివకుమార్ పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ కనకపుర ప్రజలందరికీ ఇల్లు కట్టించి, బ్యాంకుల్లో డబ్బు వేయలేనని, అయితే త్వరలో మీ ఆస్తుల విలువ పది రెట్లు పెంచేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.రహదారి పక్కనే శివనహళ్లి గ్రామం ఉన్నందున రైతులు ఎట్టిపరిస్థితుల్లోనూ భూములు అమ్ముకోవద్దని సలహా ఇచ్చారు. కేఎంఎఫ్ డెయిరీ కూడా దగ్గరలోనే ఉందన్నారు.

ఉక్కు ఫ్యాక్టరీలో ఆపరేటర్ దుర్మరణం

బొమ్మనహాళ్: అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలంలోని హరేసముద్రం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న జిందాల్ సావ్ ఇనుము–ఉక్కు కార్మాగారంలో కన్వేయర్ బెల్ట్ తగిలి కార్మికుడు గాయపడి ఆస్పత్రిలో మరణించాడు. వివరాల మేరకు... కర్ణాటకలోని బళ్లారి నగరానికి చెందిన టి. మనోజ్‌కుమార్ (32) జిందాల్ కర్మాగారంలోని పవర్ ప్లాంట్‌లో బాయిలర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం కర్మాగారంలో పనిచేస్తుండగా కన్వేయర్ బెల్ట్‌లో కుడి కాలు ఇరుక్కుని తొడ భాగం వరకు విగిరిపోయింది. గమనించిన తోటి కార్మికులు వెంటనే బళ్లారిలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. తీవ్ర రక్తస్రావం కావడంతో చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్‌ఐ తెలిపారు. మృతుని తల్లి వరలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. శవానికి బళ్లారి విమ్స్‌లో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

ఆలయాల్లో విశేష పూజలు

కోలారు: శరన్నవరాత్రులలో భాగంగా నగరంలోని పలు ఆలయాల్లో సోమవారం మహర్నవమి సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. నగరంలోని కెఈబి గణపతి, సోమేశ్వర, నగరదేవత కోలారమ్మ, సత్యమ్మ, రేణుకా యల్లమ్మ, వేణుగోపాలస్వామి, కాళమ్మ గుడి తదితర దేవాలయాలలో విశేష పూజలు జరిగాయి. నగరంలోని శృంగేరి శారదా మఠంలో శారదా దేవికి సాయంత్రం కొబ్బరి అలంకరణ చేసి విశేష పూజలు చేశారు.

డెంగీ కేసులపై అప్రమత్తం

బనశంకరి: ఉత్తరకన్నడ జిల్లా భట్కళ తాలూకా మావినకుర్వే పంచాయతీ పరిధిలో డెంగీ లక్షణాలతో యువకుడు మృతి చెందాడు. దీంతో జిల్లా మలేరియా నియంత్రణాధికారి రమేశ్‌రావ్ (డీఎంఓ) మంగళవారం భట్కళ ప్రాంతంలో పర్యటించారు. కొద్దిరోజులుగా అనుమానిత డెంగీ కేసులు వెలుగు చూస్తుండటంతో తనిఖీలు చేపట్టినట్లు రమేశ్‌రావ్ తెలిపారు. ఆశాకార్యకర్తలతో కలిసి ప్రజలను జాగృతం చేస్తున్నామని తెలిపారు.

పేరుమోసిన నేరగాడు అరెస్ట్

యశవంతపుర: అండర్ వరల్డ్ డాన్ రవిపూజారి, కలి యోగేశ్వ సహచరుడు నొటోరియస్ షార్ప్‌షూటర్, కేరళ మంజేశ్వర నివాసి మోహమ్మద్ హనీఫ్ అలియాస్ అలీ మున్నాను మంగళూరు దక్షిణ విభాగం పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడిపై అరెస్ట్ వారెంట్ ఉంది. కోణాజె, మంగళూరు ఉత్తర, పుత్తూరు, బర్కె, విట్ల, ఉళ్లాల, బెంగళూరు విమానశ్రయ పోలీస్‌స్టేషన్లలో కేసులున్నాయి. 2010, 2013లో కాసరగోడులో ప్రజాపనుల కాంట్రాక్టర్‌పై కాల్పులు జరిపిన ఘటనలో ఇతను నిందితుడు.

రైల్వేశాఖకు వినియోగదారుల ఫోరం జరిమానా

బనశంకరి: బుక్ చేసుకున్న టికెట్‌ను మరొకరికి కేటాయించిన రైల్వేశాఖకు జిల్లా వినియోగదారుల ఫోరం జరిమానా విధించింది. బెంగళూరు వైట్‌ఫీల్డ్ నివాసి ఆలోక్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన నగర 3 వ అదనపు జిల్లా వినియోగదారుల ఫోరం కమిషన్ అధ్యక్షుడు కే.శివరామ నేతృత్వంలోని న్యాయపీఠం విచారణ చేపట్టింది. ప్రయాణికులనుంచి అదనంగా తీసుకున్న రూ.22,300కు ఏడాదికి 9 శాతం వడ్డీతో కలిపి ఇవ్వాలని, అదేవిధంగా మానసిక బాధ అనుభవించినందుకు రూ.30 వేల పరిహారం, న్యాయపోరాటానికి అయిన ఖర్చు రూ.10 వేలు 45 రోజుల్లో బాధితులకు చెల్లించాలని తీర్పు ఇచ్చింది.

చిరుత సంచారంతో భయం భయం



చిరుత దాడిలో మృతిచెందిన మేక

దొడ్డబళ్లాపురం: దొడ్డబళ్లాపురం తాలూకా హొన్నాఘట్ట గ్రామం పరిసరాల్లో చిరుత సంచరిస్తోంది.ఆదివారం మధ్యాహ్నం ద్రాక్షతోటలో మేత మేస్తున్న మేకను లాక్కెళ్లి హతమార్చింది. దీంతో రైతులు తోటలకు వెళ్లాలంటేనే భయపడిపోతున్నారు. చిరుత గ్రామానికి దగ్గరగా సంచరిస్తుండడంతో గ్రామస్తులకు కంటిమీద కునుకు లేకుండా పోయింది. త్వరగా చిరుతను బంధించాలని గ్రామస్తులు అటవీశాఖ అధికారులను కోరుతున్నారు.

కళలపై ఆసక్తి పెంపొందించాలి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

యశవంతపుర: నాట్యం భారత ప్రాచీన కళ అని సేల్యూషం అర్ట్ అండ్ క్రియేషన్ ప్రముఖుడు విద్వాన్ అనంత విక్రమ్ తెలిపారు. బెంగళూరు నయన సభాంగణంలో కన్నడ సంస్కృతిశాఖ, శేల్యూషం అర్ట్ అండ్ క్రియేషన్ సంయుక్తంగా నిర్వహించిన చిన్నర కలరవ కార్యక్రమంను ప్రారంభించి మాట్లాడారు. పిల్లలకు ఆసక్తి ఉన్న కళల్లో ప్రతిభ చాటేలా ప్రోత్సహించాలన్నారు. అనంతరం భరత నాట్యం, కుచిపూడి నృత్యాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. బెంగళూరు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు శివకుమార్ నాగర నవిలె, అశాకుమార్, భావనా వెంకటేశ్ తదితరలు పాల్గొన్నారు.

ఎయిర్ షో జయప్రదం



ఆకాశంలో దూసుకెళ్తున్న యుద్ధ విమానాలు

మైసూరు: నాడహబ్బ మైసూరు దసరా మహోత్సవంలో వినీలాకాశంలో లోహ విహంగాలు శరవేగంతో దూసుకెళుతూ చేసిన విన్యాసాలు చూపరులను అబ్బురపరిచాయి. నాలుగేళ్ల తర్వాత మైసూరు బన్నిమంటపం మైదానంపై ఆదివారం ఎయిర్ షో రిహార్సల్ జరిగింది. సోమవారం సాయంత్రం 4 గంటలకు నిజమైన ఎయిర్ షో జరిగింది. ఒక గంట ముందుగానే ప్రజలు మైదానానికి చేరుకున్నారు. వాయుసేనకు చెందిన సూర్యకిరణ్ జెట్ విమానాలు పాల్గొన్నాయి. గంటకు 200–300 కి.మీ. వేగంతో ఎంతో శబ్దం చేస్తూ గగనంలో చెలగాటమాడాయి. 35 వేలకు పైగా ప్రజలు ఈ ఎయిర్ షోను తిలకించారు,. తన కుటుంబ సభ్యులతో కలసి సీఎం సిద్ధరామయ్య ఎయిర్ షోను వీక్షించారు. సీఎం సిద్ధరామయ్యతో పాటు కోడలు స్మిత రాకేశ్, మనమళ్లు కూడా ఉన్నారు. జన రద్దీతో కి.మీ. మేర ట్రాఫిక్ స్తంభించింది.

ఆకట్టుకున్న నాడహబ్బ ఉత్సవాలు

రాయచూరు రూరల్: నగరసభ ఆధ్వర్యంలో నాడహబ్బ ఉత్సవాలను కిల్లే బృహన్మఠ మఠాధిపతి శాంతమల్ల శివాచార్యులు నాడదేవికి పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కరగ ఉత్సవం, వీరగాసే, లంబాడీ మహిళల నృత్యం, బొమ్మలాటలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్, కమిషనర్ గురుసిద్దయ్య, రవి బోసురాజ్, సభ్యులు జయన్న, బసవరాజ్, రవీంద్ర, హరీష్ పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న అంబులెన్స్

- రోగి మృతి, ముగ్గురికి గాయాలు



ప్రమాదానికి గురైన అంబులెన్స్

దొడ్డబళ్లాపురం: అంబులెన్స్ లారీని ఢీకొని రోగి మృతిచెందగా మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన నెలమంగల తాలూకా బొమ్మనహళ్లి వద్ద చోటుచేసుకుంది. చిత్రదుర్గకు చెందిన విజయ్‌కుమార్ అనే వ్యక్తి అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా మెరుగైన చికిత్స కోసం అంబులెన్సులో బెంగళూరుకు తీసుకొనిబయల్దేరారు. నెలమంగల బొమ్మనహళ్లి వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన కంటెయినర్ లారీని అంబులెన్స్ ఢీకొంది. దీంతో విజయ్‌కుమార్ తలకు బలమైన గాయాలయ్యాయి. అతన్ని మరో అంబులెన్సులో తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతిచెందాడు. ఘటనలో మరో ముగ్గురు గాయపడగా సమీప ఆస్పత్రికి తరలించారు.నెలమంగల ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

వంతెన పైనుంచి పడి వ్యక్తి మృతి

హిందూపురం అర్బన్: పెన్నా పాత బ్రిడ్జిపై నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కర్ణాటకలోని కొడిగేహళ్లి పంచాయతీ రెడ్డిపల్లి గ్రామానికి చెందిన వెంకటశివారెడ్డి (51)కి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెనుకొండ సమపంలోని కియా అనుబంధ పరిశ్రమలో డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఏడాది క్రితం కురిసిన వర్షాలకు రెడ్డిపల్లి – హిందూపురం మధ్యమార్గంలో పోచనపల్లి వద్ద ఉన్న పెన్నానది బ్రిడ్జి కూలిపోయింది. దీంతో అక్కడ తాత్కాలిక బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం పోచనపల్లి, ఊడుగలపల్లి, బేవనహళ్లి తదితర కర్ణాటక ప్రాంత ప్రజలు తాత్కాలిక బ్రిడ్జి మీదనే రాకపోకలు సాగిస్తున్నారు. అయితే మంగళవారం వేకువజామున విధులకు హాజరయ్యే హడావుడిలో రెడ్డిపల్లి నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన వెంకటశివారెడ్డి.. పాత బ్రిడ్జి మార్గంలోకి దూసుకెళ్లి.. పై నుంచి బ్రిడ్జి శిథిలాలపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తులు, పోలీసులు ఉదయం గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు.

వైభవంగా గ్రామీణ దసరా



శమి వృక్షానికి పూజలు చేస్తున్న తహసీల్దార్



పూజా కార్యక్రమంలో పాల్గొన్న నగర ప్రజలు

కోలారు: నగరంలో విజయ దశమి వేడుకలను మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామీణ దసరా తరహాలో తహసీల్దార్ హర్షవర్ధన్ మైసూరు పేట ధరించారు. ఆయన్ను పూర్ణకుంభంతో స్వాగతం పలికి మేళతాళాలతో శమి వృక్షం వద్దకు తీసుకువచ్చారు. అనంతరం ఆయన కత్తితో శమి వృక్షాన్ని కత్తిరించడం ద్వారా దసరా వేడుకలను సాంప్రదాయ బద్ధంగా ఆచరించారు. నగరంలోని శక్తి దేవతల ఉత్సవ మూర్తులను ఈ ఆలయానికి తీసుకువచ్చి పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. శమి వృక్షానికి అరటి దిండ్లను కట్టి విశేష పూజలు చేశారు. ఈ వేడుకలను చూడటానికి పెద్ద సంఖ్యలో నగర ప్రజలు కొండరాజనహళ్లి వద్ద తరలి వచ్చారు.

కోలారు వార్తలు...

చెరువులో పడి వ్యక్తి మృతి



మృతి చెందిన నారాయణస్వామి

మాలూరు: చెరువులో చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన తాలూకాలోని లక్కూరు గ్రామ పెద్ద చెరువులో చోటు చేసుకుంది. చిక్క తిరుపతి గ్రామానికి చెందిన నారాయణస్వామి (45) మృతి చెందిన వ్యక్తి. నారాయణస్వామి చెరువులో చేపలు పడుతున్న సమయంలో కాలు జారి చెరువులో పడి మృతి చెందాడు. చుట్టుపక్కల వారు గమనించి లక్కూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిమాపక సిబ్బంది సహాయంతో మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.

జిల్లాలో దళితుల హత్యలు పెరిగిపోతున్నాయి

కెజీఎఫ్: జిల్లా యంత్రాంగం వైఫల్యం కారణంగా జిల్లాలో దళితులపై దౌర్జన్యాలు, హత్యలు అధికమవుతున్నాయని, ఇప్పటికే తాలూకాలో రెండు హత్యలు జరిగాయని దళిత సమాజ సేన సంస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సూలికుంటె ఆనంద్ తెలిపారు. మంగళవారం బంగారుపేట పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. దళిత పోరాటాలకు కోలారు జిల్లా పుట్టినిల్లు లాంటిది. అలాంటి జిల్లాలో దళితుల హత్యలు అధికం అవుతున్నాయన్నారు. దళితులకు తగిన రక్షణ కల్పించాలన్నారు. ఈ సందర్భంగా డీఎస్ఎస్ నాయకులు నవీన్ దిసాయి రాజ్, ఆటో కర్ణా, మంజు, భాగ్యరాజ్ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

మాలూరు: తాలూకాలోని లక్కూరు ఫిర్కా మీణసంద్ర – కోడిహళ్లి రహదారిలో జరిగిన గ్రామ పంచాయతీ సభ్యుడు అనిల్‌కుమార్ హత్య కేసుకు సంబంధించి పోలీసులు మీణసంద్ర గ్రామానికి చెందిన అశోక్, అనిల్, ఆనంద్, అరవింద, గీతా, చన్నసంద్ర హరికాంత్‌లను అరెస్ట్ చేశారు. వీరు ఈనెల 21న ద్విచక్ర వాహనంలో వెళ్తున్న అనిల్‌కుమార్‌పై మారణాయుధాలతో దాడి చేసి హత్య చేశారు. అనిల్ కుమార్, అశోక్‌ల మధ్య గణేష నిమజ్జన సమయంలో జరిగిన గొడవ పెరిగి హత్యకు దారి తీసినట్లు సమాచారం. నిందితులను జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు.

జెడీఎస్ మాజీ అధ్యక్షుడి దారుణ హత్య



హత్యకు గురైన శ్రీనివాసన్ (ఫైల్)



పోలీసు కాల్పుల్లో గాయపడిన నిందితులు

- మారణాయుధాలతో నరికి చంపిన దుండగులు
- అరెస్టు సమయంలో నిందితుల దాడి, పోలీసుల ఎదురు కాల్పులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పోలీసులు

శ్రీనివాసపురం: శరన్నవరాత్రులలో మహర్నవమి రోజున శ్రీనివాసపురం తాలూకాలో దారుణం చోటు చేసుకుంది. జిల్లా పంచాయతీ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాసన్ (62) దారుణ హత్యకు గురయ్యాడు. మాజీ స్పీకర్ కె ఆర్ రమేష్‌కుమార్ అనుచరుడు, హోం మంత్రి పరమేశ్వర్ ఆప్తుడి శ్రీనివాసన్ కౌన్సిలర్ శ్రీనివాస్‌గా గుర్తింపు పొందాడు. సోమవారం తన తోటలోని ఫాంహౌస్‌లో హత్యకు గురయ్యాడు. శ్రీనివాసపురం సమీపంలోని హొగళగెరె వద్ద హత్య జరిగింది. రక్త గాయాలతో చావుబతుకుల మధ్య ఉన్న శ్రీనివాసన్‌ను అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించి అక్కడి నుంచి ఆర్‌ఎల్ జాలప్ప ఆస్పత్రికి తరలించారు. చికిత్స ఫలించక శ్రీనివాసన్ ఆస్పత్రిలో మృతి చెందాడు.

ప్రత్యక్ష సాక్షి కథనం: ఘటనను ప్రత్యక్షంగా చూసిన అమర్ అనే వ్యక్తి కథనం మేరకు ...నూతనంగా నిర్మిస్తున్న బారు నిర్మాణ పనులను వీక్షించి తిరిగి తోటలోని ఇంటికి వచ్చామని, ఈ సమయంలో రెండు ద్విచక్ర వాహనాలలో తోటలోకి వచ్చిన దుండుగులు అంకుల్ బాగున్నారా అని పలకరించి షేక్‌హాండ్ ఇచ్చే నెపంతో ముందుకు వచ్చి మారణాయుధాలతో శ్రీనివాసన్‌ను నరికి చంపారని తెలిపాడు. దుండుగులు ఈ ప్రాంతంలో తిరుగుతున్నట్లు చూశానని తెలిపారు.

రమేష్ కుమార్, హోం మంత్రి పరమేశ్వర్ పరామర్శ :

హత్య విషయం తెలిసిన వెంటనే హోం మంత్రి పరమేశ్వర్, మాజీ స్పీకర్ రమేష్‌కుమార్ ఆర్‌ఎల్ జాలప్ప ఆస్పత్రికి వెళ్లి శ్రీనివాసన్ భౌతిక కాయాన్ని సందర్శించారు. రమేష్ కుమార్ కన్నీరు పెట్టుకున్నారు. శ్రీనివాస్ హంతకులను వెంటనే పట్టుకుంటామని పరమేశ్వర్ తెలిపారు.

పోలీసులపై ఎదురుదాడి, హంతకులపై కాల్పులు

శ్రీనివాసన్ హత్య అనంతరం హంతకులు ఆరుగురు లక్ష్మీ సాగర అటవీ ప్రాంతంలో తలదాచుకున్నారు. నిందితులను పట్టుకోవడం కోసం మూడు ప్రత్యేక బృందాలను ఎస్పీ నారాయణ్ రంగంలోకి దింపి 24 గంటల్లోపు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో వేమగల్ సీఐ వెంకటేష్ నేతృత్వంలోని ఓ బృందం లక్ష్మీ సాగర అటవీ ప్రాంతంలో గాలింపు చేపట్టారు. తారసపడిన హంతకులు పట్టుకోవడానికి యత్నించగా వారు పోలీసులపై దాడి చేశారు. దీంతో సీఐ కాల్పులు జరిపారు. నిందితులు మునీంద్ర, సంతోష్, వేణుగోపాల్‌కు గాయాలయ్యాయి. నిందితుల దాడిలో పోలీసులు ముంజునాథ్, నాగేశ్‌లు కూడా గాయపడ్డారు. అందరినీ ఎస్ఎన్ఆర్ ఆస్పత్రికి తరలించారు. మిగిలిన ముగ్గురి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

రాజకీయ, ఆస్తి తగాదాలే కారణమా : హతుడు శ్రీనివాసన్, వేణుల మధ్య ఏడేళ్లుగా రాజకీయ వైరంతో పాటు భూ వివాదాలు కూడా ఉన్నట్లు సమాచార. ఈ నేపథ్యంలోనే హత్య జరిగిందని భావిస్తున్నారు.

చిరుతల సంచారం, స్థానికుల ఆందోళన

శ్రీనివాసపురం: ముళబాగిలు తాలూకాలోని పలు గ్రామాల తోటల సమీపంలో చిరుతల సంచారం ప్రజలను భయాందోళకు గురిచేస్తోంది. తాలూకాలోని అత్తికుంటె, కాడ కచ్చిన హళ్లి, చొక్కదొడ్డి, మల్లికచ్చనహళ్లి, ఆవణి తదితర ప్రాంతాలలో చిరుతలు సంచరించిన గుర్తులు కనిపిస్తున్నాయి. ఇటీవల చిరుత అత్తికుంట గ్రామంలో ఓ ఆవుపై దాడి చేసి గాయపరిచింది. చిరుతను బంధించడానికి బోనులు పెట్టినా ఫలితం లేకపోతోంది. తాలూకాలోని గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చిరుతలను వెంటనే పట్టుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఘనంగా దసరా వేడుకలు



విజయపురలో బస్సులకు ఆయుధపూజ నిర్వహించిన దృశ్యం

విజయపుర: విజయదశమి వేడుకలు సోమ, మంగళవారాల్లో ఘనంగా జరిగాయి. ప్రజలు ఇళ్లకు మావిడకులు కట్టి పండుగకు ఘన స్వాగతం పలికారు. ఇంటిల్లిపాది కొత్త వస్త్రాలు ధరించి ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు. వియజపుర పట్టణంలోని శ్రీ నగరేశ్వర స్వామి దేవాలయంలో శ్రీ అన్నపూర్ణాంభ దేవికి ప్రత్యేక పూజలు చేశారు. చాముండేశ్వరి దేవికి సహస్ర కుంకుమార్చన, లలిత సహస్ర నామ, అష్టోత్తర నిర్వహించారు. చెన్నకేశవ స్వామి, శ్రీ ఓంకారేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీ వేంకటరమణ స్వామి ఆలయాల్లో స్వామివార్లకు ప్రత్యేక అంలకారాలు, పూజలు చేపట్టారు.

ఘనంగా గజ్జెపూజ



గజ్జె కట్టి నాట్యం చేస్తున్న చిన్నారులు

గౌరిబిదనూరు: నాట్య కళాకారుల జీవితంలో గజ్జె పూజకు ఎంతో ప్రాముఖ్యత ఉందని దిక్సూచి నాట్యాలయ సంస్థాపకురాలైన దివ్యా శివనారాయణ్ తెలిపారు. పట్టణంలోని బైపాస్ రోడ్డులో గంగిరెడ్డి స్వగృహంలో ఆయన కుమార్తె మధుశ్రీ జి రెడ్డి, మనస్విని గజ్జెపూజె కార్యక్రమంలో గురువుగా పాల్గొని ప్రసంగించారు. నాట్యాచార్యుడైన నటరాజుకు పూజలు నిర్వహించి గురువులు, పెద్దల అనుమతితో గజ్జె కట్టి నాట్యం చేయాల్సి ఉంటుందన్నారు.

చెరకు పంట అగ్నికి ఆహుతి

శివాజీనగర: అగ్ని ప్రమాదంలో 30 ఎకరాల్లోని చెరకు పంట కాలి బూడిదైంది. ఫలితంగా అన్నదాతలకు లక్షలాదిరూపాయల నష్టం వాటిల్లింది. ఈ ఘటన బెళగావి జిల్లా బైలహొంగల తాలూకా చివటగుండి గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన 8 మంది రైతులు పక్క పక్క పొలాల్లో దాదాపు 30 ఎకరాల్లో చెరకు సాగు చేశారు. చెరకు పంట సమీపంలోనే వెళ్లిన విద్యుత్ తీగలు పరస్పరం రాపిడికి గురై నిప్పు రవ్వలు ఎగసి పంటపై పడ్డాయి. దీంతో మంటలు చెలరేగి 30 ఎకరాల్లోని పంట కాలి బూడిదైంది. విద్యుత్ మోటర్లు, పైపులు, కేబుల్, కరెంట్ బాక్స్‌లు అగ్నికి ఆహుతయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చిమంటు ఆర్పివేశారు. దాదాపు రూ.50 లక్షల నష్టం జరిగినట్లు బాధిత రైతులు పేర్కొన్నారు.

బోనులో చిక్కిన చిరుత

మైసూరు: గ్రామస్తులకు కునుకు లేకుండా చేసిన చేసిన చిరుత ఎట్టకేలకు బోనులో పడింది. పిరియాపట్టణ తాలూకా మళగనకెరె గ్రామంలో 15 రోజులుగా చిరుత సంచరిస్తోంది. పశువులు, కుక్కలను బలి తీసుకుంది. దీంతో గ్రామస్తులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్నారు. చిరుతను బంధించేందుఉ అటవీ అధికారులు గ్రామ సమీపంలో బోనును ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం ఆహారం కోసం వచ్చి బోనులో చిక్కింది. విషయం తెలిసిన వెంటనే అదికారులు అక్కడి వచ్చి చిరుతను తరలించారు.

మరకత శివలింగానికి భస్మ అలంకరణ



బనశంకరి: దసరా నవరాత్రి మహోత్సవాల సందర్భంగా జేపీ నగర మూడో ఫేజ్ శ్రీ శివబాల యోగిమహరాజ్ ట్రస్ట్ ఆశ్రమంలో మంగళవారం బ్రహ్మ, విష్ణు, మహేశ్వర దేవతలకు మహిషాసురమర్దిని అలంకరణచేపట్టి పూజలు చేపట్టారు. అదేవిధంగా మరకత శివలింగానికి భస్మ అలంకరణచేపట్టి విశేషపూజలు నిర్వహించారు. సాయంత్రం సహస్రకుంకుమార్చన చేపట్టి భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణచేశారు. ట్రస్ట్ కార్యాధ్యక్షుడు డీ.రాంబాబు, ట్రస్టీసభ్యులు పాల్గొన్నారు.

ప్రేమించాలని వేధింపులు.. విద్యార్థిని ఆత్మహత్య

మైసూరు: ప్రేమించాలని పీడించడంతో మనస్తాపానికి గురైన పీయూసీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన చామరాజనగర జిల్లా గుండ్లుపేట తాలూకాలో జరిగింది. హుణకణపుర గ్రామానికి చెందిన 16 ఏళ్ల విద్యార్థిని నంజనగూడులో పీయూసీ చదువుతోంది. యడవనహళ్లి గ్రామానికి చెందిన శ్రీని అనే వ్యక్తి విద్యార్థిని వెంట ప్రేమించాలని ఒత్తిడి చేసేవాడు. మొబైల్‌కు సందేశాలు పంపుతూ , ప్రేమించాలని వేధించాడు. అతడి వేధింపులు ఇంతవరకు సహిస్తూ వచ్చిన విద్యార్థిని చివరికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు బేగూరు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

వైభవంగా ముగిసిన శరన్నవరాత్రులు



విశేష అలంకరణలో బనశంకరీదేవి మూలవిరాట్



దసరా పూజలు నిర్వహిస్తున్న అర్చకుల బృందం



తరలివచ్చిన భక్తులు

బనశంకరి: బనశంకరి ఆలయంలో తొమ్మిది రోజులుగా జరుగుతున్న దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. ప్రధాన అర్చకులు ఏ.చంద్రమోహన్ ఆధ్వర్యంలో సోమవారం బనంకరీదేవి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ, శాకంబరీదేని మారెమ్మదేవగా అలంకరణచేపట్టి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో అర్చకుల బృందం నవచండికా హోమం చేపట్టారు. మధ్యాహ్నం మహా మంగళహారతి ఇచ్చారు. సాయంత్రం శాకాంబరి అమ్మవారికి రాజవీధి ఉత్సవం చేపట్టారు. సాయంత్రం 7.30 గంటలకు దేవాలయ ఆవరణలో అర్చకులు ఏ.చంద్రమోహన్, సత్యనారాయణశాస్త్రి ధ్వర్యంలో శమీపూజ నిర్వహించారు. మంగళవారం వేకువజామున సుప్రభాతసేవ అనంతరం పంచామృతాభిషేకం అనంతరం బనశంకరీదేవి మూలవిరాట్ కు ప్రత్యేక అలంకరణ చేపట్టారు. విజయదశమి కావడంతో భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు నిమ్మకాయల ప్రమిదలతో దీపారాధన చేసి తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ వ్యవస్థాపక సమితి అధ్యక్షుడు ఏహెచ్.బసవరాజ్, ఆలయ ఈఓ లక్ష్మీ , సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి, సమితి సభ్యులు హనుమంతరాయప్ప, వెంకటేశ్, చంద్రు పాల్గొన్నారు.

చాముండేశ్వరిగా చౌడేశ్వరి దేవి

బనశంకరి: శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా దేవనహళ్లి చౌడేశ్వరీదేవి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. చౌడేశ్వరీదేవి మూలవిరాట్‌కు అర్చకులు చాముండేశ్వరిగా అలంకరణ చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.



మారెమ్మదేవిగా అలంకరణ



చాముండేశ్వరి అలంకరణలో చౌడేశ్వరీదేవి

పబ్‌లు, రెస్టారెంట్లలో తనిఖీలు జోరు



ఒక రెస్టారెంట్‌ను సీజ్ చేస్తున్న దృశ్యం



తనిఖీలు నిర్వహిస్తున్న బీబీఎంపీ అధికారి

- నిబంధనలు పాటించని రెస్టారెంట్ల మూసివేత

బనశంకరి: బృహత్ బెంగళూరు మహానగర పాలికె పరిధిలో మూడు రోజులుగా బీబీఎంపీ అధికారులు పబ్‌లు, బార్లు, రెస్టారెంట్లలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. నిబంధనలు పాటిస్తున్నారా ? లేదా అనే విషయంపై విచారణ చేస్తున్నారు. ఈక్రమంలో జేపీ.నగరలో బిల్డింగ్ పైభాగంలో రెస్టారెంట్‌తో సహా మొత్తం పదింటిని మూసివేయించారు. కోరమంగల పోరంమాల్ ముందు భాగంలో మడ్‌పైప్ కెఫే 6 వ అంతస్తులో ఈనెల 16వ తేదీన వంట గ్యాస్ సిలెండర్లు పేలి భారీ అగ్నిప్రమాదం సంభవించిన విషయం తెలిసిందే. అగ్నిమాపక శాఖ, బీబీఎంపీ అధికారులు పరిశీలించగా హోటల్ నిర్వహించడానికి మాత్రమే అనుమతి ఉన్నట్లు తేలింది. అయితే వినియోగదారులకు అక్రమంగా హుక్కా ఇస్తున్నట్లు తేలింది. ఈ కెఫేలో అగ్నిప్రమాదం సంభవించిన అనంతరం అప్రమత్తమైన పాలికె అధికారులు నగరవ్యాప్తంగా పబ్‌లు, బార్లు, రెస్టారెంట్లను పరిశీలిస్తున్నారు. బీబీఎంపీ మొత్తం 1,118 రెస్టారెంట్లకు అనుమతులు ఇచ్చింది. ఇప్పటి వరకు 669 రెస్టారెంట్లలో తనిఖీలు పూర్తి చేశారు. 157 సంస్థలు ట్రేడ్‌లైసెన్స్ నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలినట్లు సమాచారం.

వర్షాభావంతో తగ్గిన విద్యుదుత్పత్తి

- వ్యవసాయ పంప్‌సెట్లకు ఐదు గంటల సరఫరా
- కృత్రిమ కొరత అంటూ కుమారస్వామి చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదు
- సీఎం సిద్ధరామయ్య

మైసూరు: దేశంలో బొగ్గు నిల్వలు పడిపోయాయని, అందువల్లే ఉత్పత్తి తగ్గిపోయిందనే విషయం మాజీ సీఎంకు బాగా తెలుసునని, కేవలం ఊరికే ఆరోపణలు చేస్తున్నారనే విషయం ఆయనకు కూడా తెలుసునని హెచ్‌డీకుమారస్వామిని ఉద్దేశించి సీఎం సిద్దరామయ్య వ్యాఖ్యలు చేశారు. మైసూరులో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ కృత్రిమ లోటును సృష్టించారని మాజీ సీఎం కుమారస్వామి చేసిన వ్యాఖ్యలపై సిద్దరామయ్య స్పందించారు. రాష్ట్రంలో మొత్తం 32 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉందని, అయితే ఈసారి వర్షాభావ పరిస్థితులతో విద్యుత్ వినియోగంపై డిమాండ్ ఏర్పడిందన్నారు. డిమాండ్ మేర విద్యుత్‌ఉత్పత్తి జరగడం లేదని, వర్షాలు లేకపోవడంతో రైతులు నదుల నుంచి ఎక్కువగా నీటిని వినియోగిస్తున్నారని, ఇందుకోసం ఎక్కువగా పంప్‌సెట్లను వాడుతున్నారని చెప్పారు. క్రమంలో రైతుల పంప్‌సెట్లకు ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరా చేయాలని అధికారులను ఆదేశించినట్లు సిద్ధరామయ్య తెలిపారు.

రోడ్ల అనుసంధానం లేక ఇబ్బందులు

- సర్వీసు రోడ్డులోనే ప్రయాణిస్తున్న వాహనదారులు



ఇండువాళు వద్ద సర్వీస్ రోడ్డులోకి వెళ్లేందుకు అవకాశం కల్పించిన దృశ్యం

మండ్య: బెంగళూరు–మైసూరు ఎక్స్‌ప్రెస్‌వే మార్గంలో సర్వీస్ రోడ్లకు, ఎక్స్‌ప్రెస్‌వేకు చాలా చోట్ల అనుసంధానం లేదు. దీంతో జిల్లా, తాలూకా , గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. గత్యంతరం సుదీర్ఘంగా సర్వీస్ రోడ్లలోనే ప్రయాణించాల్సి వస్తోంది. మండ్య నుంచి మైసూరు మధ్య తాలూకా కేంద్రం, గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే ఎగ్జిట్ స్థలాలను మూసివేయడంతో వాహనదారులు తప్పనిసరై సర్వీసు రోడ్డులో వెళ్లాల్సి వస్తోంది. మండ్య వైపు నుంచి ఇండువాళు, తూబినకెరె, కాశేనహళ్లి వద్ద వాహనదారులు వచ్చి పోయే అవకాశం కల్పించారు. ఈ పాయింట్లలో రాళ్లను అడ్డుగా పెట్టారు. ఇండువాళు వద్ద ఎక్స్‌ప్రెస్‌వే ఎక్కేందుకు అవకాశం కల్పించారు. మిగిలిన మైసూరు వరకు ఎక్కడ కూడా సర్వీసు రోడ్డు వైపు వెళ్లేందుకు అవకాశం కల్పించలేదు. అధికారులు స్పందించి ఇబ్బందులు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

వేర్వేరు బైక్ ప్రమాదాల్లో ఇద్దరి మృతి

మైసూరు: రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు వివరాలు... నంజనగూడు తాలూకా నెరళె గ్రామానికి చెందిన కిరణ్ (22) అనే వ్యక్తి తన స్నేహితుడికి బైక్ ఇచ్చేందుకు వెళ్తూ నియంత్రణ కోల్పోయి డివైడర్‌ను ఢీ కొట్టాడు. తీవ్రంగా గాయపడి కిరణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అదేవిధంగా హుణసూరు తాలూకా అంచె గ్రామానికి చెందిన తులసీ అనే మహిళ కూలీ పనుల కోసం కాలినడకన వెళ్తుండగా హెచ్‌డీ కోటెకు వేగంగా వెళుతున్న బైక్ కొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆమెను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆయా ఘటనలపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

భవనంపైనుంచి పడి...

శివాజీనగర: భవనంపై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం జ్ఞానభారతి పోలీస్ స్టేషన్ వ్యాప్తిలోని కెంచనపురలో జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు...కెంచనపురలో పునర్వసతి కేంద్రం భవనం ఉంది. ఉదయం 11.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి భవనంపై తిరుగుతూ కిందపడి తీవ్ర గాయాలతో మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో జ్ఞానభారతి పోలీసులు వచ్చి పరిశీలించి మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. మృతుడు ఎవరు? ఆత్మహత్య చేసుకున్నాడా? ప్రమాదవశాత్తూ పడి మృతి చెందాడా అనేది దర్యాప్తులో తేలాల్సి ఉంది.

తమ్ముడి చేతిలో అన్న హతం



వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

దొడ్డబళ్లాపురం: వదినతో అక్రమ సంబంధం పెట్టుకున్న తమ్ముడు అన్నను కడతేర్చాడు. ఈ ఘటన దొడ్డ తాలూకా దొడ్డమంకలాళ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గంగరాజు(35), రవి సోదరులు. రవి తన అన్న భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడు. ఆమెను బెంగళూరుకు తీసుకెళ్లాడు. ఐదేళ్లుగా అక్కడే ఉన్నారు. దీంతో గంగరాజు తన ముగ్గురు పిల్లలను అనాథ ఆశ్రమంలో వదిలేశాడు. ఈక్రమంలో 15 రోజుల క్రితం రవి గ్రామానికి రాగా అతనితో గంగరాజు గొడవ చేశాడు. మంగళవారం రాత్రి గంగరాజు తలపై బండరాయి వేసి హత్య చేశారని మృతుడి తల్లి జయమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దొడ్డబెళవంగల పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో చండికా హోమం



చండికా హోమంలో పూర్ణాహుతి చేస్తున్న అర్చకులు

గౌరిబిదనూరు: శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా తాలూకా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో చండికా హోమం నిర్వహించారు. అధ్యక్షుడు రఘుబాబు మాట్లాడుతూ లోక కల్యాణాం కోసం చండికా హోమాన్ని ప్రధాన పురోహితులైన అశ్వత్థనారాయణ శర్మ ఆధ్వర్యంలో పదిరోజులుగా నిర్వహించి సోమవారం ముగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

మోదీ పేరుతోనే ఎన్నికలకు వెళ్తాం

- ఎంపీ ప్రతాప్‌సింహా

మైసూరు: వచ్చే లోకసభ ఎన్నికలను ప్రధాని నరేంద్ర మోదీ పేరు మీదే ఎదుర్కొంటామని ఎంపీ ప్రతాప్‌సింహా పేర్కొన్నారు. మైసూరులో మీడియాతో మాట్లాడుతూ తాము ప్రధాని మోదీ పేరు చెప్పుకునే గత ఎన్నికల్లో గెలిచామన్నారు. ఈసారి కూడా ఆయన పేరు ద్వారానే లోకసభలో అడుగు పెడతామని చెప్పారు. లోకసభ ఎన్నికలకు, రాష్ట్ర రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదన్నారు. 25 మంది ఎంపీలు మోదీ ఫొటో, పేరుతోనే గెలిచి వస్తామని ధీమా వ్యక్తం చేశారు.

కాలేజీకి నూతన భవనాలు: సీఎం

మైసూరు: నగరంలోని ప్రసిద్ధ మహారాణి కాలేజీ, హాస్టల్‌ను సీఎం సిద్ధరామయ్య సందర్శించారు. అక్కడ శిథిలావస్థలో ఉన్న కట్టడాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. సుమారు రూ. 150 కోట్ల ఖర్చుతో కాలేజీ, హాస్టల్ నిర్మాణాలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. 2000 మంది విద్యార్థుల కోసం నాలుగు హాస్టళ్లను నిర్మించనున్నారు.

వర్షాలు కురవాలని ప్రార్థించా

మైసూరు: రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసి మంచి పంటలు పండాలని చాముండేశ్వరి దేవిని ప్రార్థించినట్లు ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. మంగళవారం మైసూరు ప్యాలెస్ బలరామ ద్వారంలో నంది ధ్వజానికి పూజ చేసి జంబూ సవారీ ఊరేగింపును ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ మైసూరు దసరా కేవలం నాడ హబ్బ మాత్రమే కాకుండా ప్రజల పండుగ అని అన్నారు. రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈసారి దసరాను ఘనంగా జరపాలని ఆశించామని, అయితే కరువు పరిస్థితుల కారణంగా సంప్రదాయంగా నిర్వహించినట్లు చెప్పారు. అయినప్పటికీ దసరా పండుగ కోసం పది లక్షల మంది వచ్చారని తెలిపారు.

తేనెటీగలకు రైతు బలి

మైసూరు: తేనెటీగల దాడిలో రైతు మృతి చెందిన ఘటన కేఆర్ నగర తాలూకా మారగౌడనహళ్లిలో జరిగింది. గ్రామానికి చెందిన రైతు చంద్రేగౌడ (60) తన పొలంలో పని చేస్తుండగా ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. దీంతో రైతు గట్టిగా కేకలు వేశాడు. ఇరుగుపొరుగు పొలాల్లో ఉన్న రైతులు వచ్చి చంద్రేగౌడను కాపాడి సమీపంలోని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని కేఆర్ నగర పోలీసులు తెలిపారు.

హోసూరు వార్తలు..

డెంకణీకోటలో ఇరుకురోడ్లు



ఓ రహదారిలో వాహన రద్దీ

కెలమంగలం: తాలూకా కేంద్రం డెంకణీకోట పట్టణంలో సరైన రోడ్డు వసతులు లేక వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఇరుకైన రోడ్లలో వాహనాలను నడపలేకపోతున్నామని తెలిపారు. డెంకణీకోట పట్టణం మీదుగా డెంకణీకోట, అంచెట్టి, తళి తదితర ప్రాంతాల నుంచి గ్రామీణ ప్రాంతాల నుంచి రోజూ వేలాది మంది ప్రజలు వ్యాపార, ఉద్యోగ, విద్య, వైద్య సదుపాయాల కోసం హోసూరు, బెంగళూరు, క్రిష్ణగిరి తదితర ప్రాంతాలకు వెళ్తుంటారు. డెంకణీకోట బస్టాండు నుంచి హోసూరు, బెంగళూరు, క్రిష్ణగిరి, రాయకోట, ధర్మపురి, హొగేనకల్ తదితర ప్రాంతాలకు బస్సు వసతులున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు, పండుగ రోజుల్లో గ్రామీణ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు డెంకణీకోట పట్టణానికి చేరుకోవడంతో పట్టణంలోని ఇరుకై న రోడ్లతో వాహనాలు ఎటువైపూ కదలలేని స్థితికి చేరుకొని గంటల తరబడి ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు. అధికారులు పట్టణంలో రోడ్లను విస్తరించాలని ప్రజలు కోరారు.

అదృశ్యమైన కానిస్టేబుల్ మృతి

యశవంతపుర: అదృశ్యమైన దక్షిణకన్నడ జిల్లా కార్కళ టౌన్ పోలీసుస్టేషన్ కానిస్టేబుల్ శృతిశెట్టి(35)శవమై తేలాడు. కాపు జనార్ధన దేవస్థానం అంగడిమనెకి చెందిన శృతిశెట్టి ఈ నెల 19న విధులకు వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదు. దీంతో ఆ మరుసటి రోజు భార్య పడుబిద్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో సోమవారం కార్కళ లక్ష్మీదేవి కల్యాణ మంటపం వద్ద ఒక మృతదేహం కనిపించగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు వెళ్లి పరిశీలించగా మృతుడు శృతిశెట్టిగా నిర్ధారించారు.

ఆలయాల్లో దసరా పూజలు



గ్రామదేవతలను ఊరేగిస్తున్న దృశ్యం

కెలమంగలం: విజయదశమి సందర్భంగా మంగళవారం గ్రామదేవతల ఆలయాలు కళకళలాడాయి. తొమ్మిది రోజులు గ్రామదేవత ఆలయాల్లో అమ్మవారిని రోజూ వివిధ అలంకరణలతో అలంకరించి నిత్య పూజలు చేస్తూ వచ్చారు. కెలమంగలంలోని వెట్కాళియమ్మ ఆలయంలో అమ్మవారిని అలంకరించి పూజలు ఊరేగింపు నిర్వహించారు. బైరమంగలంలో యల్లమ్మదేవి తదితర గ్రామదేవతల ఉత్సవమూర్తులను ఊరేగించారు. జమ్మిచెట్లకు పూజలు చేశారు.

మార్కెట్లో దసరా పూజలు



హోసూరు: హోసూరు సమీపంలోని బత్తలపల్లి కాయగూరల మార్కెట్‌లో సోమవారం ఆయుధ పూజను విశేషంగా జరుపుకొన్నారు. సంఘ ఉపాధ్యక్షుడు రంఘనాథ్ అధ్యక్షతన మార్కెట్ యాజమానులు తమ దుకాణాల్లో పూజలు నిర్వహించారు. కార్మికులకు, రైతులకు, వ్యాపారులకు స్వీట్లను అందజేశారు. గత 20 ఏళ్లుగా విజయదశమికి పూజలు చేస్తున్నట్లు తెలిపారు.

నకిలీ మద్యం, సారా స్వాధీనం

తుమకూరు: నకిలీ మద్యం, సారా తరలిస్తున్న రంగనాథ్ అలియాస్ మారెన్న అనే నిందితుడిని అబ్కారీ శాఖ పోలీసులు అరెస్ట్ చేశారు. బైక్, నకిలీ మద్యం, 15 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నారు. మధుగిరి తాలూకా మిడిగేశీ హోబళి నీరకల్లు నుంచి ఏపీలోని చిన్నేనహళ్లి గ్రామానికి నకిలీ మద్యం, సారా తరలిస్తుండగా అబ్కారీ శాఖ అధికారులు పట్టుకున్నారు.

చెత్త తొలగింపు మహానగర పాలికెకు సవాలే



నిండిపోయి చెత్త డంపర్లు



కేఆర్ మార్కెట్ వద్ద పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న దృశ్యం

బనశంకరి: విజయ దశమి పండుగను తొమ్మిది రోజులపాటు ఘనంగా నిర్వహించిన నగరవాసులకు ఇప్పుడు చెత్త సమస్య ఎదురైంది. దసరా పండుగకు అమ్ముడుపోని అరటిపిలకలు, బూడిదగుమ్మడి కాయలు, పూలను వ్యాపారస్తులు ఫుట్‌పాత్‌లపై వదిలేసి వెళ్లారు. దీంతో ఎక్కడ చూసినా చెత్త రాశులు దర్శనం ఇస్తున్నాయి. కేఆర్.మార్కెట్, విక్టోరియా ఆసుపత్రి కంపౌండు వద్ద, మడివాళమార్కెట్, యశవంతపుర, గాంధీబజార్, మల్లేశ్వరం, మెట్రో మార్కెట్ ఫిల్లర్ల వద్ద అరటిపిలకలు, బూడిదగుమ్మడికాయలు, మామిడి ఆకులతో చెత్త నిండిపోయింది. చెత్తను పశువులు, కుక్కలు చెల్లాచెదరుచేయడంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. సాధారణ రోజుల్లో నగరంలో 4 వేల టన్నుల చెత్త ఉత్పత్తి కాగా పండుగ సమయంలో 20 నుంచి 30 శాతం అదనంగా చెత్త ఉత్పత్తిఅయింది. ఈ చెత్త తరలింపు బీబీఎంపీకి సవాల్‌గా మారింది. మార్కెట్లు, జననాస ప్రాంతాల్లో చెత్త తొలగింపునకు అవసరమైన సిబ్బంది వాహనాలు సమకూర్చుకునేందుకు ఆయా వలయ జాయింట్ కమిషనర్లకు బీబీఎంపీ కమిషనర్ అధికారమిచ్చారు. మూడురోజుల్లో చెత్త తొలగిస్తామని సీనియర్ పాలికె అధికారి తెలిపారు.

మార్మోగిన సాయినామం



పూర్ణాహుతి ఇస్తున్న వేదపండితులు

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలో విజయదశమి వేడుకలు ఘనంగా జరిగాయి. అశేష భక్తకోటితో సాయినామస్మరణ మార్మోగింది. విశ్వశాంతిని కాంక్షిస్తూ పూర్ణచంద్ర ఆడిటోరియం వేదికగా చేపట్టిన వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం మంగళవారం పూర్ణాహుతితో ముగిసింది. వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. వేదపండితులు శ్రీమన్నారాయణ దంపతులు వేదమంత్రోచ్చారణ నడుమ యజ్ఞద్రవ్యాలను సమర్పిస్తూ సంప్రదాయ రీతిలో పూర్ణాహుతి గావించారు. పుణ్యజలాన్ని భక్తకోటిపై సంప్రోక్షణ గావించారు. భక్తులు సత్యసాయిని కీర్తిస్తూ భక్తిగీతాలు ఆలపించారు.వేడుకల్లో సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, సభ్యుడు చక్రవర్తి, కలెక్టర్ అరుణ్ బాబు, ఎస్పీ మాధవరెడ్డి, మాజీ మంత్రి గీతారెడ్డి, పలువురు సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ ప్రతినిధులు, సత్యసాయి సంస్థల సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నిర్మాణ రంగానికి మరింత ఊతం

మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి



మంత్రి బుగ్గనకు స్వాగతం పలుకుతున్న క్రెడాయ్ ప్రతినిధులు

లబ్బీపేట (విజయవాడతూర్పు): నిర్మాణ రంగానికి రాష్ట్రంలో మరింత ఊతం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ బృందావన కాలనీలోని ఎ కన్వెన్షన్ సెంటర్‌లో క్రెడాయ్ విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ప్రోపర్టీ షో సోమవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిర్మాణ రంగం పుంజుకుందని, నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం ద్వారా లక్షలాది ఇళ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. అంతేకాకుండా రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్ సౌకర్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. క్రెడాయ్ విజయవాడ చాప్టర్ అధ్యక్ష, కార్యదర్శులు డి.రాంబాబు, వరదా శ్రీధర్, రాష్ట్ర అధ్యక్షుడు వైవీ రమణరావు, ప్రధాన కార్యదర్శి బాయన శ్రీనివాసరావు, ఎస్‌బీఐ డీజీఎం మనీష్‌కుమార్ పాల్గొన్నారు.

మిసెస్ ఏసియా వరల్డ్‌వైడ్‌గా విజయారెడ్డి



పులివెందుల రూరల్: మిసెస్ సింగపూర్–2023 పోటీల్లో ఏసియా వరల్డ్‌వైడ్ కేటగిరిలో వైఎస్సార్ జిల్లా మహిళ విజేతగా నిలిచారు. పులివెందుల మండలంలోని నల్లపురెడ్డి పల్లె గ్రామానికి చెందిన గోపాల్ రెడ్డి, రమాదేవి కుమార్తె విజయారెడ్డి సింగపూర్‌లో ఎంబీఏ చదివే సమయంలో విజయవాడకు చెందిన సుంకర ప్రదీప్‌ను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఓ కుమారుడు. ప్రస్తుతం విజయ, ప్రదీప్‌లిద్దరూ పదిహేనేళ్లుగా సింగపూర్‌లోనే ఉంటూ, అక్కడ సిటీ బ్యాంక్‌లో పనిచేస్తున్నారు. ఈక్రమంలో అక్టోబర్21న సింగపూర్‌లో లూమియర్ అంతర్జాతీయ సంస్థ నిర్వహించిన అందాల పోటీల్లో విజయారెడ్డి పాల్గొని, విజయం సాధించారు. మొదటి ప్రయత్నంలోనే విజేత కావడం చాలా ఆనందంగా ఉందని విజయ అన్నారు.

బీమాతో రైతులకు ధీమా కనిపించడంలేదా?

వాస్తవాలు తెలుసుకోకుండా రామోజీ విషపు రాతలు

- ఖరీఫ్–2023 సీజన్ కోసం అక్టోబర్ 31 నాటికి ఈక్రాప్ నమోదు
- సామాజిక తనిఖీ, గ్రామ సభల ద్వారా తుది జాబితా ప్రదర్శన
- ప్రతి రైతుకు సాగు చేసిన పంట వివరాలతో డిజిటల్ రశీదు
- భౌతిక రశీదులో నోటిఫై చేసిన పంటలకు ప్రత్యేక గుర్తింపు
- ఎన్‌సీఐ పోర్టల్‌లో పూర్తయిన నోటిఫికేషన్ డిజిటలైజేషన్ ప్రక్రియ
- రైతుల వారీ వివరాల పరిశీలన తర్వాతే పోర్టల్‌లో ఖరీఫ్–23 డేటా ప్రదర్శన
- ఖరీఫ్–2023, రబీ–2023–24 సీజన్‌ల కోసం నోటిఫికేషన్ విడుదల
- అన్ని పనులు సక్రమంగా సాగుతున్నా కూడా ఈనాడు బురద రాతలు



ఉచిత పంటల బీమా ఉన్నట్లా.. లేనట్లా?
ఖరీఫ్ ముగిసినా స్పష్టతేది?
ఏ పంటలకు.. ఎన్ని ఎకరాలకో రహస్యమే
ఎండుతున్న పంటలు.. కరువుపై రైతుల్లో ఆందోళన
బీమా లేకుంటే నిండా మునగడమే
(మిగతా 2లో)

సాక్షి, అమరావతి: నిత్యం అసత్యపు వార్తలతో ప్రజల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచాలనే లక్ష్యంగా పనిచేస్తున్న ఈనాడు రామోజీరావు.. పంటల బీమాపై విషపురాతలు రాశారు. రైతులపై పైసా భారం పడకుండా ఈక్రాప్ నమోదు ప్రామాణికంగా నోటిఫై చేసిన ప్రతీ పంటకు, సాగు చేసిన ప్రతీ ఎకరాకు యూనివర్సల్ బీమా కవరేజీను కల్పిస్తూ దేశానికే ఆంధ్రప్రదేశ్ ఆదర్శంగా నిలుస్తుంటే.. ఈనాడు పత్రిక మాత్రం బురద జల్లడమే పనిగాపెట్టుకుంది. ఒక సీజన్‌కు చెందిన బీమా పరిహారాన్ని వచ్చే ఏడాది అదే సీజన్ ప్రారంభానికి ముందే చెల్లిస్తూ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం ద్వారా అన్ని విధాలుగా రైతులకు అండగా నిలుస్తుంటే 'ఉచిత బీమా ఉన్నాట్టా? లేనట్టా?' అంటూ రైతులను తప్పుదోవపట్టించేలా విషపు రాతలు రాస్తోంది. ఎక్కువ మంది రైతులకు లబ్ధి చేకూర్చాలనే లక్ష్యంగా వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకంలో రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని సంస్కరణలు తీసుకొచ్చింది. నోటిఫై చేసిన పంటలు ఏ కేటగిరి కింద సాగైనా.. ఒకే రీతిలో బీమా రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టడమే కాకుండా పెరిగిన సాగు విస్తీర్ణాన్ని బట్టి కొత్త పంటలను బీమా పరిధిలోకి తీసుకొచ్చింది. ఈ సీజన్‌కు సంబంధించి జిల్లాల వారీగా కవరేజ్ కల్పించే కంపెనీలతో పాటు నోటిఫైడ్ పంటల వివరాలను పూర్తి మార్గదర్శకాలతో ఇటీవలే నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. దీనిపై ఈనాడు పలు ఆరోపణలు చేసింది.

ఆరోపణ: ఖరీఫ్ ముగిసినా స్పష్టతేది?

వాస్తవం: ఎటువంటి పక్షపాత వైఖరికి తావులేకుండా వ్యవసాయ, రెవెన్యూ ఉమ్మడి అజమాయిషీలో ఈ–పంట నమోదు చేస్తున్నారు. ఖరీఫ్–23లో ఈ–క్రాప్‌లో వ్యవసాయ, ఉద్యాన పంటలతో పాటు పట్టు, సామాజిక అటవీ సాగు పంటలను కలిపి 93 లక్షల ఎకరాలను నమోదు చేశారు. అయితే మార్గదర్శకాల మేరకు ఖరీఫ్, రబీ సీజన్ వారీగా నోటిఫై చేసిన పంటలకు మాత్రమే బీమా వర్తిస్తుందన్న విషయం రామోజీకి తెలియంది కాదు. ఖరీఫ్ 2023లో 15 పంటలను దిగుబడి ఆధారంగా, 6 పంటలను వాతావరణ ఆధారంగా, రబీ 2023–24లో 13 పంటలను దిగుబడి ఆధారంగా, 4 పంటలను వాతావరణ ఆధారంగా బీమా పరిధిలోకి తీసుకొచ్చి ఆమేరకు నోటిఫికేషన్ కూడా ఇవ్వడం జరిగింది.

ఆరోపణ: కేంద్ర బీమా పోర్టల్‌లో వివరాలేవీ?

వాస్తవం: ఇతర రాష్ట్రాల్లో నేషనల్ క్రాపు ఇన్సూరెన్సు పోర్టల్ విషయానికి వస్తే.. బ్యాంకు నుంచి రుణం మంజూరైన సమయంలో ఆ బ్యాంకుల ద్వారాను, రుణం పొందని రైతులు కామన్ సర్వీస్ సెంటర్ల ద్వారా గడువులోగానూ ప్రీమియం చెల్లించిన వారికే బీమా వర్తింప చేస్తారు. సాధారణంగా ఈ ప్రక్రియ ఖరీఫ్‌లో జూలై 31 నాటికి, రబీలో డిసెంబర్ 31 నాటికి పూర్తి చేస్తారు. అర్హత పొందిన లబ్ధిదారుల వివరాలను మాత్రమే పోర్టల్‌లో పొందుపరుస్తారు. గడువులోగా ప్రీమియం చెల్లించలేని రైతులు బీమా రక్షణ అవకాశాన్ని కోల్పోతారు. అయితే మన రాష్ట్రంలో మాత్రం ఈక్రాప్ డేటా ఆధారంగా క్రాప్ ఇన్సూరెన్సు పోర్టల్‌లో నేరుగా నమోదు చేసే వెసులుబాటు కల్పించారు. తద్వారా యూనివర్సల్ కవరేజీ సాధించిన ఏకైక రాష్ట్రంగా ఏపీ గుర్తింపు పొందింది.

ఆరోపణ: ఆది నుంచి జాప్యమే

వాస్తవం: కేంద్ర మార్గదర్శకాల మేరకు ఏటా అక్టోబర్ 31 నాటికి ఖరీఫ్ ఈక్రాప్ డేటా, మార్చి 31 నాటికి రబీ ఈక్రాప్ డేటా కేంద్రానికి పంపిస్తున్నారు. ఖరీఫ్ 23 సీజన్‌కు సంబంధించి ఈక్రాప్‌లో నమోదైన పంటలు, రైతుల వివరాలను కేంద్రంతో పాటు ఎంపిక చేసిన బీమా కంపెనీలకు అక్టోబర్ 31 నాటికి రాష్ట్ర ప్రభుత్వం పంపిస్తుంది. గడువు తేదీలను నోటిఫికేషన్‌లో కూడా తెలియజేశారు. నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్‌లో నోటిఫికేషన్ డిజిటలైజేషన్ ప్రక్రియ కూడా పూర్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ టెక్నికల్ బృందం ఈ క్రాప్‌లో నమోదైన రైతుల వారీ వివరాలను పరిశీలన పూర్తి చేసిన తర్వాతనే పీఎంఎఫ్‌బీవై పోర్టల్‌లో ఖరీఫ్ డేటా ప్రదర్శిస్తారు. ఇది కేవలం కేంద్రప్రభుత్వ పరిధిలోని సాంకేతికమైన అంశమే తప్ప ఇందులో రాష్ట్ర ప్రభుత్వ జాప్యం కానీ, తప్పిదం కానీ ఏమాత్రం లేదన్నది సుస్పష్టం.

ఆరోపణ: బీమా ఉందో లేదో తెలిసేదెలా?

వాస్తవం: సామాజిక తనిఖీ, గ్రామ సభల అనంతరం ఈక్రాప్ జాబితాలను ఆర్బీకేల్లో ప్రదర్శిస్తున్నారు. తొలుత డిజిటల్ రశీదులో రైతుకు తాను సాగు చేసిన పంట వివరాలను ఎస్ఎంఎస్ రూపంలో పంపిస్తున్నారు. ఈ క్రాప్‌తో పాటు ఈ కేవైసీ నమోదు పూర్తికాగానే భౌతిక రశీదు అందిస్తున్నారు. భౌతిక రశీదులో ఉచిత పంటల బీమా పథకం వర్తించే నోటిఫై చేసిన పంటలకు (స్టార్) గుర్తుతో ప్రత్యేకంగా తెలియజేస్తూ సంబంధిత సాగుదారుడి సంతకంతో అందజేస్తున్నారు. ఆ మేరకు జారీ చేసిన భౌతిక రశీదులో 'డా.వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం క్రింద నోటిఫై చేసిన మీ పంటకు మీరు చెల్లించాల్సిన ప్రీమియం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించి తద్వారా పంట బీమా చేయబడినది' అని స్పష్టంగా పేర్కొంటున్నారు. అలాంటప్పుడు బీమా ఉందో లేదో రైతులకు తెలియకపోవడమేమిటో ఈనాడుకే తెలియాలి.

ఆరోపణ: బీమా లేకుంటే నిండా మునగడమే

వాస్తవం: టీడీపీ ఐదేళ్ల పాలనలో 30.85 లక్షల మందికి రూ. 3,411.20 కోట్ల పరిహారం ఇస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ నాలుగున్నరేళ్లలో 54.48 లక్షల మంది రైతులకు రూ. 7,802.05 కోట్ల పరిహారాన్ని జమ చేసింది. పైగా గతంలో ఉండే లోటుపాట్లను సరి చేస్తూ ఉచిత పంటల బీమా పథకం ద్వారా రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటుంటే లేనిపోని అపోహలు సృష్టించేలా రైతులను గందరగోళ పరిచేలా విషపు రాతలు రాయడం ఈనాడుకే చెల్లింది.

కేంద్ర ఆర్థికమంత్రితో ఏపీ చాంబర్స్ ప్రతినిధుల భేటీ

సమస్యలపై వినతిపత్రం సమర్పణ



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఏపీ చాంబర్స్ ప్రతినిధులు

లబ్బీపేట (విజయవాడతూర్పు): కేంద్ర ప్రభుత్వ పరంగా నిర్వహించాల్సిన పలు అంశాల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై ఆంధ్రప్రదేశ్ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో చర్చించారు. ఎన్టీఆర్ జిల్లా, విజయవాడలోని ఓ హోటల్‌లో సోమవారం సమావేశమైన వారు పలు అంశాలపై చర్చించారు. మూడు పారిశ్రామిక కారిడార్లలో ప్రతిపాదించిన ఆరు ఇండస్ట్రియల్ నోడ్‌లను త్వరితగతిన పూర్తి చేయాలని, రాష్ట్రం కోసం ప్రతిపాదించిన మూడు మల్టీ మోడల్ ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్కుల వేగవంతమైన అభివృద్ధి, పోర్ట్ లీడ్ ఎకానమీ అభివృద్ధికి తోడ్పాటు వంటి అంశాలపై చర్చించారు. ఎంఎస్ఎంఈలకు క్రెడిట్‌రేటింగ్, సిబిల్ స్కోర్‌లను సులభతరం చేయడం, ఆలస్యమైన చెల్లింపుల సమస్య, ఎంఎస్ఎంఈ నుంచి తప్పనిసరి సేకరణ వంటి అంశాలను పరిష్కరించాలని సూచించారు. విజయవాడ నుంచి దేశీయ, అంతర్జాతీయ విమాన కనెక్టివిటీని పునరుద్ధరించి, సర్వీసులు పెంచాలని, ఏపీలోని అన్ని విమానాశ్రయాల్లో కోల్డ్‌స్టోరేజీ సౌకర్యాలతో కార్గో సౌకర్యాలను అందించాలని ఆమెను కోరారు. విజయవాడ నుంచి ఢిల్లీ, ముంబై, కోల్‌కతా ప్రాంతాలకు ప్రతిపాదిత వందేభారత్ స్లీపర్ రైళ్లను ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా అనేక విషయాలు చర్చించారు. కేంద్రమంత్రిని కలిసిన వారిలో ఏపీ చాంబర్స్ ప్రెసిడెంట్ పొట్లూరి భాస్కరరావు, జనరల్ సెక్రటరీ బి రాజశేఖర్, సీఐఐ ఏపీ చాప్టర్ అధ్యక్షుడు లక్ష్మీప్రసాద్, ఆల్ ఇండియా మిర్చి ఎగుమతిదారుల సంఘం అధ్యక్షుడు వెలగపూడి సాంబశివరావు, ఏపీ ఎంఎస్ఎంఈ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు బాయన వెంకట్రావు, క్రెడాయ్ ఏపీ చాప్టర్ అధ్యక్షుడు రమణరావు, ఏపీ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్‌వీ స్వామి, కోవే ఏపీ చాప్టర్ అధ్యక్షురాలు రాధిక ఉన్నారు.

15 గంటలుగా మండుతూనే...

ఒంగోలులో అగ్నిప్రమాదం.. రూ.2 కోట్లకు పైగా నష్టం

ఒంగోలు సబర్బన్: ప్రకాశం జిల్లా ఒంగోలులోని గాంధీ రోడ్డు సమీపంలోని పప్పు బజార్‌లో ఉన్న కాయర్ రోప్ మర్చంట్స్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. మంగళవారం తెల్లవారుజామున సునీల్ కాయర్ రోప్ మర్చంట్స్ గోడౌన్‌లో మంటలు వ్యాపించాయి. ఒంగోలు ఫైర్ ఇంజన్లతో పాటు టంగుటూరు, కొండపి, బాపట్ల జిల్లా అద్దంకి నుంచి 8 ఫైర్ ఇంజన్లు తీసుకువచ్చి మంటలను అదుపు చేస్తున్నారు. 15 గంటలకు పైగా మంటలు దట్టంగా వ్యాపిస్తూనే ఉన్నాయి. భారీగా స్టాక్ ఉండటంతో మంటలు అదుపులోకి రావడం లేదు. ఈ ప్రమాదంలో రూ.2 కోట్లకు పైగా నష్టం వాటిలినట్లు సమాచారం.



గోడౌన్‌లో ఎగసిపడుతున్న మంటలు

విభిన్న రంగాల్లో పరిశోధనలకు పూనుకోవాలి

- విద్యార్థులకు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ సూచన
- ఘనంగా విజ్ఞాన్ వర్సిటీ 11వ స్నాతకోత్సవం

చేబ్రోలు: ప్రస్తుతం ప్రపంచంలో ఎక్కువ అవకాశాలు కలిగిన దేశమేదైనా ఉందంటే అది భారతదేశమేనని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ వర్సిటీలో సోమవారం 11వ స్నాతకోత్సవం జరిగింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ ఫౌండర్ డాక్టర్ పావులూరి సుబ్బారావు, విమ్టా ల్యాబ్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ ఎస్‌పీ వాసిరెడ్డి, ఇండియన్ చెస్ ప్లేయర్ కోనేరు హంపిలకు గౌరవ డాక్టరేట్‌లను, 1,820 మందికి డిగ్రీలు, మరికొంతమందికి గోల్డ్ మెడల్స్, అవార్డులను అందజేశారు. నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. సాఫ్ట్‌వేర్, ఐటీ కంపెనీల్లో ఉద్యోగాలు మాత్రమే కాకుండా కొత్త మెటీరియల్స్, రేర్ మినరల్స్, మెటీరియల్ సైన్స్, డ్రోన్ టెక్నాలజీ వంటి రంగాల్లో పరిశోధనలకు పూనుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఇప్పటికే ఇస్రో చంద్రయాన్–3 ద్వారా దక్షిణ ధృవం మీదకు వెళ్లగలిగామని, 2040 నాటికి మానవ రహిత ప్రయోగానికి పూనుకోవాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. 2035 లోపు 'భారత స్పేస్ స్టేషన్'ను పెట్టడానికి ప్రయత్నాలు మొదలుపెట్టాలని ఇస్రోకు ప్రధాని మోదీ సూచించారని తెలిపారు. చంద్రయాన్–3 విజయాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలనే ఉద్దేశంతో 10 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు చంద్రయాన్ నమూనాను బహుమతిగా అందజేశారు. రాష్ట్ర మంత్రి బుగ్గన మాట్లాడుతూ విద్యార్థుల మేధోపరమైన, విద్యాపరమైన అన్వేషణను వారి వృత్తిపరమైన విజయాలను కుటుంబం, స్నేహితులు, శ్రేయోభిలాషులతో జరుపుకోవడానికి ఇది చిరస్మరణీయ వేదిక అని అన్నారు. విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, వీసీ నాగభూషణ్ పాల్గొన్నారు.

జాతీయం/అంతర్జాతీయం

పంచతంత్రం

దిగ్విజయ్ సింగ్ సంస్కారం ఇదేనా?

మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్‌సింగ్ ఆగ్రహం

భోపాల్: దసరా నవరాత్రుల సంప్రదాయంలో భాగంగా కన్యాపూజ చేస్తే అదంతా నాటకం అంటూ విమర్శించడం ఏమిటని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్‌పై మధ్యప్రదేశ్ సీఎం, బీజేపీ నాయకుడు శివరాజ్‌సింగ్ చౌహాన్ మండిపడ్డారు. నవరాత్రుల్లో కన్యాపూజ చేసే సంప్రదాయం దేశమంతటా ఉందని గుర్తుచేశారు. ఆడబిడ్డలను దేవతలుగా భావిస్తూ పూజించడం మన సనాతన సంస్కారమని చెప్పారు. తాను సోమవారం తన ఇంట్లో కన్యాపూజ చేస్తే దిగ్విజయ్ సింగ్ తప్పుపట్టడం విచారకరమని అన్నారు. ఆయన సంస్కారం ఇదేనా? అని మంగళవారం నిలదీశారు. కన్యాపూజ చేయడం నాటకం అని దిగ్విజయ్ వ్యాఖ్యానించడం తనను బాధించిందని చౌహాన్ అన్నారు.

మళ్లీ అధికారంలోకి వస్తే రుణమాఫీ: భూపేష్ భఘేల్

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ నేత భూపేష్ భఘేల్ కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో తాము మళ్లీ అధికారంలోకి వస్తే రైతుల రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించారు. ఆయన సోమవారం ఎన్నికల ప్రచార సభలో ప్రసంగించారు. 2018 ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని, 18.82 లక్షల మంది రైతులకు చెందిన రూ.2,270 కోట్ల రుణాలు మాఫీ చేశామని వెల్లడించారు. ఈసారి ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌ను గెలిపిస్తే రైతులను రుణ విముక్తులను చేస్తామని ఉద్ఘాటించారు. అలాగే ఎకరాకు 20 క్వింటాళ్ల చొప్పున రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పారు.

ఛత్తీస్ మొదటి విడత ఎన్నికల బరిలో 223 మంది

రాయ్‌పూర్: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ వచ్చే నెల 7న మొదటి విడతలో 20 సీట్లకు ఎన్నిక జరగనున్న విషయం తెలిసిందే. మావోయిస్టు ప్రభావిత బస్తర్ డివిజన్‌లోని ఏడు జిల్లాలతోపాటు మరో నాలుగు జిల్లాల్లో పోలింగ్ జరగనుంది. 20 స్థానాలకు గాను 294 మంది నామినేషన్లు వేశారు. పరిశీలన అనంతరం 253 మంది మిగిలారు. వీరిలో 30 మంది సోమవారం తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. దీంతో, 20 సీట్లకు గాను 223 మంది ఎన్నికల బరిలో నిలిచారని అధికారి ఒకరు చెప్పారు.

ఇద్దరికీ ఇబ్బందులే!

రాజస్తాన్‌లో ఆసక్తికరంగా ఎన్నికల పోరు | సమస్యలతో కాంగ్రెస్, బీజేపీ సతమతం

- పథకాలనే నమ్ముకున్న గెహ్లోత్ సర్కారు
- ప్రభుత్వ వ్యతిరేకతపై బీజేపీ ఆశలు
- ఎవరికీ అంతుచిక్కని ఓటరు నాడి

200 స్థానాలున్న రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల పోరు తారస్థాయికి చేరింది. బీజేపీ, పాలక కాంగ్రెస్ హోరాహోరీగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. ప్రభుత్వ వ్యతిరేకత, మోదీ మేనియా తమను ఈసారి కచ్చితంగా గట్టెక్కిస్తాయని బీజేపీ ఆశపడుతోంది. ఇక అశోక్ గెహ్లోత్ ప్రభుత్వం సంక్షేమ పథకాలపైనే నమ్మకం పెట్టుకుంది. మరోవైపు రెండు పార్టీలూ అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతున్నాయి. పైగా అవతలి పార్టీలోని తలనొప్పులు తమకే మేలు చేస్తాయన్న భావనలో ఉన్నాయి...!

ఐదేళ్లకోసారి అధికార పార్టీని మార్చడం రాజస్తాన్ ఓటర్లకు ఆనవాయితీ. 1993 మధ్యంతర ఎన్నికల నాటినుంచి ఏ పార్టీ కూడా అధికారాన్ని నిలబెట్టుకున్న చరిత్ర లేదు. అలా చూస్తే ఈసారి బీజేపీకి అవకాశం దక్కాలి. దీనికి తోడు కాంగ్రెస్‌లో సీఎం గెహ్లోత్, ఆ పార్టీ అసమ్మతి నేత సచిన్ పైలట్ మధ్య విభేదాలను వీలైనంతగా ప్రచారం చేయడం ద్వారా మరింత లబ్ధి పొందాలని కమలనాథులు ప్రయత్నిస్తున్నారు. అంతేగాక కొన్నేళ్లుగా ఎన్నో శాంతిభద్రతల సమస్యలను రాజస్తాన్ చవిచూడటాన్ని ప్రచారంలో పదేపదే ప్రస్తావిస్తున్నారు. ఇక అవినీతి విచ్చలవిడిగా మారిపోయిందంటూ విమర్శలు గుప్పిస్తున్నారు.

అయినా గెహ్లోత్‌కే మొగ్గు...!

అవినీతి ఆరోపణలు, శాంతిభద్రతల సమస్యలు, అంతర్గత కుమ్ములాటల వంటివి ఎన్నున్నా గెహ్లోత్ సర్కారుపై ప్రజల్లో వ్యతిరేకత పెద్దగా కనిపించడం లేదని పరిశీలకులు అభిప్రాయపడుతుండటం విశేషం! ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని గెహ్లోత్ పలు ప్రజాకర్షక పథకాలను వరుసబెట్టి ప్రకటించారు. ఇవన్నీ జనాన్ని బాగా ఆకట్టుకుంటున్నట్టు చెబుతున్నారు. 2014లో రాష్ట్రంలో కనిపించిన మోదీ వేవ్ ఇప్పుడు దాదాపుగా లేనట్టేనన్న అభిప్రాయం వినిపిస్తోంది. నిత్యావసరాల ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటివాటి వల్ల మోదీపై రాష్ట్ర ప్రజలకు భ్రమలు తొలగాయంటూ కాంగ్రెస్ జోరుగా ప్రచారం చేస్తోంది. ముఖ్యంగా కేంద్రం పట్ల మహిళల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, ఇది తమకు బాగా అనుకూలిస్తుందని ఆ పార్టీ నేతలంటున్నారు.

గుజ్జర్లు ఏం చేస్తారో?

- 24 అసెంబ్లీ స్థానాల్లో నిర్ణాయకంగా ఉన్న గుజ్జర్లు, మీనా సామాజిక వర్గం ఓటర్లు ఈసారి కాంగ్రెస్‌ను ఆదరించడం కష్టమేనంటున్నారు.
- గుజ్జర్ సామాజిక వర్గానికి చెందిన సచిన్ పైలట్ సీఎం అవుతారన్న భావనతో గత అసెంబ్లీ ఎన్నికల్లో వారు కాంగ్రెస్‌కు జైకొట్టారు. ఈసారి వారు బీజేపీకేసి మొగ్గితే కాంగ్రెస్‌కు కష్టమేనని చెబుతున్నారు.
- ఇక ఓబీసీ సామాజికవర్గంలో ప్రధానమైన జాట్‌లు గెహ్లోత్‌తో ఎప్పుడూ సంతృప్తిగా లేరు పైగా జాట్ ప్రాబల్య స్థానాల్లో రాష్ట్రీయ లోక్ తాంత్రిక్ పార్టీ పోటీకి దిగుతుండటం కాంగ్రెస్ అవకాశాలను దెబ్బ తీసేలా కనిపిస్తోంది.
- భారతీయ ఆదివాసీ పార్టీ 2018లో రెండు స్థానాలే గెలిచినా పలు గిరిజన ప్రాంతాల్లో గణనీయంగా ఓట్లు సాధించింది. బీఎస్పీ సైతం కాంగ్రెస్ ఓటు బ్యాంకు నుంచి 5 శాతం ఓట్లు కొల్లగొట్టినట్టు గత ఎన్నికల ఫలితాల విశ్లేషణలో తేలింది. ఈసారి ఈ ట్రెండ్ కొనసాగితే కాంగ్రెస్‌కు మరింత నష్టమే.



అధికార ఎమ్మెల్యేల్లో అసంతృప్తి

కానీ కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో నెలకొన్న తీవ్ర అసంతృప్తి ఆ పార్టీకి బాగా చేటుచేయవచ్చన్న అభిప్రాయం అంతర్గతంగా వినిపిస్తోంది. పైగా వారిలో చాలామందిపై ప్రజలు అసంతృప్తితో ఉన్నట్టు వస్తున్న వార్తలు నాయకత్వానికి సమస్యగా మారాయి. ఇవన్నీ అంతిమంగా పుట్టి ముంచితే ఎలాగన్న ఆందోళన కాంగ్రెస్ అధిష్టానంలో నెలకొంది. అందుకే బీజేపీ బాటలోనే ఆ పార్టీ ఈసారి గెహ్లోత్‌ను సీఎం అభ్యర్థిగా ఎక్కడా పెద్దగా ప్రచారం చేయడం లేదు. అయితే ఈ ఎత్తుగడ అంతిమంగా బెడిసికొట్టి వారికే చేటు చేసే ప్రమాదం లేకపోలేదంటూ వస్తున్న వార్తలు పార్టీ పెద్దలను చికాకు పరుస్తున్నాయి.

కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు

100 యూనిట్లదాకా ఉచిత కరెంటు	రూ.500కే ఎల్పీజీ వంటగ్యాస్ సిలిండర్
వృద్ధాప్య పింఛన్ల మొత్తం పెంపు	ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం

బీజేపీకీ ఇంటి పోరు

బీజేపీ ఇంటి పోరుతో సతమతమవుతోంది. ముఖ్యంగా మాజీ సీఎం వసుంధర రాజే వర్గం స్థానిక బీజేపీ ముఖ్యులకు సహాయ నిరాకరణ చేస్తూ చిక్కులు సృష్టిస్తోంది. ఈ గొడవలు ముదిరితే మొదటికే మోసమని గ్రహించిన అధిష్టానం ఈసారి సీఎం అభ్యర్థిగా ఎవరినీ ప్రకటించకుండా జాగ్రత్త పడింది. రాజే సూచించిన వారిలో పలువురికి టికెట్లు నిరాకరించింది. కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహించే ప్రయత్నాల్లో పడింది.

- హిందూత్వ కార్డుతో పాటు మోదీ చరిష్మాపైనే బీజేపీ ప్రధానంగా నమ్మకం పెట్టుకుంది.
- కానీ వసుంధర రాజే మాదిరిగా రాష్ట్రమంతటా జనాకర్షణ ఉన్న మరో నాయకుడంటూ ఎవరూ లేకపోవడం బీజేపీకి పెద్ద మైనస్ పాయింట్‌గా మారింది.

\- సాక్షి, నేషనల్ డెస్క్

కాంట్రాక్టర్లకు బకాయిలు ఎఫ్ఆర్‌బీఎంలో కలపాలి

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు పురందేశ్వరి వినతి
- రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక స్థితిపై ఫోరెన్సిక్ ఆడిట్ జరిపించాలని డిమాండ్
- రాష్ట్ర అప్పులపై కేంద్రం తప్పుడు లెక్కలు చెబుతోందని విమర్శ

సాక్షి, అమరావతి: ప్రభుత్వ గ్యారెంటీలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బకాయిలను కూడా ఎఫ్ఆర్‌బీఎంలో కలపాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన సీతారామన్‌కు పురందేశ్వరి ఈ మేరకు ఒక వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంచనా కోసం ఫోరెన్సిక్ ఆడిట్ జరిపించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక అవకతవకలు, కార్పొరేషన్ల రుణాలు, ఆస్తులు తనఖాపెట్టి తెచ్చిన అప్పులు, ఇతర సావరీన్ గ్యారెంటీలను పరిగణనలోకి తీసుకుంటూ ఫోరెన్సిక్ ఆడిట్ జరిపించాలని కోరారు. అన్ని రకాల సావరీన్ గ్యారెంటీలను, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను ఎఫ్ఆర్‌బీఎం పరిధిలో చేర్చాలని కోరారు. రాష్ట్ర ఆర్థిక స్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలి అని కూడా కోరారు. రాష్ట్ర ఎంపీలు అడిగిన ప్రశ్నకు పార్లమెంట్‌లో కేంద్రం కేవలం ఆర్బీఐకు రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన రూ.4.42 లక్షల కోట్ల అప్పులను మాత్రమే చెప్పిందని లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వ కార్పొరేషన్లు, ఇతర అప్పులను చెప్పలేదన్నారు. పార్లమెంట్‌లో ఇచ్చిన ఈ సమాధానాన్ని అడ్డుపెట్టుకొని బీజేపీ రాష్ట్ర శాఖ ప్రతిష్ట దెబ్బతినేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసిందన్నారు.

టీడీపీ కోసమే పనిచేస్తున్న పురందేశ్వరి.. ఇదే అడిగితే బీజేపీ ప్రతిష్ట దెబ్బతీసినట్టా!

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దేశంలోనే మరెక్కడా లేని విధంగా నాలుగున్నరేళ్లుగా రాష్ట్రంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోంది. కోవిడ్ సమయంలోనూ వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రజలకు ఎక్కడా ఏ ఇబ్బందీ రాకుండా చేపట్టిన చర్యలు దేశం దృష్టిని ఆకర్షించాయి. ప్రపంచంలో అనేక దేశాలు, పలు రాష్ట్రాలు కోవిడ్‌తో కుదేలైనా, రాష్ట్రంలో ప్రజలకు సంక్షేమ పథకాలు ఆగలేదు. వైఎస్ జగన్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని, అభివృద్ధిని అడ్డుకోవడానికి తెలుగుదేశం పార్టీ, దానికి వత్తాసు పలికే పత్రికలు అనేక విధాలుగా ప్రయత్నిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ అప్పులంటూ రకరకాల తప్పుడు ప్రచారాలు సాగిస్తున్నాయి. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి కూడా టీడీపీ పంచన చేరి, అదే తప్పుడు ప్రచారం చేస్తున్నారు. మూడు నెలల క్రితం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత.. సొంత పార్టీ ప్రయోజనాలకన్నా టీడీపీ, చంద్రబాబు ప్రయోజనాలకే పెద్ద పీట వేసేలా కార్యక్రమాలు చేపడుతున్నారని ఆ పార్టీ నేతలే విమర్శిస్తున్నారు. టీడీపీ అధినేత చంద్రబాబును స్కిల్ స్కామ్‌లో సీఐడీ అన్ని ఆధారాలతో అరెస్టు చేస్తే, టీడీపీ నేతలకన్నా ముందే పురందేశ్వరి ఆ అరెస్టును ఖండించారు. ప్రధాని నరేంద్రమోదీనే స్వయంగా చంద్రబాబు అవినీతిని ఎండగట్టినా, అదే చంద్రబాబుకు మద్దతుగా పురందేశ్వరి మాట్లాడారు. టీడీపీ నేత లోకేశ్ అనేక ప్రయత్నాలు చేసిన మీదట కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఇటీవల అపాయింట్‌మెంట్ ఇచ్చారు. తీరా అమిత్‌షాను కలిసి వచ్చిన తర్వాత అమిత్‌షా పిలిస్తేనే తాను వెళ్లి కలిశానని బీజేపీ అగ్రనాయకత్వ ప్రతిష్ట దెబ్బతినేలా లోకేశ్ విలేకరులకు చెప్పారు. దీనిని పురందేశ్వరి ఖండించలేదు. పైగా ఎవరు ఎవరిని కలిశారన్నది ప్రధానమే కాదంటూ వ్యాఖ్యానించారు. చంద్రబాబు అరెస్టుకు ముందు కూడా ఎన్టీఆర్ నాణెం విడుదల కార్యక్రమాన్ని ఆసరా చేసుకొని చంద్రబాబును, బీజేపీ పెద్దలను దగ్గర చేయడానికి ఆమె ప్రయత్నించారు. ఇలా అడుగడుగునా టీడీపీకి అనుకూలంగా పనిచేస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలి తీరును వైఎస్సార్‌సీపీ నేతలు తప్పుపడుతున్నారు. పురందేశ్వరి టీడీపీ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారా అంటూ ప్రశ్నిస్తున్నారు. అయితే, పురందేశ్వరి వీటినే బీజేపీ రాష్ట్ర శాఖ ప్రతిష్ట దెబ్బతినేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేస్తోందని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. పురందేశ్వరి తీరు కచ్చితంగా తప్పేనని, ఆమె పార్టీ కోసం కాకుండా చంద్రబాబు కోసం పనిచేస్తున్నారనడానికి అనేక ఉదంతాలు ఉన్నాయని ఆ పార్టీ నేతలే చెబుతున్నారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
బుధవారం ॥ 25-10-2023

కలల సౌధాన్ని డిజైన్ చేస్తాను!

- షబ్నమ్ గుప్త



షబ్నమ్ గుప్త

'ప్రతి ఇంటికీ ఒక వ్యక్తిత్వం ఉంటుంది. ఇంటి యజమాని ప్రాధాన్యతలకు అనుగుణంగా ఆ ఇంటి డిజైనింగ్ ఉండాలి. వారి కలల సౌధాన్ని కళ్ల ముందు నిలపడానికి నేనెప్పుడూ సిద్ధంగా ఉంటాను' అని తన గురించి, తన ప్రాజెక్ట్స్ గురించి వివరించారు ఇటీవల ముంబయ్ నుంచి హైదరాబాద్ వచ్చిన ప్రొఫెషనల్ ఇంటీరియర్ డిజైనర్ షబ్నమ్ గుప్త. 48 ఏళ్ల షబ్నమ్ గుప్త 16 ఏళ్ల వయసు నుంచే ఈ రంగంలోకి వచ్చానని వివరించింది. ఆమె డిజైన్స్ సెలబ్రిటీల ఇళ్లకు మాత్రమే పరిమితం కాలేదు. అపార్ట్‌మెంట్లు, ఫామ్‌హౌజ్‌లు, హాస్పిటల్స్ నుంచి మట్టితో కట్టిన చిన్న రూమ్‌లను కూడా తన విలక్షణమైన శైలితో ఆవిష్కరిస్తుంటారు. తనే ఇన్నేళ్ల ప్రయాణం గురించి షబ్నమ్ వివరిస్తూ..

''నా జీవితంలో అత్యంత ప్రభావాన్ని కలిగించే వ్యక్తులు ఎవరైనా ఉన్నారంటే అది మా అమ్మానాన్నలు, మా వారు. వాళ్లతో చేసే చర్చలు నాలో ఇంకా స్థిరత్వానికీ, ఎదుగుదలకూ తోడ్పడుతుంటాయి. ఎందుకంటే వాళ్లే నా వర్క్‌లో మొదటి అతిపెద్ద విమర్శకులు. దేనినీ త్వరగా మెచ్చుకోరు. వాళ్లను మెప్పించడం అంటే నేను సూపర్ సక్సెస్ అయినట్టు అనుకుంటాను. అంతగా నా వర్క్‌లో ఇన్‌వాల్వ్ అవుతాను. మొదటిసారి మా నాన్న ఇల్లు కట్టించినప్పుడు నేను చాలా ఆసక్తి కనబరిచాను. చాలా మార్పులు, చేర్పులు చేశాను. నాన్నగారు కూడా నా సూచనలను చాలా బాగా తీసుకున్నారు. అక్కడి నుంచి ఇంటీరియర్, ఆర్కిటెక్చర్ మీద ఇష్టం ఏర్పడింది. దీంతో ఇంటీరియర్ డిజైనింగ్‌లో డిప్లొమా పూర్తి చేశాను. ముంబయ్ రహేజా స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ నుంచి కోర్స్ పూర్తి చేసుకున్నాక సొంతంగా ప్రాక్టీస్ మొదలు పెట్టాను. దీనికి ముందు ప్రముఖ ఆర్కిటెక్ట్ తుషార్ దేశాయ్‌తో కలిసి పనిచేయడం ద్వారా డిజైనింగ్‌లో చాలా నైపుణ్యాలను నేర్చుకున్నాను. ఆ తర్వాత ఫిల్మ్ ప్రొడక్షన్ హౌజ్‌లో ఒక చిన్న పనితో నా లైఫ్ స్టార్ట్ అయ్యింది. అక్కడ నుంచి నా సొంత లేబుల్ పెరుగుతూ వచ్చింది. నా ఖాతాలో ఆదిత్యా చోప్రా, రాణీ ముఖర్జీ, పరిణీతి చోప్రా.. వంటి చాలా మంది బాలీవుడ్ తారల ఇళ్లు, మీడియా హౌజ్‌లు, హాస్పిటల్స్ డిజైన్ చేసినవి ఉన్నాయి.

టీమ్ వర్క్..

డిజైనింగ్‌లో ఎప్పుడూ కొత్త కొత్త ఆవిష్కరణలకు స్పేస్ ఉంటుంది. ఇందులో ప్రకృతి, మన సంప్రదాయం, కళలు అన్నింటినుంచి ప్రేరణ పొందవచ్చు. ఈ డిజైనింగ్‌లో ప్రకృతితో మనకు ఒక అనుబంధం ఏర్పడిపోతుంది. ఏ ఒక్కరి జీవిత ప్రయాణం మరొకరితో పోల్చలేం. చాలామంది విజయాలకు వేర్వేరు అర్థాలు ఉంటాయి. మనం చేసే పనిలో సంతృప్తి పొందితే చాలు. మిగతా ట్యాగ్‌లు ఏవీ అక్కర్లేదు. వాటిని నేను సీరియస్‌గా తీసుకోను కూడా. ఇప్పటివరకు నా ప్రయాణం ప్రశాంతతను నేర్పింది. చాలా మందితో కలిసి టీమ్ వర్క్ చేయాల్సి ఉంటుంది. దీనివల్ల మానవ సంబంధాలను తెలుసుకునే వీలుంటుంది. మా టీమ్‌తో పని చేసే సమయంలో చాలా జోవియల్‌గా ఉంటాను. ఎలా అంటే ఒక మానసిక వైద్యుడిలా. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ ఉండటంతో పనిప్రదేశంలో ఉల్లాసంగా ఉంటాం. పట్టణ, నగర వాసాల నుంచి, గ్రామీణ ఇండ్ల వరకు డిజైన్ చేసినవన్నీ నా జాబితాలో ఉన్నాయి. ఈ రంగంలో మన చేత వర్క్ చేయించుకునేవారితో నమ్మకమైన వాతావరణాన్ని సృష్టించుకోవడం ముఖ్యం. అలాగే, వ్యాపారులతో మంచి సంబంధాలు కలిగి ఉండాలి. ఇదే ఇన్నేళ్ల నా ప్రయాణంలో సాధించిన విజయం అనుకుంటాను.

ప్రతిదీ సాధనే..

ఆర్కిటెక్చర్‌లో భాగంగా దేశమంతా తిరిగాను. ప్రముఖ ఆర్కిటెక్చురల్ ప్రాధాన్యమున్న స్థలాలన్నీ సందర్శించాను. అవగాహన చేసుకున్నాను. విదేశాల్లోని కట్టడాలు, ఇంటీరియర్ వర్క్ చూస్తూ ప్రయాణించడంతో ప్రతిదానినీ అర్థం చేసుకుంటూ, ఇంకాస్త మెరుగైన పనితనాన్ని నా వర్క్‌లో చూపించడం ఎప్పటికప్పుడూ జరుగుతూనే ఉంటుంది. ఏ ఒక్క రోజు ఇంకో రోజుతో పోల్చలేం. చేయాలనుకున్న పనుల జాబితాను టిక్ చేసుకుంటూ వెళ్లడమే. మొదట్లో గందరగోళంగా ఉండేది. తర్వాత ఏ రోజు పనులు ఆ రోజు చేయడం ఒక అలవాటుగా మారిపోయింది. నా జీవనశైలిలో నా మైండ్ స్పేస్‌ను అర్థం చేసుకోవడం చాలా సవాల్‌గా ఉండేది. జీవితంలో ఏదైనా రూపొందించాలనుకున్నప్పుడు అదొక ప్రాక్టీస్‌గా ఉండాలి.

క్లయింట్స్ ఇళ్లను డిజైన్ చేయడంలో నా స్కిల్‌ని మాత్రమే చూపించాలి. ఇదీ ఒక బాధ్యతాయుతమైన ఉద్యోగమే. ఇంటీరియర్ డిజైనర్‌గా, ఆర్కిటెక్ట్‌గా ఎక్కువ సమయం సిమెంట్, దుమ్ము కొట్టుకుపోయి పనిలో గడిచిపోతుంటుంది. అయినా నాకంటూ కొంత స్పేస్ ఉంచుకుంటాను. ప్రయాణాలు నాకు ఎప్పుడూ ఇష్టం. ఇది ఎల్లప్పుడూ నన్ను పునరుజ్జీవింపజేస్తుంది. చాలాసార్లు పని నుంచి రిలాక్స్ అవడానికి టూర్స్‌ని ఎంచుకుంటుంటాను. వందల ఇళ్లు డిజైన్ చేసి ఉంటాను. ఎన్నో అవార్డులు ఈ రంగంలో అందుకున్నాను. కానీ, నా ఇంట్లో ఏది ఎలా ఉండాలనే నియమం లేదు. అక్కడంతా నా పిల్లల ఇష్టమే. ఎందుకంటే వారి దగ్గర నేను తల్లిని మాత్రమే.

భవిష్యత్తు తరాలకు..

దాదాపు ఇరవై ఏళ్ల క్రితం ది ఆరెంజ్ లేస్ ఆ తర్వాత పీకాక్ లైఫ్ పేరుతో ఇంటీరియర్ స్పేస్‌లను క్రియేట్ చేశాను. హైదరాబాద్‌లో కోషా పేరుతో వింటేజ్ స్టైల్ ఫర్నీచర్‌ను లాంచ్ చేశాను. ఇంటీరియర్ డిజైనింగ్‌లో వింటేజ్ స్టైల్ ఇప్పుడు బాగా ట్రెండ్‌లో ఉంది. దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి ముఖ్యంగా రాజస్థాన్, గుజరాత్‌లలోని అతి ప్రాచీన కళా ఖండాలను సేకరించడం, వాటిని రీ మోడలింగ్ చేసి, నేటి తరానికి అందించడంలో నాటి కళను భవిష్యత్తు తరాలకు తీసుకెళుతున్నామనే సంతృప్తి కలుగుతుంది. ఇక నా వ్యక్తిగత విషయానికి వస్తే ప్రయాణాలు అంటే ఎంత ఇష్టమో వ్యక్తిగత అలంకరణ కూడా అంతే ఇష్టం. నా వ్యక్తిగత అలంకరణ కొంచెం బోహో స్టైల్‌లో ఉంటుంది. ఇది స్వేచ్ఛా, స్ఫూర్తిలకు ప్రతీకగా ఉంటుంది. ఎదుటివారు మనల్ని పరిశీలనగా గమనించేంత ప్రత్యేకంగా ఉంటాయి' అని నవ్వుతూ వివరించారు షబ్నమ్.

– నిర్మలారెడ్డి,
ఫొటో: ఎస్.ఎస్.ఠాకూర్

పిల్లలు బాగా చదవాలని తల్లిదండ్రులకు ఉంటుంది. అందుకోసం అదిలించేవారూ బెదిరించేవారూ ఎప్పుడూ నిఘా పెట్టేవారూ ఉంటారు. కాని ప్రయాగ్‌రాజ్‌కు చెందిన ఒక తండ్రి అలా చేయలేదు. 'నీతో పాటు నేనూ చదివి పరీక్ష రాస్తా. చూద్దాం ఎవరికి మంచి ర్యాంక్ వస్తుందో' అన్నాడు. నీట్ - 2023లో కూతురి ర్యాంక్ కోసం తండ్రి చేసిన పని సత్ఫలితం ఇవ్వడమేగాక అందరికీ ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇలా అందరూ చేయకపోవచ్చు. కాని పిల్లల్ని చదివించడానికి పాత విధానాలు పనికి రావని తెలుసుకోవాలి.

కూతురితో పోటీ పడి చదివి...

పేరెంటింగ్



డాక్టర్ ప్రకాష్ ఖైతాన్



మిటాలి

పిల్లల్లో తెలివితేటలు ఉన్నా, సామర్థ్యం ఉన్నా, ఏకాగ్రత ఉన్నా, ఆరోగ్యంగా ఉండి రోజూ కాలేజీకు వెళ్లి పాఠాలు వింటున్నా అంతిమంగా వారిలో 'సంకల్పం' ప్రవేశించకపోతే కావలసిన ఫలితాలు రావు. ముఖ్యంగా పోటీ పరీక్షల్లో విజయం సాధించాలంటే తల్లిదండ్రులు బయటి నుంచి పెట్టే వత్తిడి కంటే పిల్లల్లో లోపలి నుంచి వచ్చే పట్టుదల ముఖ్యం. ఆ పట్టుదలను వారిలో ఎలా కలిగించాలో, సంకల్పం బలపడేలా ఎలాంటి మాటలు మాట్లాడాలో తెలుసుకోవడమే తల్లిదండ్రులు ఇప్పుడు చేయవలసింది. 'స్ట్రిక్ట్'గా ఉండటం వల్ల పిల్లలు చదువుతారనే పాత పద్ధతి కంటే వారితో స్నేహంగా ఉంటూ మోటివేట్ చేయడం ముఖ్యం. అలాగే తల్లిదండ్రులు కూడా వారితో పాటు విద్యార్థుల్లాగా మారి, వారు సిలబస్ చదువుకుంటుంటే సాహిత్యమో, నాన్ ఫిక్షనో చదువుతూ కూచుంటే ఒక వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. పిల్లల్ని చదువుకోమని తల్లిదండ్రులు ఫోన్ పట్టుకుంటే, టీవీ చూస్తే... వారికీ అదే చేయాలనిపిస్తుంది. కాబట్టి నీట్, జెఇఇ వంటి కీలకపోటీ పరీక్షలు రాసే పిల్లలున్న తల్లిదండ్రులు తమ పిల్లలకి స్ఫూర్తి కోసం వారి స్వభావాన్ని బట్టి కొత్త విధానాలు వెతకాల్సిందే.

తానే విద్యార్థి అయ్యి

ఈ సంవత్సరం తన కూతురికి నీట్‌లో ర్యాంక్ రావడం కోసం ఒక తండ్రి చేసిన ప్రయత్నం తాజాగా బయటకు వచ్చింది. ఉత్తర ప్రదేశ్‌లో ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్)కు చెందిన డాక్టర్ ప్రకాష్ ఖైతాన్ (49) పెద్ద న్యూరో సర్జన్. అతను 1992లో ఎంట్రన్స్ రాసి మెడిసిన్‌లో సీట్ సంపాదించాడు. 1999లో పీజీ సీట్ సాధించి ఎం.ఎస్.సర్జరీ చేసి, 2003లో న్యూరో సర్జరీ చేశాడు. అంతేకాదు, 2011లో ఎనిమిదేళ్ల పాప మెదడు నుంచి 8 గంటల్లో 296 సిస్టులు తొలగించి గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించాడు. అలాంటి వైద్యుడు తన కుమార్తె మిటాలి నీట్ పరీక్షకు తగినంత సంకల్పంతో చదవడం లేదని గమనించాడు. ఇంటర్ తర్వాత ఎం.బి.బి.ఎస్.లో చేరాలంటే నీట్‌లో ర్యాంక్ సాధించక తప్పదు. 'కోవిడ్ సమయంలో నా కూతురి ఇంటర్ గడిచింది. కోవిడ్ ముగిసినా పాఠాల మీద మనసు లగ్నం చేసే స్థితికి నా కూతురు చేరలేదు. ఆమెను రాజస్థాన్‌లోని కోటాలో కోచింగ్ కోసం చేర్పించాను. కాని అక్కడ నచ్చక తిరిగి వచ్చేసింది. ఏం చేయాలా అని ఆలోచిస్తే ఆమెతో పాటు కలిసి చదవడమే మంచిది అనుకున్నాను. నేను కూడా నీతో చదివి నీట్ రాస్తాను. ఇద్దరం చదువుదాం. ఎవరికి మంచి ర్యాంక్ వస్తుందో చూద్దాం అని చెప్పాను' అన్నాడు డాక్టర్ ప్రకాష్.

ఆమెలో ఉత్సాహం నింపి

ఎప్పుడో 30 ఏళ్ల క్రితం ఎంబిబిఎస్ ఎంట్రన్స్ రాసి సీట్ కొట్టిన తండ్రి తన కోసం మళ్లోసారి పరీక్ష రాస్తాననేసరికి మిటాలికి ఉత్సాహం వచ్చింది. డాక్టర్‌గా బిజీగా ఉన్నప్పటికీ ప్రకాష్ ఉదయం, సాయంత్రం కూతురితో పాటు కూచుని చదివేవాడు. సిలబస్ డిస్కస్ చేసేవాడు. ఏ ప్రశ్నలు ఎలా వస్తాయనేది ఇద్దరు చర్చించుకునేవారు. అలా మెల్లమెల్లగా మిటాలికి పుస్తకాల మీద ధ్యాస ఏర్పడింది. మే 7న జరిగిన నీట్ ఎంట్రన్స్‌లో తండ్రీ కూతుళ్లకు చెరొకచోట సెంటర్ వచ్చింది. ఇద్దరూ వెళ్లి రాశారు. జూన్‌లో ఫలితాలు వస్తే మిటాలికి 90 పర్సెంట్, ప్రకాష్‌కు 89 పర్సెంట్ వచ్చింది. సెప్టెంబర్ చివరి వరకూ అడ్మిషన్స్ జరగ్గా మిటాలికి ప్రతిష్టాత్మకమైన మణిపాల్ కస్తూర్బా మెడికల్ కాలేజీలో సీట్ వచ్చింది.

కలిసి సాగాలి

పిల్లలు చదువులో కీలకమైన దశకు చేరినప్పుడు వారితో పాటు కలిసి ప్రయాణం చేయాల్సిన అవసరం తల్లిదండ్రులకు ఉంది. వారితో ఉదయాన్నే లేచి చిన్నపాటి వాకింగ్ చేయడం, బ్రేక్‌ఫాస్ట్ కలిసి చేయడం, కాలేజీలో దిగబెట్టడం, కాలేజీలో ఏం జరుగుతున్నదో రోజూ డిన్నర్ టైమ్‌లో మాట్లాడటం, మధ్యలో కాసేపైనా వారిని బయటకు తీసుకెళ్లడం, వారు చదువుకుంటున్నప్పుడు తాము కూడా ఏదో ఒక పుస్తకం పట్టుకుని కూచోవడం చాలా ముఖ్యం. దీనికంటే ఒక అడుగు ముందుకేసిన డాక్టర్ ప్రకాష్ కూతురుతో పాటు ఏకంగా ఎంట్రన్స్‌కు ప్రిపేర్ అవడం.. ఆ వయసులో తనే చదవగలిగినప్పుడు... నీ వయసులో నువ్వు చదవడానికి ఏమి అనే సందేశం ఇచ్చి కూతురిని గెలిపించుకున్నాడు.

బ్యూటిప్స్

సబ్జాతో మరింత కాంతిమంతం



సబ్జాగింజలను నీటిలో నానబెట్టి , పేస్టు చేయాలి. ఈ పేస్టులో టీస్పూను బాదం నూనె వేసి కలపాలి. ఈ పేస్టుని ముఖానికి పూతలా రాయాలి. పదినిమిషాలు ఆరాక మరోసారి పూత వేయాలి. పూర్తిగా ఆరాక చల్లటి నీటితో ముఖాన్ని కడిగేయాలి. దీంతో మీ ముఖం కాంతిమంతంగా, ఫ్రెష్‌గా కనిపిస్తుంది.

పంటికి జామ



నాలుగు జామ ఆకులని నీటిలో వేసి మరిగించాలి. మరిగిన నీటిని వడగట్టి..గోరువెచ్చగా ఉన్నప్పుడు నోట్లో పోసుకుని పుక్కిలించాలి. ఇలా పుక్కిలించడం వల్ల పంటినొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. జామ ఆకుల రసం పళ్లను మరింత దృఢంగా మారుస్తుంది.



అన్నీ కుమారి

'ఆర్టిస్ట్‌గా అన్నీ కుమారి ప్రత్యేకత ఏమిటి?' అనే ప్రశ్నకు ఒక ముక్కలో జవాబు చెప్పాలంటే... 'మాథ్స్, ఆర్ట్‌ను మిళితం చేసి సరికొత్త ఆర్ట్‌ను సృష్టించింది' జీవితం కూడా గణితంలాంటిదే. కొన్ని సమస్యలు సులభంగా పరిష్కారం అవుతాయి. కొన్ని ఎంతకీ కావు... ఈ సారాంశం కుమారి చిత్రాల్లో ప్రతిఫలిస్తుంది...

● కళ

చిద్విలాస చిత్రగణితం

మనం పుట్టి పెరిగిన వాతావరణం ఆలోచనల్లో, ఆచరణలో, చివరికి ఆర్ట్‌లో కూడా ప్రభావం చూపుతుంది. దీనికి నిలువెత్తు సాక్ష్యం అన్నీ కుమారి ఆర్ట్. గణితం, సంగీతం, క్రాఫ్ట్‌ల గురించి విలువైన చర్చలు జరిగే ఇంట్లో పెరిగింది కుమారి. చిన్నటిప్పటి నుంచి తనకు లెక్కలు అంటే ఇష్టం. లెక్కలంటే భయపడే పిల్లలకు భిన్నంగా అన్నీ కుమారి గంటల తరబడి లెక్కలు చేస్తూ కూర్చునేది. అంకెలు, సంఖ్యలు తన ప్రియ నేస్తాలుగా మారాయి.

'ఆర్ట్‌కు లెక్కలకు దోస్తు కుదరదు' అంటారు. అయితే అన్నీకి లెక్కలు అంటే ఎంత ఇష్టమో, ఆర్ట్ అంటే కూడా అంతే ఇష్టం. అయితే ఆర్ట్ స్కూల్‌లో మాత్రం అంకెలు నచ్చినంతగా చిత్రాలు నచ్చలేదు. తనకు కావాల్సినదేదో ఆ చిత్రాల్లో లోపించినట్లుగా అనిపించేది. ఆ సమయంలో రకరకాల ప్రయోగాల గురించి ఆలోచించేది. విజువల్ వకాబులరీ సృష్టించాలనే ఆలోచన అలా వచ్చిందే.

ఆర్ట్ స్కూల్ తరువాత...

బొమ్మలు గీస్తూ కూర్చోలేదు. తనలోని శూన్యాన్ని భర్తీ చేసుకోవడానికి ప్రయాణాన్ని సాధనంగా ఎంచుకుంది.

జార్ఖండ్‌లోని హజరీబాగ్‌కు వెళ్లి సోరాయి మ్యూరల్ ఆర్ట్ సంప్రదాయాన్ని, తమిళనాడు వెళ్లి కోలమ్ ఫ్లోర్ డ్రాయింగ్ సంప్రదాయాన్ని అధ్యయనం చేసింది. ఆ కళలో చుక్కలు, గీతలు, వంకలు చూస్తుంటే రకరకాల గణిత సూత్రాలు కంటిముందుకు వచ్చేవి. దీనికితోడు ప్రాచీన భారతీయ ఆలయాలలోని ఆర్కిటెక్చర్‌లో గణితం ఒక భాగమై ఉందనే విషయాన్ని అర్థం చేసుకుంది. ప్రకృతి ప్రపంచానికి, గణిత సూత్రాలకు మధ్య ఉండే అంతర్లీన సంబంధం కుమారిని ఆకట్టుకుంది.

సైన్స్‌కు ఉండే శక్తి అది సృష్టించే వస్తువుల్లో కనబడుతుంది. ఇక ఆర్ట్‌కు ఉండే శక్తి మానవ ఉద్వేగాలను, అనుభవాలను ప్రతిఫలించే వేదికలో కనబడుతుంది. ముఖ్య అంశం ఏమిటంటే గణితానికి సంబంధించిన సంక్లిష్టతను సరళీకరించి జనాలలోకి తీసుకువెళ్లే శక్తి ఆర్ట్‌కు ఉంది. అందుకే ఈ రెండు బలమైన మాధ్యమాలను ఒకేచోటుకి తీసుకురావాలనుకుంది.

> సైన్స్‌కు ఉండే శక్తి అది సృష్టించే వస్తువుల్లో కనబడుతుంది. ఇక ఆర్ట్‌కు ఉండే శక్తి మానవ ఉద్వేగాలను, అనుభవాలను ప్రతిఫలించే వేదికలో కనబడుతుంది.

తను సృష్టించే ఆర్ట్ ఎలా ఉండాలంటే...

మన సంస్కృతీ, సంప్రదాయాలలోకి తిరిగి ప్రయాణించేలా, మన కళలను పండగలా సెలబ్రేట్ చేసుకునేలా, మన మూలాలతో ఆత్మీయంగా కనెక్ట్ అయ్యేలా ఉండాలి అనే లక్ష్యంతో బయలుదేరింది. ఆ లక్ష్యసాధనలో విజయం సాధించి ఆర్టిస్ట్‌గా తనదైన ప్రత్యేకత నిలుపుకుంది. తాజాగా అన్నీ కుమారి ఆర్ట్ ఎగ్జిబిషన్ ముంబైలోని తావో ఆర్ట్ గ్యాలరీలో జరుగుతోంది.

ఆంగ్ల మహా సముద్రంలో ఆనంద విహారం

యూత్ పల్స్

'ఇక నీకు పూర్తిగా వచ్చేసినట్లే' అని ఆంగ్లం ఎప్పుడూ అభయం ఇవ్వదు. ఆంగ్లభాషను ఎప్పటికప్పుడూ శోధిస్తూ పట్టు సాధిస్తూనే ఉండాలి... ఈ విషయంలో స్పష్టతతో ఉన్న యువతరం ఆంగ్ల మహాసముద్రంలో కలుస్తున్న నదులు, వాగులు, వంకల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే ఉంది. నిత్యావసర భాష అయిన ఆంగ్లంలో నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి సిట్‌కామ్స్ నుంచి చాట్‌జీపీటి టూల్స్ వరకు ఎన్నో దారులలో ప్రయాణిస్తోంది...



సిట్‌కామ్ (సిచ్యువేషనల్ కామెడీ షో)తో కాసేపు హాయిగా నవ్వుకోవచ్చు అనేది పాత మాట. నవ్వుకోవడమే కాదు పదసంపద, నేటివ్ స్పీచ్‌పై పట్టు సంపాదించడానికి, పదాలతో ముడిపడి ఉన్న భావోద్వేగాల గురించి లోతుగా తెలుసుకోవడానికి సిట్‌కామ్‌లలోని విజువల్ ఎలిమెంట్స్ ఉపయోగపడతాయి అనేది నేటి మాట. అలాంటి సిట్‌కామ్స్‌లో కొన్ని...

చీర్స్ (1982-1993)

థీమ్ సాంగ్ 'ఎవ్రీబడీ నోస్ యువర్ నేమ్' నుంచి చివరి డైలాగ్ వరకు ఏదో ఒక కొత్తపదం పరిచయం అవుతూనే ఉంటుంది. రకరకాల సెట్‌లలో కాకుండా ఒకటే లొకేషన్‌లో చిత్రీకరించడం వల్ల ఒకేచోట పూర్తిగా దృష్టి కేంద్రీకరించవచ్చు. 'చీర్స్'లోని హాస్యాన్ని సులభంగా అర్థం చేసుకోవచ్చు.

ఫ్రైజర్ (1993-2004)

చీర్స్‌లోని ఎపిసోడ్‌లను అర్థం చేసుకున్నవారికి ఫ్రెజర్ కష్టమేమీ కాదు. ఈ సిట్‌కామ్‌లోని ప్రధాన పాత్రలైన ఫ్రెజర్, నీల్ మార్టిన్‌ల క్లీన్ యాక్సెంట్‌ను సులభంగా అర్థం చేసుకోవచ్చు. 'ఫ్రైజర్' నిండా ఇంటిలిజెంట్ హ్యూమర్ వినిపించి కనిపిస్తుంది.

ది సింప్సన్స్ (1980)

ది సింప్సన్ టీవీ సిరీస్ ఇప్పటికీ ప్రేక్షకులను అలరిస్తూనే ఉంది. ఈ యానిమేటెడ్ సిట్‌కామ్‌లో క్యారెక్టర్‌ల మధ్య నడిచే సంభాషణలు ఫ్యామిలీ టాపిక్స్‌పై ఉంటాయి. రియల్–లైఫ్ ఫ్రేజ్‌లపై అవగాహనకు ఉపయోగపడుతుంది. పుస్తకాల కంటే సహజమైన భాషను నేర్చుకోవచ్చు.

> 'ఇక నాకు అంతా వచ్చేసినట్లే' అనే మాట ఆంగ్లం విషయంలో ఎప్పటికీ వినిపించదు. ఎందుకంటే... ఆంగ్ల భాష అనగానే వినిపించే ప్రసిద్ధ మాట... వర్క్ ఇన్ ప్రోగ్రెస్. అందుకే ఆంగ్లంలో ఎప్పటికప్పుడు సరికొత్త నైపుణ్యాన్ని సంపాదించుకోవడానికి యువతరం వివిధ మార్గాలలో ప్రయాణిస్తుంది.

ది వండర్ ఇయర్స్ (1988-93)

మధ్యతరగతి కుటుంబానికి చెందిన కెవిన్ అర్నాల్డ్ అనే టీనేజర్ ప్రధాన పాత్రలో కనిపించే సిట్‌కామ్ ఇది. యువత మానసిక ప్రపంచానికి అద్దం పడుతుంది. కెవిన్ అతని ఫ్రెండ్స్ ఎదుర్కొనే రకరకాల సమస్యలతో యూత్ ఆటోమేటిక్‌గా రిలేట్ అవుతారు. యంగ్ పీపుల్ ఇంగ్లిష్‌లో కమ్యూనికేట్ చేసే పద్ధతిని అర్థం చేసుకోవడానికి ఉపయోగపడుతుంది.

ది ఫ్రెష్ ప్రిన్స్ ఆఫ్ బెల్-ఎయిర్ (1990-1996)

ఈ హిట్ కామెడీ షోలో ఎక్కువమందిని ఆకట్టుకునే క్యారెక్టర్ విల్ స్మిత్. ఫన్నీ డైలాగులు, జోక్స్‌ను సులభంగా అర్థం చేసుకోవచ్చు. సోషల్ క్లాస్ స్పీకింగ్ ఇంగ్లిష్ నుంచి స్ట్రీట్ ఇంగ్లీష్ వరకు అవగాహన ఏర్పర్చుకోవచ్చు.

ఫ్యామిలీ మ్యాటర్స్ (1989-1998)

ఈ సిట్‌కామ్‌లో కనిపించే రకరకాల ఎక్స్‌ప్రెషన్‌లు, గెశ్చర్ లెర్నర్స్‌కు ఉపయోగపడతాయి. స్పష్టమైన, సంక్షిప్తమైన యాక్సెంట్ వినిపిస్తుంది. కుటుంబ జీవితానికి సంబంధించి ఇళ్లల్లో వినిపించే ఇంగ్లిష్ ఇడియమ్స్ గురించి తెలుసుకోవచ్చు.

ది నానీ (1993-1999)

రకరకాల యాక్సెంట్‌లను ఈ సిట్‌కామ్‌లో వినవచ్చు. సామాన్య ప్రజలతో పోల్చితే ధనవంతులు ఎలా మాట్లాడతారో చూడవచ్చు... ఇవి మచ్చుకు కొన్ని సిట్‌కమ్స్ మాత్రమే. ఎన్నో కోణాలలో భాషను మెరుగు పరుచుకునే సిట్‌కామ్‌లు ఎన్నో ఉన్నాయి.

అప్–టు–డేట్ ఇంగ్లిష్ లెసన్స్ ప్లాట్‌ఫామ్ 'సెన్సేషన్ ఇంగ్లిష్'పై కూడా యూత్ ఆసక్తి చూపుతుంది. ఇంటర్నేషనల్ న్యూస్ వీడియోలు, ఆర్టికల్స్ ద్వారా 5 లెవెల్స్‌లో భాషను మెరుగు పరుచుకోవచ్చు. 'ప్రాక్టీస్ యువర్ ఇంగ్లిష్ టుడే' అంటోంది లాంగ్వేజ్ లెర్నింగ్ యాప్ ప్రోమోవ. మూడు వేల పదాలతో కూడిన 40 థీమ్‌డ్ టాపిక్స్, ఇడియమ్స్, స్లాంగ్ వర్డ్స్, ఎవ్రీ డే ఎక్స్‌ప్రెషన్స్ ప్రోమోవలో ఉన్నాయి. లైవ్ లెసన్స్, కాన్వర్‌జేషన్ ఈవెంట్స్, ఏఐ ప్రాక్టీస్ టాస్క్స్, సోషల్ లెర్నింగ్ గేమ్స్, లెర్నింగ్ జర్నీ తమ ప్రత్యేకతగా చెబుతుంది విజువల్ వరల్డ్స్ ఇమార్స్.

లాంగ్వేజ్ లెర్నింగ్‌లో కీలక పరిణామం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ). స్థానిక, స్థానికేతరులను భాష నైపుణ్యం మెరుగుపరుచుకోడానికి, పర్సనలైజ్‌డ్ లాంగ్వేజ్ లెర్నింగ్ ఎక్స్‌పీరియన్స్‌కు ఈ సాంకేతికత ఉపయోగపడుతుంది. ఉదా: లెర్నర్స్ బలాలు, బలహీనతల ఆధారంగా పర్సనలైజ్‌డ్ కరికులమ్‌ను, లాంగ్వేజ్ లెర్నింగ్ గేమ్స్‌ను రూపొందిస్తుంది. తప్పులను ఎత్తి చూపుతుంది.

ఇంగ్లిష్ లిరిక్స్ వినడం ద్వారా కూడా భాషలో నైపుణ్యాన్ని పెంపొందించుకునే ధోరణి పెరుగుతోంది. దీని ద్వారా ఎప్పటికప్పుడు రకరకాల యాక్సెంట్‌లను అర్థం చేసుకోవచ్చు. పదసంపద పెంచుకోవచ్చు. బెటర్ ప్రొనన్సియేషన్‌కు ఉపయోగపడుతుంది.

అలనాటి ప్రసిద్ధ ఇంగ్లిష్ పాటల్లో ఎన్నో ప్రయోగాలు కనిపిస్తాయి. ఎల్విస్ ప్రెస్లీ, మైకెల్ జాక్సన్ నుంచి నిన్న మొన్నటి కుర్రకారు సంగీతకారుల వరకు ఎంతోమంది పాత పదాలను కొత్తగా ప్రయోగించారు.

'ఇంగ్లిష్ భాషలో నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి ఉపకరించే పాటలు' అంటూ ప్రతి సంవత్సరం కొన్ని పాటలను సిఫారసు చేస్తున్నారు ఆంగ్ల భాషా నిపుణులు.

'ఇక నాకు అంతా వచ్చేసినట్లే' అనే మాట ఆంగ్లం విషయంలో ఎప్పటికీ వినిపించదు. ఎందుకంటే... ఆంగ్ల భాష అనగానే వినిపించే ప్రసిద్ధ మాట... వర్క్ ఇన్ ప్రోగ్రెస్. అందుకే ఆంగ్లంలో ఎప్పటికప్పుడు సరికొత్త నైపుణ్యాన్ని సంపాదించుకోవడానికి యువతరం వివిధ మార్గాలలో ప్రయాణిస్తుంది.



శ్రీజకు రజతం... స్నేహిత్‌కు కాంస్యం

జాతీయ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు చెందిన ఆకుల శ్రీజ మహిళల సింగిల్స్‌లో రజతం, పురుషుల సింగిల్స్‌లో సూరావజ్జుల స్నేహిత్ కాంస్య పతకం సాధించారు. తిరువనంతపురంలో జరిగిన సింగిల్స్ ఫైనల్లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ప్రాతినిధ్యం వహిస్తున్న శ్రీజ 8-11, 11-5, 5-11, 9-11, 12-14తో దియా చిటాలె (ఆర్‌బీఐ) చేతిలో ఓటమి చవిచూసింది. సెమీఫైనల్లో స్నేహిత్ 7-11, 11-3, 15-13, 4-11, 10-12, 13-11, 7-11తో మానవ్ ఠక్కర్ (పీఎస్‌పీబీ) చేతిలో పోరాడి ఓడిపోయాడు

వెర్‌స్టాపెన్ ఖాతాలో 15వ విజయం



ఫార్ములావన్-2023 సీజన్‌లో రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ 15వ విజయాన్ని అందుకున్నాడు. టెక్సస్‌లో జరిగిన యునైటెడ్ స్టేట్స్ (యూఎస్) గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. 'పోల్ పొజిషన్'తో రేసును ఆరంభించిన వెర్‌స్టాపెన్ నిర్ణీత 56 ల్యాప్‌లను అందరికంటే వేగంగా 1 గంట 35 నిమిషాల 21.362 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. వెర్‌స్టాపెన్ కెరీర్‌లో ఇది 50వ విజయం.



దివికేగిన దిగ్గజం



భారత స్పిన్ లెజెండ్ బిషన్ సింగ్ బేడీ కన్నుమూత

- పుష్కరకాలంపాటు వెలుగు వెలిగిన అలనాటి మేటి స్పిన్నర్
- ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా గుర్తింపు

టి20 క్రికెట్ మాయలో పడి, సత్తా ఉన్నా... ఐదు రోజుల ఆటకు బైబై చెప్పేసి... జస్ట్ నాలుగు ఓవర్లేసే లీగ్‌లకు జైకొట్టే బౌలర్లున్న ఈ రోజుల్లో సంప్రదాయ టెస్టులకే సర్వం ధారపోసిన స్పిన్నర్ బిషన్‌సింగ్ బేడీ. ఆయన మునివేళ్లతో బంతిని సంధిస్తే వికెట్. అయన స్పిన్ ఉచ్చు బిగిస్తే ప్రత్యర్థి ఆలౌట్. అంతలా... భారత క్రికెట్‌లో తన స్పిన్‌తో వికెట్లను దున్నేసిన దిగ్గజం బేడీ. ఎరాపల్లి ప్రసన్న, భగవత్ చంద్రశేఖర్‌లతో కలిసి దుర్భేధ్యమైన స్పిన్ త్రయంగా ప్రత్యర్థి జట్లను విలవిలలాడించాడు. ఈ త్రయానికి తర్వాత శ్రీనివాస్ వెంకటరాఘవన్ జతయ్యాక బ్యాటర్లకు చిక్కులు, చుక్కలే కనిపించేవంటే అతిశయోక్తి కాదు. క్రికెట్ జగాన్ని స్పిన్ మాయాజాలంతో ఊపేసిన బిషన్ సింగ్ ఆఖరి శ్వాస విడిచి దివికేగాడు. భారత క్రికెట్‌ను కన్నీట ముంచాడు.

న్యూఢిల్లీ: భారత క్రికెట్‌లో స్పిన్‌కే వన్నెలద్దిన బౌలింగ్ దిగ్గజం బిషన్ సింగ్ బేడీ సోమవారం ఢిల్లీలో తుదిశ్వాస విడిచారు. స్పిన్ శకాన్ని శోకసంద్రంలో ముంచి తిరిగిరాని లోకాలకు వెళ్లారు. ఆయన వయస్సు 77 ఏళ్లు. గత రెండేళ్లుగా తీవ్ర అనారోగ్యంతో సతమతమవుతున్నారు. పలు శస్త్రచికిత్సలు కూడా జరిగాయి. నెల క్రితం మోకాలు ఆపరేషన్ జరిగింది. అనారోగ్యంతో సుదీర్ఘకాలంగా పోరాడుతున్న ఆయన సోమవారం ఉదయం తన నివాసంలో కన్నుమూశారు. మోకాలు శస్త్రచికిత్స అనంతరం సోకిన ఇన్ఫెక్షన్ క్రమంగా పెరగడంతోనే మృతి చెందినట్లు ఆయన సన్నిహితుడొకరు వెల్లడించారు. ఈ పంజాబీ క్రికెట్ స్టార్ 1946లో సెప్టెంబర్ 25న అమృత్‌సర్‌లో జన్మించారు. తదనంతరం క్రికెట్‌లో చెరగని ముద్ర వేసి ఢిల్లీలో సెటిలయ్యారు. ఆయనకు భార్య అంజు, కుమారుడు అంగద్ బేడీ (సినీనటుడు) ఉన్నారు. అంగద్ భార్య నేహ ధూపియా బాలీవుడ్ హీరోయిన్. మొదటి భార్య గ్లెనిత్ మైల్స్ ద్వారా ఇద్దరు సంతానం కొడుకు గావసిందర్, కుమార్తె గిలిందర్ ఉన్నారు. స్పిన్నర్లు ఉపఖండానికే పరిమితమనే విమర్శల్ని తన స్పిన్ మంత్రతో విదేశీ గడ్డపై తిప్పిగొట్టిన ఘనత బిషన్ సింగ్‌ది. తన కెరీర్ అనంతరం కూడా క్రికెట్‌తో అనుబంధాన్ని కొనసాగించారు. ఢిల్లీ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్ (డీడీసీఏ)కు విశేష సేవలందించారు. విరాట్ కోహ్లి సహా ఎంతో మంది కుర్రాళ్లకు ఫిట్‌నెస్ గురించి పూర్తిస్థాయి అవగాహన కల్పించారు. కోహ్లి తను ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడానికి బేడీనే కారణమని పలు సందర్భాల్లో చెప్పాడు.

ఇదీ చరిత్ర...

సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్, సౌరవ్ గంగూలీ, విరాట్ కోహ్లి లాంటి బ్యాటర్లు అసలైన క్రికెట్ టెస్టు ఫార్మాటేనని ఘంటాపథంగా చెప్పే సంప్రదాయ క్రికెట్‌లో స్పిన్నర్‌గా బేడీ ఓ వెలుగు వెలిగాడు. ఈ తరం క్రికెటర్లు మెరుపుల టి20లకు అలవాటు పడి టెస్టు క్రికెట్‌ను పక్కన బెడుతున్నారు. మరి బిషన్ సింగ్ ఐదు రోజుల టెస్టుల్లో, నాలుగు రోజుల ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో సుదీర్ఘకాలం దేశానికి, రాష్ట్రానికి సేవలందించాడు. 1967 నుంచి 1979 వరకు తన అంతర్జాతీయ కెరీర్‌లో 67 టెస్టులాడిన స్పిన్ లెజెండ్ 266 వికెట్లను పడగొట్టాడు. ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు 14 సార్లు తీశాడు. ఉత్తమ ప్రదర్శన 7/98. ఇక 370 ఫస్ట్‌క్లాస్ క్రికెట్లో 1,560 వికెట్లను చేజిక్కించుకున్నాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్‌గా బిషన్ సింగ్ పేరిటే ఇంకా రికార్డు ఉండటం విశేషం. ఫస్ట్‌క్లాస్ ఫార్మాట్‌లో బిషన్ ఇన్నింగ్స్‌లో 5 వికెట్లను ఏకంగా 106 సార్లు పడగొట్టారు. మ్యాచ్‌లో 10 వికెట్లను 20 సార్లు తీశాడు. ఉత్తమ ప్రదర్శన 7/5. వన్డే ఫార్మాట్‌లో తక్కువగా 10 మ్యాచ్‌లే ఆడాడు. 7 వికెట్లు తీశాడు. 1975 తొలి వన్డే వరల్డ్‌కప్‌లో, 1979 రెండో వన్డే వరల్డ్‌కప్‌లో బేడీ భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 1975 వరల్డ్‌కప్‌లో ఈస్ట్ ఆఫ్రికాతో జరిగిన తొలి మ్యాచ్‌లో బిషన్ 12 ఓవర్లు వేసి 8 మెయిడెన్లు తీసుకొని కేవలం 6 పరుగులిచ్చి 1 వికెట్ తీశాడు. అంతేకాదు...'బేడీ సాబ్' విజయవంతమైన సారథి కూడా! 22 టెస్టులకు నాయకత్వం వహించి 6 మ్యాచ్‌ల్లో భారత్‌ను గెలిపించాడు. ఇందులో మూడైతే విదేశీ గడ్డపై సాధించిన ఘనవిజయాలున్నాయి. బేడీ కెప్టెన్సీలోనే భారత జట్టు 1976లో పోర్ట్ ఆఫ్ స్పెయిన్‌లో వెస్టిండీస్‌తో జరిగిన టెస్టులో 403 పరుగుల రికార్డు లక్ష్యాన్ని ఛేదించింది. ఈ రికార్డు 27 ఏళ్ల పాటు (2003 వరకు) చరిత్ర పుటల్లో నిలిచింది. 1970లో కేంద్ర ప్రభుత్వం నుంచి 'పద్మశ్రీ' పురస్కారం అందుకున్న బిషన్ సింగ్‌ను భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) 2004లో 'సీకే నాయుడు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్' అవార్డుతో సత్కరించింది.

ఇదీ ఘనత...

ఈ భారత స్లో లెఫ్టార్మ్ స్పిన్నర్ అంటే అరివీర ఆజానుబాహులైన విండీస్ బ్యాటర్లకు వణుకే! ముఖ్యంగా 1970వ దశకంలో ప్రపంచ క్రికెట్‌ను తన స్పిన్‌తో శాసించాడు. 1969-70 సీజన్‌లో భారత్, ఆస్ట్రేలియాల మధ్య జరిగిన ముఖాముఖి టెస్టు సిరీస్‌లో 20.57 సగటుతో 21 వికెట్లు పడగొట్టాడు. 1972-73 సీజన్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన ద్వైపాక్షిక సిరీస్‌లో 25.28 సగటుతో 25 వికెట్లు తీశాడు. ప్రత్యర్థి బౌలర్ల పాలిట సింహస్వప్నమయ్యే వెస్టిండీస్ బ్యాటర్లను వారి సొంతగడ్డపై గడగడలాడించిన బౌలర్ ఎవరైన ఉన్నారంటే అది బేడీనే! 1975-76 సీజన్‌లో 25.33 సగటుతో 18 వికెట్లు చేజిక్కించుకున్నాడు. ఆ మరుసటి సీజన్‌లో న్యూజిలాండ్‌ను తిప్పేసి 13.18 సగటుతో 22 వికెట్లు పడగొట్టాడు. ఈ 1976-77 సీజన్‌లోనే ఇంగ్లండ్ మెడకు స్పిన్ ఉచ్చు బిగించి 25 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. 1977-78 సీజన్‌లో ఈసారి ఆస్ట్రేలియా పనిపట్టాడు. 23.87 సగటులో 31 వికెట్లు తీశాడు.

అరుణ్ జైట్లీ పేరుపెడితే నొచ్చుకున్నారు!

ఢిల్లీలోని ఫిరోజ్ షా కోట్లా మైదానంలోని స్టాండ్‌కు బిషన్ సింగ్ బేడీ పేరు పెట్టారు. అయితే మాజీ కేంద్ర మంత్రి, బీజేపీ అగ్రనేత అరుణ్ జైట్లీ మృతి అనంతరం ఆ స్టేడియానికి జైట్లీ పేరు పెట్టడాన్ని తీవ్రస్థాయిలో తప్పుబట్టారు. క్రికెటేతరుడి పేరు పెట్టడాన్ని సహించలేక స్టాండ్‌కు తన పేరు తొలగించాలని బహిరంగంగా డిమాండ్ చేశారు.



ఫ్యాబులస్ ఫోర్: చంద్రశేఖర్, బిషన్‌సింగ్, ప్రసన్న, వెంకటరాఘవన్ (ఫైల్)



బేడీకి కోహ్లి పాదాభివందనం(ఫైల్)

భారత క్రికెట్‌పై చెరగని ముద్ర

బిషన్ సింగ్ మరణ వార్తను తట్టుకోలేకపోయా. స్పిన్‌పై ఆయనకున్న పట్టు, ఆటపై కనబరిచే పట్టుదల అసాధారణం. భావి క్రికెటర్లకు, భవిష్యత్ తరాలకు అతని అంకితభావం స్ఫూర్తిదాయకం. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలి. ఓం శాంతి.
-ప్రధాని నరేంద్ర మోదీ

బేడీ మృతిపట్ల విచారం వ్యక్తం చేస్తున్నా. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాను. -ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అలర్డైస్

స్పిన్ బౌలింగ్‌తో క్రికెట్ పుటల్లోకెక్కారు. భారత క్రికెట్‌లో స్పిన్‌కు మూలస్తంభంలా ఉన్నారు. అలాంటి దిగ్గజం మనమధ్య లేకపోవడం బాధాకరం.
-బీసీసీఐ కార్యదర్శి జై షా

బేడీ మార్గదర్శనం వల్లే ఇంగ్లండ్‌లో నా తొలి శతకం సాకారమైంది. అలాంటి లెజెండ్ ఇప్పుడు లేకపోవడం బాధాకరం.
-బ్యాటింగ్ దిగ్గజం సచిన్

స్పిన్నర్లందరికి ఆయనే స్ఫూర్తి. యువతరానికి దిక్సూచి. బిషన్‌సింగ్ ఆత్మకు శాంతి చేకూరాలి. ఆయన కుటుంబానికి నా సానుభూతి.
-మాజీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే

బిషన్ సింగ్ లేరన్న వార్త జీర్ణించుకోలేనిది. భారత క్రికెట్‌కోసం ఎంతో చేశారు. ఆయన కుటుంబానికి దేవుడు స్థయిర్యాన్ని ఇవ్వాలి.
-మాజీ ఓపెనర్ గంభీర్

చాలా బాధగా ఉంది. ముమ్మాటికీ బిషన్‌సింగ్ గ్రేటెస్ట్ క్రికెటర్. యువ క్రికెటర్లు ఎదిగేందుకు ఎంతో పాటుపడ్డారు.
-సీనియర్ స్పిన్నర్ అశ్విన్

బేడీ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్న. ఆయన మృతికి సంతాపం తెలుపుతున్నాను.
-మాజీ కెప్టెన్ అజహరుద్దీన్



అంత్యక్రియలకు హాజరైన కపిల్, సెహ్వాగ్

'సర్దార్ ఆఫ్ స్పిన్' బిషన్ సింగ్ బేడీ పార్థీవ దేహానికి 1983 ప్రపంచకప్ కెప్టెన్, దిగ్గజ ఆల్‌రౌండర్ కపిల్ దేవ్, 2011 ప్రపంచకప్ విజేత సభ్యుడు సెహ్వాగ్ తదితర మేటి, మాజీ క్రికెటర్లు నివాళులర్పించారు. స్థానిక లోధి శ్మశానవాటికలో మంగళవారం నిర్వహించిన అంత్యక్రియలకు కీర్తి ఆజాద్, మదన్‌లాల్, నెహ్రా, అజయ్ జడేజా, మురళీ కార్తీక్, జహీర్, అజహరుద్దీన్ తదితర క్రికెటర్లు హాజరయ్యారు. కడసారి వీడ్కోలు పలికేందుకు వచ్చిన అభిమానులు, జూనియర్ క్రికెటర్ల అశ్రునయనాల మధ్య పంజాబీ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు జరిగాయి.

దీప్తి 'పసిడి' పరుగు

ఆసియా పారా క్రీడల్లో స్వర్ణం నెగ్గిన తెలంగాణ అథ్లెట్



హాంగ్జౌ: ఆసియా పారా క్రీడల్లో రెండో రోజూ భారత క్రీడాకారులు తమ పతకాల వేట కొనసాగించారు. తొలి రోజు సోమవారం 17 పతకాలు నెగ్గిన భారత ప్లేయర్లు... రెండో రోజు మంగళవారం ఏకంగా 18 పతకాలతో అదరగొట్టారు. ఇందులో నాలుగు స్వర్ణ పతకాలు ఉన్నాయి. భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ అమ్మాయి జీవంజి దీప్తి మహిళల 400 మీటర్ల టి20 కేటగిరీలో పసిడి పతకాన్ని సాధించింది. వరంగల్ జిల్లాలోని కల్లెడ గ్రామానికి చెందిన దీప్తి అందరికంటే వేగంగా 400 మీటర్ల దూరాన్ని 56.69 సెకన్లలో పూర్తి చేసి ఆసియా పారా గేమ్స్‌తోపాటు ఆసియా రికార్డును సృష్టించింది. మహిళల కనోయింగ్ ఎల్2 ఈవెంట్‌లో ప్రాచీ యాదవ్ 500 మీటర్ల దూరాన్ని 54.962 సెకన్లలో అధిగమించి భారత్‌కు స్వర్ణ పతకాన్ని అందించింది. పురుషుల డిస్కస్ త్రో (ఎఫ్54/55/56) కేటగిరీలో నీరజ్ యాదవ్ డిస్క్‌ను 38.56 మీటర్ల దూరాన్ని విసిరి విజేతగా నిలిచి పసిడి పతకాన్ని కైవసం చేసుకున్నాడు. పురుషుల 5000 మీటర్ల (టి13 కేటగిరీ) విభాగంలో శరత్ శంకరప్ప 20ని:18.90 సెకన్లలో రేసును ముగించి బంగారు పతకాన్ని గెల్చుకున్నాడు. రెండో రోజుల పోటీలు ముగిశాక భారత్ 10 స్వర్ణాలు, 12 రజతాలు, 13 కాంస్యాలతో కలిపి మొత్తం 35 పతకాలతో నాలుగో స్థానంలో ఉంది.

గౌస్-పూజ జోడీకి స్వర్ణం



షేక్ గౌస్



పూజ



తరుణ్



మేఘన రెడ్డి

సాక్షి, అమరావతి: జాతీయ క్రీడల్లో భాగంగా బ్యాడ్మింటన్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు స్వర్ణ పతకం లభించింది. గోవాలో జరుగుతున్న ఈ క్రీడల్లో మంగళవారం ముగిసిన మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో షేక్ గౌస్-పూజ (ఆంధ్రప్రదేశ్) జోడీ విజేతగా నిలిచి పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది. ఫైనల్లో షేక్ గౌస్-పూజ ద్వయం 21-8, 21-17తో బొక్కా నవనీత్-కె.మనీషా (తెలంగాణ) జంటను ఓడించింది. ఫైనల్లో ఓడిన నవనీత్-మనీషా జోడీకి రజతం దక్కింది.

తరుణ్‌కు పసిడి పతకం

సింగిల్స్ విభాగంలో తెలంగాణకు రెండు పతకాలు దక్కాయి. పురుషుల సింగిల్స్ విభాగంలో మన్నేపల్లి తరుణ్ స్వర్ణ పతకాన్ని, మహిళల సింగిల్స్‌లో మారెడ్డి మేఘన రెడ్డి కాంస్య పతకాన్ని గెల్చుకున్నారు. ఫైనల్లో తరుణ్ 21-15, 16-21, 21-15తో సౌరభ్ వర్మ (మధ్యప్రదేశ్)పై నెగ్గగా... సెమీఫైనల్లో మేఘన రెడ్డి 21-7, 22-24, 16-21తో అదితి భట్ (ఉత్తరాఖండ్) చేతిలో ఓడిపోయింది. సౌరభ్ వర్మతో 70 నిమిషాలపాటు జరిగిన ఫైనల్లో నిర్ణాయక చివరి గేమ్‌లో తరుణ్ స్కోరు 15-15 వద్ద వరుసగా ఆరు పాయింట్లు గెలిచి గేమ్‌తోపాటు మ్యాచ్‌ను సొంతం చేసుకున్నాడు. సెమీఫైనల్లో తరుణ్ 12-21, 21-14, 22-20తో జాతీయ చాంపియన్ మిథున్ (కర్ణాటక)ను ఓడించడం విశేషం.

దక్షిణాఫ్రికా ధమాకా

- బంగ్లాదేశ్‌పై 149 పరుగులతో గెలుపు
- డికాక్ భారీ శతకం
- మహ్ముదుల్లా సెంచరీ వృథా

ముంబై: సమష్టి ప్రదర్శనతో దక్షిణాఫ్రికా జట్టు వన్డే వరల్డ్‌కప్‌లో నాలుగో విజయాన్ని సాధించింది. బంగ్లాదేశ్‌తో మంగళవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 149 పరుగులతో గెలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 5 వికెట్లకు 382 పరుగులు సాధించింది. ఓపెనర్ క్వింటన్ డికాక్ (140 బంతుల్లో 174; 15 ఫోర్లు, 7 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగి ఈ టోర్నీలో మూడో సెంచరీని నమోదు చేశాడు. తాత్కాలిక కెప్టెన్ మార్క్‌రమ్ (69 బంతుల్లో 60; 7 ఫోర్లు) అర్ధ సెంచరీ చేయగా... క్లాసెన్ (49 బంతుల్లో 90; 2 ఫోర్లు, 8 సిక్స్‌లు), డేవిడ్ మిల్లర్ (15 బంతుల్లో 34 నాటౌట్; 1 ఫోర్, 4 సిక్స్‌లు) మెరిపించారు. 383 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్ 46.4 ఓవర్లలో 233 పరుగులకు ఆలౌటై ఓడిపోయింది. ఈ టోర్నీలో బంగ్లాదేశ్‌కిది నాలుగో పరాజయం. మహ్ముదుల్లా (111 బంతుల్లో 111; 11 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీతో ఒంటరి పోరాటం చేశాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో మార్కో జాన్సెన్ (2/39), లిజాడ్ విలియమ్స్ (2/56), కొట్జీ (3/62), రబడ (2/42), కేశవ మహరాజ్ (1/32) రాణించారు.



డికాక్

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X నెదర్లాండ్స్
వేదిక: న్యూఢిల్లీ

మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	5	5	0	10	1.353
దక్షిణాఫ్రికా	5	4	1	8	2.370
న్యూజిలాండ్	5	4	1	8	1.481
ఆస్ట్రేలియా	4	2	2	4	-0.193
పాకిస్తాన్	5	2	3	4	-0.400
అఫ్గానిస్తాన్	5	2	3	4	-0.969
నెదర్లాండ్స్	4	1	3	2	-0.790
శ్రీలంక	4	1	3	2	-1.048
ఇంగ్లండ్	4	1	3	2	-1.248
బంగ్లాదేశ్	5	1	4	2	-1.253

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

మెరిసిన విహారి, స్టీఫెన్

ఆంధ్ర జట్టు 'హ్యాట్రిక్' విజయం



స్టీఫెన్

రాంచీ: సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీ దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీలో ఆంధ్ర జట్టు వరుసగా మూడో విజయం నమోదు చేసింది. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడిన ఆంధ్ర జట్టు ఆ తర్వాత సమష్టి ప్రదర్శనతో వరుసగా మూడు మ్యాచ్‌ల్లో నెగ్గడం విశేషం. మణిపూర్ జట్టుతో జరిగిన గ్రూప్ 'సి' మ్యాచ్‌లో కోన శ్రీకర్ భరత్ సారథ్యంలోని ఆంధ్ర జట్టు 70 పరుగుల తేడాతో గెలిచింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆంధ్ర జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్లకు 186 పరుగులు చేసింది. హనుమ విహారి (55 బంతుల్లో 84 నాటౌట్; 12 ఫోర్లు, 1 సిక్స్), రికీ భుయ్ (13 బంతుల్లో 40 నాటౌట్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడారు. 187 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన మణిపూర్ జట్టు 19.5 ఓవర్లలో 116 పరుగులకు ఆలౌటైంది. ఆంధ్ర మీడియం పేసర్ చీపురపల్లి స్టీఫెన్ 3.5 ఓవర్లలో 10 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టడం విశేషం.

అఫ్గాన్ గర్జన

పాకిస్తాన్‌పై 8 వికెట్లతో సంచలన విజయం



చెన్నై: వన్డే వరల్డ్‌కప్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌ను కంగుతినిపించిన అఫ్గానిస్తాన్ పట్టుదల ముందు మాజీ చాంపియన్ పాకిస్తాన్ చిత్తయ్యింది. సోమవారం స్పిన్ ట్రాక్ చెపాక్ మైదానంలో జరిగిన ఈ భారీస్కోర్ల మ్యాచ్‌లో అఫ్గానిస్తాన్ 8 వికెట్ల తేడాతో పాక్‌పై జయభేరి మోగించింది. టాస్ నెగ్గి ముందుగా బ్యాటింగ్ చేపట్టిన పాకిస్తాన్ 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 282 పరుగులు చేసింది. టాపార్డర్‌లో కెప్టెన్ బాబర్ ఆజమ్ (92 బంతుల్లో 74; 4 ఫోర్లు, 1 సిక్స్), షఫీక్ (75 బంతుల్లో 58; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అర్ధసెంచరీలు సాధించారు. షాదాబ్ ఖాన్ (38 బంతుల్లో 40; 1 ఫోర్, 1 సిక్స్), ఇఫ్తికార్ (27 బంతుల్లో 40; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) మెరుగ్గా ఆడారు. నూర్ అహ్మద్ 3, నవీనుల్ 2 వికెట్లు తీశారు. అనంతరం అఫ్గానిస్తాన్ 49 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి 286 పరుగులు చేసి గెలిచింది. గుర్బాజ్ (53 బంతుల్లో 65; 9 ఫోర్లు, 1 సిక్స్), ఇబ్రహీమ్ జద్రాన్ (113 బంతుల్లో 87; 10 ఫోర్లు), రహ్మత్ షా (84 బంతుల్లో 77 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) అఫ్గానిస్తాన్‌ను గెలిపించారు. వన్డే ఫార్మాట్‌లో పాకిస్తాన్‌పై అఫ్గానిస్తాన్‌కిది తొలి విజయం కావడం విశేషం. ఈ మ్యాచ్‌కంటే ముందు పాక్‌తో జరిగిన ఏడు మ్యాచ్‌ల్లోనూ అఫ్గానిస్తాన్ ఓడిపోయింది. టోర్నీలో మూడో ఓటమితో పాకిస్తాన్ సెమీఫైనల్ చేరే అవకాశాలు సంక్లిష్టమయ్యాయి. పాక్ సెమీస్ రేసులో ఉండాలంటే తదుపరి నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలుపొందాలి. ఇతర జట్ల మ్యాచ్‌ల ఫలితాలు సమీకరణాలు కూడా ఆ జట్టుకు కలిసి రావాలి.

సరబ్‌జోత్‌కు కాంస్య పతకం



చాంగ్వాన్ (దక్షిణ కొరియా): ఆసియా షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ పతకాల బోణీ చేసింది. మంగళవారం జరిగిన పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో భారత షూటర్ సరబ్‌జోత్ సింగ్ కాంస్య పతకం సాధించాడు. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో సరబ్‌జోత్ 221.1 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచాడు. సరబ్‌జోత్ కాంస్య పతక ప్రదర్శనతో భారత్‌కు షూటింగ్ క్రీడాంశంలో ఎనిమిదో ఒలింపిక్ బెర్త్ ఖరారైంది. అంతకుముందు క్వాలిఫయింగ్ సరబ్‌జోత్ 581 పాయింట్లు స్కోరు చేసి ఎనిమిదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించాడు. ఇప్పటి వరకు భారత్ నుంచి పారిస్ ఒలింపిక్స్‌కు రుద్రాంక్ష్ పాటిల్ (పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్), స్వప్నిల్, అఖిల్ షెరాన్ (పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్), భౌనీష్ మెండిరట్టా (పురుషుల ట్రాప్), మెహులీ ఘోష్ (మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్), సిఫ్ట్ కౌర్ (మహిళల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్), రాజేశ్వరి కుమారి (మహిళల ట్రాప్) అర్హత పొందారు. మరోవైపు మహిళల జూనియర్ విభాగం 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో భారత్‌కు చెందిన సంయమ్ 240.6 పాయింట్లు స్కోరు చేసి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది.

శ్రమించి నెగ్గిన సింధు



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ పీవీ సింధు శుభారంభం చేసి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 10వ ర్యాంకర్ సింధు 69 నిమిషాల్లో 12-21, 21-18, 21-15తో ప్రపంచ 7వ ర్యాంకర్ గ్రెగోరియా మరిస్కా టున్‌జుంగ్ (ఇండోనేసియా)పై కష్టపడి గెలిచింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం 21-13, 21-13తో లుకాస్ కోర్వీ-రొనన్ లాబర్ (ఫ్రాన్స్) జంటను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది.

సాక్షి
బిజినెస్
బుధవారం
25-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (సోమవారం ముగింపు)

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
826	261
64,572	19,282

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	13,179	▲	61
డోజోన్స్	33,087	▲	150
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,390	▲	15
డాక్స్	14,880	▲	80
షాంఘై	2,962	▲	23
నికాయ్	31,062	▲	100

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారట్)	60,250
బంగారం (22 క్యారట్)	57,380
వెండి (కిలో)	77,550

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		81.36	85.04
£	బ్రిటన్ పౌండ్		99.30	104.24
€	యూరో		86.29	90.73
¥	జపాన్ ఎన్ (100)		43.00	68.00
AU$	ఆస్ట్రేలియా డాలర్		50.57	55.39
S$	సింగపూర్ డాలర్		58.56	63.23
SAR	సౌదీ రియాల్		21.23	22.85
UAE D	యూఏఈ దిర్హామ్		21.75	23.55
¥	చైనా యువాన్		10.26	12.33

ఈవెంట్ల నిర్వహణకు కోహ్లి కంపెనీ



నిసర్గ పేరుతో ఏర్పాటు

న్యూఢిల్లీ: సెలబ్రిటీ దంపతులు విరాట్ కోహ్లి, ఆయన భార్య అనుష్క శర్మ తాజాగా ఈవెంట్ల నిర్వహణ కోసం కొత్త వెంచర్ ప్రారంభించారు. నిసర్గ పేరుతో దీన్ని ఏర్పాటు చేశారు. తొలుత మోటార్ స్పోర్ట్స్, వినోద కార్యక్రమాల నిర్వహణ సంస్థ ఎ లీట్ ఆక్టేన్‌తో నిసర్గ జట్టు కట్టింది. ఎలీట్ ఆక్టేన్‌కు ది వేలీ రన్ వంటి ఈవెంట్లకు సంబంధించి మేధోహక్కులు (ఐపీ) ఉన్నాయి. ప్రస్తుతం మూడు మోటార్‌స్పోర్టింగ్ ఈవెంట్లు, ఎగ్జిబిషన్లు, ఒక మ్యూజిక్ కాన్సర్ట్ మొద లైనవి నిర్వహించనున్నట్లు నిసర్గ పేర్కొంది. తాహా కోబర్న్ కూటే ఈ సంస్థకు సీఈవోగా, సీవోవోగా అంకుర్ నిగమ్ నియమితులయ్యారు.

విమానాల లీజింగ్ వ్యాపారంలోకి అదానీ పోర్ట్స్



ముంబై: అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనమిక్ జోన్ (ఏపీ సెజ్) తాజాగా విమానాల లీజింగ్ వ్యాపారంలోకి ప్రవేశించింది. ఇందుకోసం సొంతంగా ఉడాన్‌వత్ లీజింగ్ ఐఎఫ్‌ఎస్‌సీ పేరిట ఒక సంస్థను ఏర్పాటు చేసింది. రూ. 2.5 కోట్లు అధీకృత మూలధనంతో దీన్ని ప్రారంభించినట్లు సంస్థ తెలిపింది. టాటా గ్రూప్‌లో భాగమైన ఎయిరిండియా కూడా ఇటీవలే ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్ (ఐఎఫ్‌ఎస్‌సీ) గిఫ్ట్ సిటీలో సొంత ఎయిర్‌క్రాఫ్ట్ లీజింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేసింది. మరో విమానయాన సంస్థ ఇండిగో కూడా అలాంటి ప్రయత్నాల్లోనే ఉన్నట్లు సమాచారం.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

25-10-2023	
విశాఖ	540-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	531-00
విజయవాడ	531-00
రిటైల్ ధర (డజను)	72.00
24-10-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	511-00
వరంగల్	513-00
రిటైల్ ధర	5.70

భారత్.. మూడో అతిపెద్ద ఎకానమీ!

- 2030 నాటికి జపాన్‌ను వెనక్కునెట్టే అవకాశం
- 7.3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఆవిర్భవించే సత్తా
- ఎస్అండ్‌పీ గ్లోబల్ అంచనా



న్యూఢిల్లీ: భారత్ 2030 నాటికి జపాన్‌ను అధిగమించి ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే అవకాశం ఉందని ఎస్అండ్‌పీ గ్లోబల్ మార్కెట్ ఇంటెలిజెన్స్ పేర్కొంది. అప్పటికి భారత్ స్థూల దేశీయోత్పత్తి 7.3 ట్రిలియన్ డాలర్లకు చేరుతుందన్న విశ్వాసాన్ని వెలిబుచ్చింది. ఇదే జరిగితే ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో చైనా తర్వాత భారత్ ఎకానమీ రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా సైతం ఆవిర్భవిస్తుంది. పటిష్ట ఆర్థిక వ్యవస్థతో ప్రపంచంలో వేగవంతమైన ఎకానమీ వృద్ధి రేటును భారత్ కొనసాగిస్తున్న సంగతి తెలిసిందే. రానున్న దశాబ్ద కాలంలో కూడా ఇదే ధోరణి కొనసాగే వీలుంది. 2024 మార్చితో ముగిసే ఆర్థిక సంవత్సరంలో 6.2 శాతం నుంచి 6.3 శాతం శ్రేణిలో భారత్ ఎకానమీ వృద్ధి సాధిస్తుందన్న అంచనాలు ఉన్నాయి. ఆయా అంశాలకు సంబంధించి ఎస్అండ్‌పీ గ్లోబల్ తాజా నివేదిక ఏమి చెబుతోందంటే..

- 2023, 2024ల్లో ఎకానమీ వృద్ధి రేటు పటిష్టంగా ఉంటుంది. దేశీయంగా బలమైన వినియోగం దీనికి దోహదపడే అంశం.
- గత దశాబ్ద కాలంలో భారతదేశంలోకి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డీఐ) ప్రవాహం వేగవంతమైంది. భారత ఆర్థిక వ్యవస్థకు అనుకూలమైన దీర్ఘకాలిక వృద్ధి దృక్పథం కొనసాగుతోంది. యువత అధికంగా ఉండడం, వేగంగా పెరుగుతున్న పట్టణ గృహ ఆదాయాలు దేశ పురోగతికి దోహదపడే అంశాలు. మధ్య తరగతి ప్రజల సంఖ్య దేశంలో పెరుగుతుండడం మరో సానుకూల అంశం.
- సేవా రంగంసహా వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశీయ వినియోగ మార్కెట్, పారిశ్రామిక, తయారీ, మౌలిక రంగాలు దేశ పురోగతికి బాటలు వేస్తున్నాయి. ఆయా సానుకూలతలు బహుళజాతి కంపెనీలకు విస్తృతస్థాయిలో పెట్టుబడులు పెట్టడానికి భారత్ గమ్యస్థానంగా మార్చుతోంది.
- ప్రస్తుతం దేశంలో పురోగమిస్తున్న డిజిటలైజేషన్ ఈ-కామర్స్ వృద్ధిని వేగవంతం చేస్తుంది. రాబోయే దశాబ్దంలో రిటైల్ వినియోగదారుల మార్కెట్ ధోరణుల మార్పునకు ఆయా అంశాలు దోహదపడతాయి. ఈ పరిణామాలు టెక్నాలజీ, ఈ-కామర్స్‌లో ప్రముఖ ప్రపంచ బహుళజాతి కంపెనీలను భారత మార్కెట్‌కు ఆకర్షిస్తాయి.
- 2030 నాటికి 110 కోట్ల మందికి ఇంటర్నెట్ అందుబాటులో ఉంటుంది. 2020లో ఇంటర్నెట్ యూజర్ల సంఖ్య దాదాపు 50 కోట్లకు ఇది రెట్టింపు.
- ఈ-కామర్స్ వేగవంతమైన వృద్ధి, 4జీ, 5జీ స్మార్ట్‌ఫోన్ టెక్నాలజీకి వినియోగదారులు అధిక సంఖ్యలో మారడం వంటి అంశాలు ఆన్‌లైన్ ద్వారా సేవలను విస్తృతం చేసే యూనికార్న్ సంస్థల పురోగతికి దోహదపడతాయి.
- భారత్‌లో చోటుచేసుకుంటున్న పలు సానుకూల ఆర్థిక పరిణామాలు ఆటో, ఎలక్ట్రానిక్స్, కెమికల్స్ వంటి తయారీ పరిశ్రమలతో పాటు బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, అసెట్ మేనేజ్‌మెంట్, హెల్త్ కేర్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వంటి సేవా రంగాల పురోగతికి దోహదపడతాయి. పెట్టుబడులకు సంబంధించి బహుళజాతి కంపెనీలకు అత్యంత ముఖ్యమైన దీర్ఘకాలిక వృద్ధి మార్కెట్‌లలో ఒకటిగా దేశం మారుతుంది.

భారత్ పురోగతి బాట పటిష్టం: ఆర్థికశాఖ

భారత్ 2024 మార్చితో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రపంచంలోనే వేగవంతమైన ఎకానమీ హోదాను కొనసాగిస్తుందని ఆర్థిక మంత్రిత్వశాఖ సెప్టెంబర్ నెలవారీ సమీక్షా నివేదిక స్పష్టం చేసింది. ద్రవ్యోల్బణం దిగిరావడంసహా భారత్ ఆర్థిక ఫండమెంటల్స్ పటిష్టంగా ఉన్నట్లు నివేదిక పేర్కొంది. పశ్చిమాసియా సవాళ్లు, పరిణామాలు అంతర్జాతీయ క్రూడ్ ధరలపై ప్రభావం చూపుతాయని అభిప్రాయపడింది. అమెరికా స్టాక్ మార్కె ట్లు బలహీన ధోరణిలో ఉన్నట్లు కనిపిస్తోందని, ఇది పూర్తి వాస్తవ రూపం దాల్చితే మిగిలిన మార్కెట్లపైనా ఈ ప్రభావం పడవచ్చని వివరించింది.

ప్రస్తుతం అయిదో స్థానంలో..

భారత్ ప్రస్తుతం ప్రపంచంలో ఐదవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతున్న సంగతి తెలిసిందే. 25.5 ట్రిలియన్ డాలర్లతో అమెరికా ప్రస్తుతం ప్రపంచంలో అతిపెద్ద ఎకానమీగా కొనసాగుతోంది. ప్రపంచం మొత్తం జీడీపీలో పావుశాతం వాటాను కలిగి ఉంది. ఇక 17.9 శాతం ప్రపంచ జీడీపీ వాటాతో 18 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా చైనా రెండవ స్థానంలో ఉంది. తరువాతి స్థానాల్లో జపాన్ (4.2 ట్రిలియన్ డాలర్లు), జర్మనీ (4 ట్రిలియన్ డాలర్లు)లు ఉన్నాయి. 3.5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీతో భారత్ ఐదవ స్థానంలో నిలుస్తోంది. 2022 నాటికి భారత్ ఎకానమీ బ్రిటన్, ఫ్రాన్స్‌లను అధిగమించగా, 2023 నాటికి జర్మనీని అధిగమించే అవకాశం ఉందన్న అంచనాలు ఇప్పటికే ఉన్నాయి.

ఫ్లిప్‌కార్ట్ నష్టాలు పెరిగాయ్

2022-23లో రూ. 4,891 కోట్లు



న్యూఢిల్లీ: మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరం (2022-23)లో ఈకామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నికర నష్టం భారీగా పెరిగి రూ. 4,891 కోట్లకు చేరింది. అంతక్రితం ఏడాది(2021-22) ఇదే కాలంలో రూ. 3,371 కోట్ల నష్టం మాత్రమే నమోదైంది. బిజినెస్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ టోఫ్లర్ వివరాల ప్రకారం స్టాండెలోన్ నష్టాలు సైతం 44 శాతం పెరిగి రూ. 4,839 కోట్లను దాటాయి. అంతక్రితం రూ. 3,362 కోట్ల నష్టం ప్రకటించింది. కాగా.. కన్సాలిడేటెడ్ ఆదాయం 9 శాతం పైగా ఎగసి రూ. 56,013 కోట్లకు చేరింది. 2021-22లో మొత్తం ఆదాయం రూ. 51,176 కోట్లుగా నమోదైంది. మొత్తం వ్యయాలు రూ. 60,858 కోట్లకు చేరాయి.

పీఎన్‌బీ హౌసింగ్ లాభం 383 కోట్లు



న్యూఢిల్లీ: పీఎన్‌బీ హౌసింగ్ ఫైనాన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జూలై-సెప్టెంబర్ (క్యూ2)లో నికర లాభం 46 శాతం జంప్‌చేసి రూ. 383 కోట్లను తాకింది. వడ్డీ ఆదాయం పుంజుకోవడం ఇందుకు దోహదపడింది. గతేడాది(2022-23) ఇదే కాలంలో రూ. 263 కోట్ల నికర లాభం ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,683 కోట్ల నుంచి రూ. 1,779 కోట్లకు ఎగసింది.

ఫ్లోటింగ్ రేట్ సేవింగ్స్ బాండ్స్‌లో రిటైల్ పెట్టుబడులు

ప్రకటించిన ఆర్‌బీఐ



ముంబై: ఆర్‌బీఐ రిటైల్ డైరెక్ట్ పోర్టల్ ద్వారా 'ఫ్లోటింగ్ రేట్ సేవింగ్స్ బాండ్స్, 2020 (పన్ను వర్తించే)లో రిటైల్ ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టుకునే అవకాశం అందుబాటులోకి వచ్చింది. ఆర్‌బీఐ-రిటైల్ డైరెక్ట్ స్కీమ్‌ను ప్రధాని మోదీ 2021 నవంబర్ 12న ప్రారంభించడం గమనార్హం. ఈ పథకం కింద రిటైల్ ఇన్వెస్టర్లు ఆర్‌బీఐ వద్ద నేరుగా రిటైల్ డైరెక్ట్ గిల్ట్ అకౌంట్‌ను తెరుచుకోవచ్చు. ప్రభుత్వ సెక్యూరిటీల్లో ఈ ఖాతా ద్వారా ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. భారత ప్రభుత్వంతో సంప్రదింపుల అనంతరం ఫ్లోటింగ్ రేట్ సేవింగ్స్ బాండ్స్, 2020లో పెట్టుబడులకు అనుమతిస్తున్నట్టు ఆర్‌బీఐ ప్రకటించింది. ఇప్పటి వరకు ఆర్‌బీఐ రిటైల్ డైరెక్ట్ పోర్టల్ ద్వారా ప్రభుత్వ సెక్యూరిటీలు, ట్రెజరీ బిల్లులు, రాష్ట్ర ప్రభుత్వాల బాండ్లు, సావరీన్ గోల్డ్ బాండ్లలో పెట్టుబడులకు అవకాశం ఉంది. ఫ్లోటింగ్ రేట్ సేవింగ్స్ బాండ్స్ అనేవి ఏడేళ్ల కాల వ్యవధితో ఉంటాయి. ఇవి ట్రేడ్ అయ్యేవి కావు. వీటిని కేంద్ర ప్రభుత్వం జారీ చేస్తుంది. గడువు ముగిసిన తర్వాత చెల్లింపులు చేస్తారు.

మార్కెట్లకు 'మధ్యప్రాచ్యం' సెగ ..

ఇన్వెస్టర్ల సంపద రూ. 7 లక్షల కోట్లు ఆవిరి



ముంబై: మధ్యప్రాచ్యంలో పరిస్థితులు ఆందోళనకరంగా మారుతుండటంతో సోమవారం దేశీ సూచీలు క్షీణించిన నేపథ్యంలో ఇన్వెస్టర్ల సంపద ఏకంగా ఒకే రోజున ఏకంగా రూ. 7.59 లక్షల కోట్ల మేర తుడిచిపెట్టుకుపోయింది. వరుసగా నాలుగు రోజుల వ్యవధిలో కీలక సూచీల పతనంతో బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 12,51,700 కోట్ల మేర హరించుకుపోయి రూ. 311,30,724 కోట్లకు క్షీణించింది. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం సెన్సెక్స్ 826 పాయింట్లు (1.26%) క్షీణించి రూ. 64,572 వద్ద, నిఫ్టీ 261 పాయింట్లు (1.34%) తగ్గి 19,282 వద్ద క్లోజయ్యాయి. దసరా సందర్భంగా దేశీ మార్కెట్లు మంగళవారం పని చేయలేదు. గత బుధవారం నుంచి వరుసగా నాలుగు సెషన్లలో సెన్సెక్స్ 1,925 పాయింట్లు పతనమై కీలకమైన 65,000 మార్కు దిగువకు పడిపోయింది. నిఫ్టీ 530 పాయింట్లు తగ్గింది. ఇజ్రాయెల్-హమాస్ మధ్య ఉద్రిక్తతలకు తోడు ద్రవ్యోల్బణం, మరో దఫా వడ్డీ రేట్ల పెంపు అవకాశాలు, అంతర్జాతీయంగా అనిశ్చితి మొదలైన వాటిపై ఇన్వెస్టర్లలో ఆందోళన నెలకొందని, మార్కెట్ సెంటిమెంట్ బలహీనపడిందని కోటక్ సెక్యూరిటీస్ ఈక్విటీ రీసెర్చ్ (రిటైల్) హెడ్ శ్రీకాంత్ చౌహాన్ తెలిపారు. సెన్సెక్స్‌లో జేఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా మోటార్స్, టాటా స్టీల్, విప్రో, ఎస్‌బీఐ మొదలైనవి క్షీణించాయి. మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్ లాభపడ్డాయి.

సినిమా



• చిరంజీవి, సురేఖ, వశిష్ఠ, విక్రమ్

పాటతో ప్రారంభం

చిరంజీవి హీరోగా 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. ఈ ఫ్యాంటసీ అడ్వెంచరస్ సినిమాను యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్నారు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత అల్లు అరవింద్ కెమెరా స్విచ్ఛాన్ చేయగా, దర్శకుడు కె. రాఘవేంద్ర రావు క్లాప్ ఇచ్చారు. చిరంజీవి, ఆయన సతీమణి సురేఖ కలిసి ఈ సినిమా స్క్రిప్టును మేకర్స్‌కు అందించారు. ఈ సినిమా మ్యూజిక్ రికార్డింగ్స్ ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఈ చిత్ర సంగీత దర్శకుడు ఎమ్ఎమ్ కీరవాణి మాట్లాడుతూ– ''మ్యూజిక్ రికార్డింగ్‌తో పూజా కార్యక్రమాలను ప్రారంభించడం అనేది సంప్రదాయం. ఈ సంప్రదాయాన్ని తిరిగి తీసుకు వస్తూ, చిరంజీవిగారి 156వ సినిమాను మ్యూజిక్ రికార్డింగ్‌తో ప్రారంభించడం జరిగింది. సెలబ్రేషన్ సాంగ్ రికార్డింగ్‌తో పనులు ప్రారంభమయ్యాయి'' అన్నారు. ''అద్భుతమైన పాటలతో వస్తామని హామీ ఇస్తున్నాం. ఈ అరుదైన చిత్రానికి చాన్స్ ఇచ్చిన కీరవాణిగారికి, వశిష్ఠకు, నిర్మాతలకు ధన్యవాదాలు'' అన్నారు రచయిత చంద్రబోస్. ఈ చిత్రానికి కెమెరా: చోటా కె. నాయుడు.

సెలబ్రేషన్స్ టైమ్



• ప్రభాస్ కటౌట్

ప్రభాస్ జన్మదిన (అక్టోబర్ 23) వేడుకను హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి కైతలాపూర్ గ్రౌండ్స్‌లో ఫ్యాన్స్ నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా 'సలార్' చిత్రం లుక్‌తో ప్రభాస్ భారీ కటౌట్‌ను ఆవిష్కరించారు ఫ్యాన్స్. ఈ కార్యక్రమంలో ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ నాయకులు శాస్త్రి, రామకృష్ణ, గోవింద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సంగతి ఇలా ఉంచితే.. ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న 'సలార్' చిత్రంలోని తొలి భాగం 'సలార్: సీజ్‌ఫైర్' డిసెంబరు 22న విడుదల కానుంది. మరోవైపు ప్రభాస్ ప్రస్తుతం ఫారిన్‌లో ఉన్నారని, వచ్చే నెల తన మరో చిత్రం 'కల్కి 2898ఏడీ' షూటింగ్‌లో ఆయన పాల్గొంటారని ఫిల్మ్‌నగర్ సమాచారం.

మాస్ అవతార్



• మహేశ్‌బాబు

మహేశ్‌బాబు హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా సినిమా 'గుంటూరు కారం'. శ్రీలీల, మీనాక్షీ చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఎస్. రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం జనవరి 13న విడుదల కానుంది. దసరా సందర్భంగా 'గుంటూరు కారం' నుంచి కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేసి, త్వరలోనే తొలి పాటను విడుదల చేయనున్నామని, ఈ సినిమాలో అల్ట్రా మాస్ అవతార్‌లో మహేశ్‌బాబు ప్రేక్షకులను అలరిస్తారని చిత్ర యూనిట్ వెల్లడించింది. ఈ చిత్రానికి సంగీతం: తమన్.

దీపావళికి జరగండి



• రామ్‌చరణ్

దీపావళికి జరగండి అంటున్నారు రామ్‌చరణ్. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న సినిమా 'గేమ్ చేంజర్'. ఈ చిత్రంలో కియారా అద్వానీ మెయిన్ హీరోయిన్. ఈ చిత్రంలోని 'జరగండి..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను దీపావళికి విడుదల చేయనున్నట్లు శంకర్ దసరా సందర్భంగా వెల్లడించారు. తమన్ ఈ సినిమాకు స్వరకర్త. వచ్చే ఏడాది ఈ చిత్రం విడుదల కానుంది.

ఐదు భాషల్లో సుబ్రహ్మణ్య



• అద్వయ్

నటుడు-డబ్బింగ్ ఆర్టిస్ట్-రచయిత-ఫిల్మ్ మేకర్ రవిశంకర్ కుమారుడు అద్వయ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రానికి 'సుబ్రహ్మణ్య' టైటిల్‌ను ఖరారు చేశారు. పి. రవిశంకర్ దర్శకత్వంలో ప్రవీణ కడియాల, రామలక్ష్మి సమర్పణలో తిరుమల్ రెడ్డి, అనిల్ కడియాల ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''ఈ చిత్రం కోసం అత్యున్నత ప్రమాణాలతో వీఎఫ్‌ఎక్స్ చేయాల్సి ఉంది. తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: రవి బస్రూర్, కెమెరా: రాజ్‌తోట.

రక్షిత్ ప్యాషన్‌తో వచ్చాడు

– నాగశౌర్య



• సంకీర్తన, రక్షిత్ అట్లూరి, నాగశౌర్య

''రక్షిత్ పుట్టుకతోనే ధనవంతుడు. సినిమాల్లోకి వస్తున్నాడన్నప్పుడు.. డబ్బుంది కదా సినిమాలు చేస్తాడనుకున్నాను. కానీ డబ్బుందని కాదు ప్యాషన్‌తో రక్షిత్ సినిమాలు చేస్తున్నాడు. వాళ్ల నాన్నగారికీ సినిమాలంటే ఇష్టం. ఇద్దరూ మంచి సినిమాలు చేయాలని ఆలోచిస్తుంటారు'' అని హీరో నాగశౌర్య అన్నారు. 'పలాస' ఫేమ్ రక్షిత్ అట్లూరి హీరోగా సెబాస్టియన్ నోవా ఆకోస్టా జూనియర్ దర్శకత్వం వహించిన చిత్రం 'నరకాసుర'. అపర్ణా జనార్దన్, సంకీర్తనా విపిన్ హీరోయిన్లు. డాక్టర్ అజ్జా శ్రీనివాస్ నిర్మించిన ఈ సినిమా నవంబర్ 3న తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్‌ను నాగశౌర్య విడుదల చేసి, మాట్లాడుతూ– ''రక్షిత్ కొత్త కథలు, గ్రామీణ నేపథ్యంలో చిత్రాలు చేస్తుంటాడు. 'నరకాసుర' పెద్ద హిట్టవుతుందని నమ్ముతున్నాను'' అన్నారు. ''ఈ చిత్రంలో రక్షిత్ అద్భుతంగా నటించాడు'' అన్నారు డా. అజ్జా శ్రీనివాస్. ''మా సినిమా ప్రేక్షకుల్ని తప్పకుండా అలరిస్తుంది'' అన్నారు సెబాస్టియన్ నోవా. ''మా సినిమాలో మంచి వినోదం, విజువల్స్, చక్కని సంగీతం, మంచి కథ ఉన్నాయి. సినిమా చూశాక మేం చెప్పింది నిజం కాదని ప్రేక్షకులకు అనిపిస్తే టికెట్, పాప్‌కార్న్ డబ్బులు తిరిగి ఇస్తాం'' అన్నారు రక్షిత్ అట్లూరి.

హైదరాబాదీ కుర్రాడి ప్రేమ

''నేను నటించిన 'కేరాఫ్ కంచరపాలెం' ప్రివ్యూకి వచ్చిన ఆనంద్ 'లింగొచ్చా'కి నన్ను హీరోగా తీసుకున్నాడు. ఇందులో పక్కా హైదరాబాదీ కుర్రాడిలా కనిపిస్తాను. ఒక వైవిధ్యమైన ప్రేమకథకి వినోదం జోడించి ఆనంద్ ఈ సినిమా తీశాడు'' అన్నారు కార్తీక్ రత్నం. ఆనంద్ బడా దర్శకత్వంలో కార్తీక్ రత్నం, సుప్యర్థ సింగ్ జంటగా నటించిన చిత్రం 'లింగొచ్చా'. జె. నీలిమ సమర్పణలో యాదగిరి రాజు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న రిలీజ్ కానుంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో ఆనంద్ బడా మాట్లాడుతూ– ''హైదరాబాద్‌లో బిర్యానీ, ఇరానీ ఛాయ్‌లా మా 'లింగొచ్చా' ఫేమస్ అవుతుంది'' అన్నారు. ''కార్తీక్ రత్నం మంచి నటుడని అందరికీ తెలుసు. కానీ ఆయనలో ఉన్న స్టార్ యాక్టర్‌ని ఈ సినిమా ద్వారా మా దర్శకుడు పరిచయం చేశాడు'' అన్నారు యాదగిరి రాజు.



• సుప్యర్థ, కార్తీక్ రత్నం



• నాని

కొత్త మేకోవర్‌తో యాక్షన్

నాని హీరోగా 'సరిపోదా శనివారం' చిత్రం హైదరాబాద్‌లో ఆరంభం అయింది. ఇందులో ప్రియాంకా అరుళ్ మోహన్ హీరోయిన్. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో డీవీవీ దానయ్య, దాసరి కల్యాణ్ ఈ యాక్షన్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి నిర్మాత 'దిల్' రాజు కెమెరా స్విచ్ఛాన్ చేయగా, దర్శకుడు వీవీ వినాయక్ క్లాప్ ఇచ్చారు. దర్శక-నటుడు ఎస్‌జే సూర్య గౌరవ దర్శకత్వం వహించగా, డీవీవీ దానయ్య స్క్రిప్టును వివేక్ ఆత్రేయకు అందించారు. ''ఈ సినిమాలోని సూర్య పాత్ర కోసం నాని సరికొత్తగా మేకోవర్ కానున్నారు. ఆయన రగ్డ్ లుక్‌లో కనిపిస్తారు'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, కెమెరా: మురళి .జి.

సరైన సినిమా పడిందన్నారు

– సంపూర్ణేష్ బాబు



• వెంకటేశ్ మహా, సంపూర్ణేష్ బాబు

''మార్టిన్ లూథర్ కింగ్' ఓ కొత్త ప్రయోగం. కొన్ని చోట్ల ప్రీమియర్లు వేయగా మంచి స్పందన లభించింది. ఇండస్ట్రీ వారు కూడా 'నీకు సరైన సినిమా పడింది' అన్నారు. ఈ సినిమా చేశాక సమాజం పట్ల నాకు మరింత బాధ్యత పెరిగింది'' అని సంపూర్ణేష్ బాబు అన్నారు. పూజా కొల్లూరు దర్శకత్వంలో సంపూర్ణేష్ బాబు, వీకే నరేశ్, శరణ్య ప్రదీప్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'మార్టిన్ లూథర్ కింగ్'. వైనాట్ స్టూడియోస్, రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పణలో మహాయాన మోషన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా సంపూర్ణేష్ బాబు మాట్లాడుతూ– ''పూజకి ఇది మొదటి సినిమా. నేను చాలా సినిమాలు చేసినా ఈ సినిమా కోసం ఆమె నాతో వర్క్ షాప్ చేయించారు'' అన్నారు. ''ఈ చిత్రంలో ముఖ్య పాత్ర చేయడంతో పాటు స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ అందించి, క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా చేశాను. ప్రజాస్వామ్యం ఎన్ని దేశాల్లో ఉంటే అన్ని దేశాల్లో చూపించాల్సిన సినిమా ఇది. అన్ని భాషల్లోనూ చెప్పాల్సిన కథ'' అన్నారు వెంకటేశ్ మహా.


సస్పెన్స్‌తో బాగుంది



• భవ్యశ్రీ, కిశోర్

'బాగుంది' టీజర్ బాగుంది. కిశోర్ నటన బాగుంది. రామ్‌కుమార్ చక్కగా తీశారు. ఈ సినిమాతో నిర్మాతలకు లాభాలు వచ్చి మరిన్ని చిత్రాలు తీయాలని కోరుకుంటున్నాను'' అన్నారు డైరెక్టర్ వేణు ఊడుగుల. కిశోర్ తేజ, భవ్యశ్రీ జంటగా రామ్‌కుమార్ దర్శకత్వం వహించిన చిత్రం 'బాగుంది'. కట్టా శివ సమర్పణలో రాజనేని వెంకటేశ్వర రావు, డా. మహేంద్ర బాబు నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను డైరెక్టర్ వేణు ఊడుగుల, నిర్మాత సతీష్, ఫస్ట్ లుక్‌ను తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ రిలీజ్ చేశారు. ''సస్పెన్స్ నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం చూసి ప్రేక్షకులు థ్రిల్ అవుతారు'' అన్నారు రామ్‌కుమార్. ''మా సినిమా అన్ని వర్గాల వారికి నచ్చుతుంది'' అన్నారు రాజనేని వెంకటేశ్వర రావు.

విశాఖకు సీఎస్ జవహర్‌రెడ్డి



మహారాణిపేట: మూడు రోజుల పర్యటన నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి మంగళవారం విశాఖ చేరుకున్నారు. విమానాశ్రయంలో జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం అక్కడ నుంచి శ్రీశారదా పీఠం బయలు దేరి వెళ్లారు. బుధవారం ఉదయం 11 గంటలకు ఈస్టర్న్ నేవల్ కమాండ్ హెడ్ క్వార్టర్‌లో జరగనున్న 6వ అపెక్స్ కమిటీ సమీక్షా సమావేశంలో, మధ్యాహ్నం 3.30 గంటలకు కలెక్టరేట్‌లో పీఎం ప్రగతి మీటింగ్‌లో ఆయన పాల్గొంటారు. రాత్రికి విశాఖలో బస చేస్తారు. 26న సాయంత్రం 4.35 గంటలకు విమానంలో విజయవాడ బయలుదేరి వెళ్తారు.

బాధ్యతలు చేపట్టిన లవ్ అగర్వాల్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా 1996 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి లవ్ అగర్వాల్ నియమితులయ్యారు. లవ్ అగర్వాల్ ఏపీలోని పలు జిల్లాల్లో కలెక్టర్‌గా సేవలందించారు. కరోనా సమయంలో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ సంయుక్త కార్యదర్శిగా పనిచేశారు. అనంతరం కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖలో అదనపు కార్యదర్శిగా చేస్తున్న లవ్ అగర్వాల్ ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్‌గా తాజాగా బాధ్యతలు చేపట్టారు.

జీవన నైపుణ్యాలతో విద్యార్థులు శక్తిమంతం

సాక్షి, అమరావతి: జీవన నైపుణ్యాలు పెంపొందించుకోవడం ద్వారా విద్యార్థులు శక్తిమంతులవుతారని గండికోట అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ చీఫ్ ఆఫీసర్ శేఖర్‌బాబు అన్నారు. వైఎస్సార్ జిల్లా గండికోట అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో హైదరాబాద్ జూబ్లీ హిల్స్‌లోని ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులకు చేపట్టిన తొమ్మిది రోజుల శిక్షణ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహస క్రీడలు, జీవన నైపుణ్యాలు, పారిశ్రామిక అధ్యయనం వంటి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినట్టు తెలిపారు. ఈ శిక్షణలో 235 మంది విద్యార్థులు, 13 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారని తెలిపారు. తమ అకాడమీ పరిధిలో రెండు, నాలుగు రోజుల స్వల్పకాలిక శిక్షణ కోర్సులను కూడా నిర్వహిస్తున్నామని, వివరాలకు www. adventuregandikota. com వెబ్‌సైట్, 0091-7671963346 నంబర్లో సంప్రదించవచ్చని శేఖర్‌బాబు పేర్కొన్నారు.

అరుదైన మొక్కకు ‘రాజశేఖరుడి’ పేరు

లెపిడోగాథిస్ రాజశేఖరే మొక్క



లెపిడోగాథిస్ జాతికి చెందిన మొక్కను శేషాచలంలో గుర్తించిన వైవీయూ పరిశోధకులు

- నిర్ధారించిన ప్రముఖ పరిశోధక సంస్థలు
- ‘లెపిడోగాథిస్ రాజశేఖరే’గా నామకరణం
- పలు చికిత్సలకు ఉపయోగపడుతుందన్న పరిశోధకులు

విద్యా రంగానికి దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన సేవలకు గుర్తుగా ఓ అరుదైన మొక్కకు ఆయన పేరు పెట్టి యోగి వేమన యూనివర్సిటీ(వైవీయూ) గౌరవించింది. దీనిని లండన్‌లోని రాయల్ బొటానికల్ గార్డెన్, కోల్‌కతాలోని బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియాతో పాటు మరికొన్ని పరిశోధక సంస్థలు ధ్రువీకరించాయి. వివరాలు.. వైవీయూ వృక్షశాస్త్ర విభాగం ప్రొఫెసర్ డాక్టర్ ఎ.మధుసూదన్‌రెడ్డి, పరిశోధకుడు, ఢిల్లీలోని ఎస్‌వీ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.కె.ప్రసాద్‌ల బృందం 2020లో వైఎస్సార్ జిల్లా బాలుపల్లి అటవీ రేంజ్‌లోని మొగిలిపెంట ప్రాంతంలో ఓ మొక్కను గుర్తించింది. శాస్త్రీయ పరిశోధనల అనంతరం అరుదైన మొక్కగా గుర్తించి.. నిర్ధారణ కోసం లండన్‌లోని రాయల్ బొటానికల్ గార్డెన్, కోల్‌కతాలోని బొటానికల్ సర్వే ఆఫ్ ఇండియా, చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్, సౌత్ చైనా బొటానికల్ గార్డెన్, గాన్‌డోంగ్ ప్రావిన్స్ సంస్థలకు పంపించింది. ఆయా సంస్థలు మొక్క శాస్త్రీయతను నిర్ధారించి.. అరుదైన మొక్కగా గుర్తింపునిచ్చాయి. న్యూజిలాండ్‌కు చెందిన సైంటిఫిక్ జర్నల్ ఫైటోటాక్సాలో దీనిని కవర్ పేజీగా ప్రచురించారు. ప్రపంచం మొత్తం మీద శేషాచలం అడవుల్లో మాత్రమే లభించే మొక్కగా నిర్ధారణ అవ్వడంతో.. ఈ ప్రాంతానికి సంబంధించిన పేరు పెట్టుకునే వెసులుబాటు లభించింది. దీంతో పరిశోధకులు, అధికారులు చర్చించి.. వైవీయూ వ్యవస్థాపకుడు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా ఎందరో పేద విద్యార్థులకు చదువుకునే అవకాశం కల్పించిన దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేరు పెట్టారు.

-వైవీయూ (వైఎస్సార్ జిల్లా)

ఔషధ విలువలు అధికం



లెపిడోగాథిస్ జాతికి చెందిన ఈ మొక్కకు ప్రజాతిగా ‘రాజశేఖరే’(లాటిన్ భాష) పేరును కలిపి నామకరణం చేశారు. లెపిడోగాథిస్ జాతికి చెందిన మొక్కలు ప్రపంచవ్యాప్తంగా 144 ఉండగా.. ఇప్పుడు 145వ మొక్కగా ‘లెపిడోగాథిస్ రాజశేఖరే’ గుర్తింపు పొందింది. భారత్‌లో 34 మొక్కలు ఉండగా.. ఇది 35వది. ఏపీలో 8 మొక్కలు ఉండగా.. ఇది తొమ్మిదవది. ఈ జాతికి సంబంధించిన మొక్కలను స్థానిక భాషలో ముళ్లబంతి, సూర్యకాంతం తదితర పేర్లతో పిలుస్తారు. ఔషధ విలువలు కూడా ఉండటంతో.. సంరక్షించాల్సిన జాతుల కింద వీటిని గుర్తించారు. జ్వరం, ఎగ్జిమా, సొరియాసిస్, ఎపిలెప్సీ, దురద, మౌత్ అల్సర్, కీటకాల కాటు, దెబ్బలు తదితర చికిత్సలకు వీటిని వినియోగిస్తారని వైవీయూ వృక్షశాస్త్ర విభాగ ప్రొఫెసర్ డా.ఎ.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈ మొక్కలకు మార్చి, ఏప్రిల్ నెలల్లో మాత్రమే పూలు పూస్తాయని చెప్పారు. వైవీయూలోని బొటానికల్ గార్డెన్‌లో సంరక్షిస్తున్నట్లు చెప్పారు.

వందేభారత్‌కు మంచి ఆదరణ

- తెలుగు రాష్ట్రాల్లో సూపర్ హిట్
- ప్రయాణికుల్లో 56శాతం మంది యువకులు, ఉద్యోగులు



సాక్షి, అమరావతి: ‘వందే భారత్’ రైళ్లు తెలుగు రాష్ట్రాల్లో మంచి ఆదరణ పొందుతున్నాయి. ఈ రైళ్లను రైల్వేశాఖ ఇటీవల ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఇప్పటివరకు ప్రవేశపెట్టిన వందే భారత్ రైళ్లు వందశాతం ఆక్యుపెన్సీతో నడుస్తూ ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ప్రధానంగా యువత, ఉద్యోగులు ఈ రైళ్లలో ప్రయాణానికి విపరీతమైన ఆసక్తి చూపుతున్నారు. ఆధునిక వసతులు, అత్యధిక వేగంతో ప్రయాణించే ఈ రైళ్లను తమ ప్రయాణానికి మొదటి ప్రాధాన్యంగా ఎంపిక చేసుకుంటున్నారు. సికింద్రాబాద్-విశాఖపట్నం, సికింద్రాబాద్-తిరుపతి, విజయవాడ-చెన్నై సెంట్రల్, కాచిగూడ- యశ్వంత్‌పూర(బెంగళూరు) రైళ్లు 100శాతం కంటే ఎక్కువ ఆక్యుపెన్సీని సాధిస్తుండటమే దీనికి నిదర్శనం. తెలుగు రాష్ట్రాల్లో ప్రయాణించే వందేభారత్ రైళ్లలో ప్రయాణికుల గణాంకాలపై దక్షిణ మధ్య రైల్వే ఆసక్తికరమైన అంశాలను వెల్లడించింది.

- తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటివరకు వందేభారత్ రైళ్లలో 7.16లక్షలమంది ప్రయాణించారు.
- అత్యధికంగా యువత, ఉద్యోగులు 56శాతం మంది ఉన్నారు.
- 25ఏళ్ల నుంచి 34ఏళ్ల వయస్కులు 29.08శాతం మంది ఉన్నారు.
- ఇక 35 నుంచి 49 ఏళ్ల వయసు వారు 26.85శాతం మంది ఉండగా, 11.81శాతం మంది సీనియర్ సిటిజన్లు ఉండటం విశేషం.

‘వందే భారత్’పై రాళ్లు రువ్విన యువకుల అరెస్టు

చీరాల అర్బన్: వందే భారత్ రైలుపై రాళ్లు రువ్విన ఇద్దరు యువకులను సోమవారం బాపట్ల జిల్లా చీరాల ఆర్పీఎఫ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆర్పీఎఫ్ సీఐ వి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల మేరకు ఈనెల 12న చీరాల-స్టువర్టుపురం రైల్వేస్టేషన్ల మధ్య ఇద్దరు యువకులు వందేభారత్ రైలుపై రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో ఈ-1 కోచ్‌లో 3, 4 సీట్ల అద్దాలు పగిలిపోయాయి. ఈక్రమంలో కేసు నమోదు చేసిన ఆర్పీఎఫ్ పోలీసులు విచారణ చేపట్టారు. చీరాల శాంతినగర్‌కు చెందిన ఎస్కే తాబ్రాజ్, చీరాల రూరల్ మండలం తోటవారిపాలేనికి చెందిన జెట్టి శశితరుణ్‌ను అరెస్ట్ చేశామన్నారు. ఇద్దరి నుంచి వివరాలను నమోదు చేసుకుని కోర్టులో హాజరుపరిచారు.

రాష్ట్రంలో శాంతిభద్రతలు భేష్

మహిళా రక్షణకు సీఎం జగన్ పెద్దపీట..
డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్‌లో హోంమంత్రి వనిత



శిక్షణ పూర్తి చేసుకున్న డీఎస్పీలతో హోంమంత్రి తానేటి వనిత, డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి

అనంతపురం క్రైం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్గనిర్దేశంలో పోలీస్ శాఖ అద్భుతంగా పనిచేస్తూ.. రాష్ట్రంలో శాంతిభద్రతలను సమర్థవంతంగా పరిరక్షిస్తుందని రాష్ట్ర హోంశాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. అనంతపురం పోలీసు శిక్షణ కళాశాలలో ట్రైనింగ్ పూర్తిచేసుకున్న 28 మంది ప్రొబేషనరీ డీఎస్పీల పాసింగ్ అవుట్ పరేడ్‌ను సోమవారం పీటీసీ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హోం మంత్రి తానేటి వనిత, డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి హాజరయ్యారు. హోంమంత్రి మాట్లాడుతూ.. దేశంలోనే ఎక్కడా లేనివిధంగా తొలిసారిగా రాష్ట్రంలో మహిళల భద్రత, రక్షణ కోసం సీఎం జగనన్న ‘దిశ’యాప్ తీసుకొచ్చి పోలీస్‌స్టేషన్లు, ప్రత్యేక కోర్టులు తీసుకొచ్చారని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా దిశ యాప్ ద్వారా 30,500 మంది మహిళలు సహాయం పొందారని చెప్పారు. పోలీసుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పోలీసు శాఖలోకి నూతనంగా ప్రవేశిస్తున్న డీఎస్పీలు నిజాయితీగా, సమర్థవంతంగా, నిష్పక్షపాతంగా సేవలందించాలని సూచించారు. డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరాల నియంత్రణ, సోషల్ మీడియా పోకడలను నియంత్రించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. పోలీసులు ఒత్తిడికి లోనుకాకుండా బాధితులకు సకాలంలో సేవలందించేందుకు కృషి చేయాలన్నారు. అనంతపురం పీటీసీ ప్రిన్సిపాల్ వెంకట్రామిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ గీతాదేవి, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల ఎస్పీలు కేకేఎన్ అన్బురాజన్, మాధవరెడ్డి, తాడిపత్రి బెటాలియన్ కమాండెంట్ గంగాధర్ రావు, అనంతపురం ఎంపీ తలారి రంగయ్య, పలువురు ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

మిరపలో నల్లతామర జాడేలేదు

- ప్రతికూల పరిస్థితుల్లోనూ 6 లక్షల ఎకరాల్లో మిరప సాగు
- రైతులు గగ్గోలు పెడుతున్నారంటూ ఈనాడు దుష్ప్రచారం
- ఆ పత్రిక కథనాన్ని తీవ్రంగా ఖండించిన ఉద్యానశాఖ

సాక్షి, అమరావతి: నల్లతామర ప్రభావం వల్ల రాష్ట్రంలో మిరప రైతు గగ్గోలు పెడుతున్నట్టుగా ఈనాడు పత్రిక అవాస్తవ కథనాలు ప్రచురించిందని ఉద్యాన శాఖ కమిషనర్ ఎస్ఎస్ శ్రీధర్ స్పష్టం చేశారు. ఏపీలో మిరప సాధారణ విస్తీర్ణం 4.75 లక్షల ఎకరాలు కాగా, గతేడాది 5.77 లక్షల ఎకరాల్లో, ఈ ఏడాది ఇప్పటికే 6 లక్షల ఎకరాల్లో మిరపసాగైందన్నారు. ప్రభుత్వ చర్యల ఫలితంగా రాష్ట్రంలో మిరపతో సహా ఇతర పంటలపై నల్లతామరతో పాటు జెమినీ వైరస్ ప్రభావం గణనీయంగా తగ్గిందని చెప్పారు. గతేడాది 11.60 లక్షల టన్నుల దిగుబడులు రాగా, ఈ ఏడాది 12 లక్షల టన్నులకు పైగా దిగుబడులొస్తాయని అంచనా వేశామన్నారు. నల్లతామరను తొలిసారి 2021 నవంబర్‌లో గుర్తించిన తర్వాత వైఎస్సార్ ఉద్యాన వన విశ్వవిద్యాలయం సహకారంతో ఉద్యాన శాఖ సస్యరక్షణ చర్యలపై భారీగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించిందని, 2022-23లో పురుగు ఉధృతి గణనీయంగా తగ్గిందని చెప్పారు. అంతేకాకుండా ఏపీ ప్రభుత్వ అభ్యర్థన మేరకు బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చర్ రీసెర్చ్ (ఐఐఏఆర్), సెంట్రల్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్ (సీఐపీఎంసీ) శాస్త్రవేత్తల బృందాలు క్షేత్ర స్థాయిలో పర్యటించి పురుగు నివారణపై తగిన సిఫార్సులను చేశాయన్నారు. ఈ సిఫార్సులకనుగుణంగా ప్రతీ సీజన్‌లో ఆర్బీకే స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. నల్లతామర నివారణ చర్యలపై ముద్రించిన కరపత్రాలు, పోస్టర్లను ఆర్బీకేల్లో ప్రదర్శిస్తున్నామన్నారు. ఈ రబీ సీజన్‌లో అడపాదడపా వర్షాలు కురుస్తుండటం వల్ల ప్రస్తుతం మిరప పంట ఆశాజనకంగానే ఉందన్నారు. గడిచిన నాలుగేళ్లలో ఏ సీజన్‌లో పంట నష్టానికి ఆ సీజన్‌లోనే ప్రతీ రైతుకు పరిహారం అందిస్తున్నామన్నారు. అలాగే ఉచిత పంటల బీమా పరిహారం కూడా ఏటా బాధిత రైతులకు అందిస్తున్నామన్నారు. ఈ విధంగా 4 ఏళ్లలో వైపరీత్యాల వల్ల 1.12 లక్షల ఎకరాల్లో దెబ్బతిన్న పంటలకు సంబంధించి 75,715 మంది రైతులకు రూ. 67.26 కోట్ల పంట నష్టపరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) అందించామన్నారు. అలాగే ఉచిత పంటల బీమా పథకం కింద 1.60లక్షల ఎకరాలకు సంబంధించి 74,058 మంది రైతులకు రూ. 103.10 కోట్ల బీమా పరిహారం అందించామన్నారు. ఇవన్నీ పట్టించుకోకుండా ఈనాడు దుష్ప్రచారం చేయడం పట్ల ఉద్యానశాఖ మండిపడింది. క్షేత్ర స్థాయిలో వాస్తవాలు తెలుసుకొని వార్తలు రాయాలని హితవు పలికింది.

200కు పైగా జబ్బులకు కల్తీయే కారణం

- ఏటా 4.20 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్న వైనం
- ఐదేళ్లలోపు పిల్లల్లో 40 శాతం మంది కూడా..
- కోడెక్స్, ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలో వెల్లడి



ఆహార కల్తీతో అపాయం

సాక్షి, అమరావతి: ప్రపంచంలోని ప్రతి 10 మందిలో ఒకరు కలుషిత ఆహారం తిని అనారోగ్యానికి గురవుతున్నారు. ఇలా 600 మిలియన్ల మంది ఇబ్బంది పడుతున్నారు. కలుషిత ఆహారం కారణంగానే 4.20 లక్షల మంది మరణిస్తున్నారు. ఈ కల్తీ ఆహారంతోనే 200 రకాల వ్యాధులు రావడంతోపాటు యువకులు తీవ్రంగా ప్రభావితమవుతున్నారు. ఐదేళ్ల కంటే తక్కువ వయసున్న పిల్లలు ఏటా 1.25 లక్షల మంది మరణిస్తుంటే వారిలో 40 శాతం మరణాలకు కల్తీ ఆహారమే కారణమని ప్రపంచ ఆరోగ్య సంస్థ, ప్రఖ్యాత స్వచ్ఛంద సంస్థ కోడెక్స్ తాజా నివేదికలో వెల్లడించాయి.

ప్రపంచవ్యాప్తంగా 600 మిలియన్ల మందికి అనారోగ్యం

అతిసారం నుంచి క్యాన్సర్ల వరకూ..

ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం హానికరమైన బ్యాక్టీరియా, వైరస్‌ల అవశేషాలు గల కల్తీ ఆహారం తినడం వల్ల అతిసారం నుంచి క్యాన్సర్ల వరకు 200 కంటే ఎక్కువ వ్యాధులు చుట్టుముడుతున్నాయి. ముఖ్యంగా పసిబిడ్డలు, చిన్నపిల్లలు, వృద్ధులు, వైద్యం పొందుతున్న రోగులను బలి తీసుకుంటున్నట్టు వెల్లడించింది. కల్తీ ఆహారం ప్రజల ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా.. జాతీయ ఆర్థిక వ్యవస్థలు, పర్యాటకం, వాణిజ్యాన్ని కూడా దెబ్బతీస్తున్నట్టు వెల్లడించింది. తక్కువ, మధ్య ఆదాయ దేశాల్లో కల్తీ ఆహారం ఫలితంగా ఉత్పాదకత, వైద్య ఖర్చుల రూపంలో ఏటా 110 బిలియన్ డాలర్లు నష్టపోతున్నట్టు నివేదికలో ప్రకటించింది. భారత్‌లో 70 శాతం మందికి ఆరోగ్యకర ఆహారం కరువైందని పేర్కొంది. భారత్‌కు పొరుగున ఉన్న పాకిస్తాన్, అఫ్గానిస్తాన్, మయన్మార్ దేశాలు ‘ప్రపంచ ఆకలి హాట్‌స్పాట్’లుగా మారుతున్నాయని తెలిపింది. ఈ ప్రభావం పక్కనే ఉన్న భారతదేశంపైనే అధిక ప్రభావం చూపుతోందని యూఎన్‌ఓకు చెందిన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ హెచ్చరించింది.



మన దేశంలోనూ హెల్తీ ఫుడ్ కరువు

గ్లోబల్ హంగర్ ఇండెక్స్-2022 ప్రకటించిన 121 దేశాల్లో భారత్ 107వ స్థానంలో ఉంది. ప్రపంచంలో ఆరోగ్యకరమైన ఆహారం కొనలేని మూడు బిలియన్లలో దాదాపు 973 మిలియన్ల (దాదాపు ఒక బిలియన్) మంది భారతదేశంలోనే నివసిస్తున్నట్టు ఎఫ్ఏఓ వెల్లడించింది. ఇది మన దేశ జనాభాలో 70.5 శాతం. యునైటెడ్ నేషన్స్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (ఎఫ్ఏఓ) ప్రకారం 2020లో ఆరోగ్యకరమైన ఆహారం ఖర్చు 3.3 శాతం పెరిగిందని, అంత ఖర్చు పెట్టే స్తోమత లేకపోవడంతో భారత్‌లోనూ ఆరోగ్యకరమైన ఆహారం కొనలేనివారి సంఖ్య పెరుగుదలకు ఆజ్యం పోసిందని వెల్లడించింది. ఎఫ్ఏఓ ‘స్టేట్ ఆఫ్ ఫుడ్ సెక్యూరిటీ అండ్ న్యూట్రిషన్ ఇన్ ది వరల్డ్-2022’ నివేదిక ప్రకారం 2017లో దేశంలోని 1,002.5 మిలియన్ల మంది ప్రజలు ఆరోగ్యకరమైన ఆహారాన్ని (జనాభాలో 74.9 శాతం) పొందలేకపోయారు. అయితే, తర్వాత రెండు సంవత్సరాలు ర్యాంకింగ్‌లో కాస్త మెరుగుపడింది. 2018లో 966.6 మిలియన్లు (జనాభాలో 71.5 శాతం), 2019లో 948.6 మిలియన్లు (69.4 శాతం) తగ్గింది. అయితే, అనంతర సంవత్సరాల్లో సూచీలో భారత్ వెనుకబడటం గమనార్హం. 2017 తర్వాత ఆరోగ్యకరమైన ఆహారం ధరలు కూడా పెరిగాయని, అందువల్లే ర్యాంకింగ్ తగ్గినట్టు ఎఫ్ఏఓ పేర్కొంది. మన పక్కనే ఉన్న పాకిస్తాన్ (83.5%), బంగ్లాదేశ్ (73.5)తో పోలిస్తే మెరుగ్గానే ఉన్నట్టు చెప్పింది. బురుండి, మడగాస్కర్, లైబీరియా, మలావి, నైజీరియా, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్‌లతో సహా అనేక ఆఫ్రికన్ దేశాల్లోని జనాభాలో 95 శాతం కంటే ఎక్కువ మంది ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోలేకపోతున్నట్టు పేర్కొంది.

ఆరోగ్యకరమైన ఆహారం అంటే..

ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ఆరోగ్యకరమైన ఆహారం అంటే బీపీ, షుగర్ వంటి నాన్-కమ్యూనికబుల్ వ్యాధులు, పోషకాహార లోపాలను నివారించేదిగా ఉండాలి. తీసుకున్న ఆహారం చేసిన పనికి ఖర్చయ్యే కేలరీలు సమతుల్యంగా ఉండాలి. మొత్తం తీసుకున్న కొవ్వులో 30 శాతం కంటే తక్కువ వినియోగంతోపాటు, చక్కెర పదార్థాలు 10 శాతం కంటే తక్కువ ఉండాలి. అయితే, ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడం అనేది ఒక దేశ ఆదాయ స్థాయిని బట్టి ఉంటుందని, సగటు కుటుంబ ఆదాయంలో ఖర్చు 52 శాతానికి మించి ఉంటే, ఆహారం భరించలేనిదిగా చెబుతారు. 2020 లెక్కల ప్రకారం ఆరోగ్యకరమైన ఆహారానికి ప్రపంచ సగటు రోజుకు ఒక వ్యక్తి చేసే ఖర్చు 3.53 డాలర్లుంటే, భారతదేశంలో 2.97 డాలర్లుగా ఉంది. అజర్‌బైజాన్ (2.533 డాలర్లు), ఐస్‌లాండ్ (2.414 డాలర్లు), స్విట్జర్లాండ్ (2.659), యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(3.111 డాలర్లు)లో మొత్తం జనాభా ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనుగోలు చేయగల దేశాలుగా ఉన్నాయి. అదే ఆహారానికి జమైకాలో 6.7 డాలర్లు ఖర్చవుతుంది. ప్రపంచంలో ఆరోగ్యకరమైన ఆహారానికి అత్యధికంగా ఖర్చు చేసే దేశంగా జమైకా నిలిచింది.

విషపు పడగ

ప్రపంచాన్ని భయపెడుతున్న పాముకాట్లు

ఏటా 54 లక్షల మందికిపైగా బాధితులు
- అత్యధికంగా ఆసియాలోనే..



దేశంలో 90 శాతం నాగు పాము కాటుతోనే మరణాలు

భారత్‌లోనే ఎక్కువ పాము కాట్లు

సాక్షి, అమరావతి: ప్రపంచవ్యాప్తంగా పాముకాటు కేసులు భయపెడుతున్నాయి. ప్రపంచంలో ఏటా 54 లక్షల మంది పాముకాటుకు గురవుతున్నారు. ఇందులో 18 లక్షల నుంచి 27 లక్షల మంది విషసర్పాల బారినపడుతున్నారు. ఫలితంగా ఏడాదికి 81 వేల నుంచి 1.37 లక్షల మంది ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది. పాముకాటులోని విష ప్రభావంతో శాశ్వత వైకల్యం బారినపడుతున్న బాధితులు ఏటా మూడు రెట్లు పెరగడం గమనార్హం. ఉష్ణ మండల దేశాల్లో పాముకాటును సాధారణ అంశంగా పరిగణిస్తారు. ఆఫ్రికా, ఆసియా, లాటిన్ అమెరికా దేశాల్లో అత్యధిక కేసులు సంభవిస్తున్నాయి. ఒక్క ఆసియాలోనే ఏటా 20 లక్షల మందిని పాములు కాటేస్తున్నాయి. ఆఫ్రికాలో 4 లక్షల నుంచి 5 లక్షల మంది చికిత్స కోసం పరుగులు పెడుతున్నారు. పాము కాటు బారిన పడిన వారికి చికిత్స అందించడం తక్కువ, మధ్య ఆదాయ దేశాలకు ఆర్థిక భారంగా మారుతోంది. ముఖ్యంగా వ్యవసాయ కూలీలు, చిన్నారులు పాముకాట్ల బారినపడుతున్నారు. ఇది పేదల సమస్య కాబట్టి ప్రభుత్వాలు ఎక్కువ శ్రద్ధ తీసుకోవడం లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ఆందోళన వ్యక్తం చేస్తోంది.

ఉష్ణ మండల వ్యాధిగా గుర్తింపు

విషపూరితమైన పాముకాటు వేస్తే మరణం లేదా పక్షవాతానికి దారి తీస్తోంది. మూత్రపిండాల వైఫల్యం, కణజాలాల్లో తీవ్ర మార్పులతో పాటు శరీరంలోని ఇతర అవయవాల పనితీరు క్షీణిస్తుంది. ఫలితంగా పాము కరిచిన ఆరు గంటల్లో సరైన చికిత్స అందకుంటే మృత్యువాత పడతారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) పాముకాటుకు సంబంధించిన వైద్య పరిభాష అయిన ‘స్నేక్ బైట్ ఎన్వినమింగ్’ను నిర్లక్ష్యం చేసిన ఉష్ణ మండల వ్యాధిగా వర్గీకరించింది. అయితే.. స్నేక్‌బైట్ ఎన్వినమింగ్ వర్కింగ్ గ్రూప్ పేరుతో డబ్ల్యూహెచ్ఓ పాముకాటు విషం వల్ల కలిగే మరణాలను 2030 నాటికి 50శాతం తగ్గించాలని లక్ష్యంగా నిర్ణయించింది. ఈ క్రమంలోనే తగినన్ని యాంటీవీనమ్‌ల (పాము కాటు విరుగుడు) అభివృద్ధికి కృషి చేస్తోంది.

భారత్‌పై ‘బిగ్ ఫోర్’

ప్రపంచంలో పాముకాటు కేసులు, మరణాల్లో దాదాపు సగం భారత్‌లోనే నమోదవుతున్నాయి. ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లలో అత్యధిక మరణాలు సంభవిస్తున్నాయి. 90 శాతం మరణాలకు నాగు పాము కాటే కారణమవుతోంది. దేశంలో దాదాపు 300 రకాల పాములు ఉన్నట్టు అంచనా. వాటిలో దాదాపు 60 విషపూరితమైనవి. కానీ.. ప్రతి 10 మరణాలలో 9 మరణాలు ‘బిగ్ ఫోర్’ నాగుపాము, కట్లపాము (బంగారుస్ కెరులియస్), ఇసుక పింజరి (ఎచిస్ కారినాటస్), రస్సెల్ వైపర్ (డబోయా రస్సెలీ) పాములతోనే సంభవిస్తున్నాయి. ప్రస్తుతం దేశంలో ‘బిగ్ ఫోర్’ పాముల నుంచి పాముకాటుకు చికిత్స చేయడానికి ఉపయోగించే యాంటీవీనమ్‌లను తయారు చేస్తున్నారు. శతాబ్దాల నాటి పద్ధతుల ద్వారా తమిళనాడులోని ఇరులా స్నేక్ క్యాచర్స్ ఇండస్ట్రియల్ కో-ఆపరేటివ్ సంస్థ ద్వారా సేకరించిన నాగు పాము విషాలను ఉపయోగించి యాంటీవీనమ్‌లను ఉత్పత్తి చేస్తున్నాయి.

పాము విషంతోనే విరుగుడు మందు

ప్రపంచ ఆరోగ్య సంస్థ యాంటీవీనమ్‌లను అత్యవసరమైన మందుల జాబితాలో చేర్చింది. యాంటీవీనమ్‌లో తయారీలో సరైన ఇమ్యునోజెన్‌ల (పాము విషాలు) తయారీ సవాల్‌గా మారింది. కొన్ని దేశాలు మాత్రమే యాంటీవీనమ్ తయారీకి తగిన నాణ్యత కలిగిన పాము విషాలను ఉత్పత్తి చేస్తున్నాయి. అక్కడ కూడా తక్కువ డిమాండ్ కారణంగా తయారీదారులు ఉత్పత్తిని నిలిపివేశారు. గత 20 ఏళ్లలో కొన్ని యాంటీవీనమ్ ఉత్పత్తుల ధర నాటకీయంగా పెరిగింది. దీనివల్ల చికిత్స భరించలేనిదిగా మారింది. ఇక్కడ ఒకే యాంటీవీనమ్‌లు అన్ని పాము కాటు చికిత్సకు పనికిరావు. పాముల్లో విషాలు వేర్వేరుగా ఉంటాయి. పాము వయసు, దాని లింగం, జీవన పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. జీవావరణ, ఆహారం ఆధారంగా విషాలు ఒకే జాతిలో రకరకాలుగా మారుతూ ఉంటాయి. ఇప్పటికీ చాలా దేశాల్లో సొంతంగా యాంటీవీనమ్‌ను ఉత్పత్తి చేసే సదుపాయాలే లేవు. ప్రస్తుతం నాగు పాము విషం భారత్‌లో గ్రాము రూ.4 వేలుగా ఉంది. ఇక భూమిపై సంచరించే పాములన్నింటిలో ఆస్ట్రేలియాలోని ఇన్‌లాండ్ తాయ్‌పాన్ పాము అత్యంత విషపూరితమైనది. దీని విషం గ్రాము రూ.10 వేల వరకు ధర పలుకుతోంది.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943


ధార్వాడలో దసరా ఉత్సవాల్లో నృత్యాలు


బెంగళూరు హలసూరు చెరువులో బెంగాలీలచే దుర్గాదేవి విగ్రహాల నిమజ్జనం

న్యూస్‌రీల్

నల్ల జెండాలతో నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

మండ్య: రాష్ట్రంలో కావేరి జలాశయాల నుంచి తమిళనాడుకు నీటిని విడుదల చేయడంపై నిరసనలు కొనసాగుతున్నాయి. జిల్లా రైతు హిత రక్షణ సమితి ఆధ్వర్యంలో చేస్తున్న సత్యాగ్రహ దీక్ష 50వ రోజుకు చేరుకుంది. మంగళవారం నల్ల జెండాలు ప్రదర్శించి విజయదశమిని చీకటి రోజుగా అభివర్ణిస్తూ నిరసన తెలిపారు. జేసీ సర్కిల్‌లో గుమిగూడిన ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సర్ ఎంవీ విగ్రహం ఎదుట దీక్షా శిబిరంలో ధర్నాలో పాల్గొన్నారు.

రూ.1500 కోసం తండ్రి హత్య

తుమకూరు: గుబ్బి తాలూకా కడబ గ్రామంలో తండ్రిని చంపిన కిరాతక కొడుకుని పోలీసులు అరెస్టుచేశారు. రేణుకయ్య (65)ను అతని కుమారుడు రమేశ్ (31) హత్య చేశాడు. పంట అమ్మగా వచ్చిన రూ. 1500 డబ్బుల గురించి గొడవ జరిగింది. ఆ డబ్బులు తనకు ఇవ్వాలని కొడుకు కోరగా తండ్రి ఒప్పుకోలేదు. దీంతో రగిలిపోయిన కొడుకు కత్తితో తండ్రిని నరికాడు. తీవ్ర రక్తస్రావంతో రేణుకయ్య అక్కడికక్కడే కిందపడి మరణించాడు. విషయం తెలిసిన గుబ్బి పోలీసులు అక్కడికి చేరుకుని నిందితుడిని అరెస్టు చేశారు.

జంబూసవారీ.. జన భేరి


మంగళవారం మైసూరులో జంబూ సవారీ ఉత్సవం


జన సందోహం మధ్య గజరాజుల ఊరేగింపు


జంబూసవారీ చూడడానికి కిక్కిరిసిన ప్రజలు


శకటాల ముందు కళాకారుల నృత్యాలు

- వైభవోపేతంగా మైసూరు దసరా ఊరేగింపు
- గజరాజుపై చాముండేశ్వరిదేవి అంబారీ
- సీఎం, ప్రముఖుల పూజలు
- జనసంద్రమైన రాచనగరి
- విజయదశమి ఉత్సవాలు సమాప్తం

మైసూరు: తొమ్మిది రోజులుగా మైసూరు నగరంతో పాటు రాష్ట్రమంతటా ఉత్సుకత కలిగించిన దసరా మహోత్సవాలు విజయవంతంగా సమాప్తమయ్యాయి. ఈ నెల 15న చాముండేశ్వరి సన్నిధిలో మైసూరు దసరా నవరాత్రులు ఆరంభం కావడం తెలిసిందే. అప్పటి నుంచి వారసత్వ నగరిలో రోజూ వైవిధ్య సాంస్కృతిక, కళా ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. ముహూర్తం ప్రకారం మంగళవారం జంబూసవారీ మహా వేడుకను నిర్వహించారు.

సాయంత్రం 5 గంటలకు ప్యాలెస్ ఆవరణలో.. సీఎం సిద్దరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, రాజవంశీకుడు యదువీర్ ఒడెయర్ తదితరులు అభిమన్యు ఏనుగుపై నున్న బంగారు అంబారీలోని చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆపై ఏనుగుల ఊరేగింపు కోలాహలంగా ఆరంభమైంది.

లక్షలాదిగా వీక్షణం

- జంబూ సవారీని వీక్షించేందుకు ప్రజలు పోటీపడ్డారు. సోమవారం మధ్యాహ్నం నుంచే జంబూ సవారీ ఊరేగింపు సాగే ప్రాంతాల్లో స్థలం కోసం పోటీలు పడ్డారు. ఒకరు చేతి రుమాలు, ఇంకొకరు దుప్పటి, మరొకరు రాయి, ఇంకొకరు చాప వేసి చోటు రిజర్వ్ చేసుకున్నారు.
- ఊరేగింపును లక్షలాది మంది వీక్షించారు. అధికారికంగా టికెట్ కొన్నవారి కోసం 40 వేల సీట్లను ఏర్పాటు చేశారు. దేశ విదేశాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు.
- మత సామరస్యతకు జంబూసవారీ అద్దం పట్టింది. చామరాజ మొహల్లాలో ఉన్న హజరత్ ఇమామ్ షా వలీ దర్గా వద్ద నుంచి ఏనుగులు వెళ్లాయి. ఆ సమయంలో దర్గా వద్ద ఆపి పూజలు చేసి, సాంబ్రాణి వేసి ఏనుగులకు గంధం పెట్టారు. దర్గా ముఖ్యులు మహమ్మద్ నఖీబుల్లా షా ఖద్రీ పాల్గొన్నారు.
- గజరాజులు బన్ని మంటప వరకు నడిచి అక్కడ పూజల తరువాత మళ్లీ ప్యాలెస్‌కు తిరుగుముఖం పట్టాయి. దారిపొడవునా కళాబృందాలు, శకటాలు, జన సందోహం మిన్నంటింది.
- భద్రత కోసం సుమారు 6 వేల మంది పోలీసులను వినియోగించారు. జంబూ సవారీకి ఉగ్రవాదుల ముప్పు ఉందని నిఘా వర్గాల హెచ్చరికల మేరకు క్షుణ్ణంగా తనిఖీలు చేశారు.
- దసరా ప్రచారం కోసం ఏర్పాటు చేసిన సూచక ఫలకాలు, బోర్డులు, ఫ్లెక్సీల్లో ఇంగ్లిష్‌లో రాశారని కొందరు కన్నడ క్రియా సమితి కార్యకర్తలు మసి పూసి నిరసన తెలిపారు.

కన్నుల పండువగా శకటాలు

చారిత్రక జంబూ సవారీ ఊరేగింపులో కన్నడ నాడు సంస్కృతీ సంప్రదాయాలు, చరిత్రను చాటేలా శకటాల ప్రదర్శన సాగింది. అన్ని జిల్లాలు, ప్రధాన ప్రభుత్వ శాఖల కలిసి 31కి పైగా శకటాలను రూపొందించాయి. సవారీకి హాజరైన లక్షలాది మంది వీక్షించారు. యునెస్కో గుర్తింపు దక్కిన హోయ్సళ దేవస్థానం, బేలూరు, హళేబీడు, సోమనాథపురం దేవాలయాల స్తబ్ధచిత్రాలు ఆకర్షణగా నిలిచాయి. చంద్రయాన్-3, ఐదు గ్యారంటీల స్కీమ్‌ల శకటాలు కూడా ఏర్పాటయ్యాయి. జంబూ సవారీ ఊరేగింపులో జానపద, ఆదివాసీ కళాకారుల ప్రదర్శన ప్రశంసలు అందుకుంది. కళాకారులు తమ కళల సంస్కృతీ సంప్రదాయానికి అనుగుణంగా వేష, భూషణాలతో పాల్గొన్నారు. జానపద గేయాలు పాడుతూ సంగీత వాయిద్యాలతో వీక్షకులను అలరించారు. నంది ధ్వజ, వీరభద్ర కుణిత, కుంబు కహాళె, డోలు, జూంజ్ పథక్ నృత్యం, కంసాలె, సోమన, కుణిత, నవీలు నృత్యం తదితర నృత్యాలు ఆకట్టుకున్నాయి.


అంబారీలో కొలువైన అమ్మవారు


విశ్వరూప దర్శనం.. ఓ కళాకారుని ప్రదర్శన

దసరా ఏనుగుకు ప్రసవం

- శివమొగ్గలో ఘటన

శివమొగ్గ: దసరా ఊరేగింపునకు తీసుకువచ్చే ఏనుగులు అన్నీ ఆరోగ్యంగా ఉండాలి. గర్భంతో ఉన్న ఏనుగులను ఉత్సవాలకు తీసుకురాకూడదు. కానీ మరోసారి శివమొగ్గలో అందుకు విరుద్ధంగా జరిగింది. సక్రెబెలు శిబిరం నుంచి కొన్ని రోజుల క్రితం తీసుకొచ్చిన నేత్రావతి ఏనుగు సోమవారం రాత్రి ప్రసవించింది. నేత్రావతి గర్భిణి అనే విషయం తెలియకుండా ఊరేగింపు కోసం ఆ ఏనుగును తరలించడం, రోజూ గంటలకొద్దీ సాధన చేయించడంపై సామాన్య ప్రజలు మండిపడుతున్నారు. సక్రెబెలు వన్యజీవి వైద్యులకు ఆ ఏనుగు నిండు గర్భంతో ఉన్నదని తెలియదా?, అధికారులు కోరగానే పరీక్షించకుండా ఏనుగులు పంపిస్తారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఇందులో అటవీ శాఖ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని మండిపడుతున్నారు. ఈ విషయంపై పాత్రికేయుడు టెలెక్స్ రవికుమార్ అటవీ శాఖ మంత్రికి లేఖ ద్వారా ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం నేత్రావతి, పిల్ల ఏనుగును శివమొగ్గ నగరం నుంచి తిరిగి శిబిరానికి పంపించారు. గతంలో మైసూరులో కూడా ఇదేమాదిరిగా జరిగింది.

పులి గోరుకు కటకటాలు

- ధరించినందుకు బిగ్‌బాస్ పోటీదారు సంతోష్ అరెస్టు
- మరికొందరు ప్రముఖులపై ఫిర్యాదులు


వర్తూరు సంతోష్


నటుడు దర్శన్ మెడలోని పులి గోరు (ఫైల్)

యశవంతపుర: పులి గోరును మెడలో ధరించి దర్జా ప్రదర్శించిన బిగ్‌బాస్-10 పోటీదారు వర్తూరు సంతోష్ కటకటాలు లెక్కిస్తున్నాడు. వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద అతన్ని బెంగళూరు అటవీశాఖ అధికారులు అరెస్ట్ చేసి పరప్పన జైలుకు పంపారు. ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అటవీశాఖ అధికారులు బెంగళూరు రాజరాజేశ్వరినగర సమీపంలోని సంతోష్ ఇంటికెళ్లి ఆదివారం రాత్రి అరెస్ట్ చేశారు. జడ్జి ఇంటిలో హాజర్ పరచగా నవంబర్ 6 వరకు రిమాండ్ విధించారు. అతని బెయిలు పిటిషన్‌పై బుధవారం విచారణ జరుగుతుంది.

వర్తూరుకు చెందిన సంతోష్ వ్యవసాయ కుటుంబానికి చెందినవాడు. హళ్లికార్ జాతి ఎద్దులను సాకుతున్న సంతోష్ ఎద్దుల పోటీలలో పాల్గొని పేరు సంపాదించి బిగ్‌బాస్ పోటీలకు వెళ్లాడు. చట్ట ప్రకారం నిజమైన పులి గోర్లు ధరించడం నేరం. ఈ కేసులో నేరం రుజువైతే 3 నుంచి 7 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా పడే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

దర్శన్, వినయ్ గురూజీలపై ఫిర్యాదు

ఇదే మాదిరిగా పులి గోర్లు ధరించే ప్రముఖ నటుడు దర్శన్‌కు చిక్కులు తప్పేలా లేవు. సంతోష్ కేసు నేపథ్యంలో సినీ, టీవీ రంగాల్లో అనేక మంది పులిగోర్లను వేసుకున్నవారి ఫోటోలు వైరల్ అవుతున్నాయి. వీరిలో పేరు గాంచిన ఆధ్యాత్మికవేత్త వినయ్ గురూజీ, నటుడు దర్శన్‌లపై సర్వ సంఘటన ఒక్కూట అధ్యక్షుడు శివకుమార్ అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. వారిద్దరినీ విచారించాలని కోరారు. ఇద్దరిపై అటవీశాఖ అధికారులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది. మునుముందు ఏం జరుగుతుందోనని ఇద్దరి అభిమానుల్లో కలవరం మొదలైంది.

మూడిగెరెలో ఇద్దరి అరెస్ట్

వెండి గొలుసుకు పులి గోరును వేసుకొని తిరుగుతున్న ఇద్దరిని చిక్కమగళూరు జిల్లా మూడిగెరెలో అరెస్ట్ చేశారు. సతీశ్, రంజిత్‌లు పులిగోరు వేసుకొని తిరుగుతున్నట్లు తెలిసి పట్టుకున్నారు. పులిగోర్లను అమ్ముతున్న ఇద్దరు పరారయ్యారు.

వ్యాపారిని కిడ్నాప్ చేసి.. చితకబాది..



శివాజీనగర: నగరంలో రామమూర్తి నగర పోలీస్ స్టేషన్ వ్యాప్తిలో అభిలాష్ దామోదరన్ అనే వ్యాపారిని అనే కోమల మహిళ ఆర్థిక గొడవలతో కిడ్నాప్ చేయించింది. వీరిద్దరూ కలిసి వ్యాపారం చేస్తుండేవారు, అందులో రూ.1.5 కోట్ల విషయమై గొడవ జరుగుతోంది. ఈ నేపథ్యంలో 20న రాత్రి సంపిగెహళ్ళిలో అతని ఇంటి వద్ద కోమల, సందీప్, గోపాల్, భాస్కర్‌తో పాటు 8 మంది బృందం కిడ్నాప్ చేసి, రామమూర్తి నగరలోని గోదాములో ఉంచారు. అతన్ని చాకు, పిస్టల్‌తో బెదిరించి రూ.50 లక్షలు ఇవ్వాలని కోరారు. తలపై బీరు బాటిల్‌తో బాదారు. బాధితుడు డబ్బు ఇచ్చేది లేదని చెప్పడంతో భార్య, తండ్రికి వీడియో కాల్ చేసి వారి ముందే చావబాదారు. దుండగులు భోజనానికి వెళ్లిన సమయంలో అక్కడ ఉన్న ఒక ఫోన్ ద్వారా బాధితుడు అభిలాష్ పోలీసులకు కాల్ చేసి చెప్పాడు. వెంటనే అభిలాష్‌ను కాపాడి నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు. కోమల తదితర కొందరు నిందితులు పరారీలో ఉండగా, కేసు విచారణలో ఉంది.

మైసూరులో రైతుల ధర్నా

మైసూరు: ఒకవైపు అట్టహాసంగా మైసూరు దసరా ఉత్సవాలు జరుగుతుండగా, మరోవైపు రైతులు ముట్టడికి యత్నించడంతో ఉద్రిక్తత నెలకొంది. ప్రభుత్వానివి రైతు వ్యతిరేక విధానాలంటూ మంగళవారం బెంగళూరు-మైసూరు రోడ్డులో ఉన్న కొలంబియా ఏసియా సర్కిల్‌లో ఉదయం 9 గంటలకు రాష్ట్ర రైతు సంఘాల ఒక్కూట రాష్ట్రాధ్యక్షుడు కురుబూరు శాంతకుమార్ నేతృత్వంలో రాస్తారోకో జరిగింది. రైతులకు-పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసులు రైతులను అరెస్టు చేసి వ్యాన్‌లోకి ఎక్కించి సీఏఆర్ పెరేడ్ మైదానికి తీసుళ్లారు.

అరేబియా పాలై ఇద్దరు మృతి

యశవంతపుర: ఉడుపి జిల్లా మురుడేశ్వర విహారయాత్రకు వెళ్లిన ఇద్దరు అరేబియా సముద్రంలో మునిగి మరణించారు. సోమవారం బాగలకోట జిల్లాకు బూదిహాళకు చెందిన మంజునాథ్ రమేశ హడపద (25) కుటుంబంతో కలిసి మురుడేశ్వరకు విహారయాత్రకు వెళ్లారు. సముద్రంలో ఈతకు వెళ్లగా అలలకు సముద్రంలో కొట్టుకుపోయి మరణించాడు. మరో ఘటనలో బాగలకోట జిల్లా లోకాపురకు చెందిన కృష్ణప్ప కరియప్ప హరకంగి (18) స్నేహితులతో సముద్ర ఒడ్డున ఉండగా అలలకు కొట్టుకుపోయి చనిపోయాడు.

ప్యాలెస్‌లో ధూంధాం

- యదువీర్ దసరా పూజలు


ఆయుధాలకు పూజ చేస్తున్న యదువీర్

మైసూరు: నగరంలోని మైసూరు ప్యాలెస్‌లో రాజ సంప్రదాయం ప్రకారం ఆయుధ పూజను రాజవంశస్తులు యదువీర్ ఒడెయార్ ఘనంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున 5.30 గంటలకు చండీ హోమంతో పూజా కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయి. ఉదయం 6.05 గంటల నుంచి 6.15 గంటల వరకు ప్యాలెస్‌లోని ఆయుధ సామగ్రిని సోమేశ్వర దేవాలయానికి తీసుకొచ్చారు. 7.15 గంటలకు ప్రత్యేక పూజలు చేసి మళ్లీ ప్యాలెస్‌కు తరలించారు. ఉదయం 9.30 గంటలకు చండీ హోమం, పూర్ణాహుతి సాగింది. 11.45 గంటలకు కళ్యాణ మండపానికి ఏనుగు, గుర్రం, ఒంటెను తీసుకొచ్చారు. మధ్యాహ్నం 12.20 గంటల నుంచి 12.45 వరకు యదువీర్ ఆయుధ పూజను చేవారు. పూజా కైంకర్యాలను బాల్కనీ నుంచి యదువీర్ భార్య త్రిషిక, కుమారుడు ఆద్యవీర్, రాజమాత ప్రమోదా దేవీ తిలకించారు. ఆపై ఆయన విజయ యాత్ర చేపట్టి జమ్మి చెట్టుకి పూజలు చేసి ఉత్సవాలను ముగించారు.


ప్యాలెస్‌లో సందర్శకులకు ఏనుగు పలకరింత


వీక్షిస్తున్న రాజ కుటుంబీకులు

క్లుప్తంగా

దుష్టశిక్షణకు ప్రతీక దేవి నవరాత్రులు



పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: సమాజంలో దుష్ట శిక్షణ, శిష్ట రక్షణకు ప్రతీక దేవి నవరాత్రులని భాళే హోన్నూరు రంభాపుర జగద్గురువు వీర సోమేశ్వర అన్నారు. 32వ శరవన్న రాత్రి దసరా ధర్మ సమ్మేళన ముగింపు సమావేశంలో స్వామీజీ మాట్లాడారు. నేటి ఆధునిక భారత దేశంలో మహిళలపై జరుగుతున్న హింసను అణచివేయాలన్నారు. దసరా ధర్మ సమ్మేళనం జాగృతి కార్యక్రమాలను చేపట్టమన్నారు. అనంతరం పుస్తకాన్ని ఆవిష్కరించారు. స్వామీజీలు, మాజీ మంత్రులు బసవరాజ పాటిల్, అమరే గౌడ బయ్యాపూర్, వెంకట్రావ్ నాడగౌడ, శాసన సభ్యులు మానప్ప వజ్జల్ తదితరులు పాల్గొన్నారు.

హట్టిలో భూ ప్రకంపనలు

రాయచూరు రూరల్: లింగసుగూరు తాలూకా హట్టి బంగారు గనుల కంపెనీ ప్రాంతంలో భూమి కంపించింది. హట్టి పరిసర ప్రాంతాల్లో హట్టి, వీరాపూర్, వజ్జల గట్ట, నీలోగల్ ప్రాంతాలలో సోమవారం కొన్ని సెకెండ్ల పాటు భూ ప్రకంపనలు కనిపించాయి.

యరమల దొడ్డిలో చిరుత దాడి ?



మృతి చెందిన జింక

రాయచూరు రూరల్: మాన్వి తాలుకా యరమల దొడ్డిలో చిరుత కనిపించడంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మూడు రోజుల క్రితం చిరుత జింకతో పాటు మేకలను బలి తీసుకుంది. వెంటనే చిరుతను బంధించాలని స్థానికులు కోరుతున్నారు.

కిత్తూరు రాణి చెన్నమ్మను ఆదర్శంగా తీసుకోవాలి



రాయచూరు రూరల్: వీరనారి కిత్తూరు రాణి చెన్నమ్మను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కన్నడ సాంస్కృతి శాఖాధికారి మంగళ నాయక్ అన్నారు. సోమవారం కన్నడ భవనంలో జిల్లాధికార యంత్రాంగం, జిల్లా పంచాయతీ, నగరసభ ఆధ్వర్యంలో రాణి చెన్నమ్మ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

ముగిసిన విజయ దశమి ఉత్సవాలు



అలంకారంలో నగరేశ్వరుడు

రాయచూరురూరల్: దసరా ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. నగరంలోని కిల్లే బృహన్మఠం వెండి అంబా భావాని ప్రతిమకు ప్రత్యేక పూజలు చేశారు. కందగడ్డ మారెమ్మ, ఆలయం, కోటలోని కాళిక ఆలయంలో అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. అదే విధంగా నగరేశ్వరాలయంలో వెంకటేశ్వర స్వామికి రథోత్సవం నిర్వహించారు.

రెండు కాళ్లతో దూడ జననం

హొసపేటి: విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకా హరకబావి గ్రామంలో సోమవారం ఓ ఆవు రెండు కాళ్ల దూడకు జన్మనిచ్చింది. హడపద బసవణ్ణకు చెందిన ఆవు విజయదశమి రోజు దూడకు జన్మన్విడంతో స్థానికులు దూడకు పూజలు చేశారు. జన్యుపరమైన లోపం కారణంగా రెండుకాళ్లతో జన్మించినట్లు పశు వైద్యులు చెబుతున్నారు.

జమ్మిచెట్టుకు పూజలు



బళ్లారి అర్బన్: దసరా సందర్భంగా మంగళవారం సాయంత్రం సమీపంలోని బన్ని మహంకాళమ్మ వద్ద వెలసిన జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జమ్మి పత్రిని తీసుకొని సమీపంలోని ఆలయాలను దర్శించి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో పాటు పెద్దలకు, గురువుల కాళ్లకు నమస్కరించి ఆశీర్వాదం పొందారు. విజయదశమి నాటి నుంచి అన్ని విజయాలు చేకూరాలని జమ్మి పత్రి తీసుకుని ఇచ్చి పుచ్చుకోవడం ఆనవాయితీ.

అన్నభాగ్య బియ్యం పక్కదారి

ఆగని అక్రమ దందా

- గోడౌన్లకు చేర్చి అక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు
- రేషన్ బియ్యానికి పాలిష్ చేసి అమ్మకాలు



పాలిష్ చేసి పొరుగు రాష్ట్రాలకు తరలింపు

సాక్షి,బళ్లారి: రేషన్ కార్డుల కోసం వేలాది మంది ఎదురు చూస్తుంటే మరోవైపు టన్నుల కొద్ది బియ్యం పక్కదారి పడుతున్నాయి.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పది కేజీల బియ్యం ఇవ్వాలని భావించింది. అయితే ఒక్కొక్కరికి పది కేజీలు ఇవ్వడం కష్టమని, గతంలో మాదిరిగానే ఐదు కేజీలు ఇస్తూ మిగలిన ఐదు కేజీలకు నగదు వారి ఖాతాలోల వేసేందుకు ప్రయత్నం చేస్తోంది. ఇందులో కొందరికి నగదు బ్యాంకులో పడుతోందని పేర్కొంటున్నారు.

ఇతర రాష్ట్రాలకు చేరవేత :

ఇదిలా ఉంటే ఏటా టన్నుల కొద్ది బియ్యం ఇతర రాష్ట్రాలకు తరలిపోతోంది. దీనిపై కేసులు కూడా నమోదువుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా కాకుండా విజయనగర, తదితర జిల్లాల నుంచి కూడా అన్నభాగ్య బియ్యం అక్రమంగా రవాణా జరుగుతోంది. రేషన్‌కార్డుదారులు కూడా సగం మంది నేరుగా అన్నభ్యాగ్య బియ్యం అమ్మకాలు చేయడం వల్ల అక్రమ రవాణాకు దారులు ఏర్పడుతున్నాయి. బళ్లారి జిల్లా ఆంధ్రప్రదేశ్‌కు సరిహద్దున ఉండటంతో చెక్‌పోస్టులు దాటిస్తే ఇతర రాష్ట్రాలకు పెద్ద ఎత్తున లారీల్లో తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. రేషన్‌కార్డుదారులతో కేజీ బియ్యాన్ని రూ.10లకే కొనుగోలు చేసి వాటికి పాలిష్ చేసి రూ.45 నుంచి రూ.50లకు అమ్మకాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు లబ్ధిదారులు బియ్యాన్ని హోటళ్లకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. లబ్ధిదారుల నుంచి సేకరించిన బియ్యాన్ని రహస్య ప్రాంతాలకు చేర్చి అక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. అక్రమ రవాణాపై దాదాపు 20 కేసులు నమోదయ్యాయి.

ఇక్కడ లబ్ధిదారులే బియ్యాన్ని రేషన్‌షాపు యజమానులు, లేదా వారే మార్కెట్‌లో విక్రయించడం గమనార్హం. ఈ దందా పూర్తిగా అడ్డుకట్ట వేయాలంటే ముందుగా రేషన్‌షాపు డీలర్లతో పాటు రేషన్‌కార్డు దారులు కూడా బియ్యాన్ని విక్రయించకపోతే ఎలా పెద్ద ఎత్తున ఇతర ప్రాంతాలకు బియ్యం సరఫరా చేసేందుకు వీలవుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారి మాట్లాడుతూ... రేషన్‌బియ్యం పక్కదారి పట్టకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నామని, పోలీసులు సహకారంతో చెక్‌పోస్టులు వద్ద గట్టి నిఘా పెట్టామని, సమాచారం ఆధారంగా కూడా దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు.

ఘనంగా ఆయుధపూజ



పూజలు చేస్తున్న భరత్‌రెడ్డి దంపతులు

సాక్షి,బళ్లారి: నగరంలో గాంధీనగర్‌లో శ్రీ రాఘవేంద్ర ఎంటర్ ప్రైజస్ కార్యాలయంలో ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఆయుధ పూజ నిర్వహించారు. సోమవారం రాత్రి దసరా పండుగ సందర్భంగా ప్రముఖులు, స్వామిజీలు సమక్షంలో సంప్రదాయబద్ధంగా ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డితో పాటు ఆయన సతీమణి పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర, బళ్లారి ఐజీపీ లోకేష్ కుమార్, జిల్లాధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా, జిల్లా ఎస్పీ రంజిత్ కుమార్ బండారి, మాజీ ఎమ్మెల్యే నారా సూర్య నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబారీపై అమ్మవారి ఊరేగింపు



అమ్మవారిని ఏనుగుపై ఊరేగిస్తున్న దృశ్యం

గంగావతి: విజయ దశమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆనెగుంది సమీపంలోని మేగోట దుర్గాదేవిని ఏనుగు అంబారీపై ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపును రాజా శ్రీకృష్ణదేవరాయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆనెగుంది గ్రామానికి వందలాది మంది మహిళలు పూర్ణకుంభాలు, డప్పులతో అమ్మవారి సన్నిధికి చేరుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి, కొప్పళ ఎంపీ కరడి సంగణ్ణ, మాజీ ఎంపీ హెచ్‌జీ రాములు, మాజీ ఎమ్మెల్సీ హెచ్‌ఆర్.శ్రీనాథ్, మాజీ ఎమ్మెల్యే కరియన్న సంగటి తదితరులు పాల్గొన్నారు. గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్దన్‌రెడ్డి సతీసమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు.



ట్రాక్టర్‌లో అమ్మవారి వేషధారణలో చిన్నారులు

వేడుకగా పల్లకీల ఉత్సవం

మాలూరు: తాలూకాలో మంగళవారం విజయదశమి సంబరాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. లక్కూరు గ్రామంలో గ్రామ దేవతల పల్లకీ ఊరేగింపు చేపట్టారు. లక్కూరు గ్రామంలో నవరాత్రి ఉత్సవాలకు వంద సంవత్సరాల చరిత్ర ఉంది. మైసూరు మహారాజు దసరా మహోత్సవాలను నిర్వహించిన విధంగా సాంప్రదాయ రీతిలో ఇక్కడ దసరా ఉత్సవాలను నిర్వహిస్తారు. గ్రామ దేవతల ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించిన అనంతరం గ్రామంలోని ప్రసన్న సోమేశ్వర స్వామి దేవాలయం వద్ద ఉన్న శమి వృక్షానికి పూజలు చేశారు.

అంబరాన్నంటిన విజయ దశమి సంబరాలు



బళ్లారి కనకదుర్గమ్మకు ఆభరణాల అలంకరణ



ఆలయంలో సాంస్కృతిక కార్యక్రమాలు



కన్యకా పరమేశ్వరి దేవికి శివపార్వతి అలంకరణ



బెంకి మారెమ్మకు దూది అలంకరణ



చినదుర్గమ్మకు విశేష అలంకరణ

బళ్లారి అర్బన్: బళ్లారిలో విజయ దశమి సంబరాలు అంబరాన్నంటాయి. బళ్లారి నగర ఆరాధ్య దైవం శ్రీ కనకదుర్గమ్మ ఆలయం భక్తులతో పోటెత్తింది. మూడు రోజుల పాటు అమ్మవారికి బంగారు ఆభరణాల అలంకరణాలతో పూజలు నిర్వహించారు. కర్ణాటకతో పాటు ఆంధ్ర, తెలంగాణ, మహారాష్ట్రల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయంలో దేవి నవరాత్రుల పూజలు నిర్వహించి సాయంత్రం ప్రవచనాలు, దేవి పురాణం, సాంస్కృతిక నృత్యాలు, భక్తి గీతాలు, కుంకుమార్చనలు, నిర్వహించినట్లు దేవస్థాన ఈఓ హనుమంతప్ప, ధర్మకర్త రాజశేఖర్ తెలిపారు. పండుగ సందర్భంగా అమ్మవారికి పల్లకీ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం రావణ దహనాన్ని భక్తుల సమక్షంలో నిర్వహించారు. రాజగోపురంతో పాటు ఆలయాన్ని విద్యుద్దీపాలను అలంకరించారు.

నిజరూప దర్శనమిచ్చిన అమ్మవార్లు

బళ్లారి అర్బన్: విజయదశమి సందర్భంగా బళ్లారి నగరంలోని 9వ రోజు దేవి నవరాత్రులు అలంకరణ ముగించి 10వ రోజున మంగళవారం పండుగ రోజు అమ్మవార్లకు నిజరూప అలంకరణలతో పూజలు నిర్వహించారు. పటేల్‌నగర్ చిన్న దుర్గమ్మకు శ్రీ విష్ణుదేవి నిజరూప అలంకరణ, మిల్లర్‌పేట్ మల్నాడు దుర్గామ్మ నిజరూప అలంకరణ, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవికి శివపార్వతి అలంకరణ, వాసవీ కళ్యాణ మంటపంలో మహిషాసు మర్ధిని అలంకరణ, నగరేశ్వరి ఆలయంలో పార్వతి దేవికి కాళిక దేవి అలంకరణ, అవంబావి సీతారామ ఆశ్రమంలో రాజ రాజేశ్వరిదేవి అలంకరణ, బెంకి మారెమ్మ దేవికి వెండి ఆభరణాలు, దూదితో అలంకరణ, చిన్నమార్కెట్ శాంభవి దేవికి గౌరిదేవి అలంకరణ, సిరుగుప్ప రోడ్డు తౌలిజ యల్లమ్మ ఆలయంలో రాజరాజేశ్వరిదేవి అలంకరణ, ఏళ్లమక్కళ తాయి ఆలయాల్లో విశేష పూజలు చేశారు.

ఆకట్టుకున్న నాడహబ్బ ఉత్సవాలు



ఉత్సవాలను ప్రారంభిస్తున్న స్వామీజీ

రాయచూరు రూరల్: నగరసభ ఆధ్వర్యంలో నాడహబ్బ ఉత్సవాలను కిల్లే బృహన్మఠ మఠాధిపతి శాంతమల్ల శివాచార్యులు నాడదేవికి పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కరగ ఉత్సవం, వీరగాసే, లంబాడీ మహిళల నృత్యం, బొమ్మలాటలు ఆకట్టుకున్నాయి. శాసనసభ్యుడు శివరాజ్ పాటిల్, కమిషనర్ గురు సిద్దయ్య, రవి బోసురాజ్, సభ్యులు జయన్న, బసవరాజ్, రవీంద్ర, హరీష్, అంజనేయ, శివమూర్తి, నరసింహులు, ముక్తియార్ తదితరులు పాల్గొన్నారు.



కరగ ఉత్సవం

యువకుడి దారుణ హత్య

హుబ్లీ: విజయదశమి రోజే వాణిజ్య నగరి హుబ్లీలో గుర్తు తెలియని యువకుడు హత్యకు గురయ్యాడు. మంగళవారం వెలుగు చూసిన ఘటన వివరాలు.. హుబ్లీ శివారు శివల్లి రైల్వే బ్రిడ్జి వద్ద 30 ఏళ్ల గుర్తు తెలియని యువకుడి శవాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. యువకుడి గొంతు ముఖం, శరీరంలో పలు చోట్ల గాయాలు కనిపించాయి. ఘటన స్థలాన్ని పోలీసు ఉన్నతాధికారులు పరిశీలించారు. అశోక్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

బైక్ ఢీకొని మహిళకు గాయాలు

రోడ్డు దాటుతున్న మహిళను బైక్ ఢీకొన్న ఘటన హుబ్లీ కేశ్వపుర సర్కిల్ జైన్ దేవస్థానం వద్ద మంగళవారం చోటు చేసుకుంది. ఘటనలో జోష్నజైన్ తీవ్రంగా గాయపడింది. జోష్న జైన్ పండుగ సందర్భంగా ఆలయానికి వెళ్లే క్రమంలో రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. హుబ్లీ తూర్పు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఆదిత్య మల్లికార్జున అనే వ్యక్తి బైక్‌తో ఢీకొట్టినట్లు సీసీ కెమెరాలో రికార్డయింది.

మఠాధీశులతో శాంతి, అభివృద్ధి

- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాగేంద్ర



మంత్రి నాగేంద్రను సన్మానిస్తున్న స్వామీజీలు

సాక్షి,బళ్లారి: రాష్ట్రంలోని మఠాధీశులు శాంతి, అభివృద్ధికి కారకులని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర పేర్కొన్నారు. నగరంలోని కణేకల్లు బస్టాండు సమీపంలోని శ్రీ కమ్మరచేడు కళ్యాణస్వామి మఠంలో శరన్నవరాత్రులు పూజలను ఘనంగా నిర్వహించిన అనంతరం సోమవారం రాత్రి శ్రీదేవి పురాణ ప్రవచనం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఏటా శ్రీకమ్మర చేడు కళ్యాణ స్వామి మఠంలో దసరా శరన్నవరాత్రులు పూజలు చేయడం సంతోషకర విషయమన్నారు. సమాజ సేవలో కళ్యాణ స్వామి ముందుంటారని, ఈ మఠంతో తనకు చిన్ననాటి నుంచి సంబంధాలు ఉన్నాయని, మఠాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. యలబుర్గి సిద్ధలింగ స్వామీజీ మాట్లాడుతూ... 2008లో కూడ్లిగి నియోజకవర్గం నుంచి పోటీ చేసిన నాగేంద్ర చిన్నవయస్సులోనే ఎమ్మెల్యేగా గెలుపొంది, అనంతరం జరిగిన నాలుగుసార్లు ఎన్నికల్లో కూడా ఘన విజయం సాధించి ఓటమి ఎరగని నాయకుడుగా గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. అనంతరం మంత్రిని స్వామీజీలు ఘనంగా సన్మానించగా, స్వామీజీలను మంత్రి సన్మానించి ఆశీర్వచనం పొందారు. కార్యక్రమంలో మఠాధీశులతో పాటు, కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకటేశ్ ప్రసాద్, కార్పొరేటర్ విక్కీ తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా చెప్పేది కవిత్వం

గంగావతి రూరల్: రసవత్తరంగా చెప్పేది కవిత్వమని సీనియర్ సాహితీవేత్త జనలింగప్ప మేణసగి అన్నారు. ఆయన నగరంలో లయన్స్ క్లబ్ కావ్యలోక సంఘటనతో పాటు కర్ణాటక రక్షణా వేదిక జిల్లా ఘటక సంయుక్త ఆశ్రయంలో ఏర్పాటు చేసిన 102వ దసరా కవిగోష్టి కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ... కవిత్వంతో హృదయం వికసిస్తుంది, కవిత్వానికి అవధులు లేవు అని అన్నారు. అనంతరం రాఘవేంద్ర మంగళూరు కవిగోష్టి ప్రారంభించి మాట్లాడుతూ సీనియర్ రచయితల మార్గదర్శనం లేకుండా సాహిత్య రచనలు చేయకూడదన్నారు. కవిత్వం అంటే ఏమిటో తెలియని వారి నుండి సాహిత్యం సృశించడం మంచిదికాదన్నారు. ఈ సందర్భంగా అడ్వకేట్ శరణప్ప సజ్జిహొల, కరవే జిల్లా అధ్యక్షులు పంపణ్ణ నాయక, కావ్యలోక గౌరవ అధ్యక్షులు డాక్టర్ శివకుమారు, అధ్యక్షులు పరుశురామ్ ప్రియ, నర్మదాబాయి కులకర్ణి, శకుంతలా నాయక, యు.ఆర్ శివరుద్రప్పతో పాటు పలువురు కళాకారులు పాల్గొన్నారు.

ఉక్కు ఫ్యాక్టరీలో ఆపరేటర్ దుర్మరణం



మనోజ్‌కుమార్

బొమ్మనహాళ్: అనంతపురం జిల్లా రాయదుర్గం నియోజకవర్గంలో బొమ్మనహాళ్ మండలంలోని హరేసముద్రం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న జిందాల్ సాప్ ఇనుము–ఉక్కు కార్మాగారంలో కన్వేయర్ బెల్ట్ తగిలి కార్మికుడు గాయపడి ఆస్పత్రిలో మరణించాడు. వివరాల మేరకు... కర్ణాటకలోని బళ్లారి నగరానికి చెందిన టి. మనోజ్‌కుమార్ (32) జిందాల్ కర్మాగారంలోని పవర్ ప్లాంట్‌లో బాయిలర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం కర్మాగారంలో పనిచేస్తుండగా కన్వేయర్ బెల్ట్‌లో కుడి కాలు ఇరుక్కుని తొడ భాగం వరకు విగిరిపోయింది. గమనించిన తోటి కార్మికులు వెంటనే బళ్లారిలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. తీవ్ర రక్తస్రావం కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని ఎస్‌ఐ తెలిపారు. మృతుని తల్లి వరలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. శవానికి బళ్లారి విమ్స్‌లో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. బాధిత కుటుంబాన్ని జిందాల్ యాజమాన్యం ఆదుకోవాలని కార్మికులు డిమాండ్ చేశారు.

పల్లకీ ఉత్సవానికి పోటెత్తిన భక్తులు



పల్లకీని మోసుకుని వస్తున్న భక్తులు

హొసపేటి: విజయ దశమి పండుగ సందర్భంగా హొసపేట తాలూకా నాగేనహళ్లి– కలఘట్ట గ్రామాల మధ్య కొలువై ఉన్న చన్నబసవేశ్వరుడు, నిజలింగమ్మ ధర్మధ గుడ్డలో బన్ని ముద్యోదన స్వామిని దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు పోటెత్తారు. విజయదశమి నాడు బన్నికి పూజలు చేయడం ఆనవాయితీ. విజయనగర సామ్రాజ్య కాలంలో హంపీ ప్రాంతంలో దసరా పండుగను అత్యంత వైభవంగా జరుపుకునే వారు. ఆ వారసత్వాన్ని ఇప్పటికి వాల్మీకి సమాజం కొనసాగిస్తోంది. పల్లకీ ఉత్సవానికి భక్తులు పోటెత్తారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

మాలూరు: తాలూకాలోని లక్కూరు ఫిర్కా మీణసంద్ర – కోడిహళ్లి రహదారిలో జరిగిన గ్రామ పంచాయతీ సభ్యుడు అనిల్‌కుమార్ హత్య కేసుకు సంబంధించి పోలీసులు మీణసంద్ర గ్రామానికి చెందిన అశోక్, అనిల్, ఆనంద్, అరవింద, గీతా, చన్నసంద్ర హరికాంత్‌లను అరెస్ట్ చేశారు.

● కిత్తూరు ఉత్సవం



మంగళవారం బెళగావి నగరంలో కిత్తూరు రాణి చెన్నమ్మ ఉత్సవం ఘనంగా ప్రారంభమైంది. గిరిజన మహిళల నృత్యాలు, కళాకారుల ప్రదర్శనలు నగరవాసులను అలరించాయి. కిత్తూరు కోటను విద్యుద్దీపాలతో అలంకరించారు.

జెడీపీ మాజీ అధ్యక్షుడి దారుణ హత్య



హత్యకు గురైన శ్రీనివాసన్ (ఫైల్)







పోలీసు కాల్పుల్లో గాయపడిన నిందితులు

- మారణాయుధాలతో నరికి చంపిన దుండగులు
- అరెస్టు సమయంలో నిందితుల దాడి, పోలీసుల ఎదురు కాల్పులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పోలీసులు

శ్రీనివాసపురం: శరన్నవరాత్రులలో మహర్నవమి రోజున శ్రీనివాసపురం తాలూకాలో దారుణం చోటు చేసుకుంది. జిల్లా పంచాయతీ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాసన్ (62) దారుణ హత్యకు గురయ్యాడు. మాజీ స్పీకర్ కెఆర్ రమేష్‌కుమార్ అనుచరుడు, హోం మంత్రి పరమేశ్వర్ ఆప్తుడి శ్రీనివాసన్ కౌన్సిలర్ శ్రీనివాస్‌గా గుర్తింపు పొందాడు. సోమవారం తన తోటలోని ఫాంహౌస్‌లో హత్యకు గురయ్యాడు. శ్రీనివాసపురం సమీపంలోని హొగళగెరె వద్ద హత్య జరిగింది. రక్త గాయాలతో చావుబతుకుల మధ్య ఉన్న శ్రీనివాసన్‌ను అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించి అక్కడి నుంచి ఆర్‌ఎల్ జాలప్ప ఆస్పత్రికి తరలించారు. చికిత్స ఫలించక శ్రీనివాసన్ ఆస్పత్రిలో మృతి చెందాడు.

ప్రత్యక్ష సాక్షి కథనం: ఘటనను ప్రత్యక్షంగా చూసిన అమర్ అనే వ్యక్తి కథనం మేరకు ...నూతనంగా నిర్మిస్తున్న బార్ నిర్మాణ పనులను వీక్షించి తిరిగి తోటలోని ఇంటికి వచ్చామని, ఈ సమయంలో రెండు ద్విచక్ర వాహనాలలో తోటలోకి వచ్చిన దుండుగులు అంకుల్ బాగున్నారా అని పలకరించి షేక్‌హాండ్ ఇచ్చే నెపంతో ముందుకు వచ్చి మారణాయుధాలతో శ్రీనివాసన్‌ను నరికి చంపారని తెలిపాడు. దుండుగులు ఈ ప్రాంతంలో తిరుగుతున్నట్లు చూశానని తెలిపారు.

రమేష్ కుమార్, హోం మంత్రి పరమేశ్వర్ పరామర్శ :

హత్య విషయం తెలిసిన వెంటనే హోం మంత్రి పరమేశ్వర్, మాజీ స్పీకర్ రమేష్‌కుమార్ ఆర్‌ఎల్ జాలప్ప ఆస్పత్రికి వెళ్లి శ్రీనివాసన్ భౌతిక కాయాన్ని సందర్శించారు. రమేష్ కుమార్ కన్నీరు పెట్టుకున్నారు. శ్రీనివాస హంతకులను వెంటనే పట్టుకుంటామని పరమేశ్వర్ తెలిపారు.

పోలీసులపై ఎదురుదాడి, నిందితులపై కాల్పులు

శ్రీనివాసన్ హత్య అనంతరం హంతకులు ఆరుగురు లక్ష్మీ సాగర అటవీ ప్రాంతంలో తలదాచుకున్నారు. నిందితులను పట్టుకోవడం కోసం మూడు ప్రత్యేక బృందాలను ఎస్పీ నారాయణ్ రంగంలోకి దింపి 24 గంటల్లోపు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో వేమగల్ సీఐ వెంకటేష్ నేతృత్వంలోని ఓ బృందం లక్ష్మీ సాగర అటవీ ప్రాంతంలో గాలింపు చేపట్టారు. తారసపడిన హంతకులు పట్టుకోవడానికి యత్నించగా వారు పోలీసులపై దాడి చేశారు. దీంతో సీఐ కాల్పులు జరిపారు. నిందితులు మునీంద్ర, సంతోష్, వేణుగోపాల్‌కు గాయాలయ్యాయి. నిందితుల దాడిలో పోలీసులు ముంజునాథ్, నాగేశ్‌లు కూడా గాయపడ్డారు. అందరినీ ఎస్‌ఎన్‌ఆర్ ఆస్పత్రికి తరలించారు. మిగిలిన ముగ్గురి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

రాజకీయ, ఆస్తి తగాదాలే కారణమా ? హతుడు శ్రీనివాసన్, వేణుల మధ్య ఏడేళ్లగా రాజకీయ వైరంతో పాటు భూ వివాదాలు కూడా ఉన్నట్లు సమాచార. ఈ నేపథ్యంలోనే హత్య జరిగిందని భావిస్తున్నారు.

చిరుతల సంచారం, స్థానికుల ఆందోళన

శ్రీనివాసపురం: ముళబాగిలు తాలూకాలోని పలు గ్రామాల తోటల సమీపంలో చిరుతల సంచారం ప్రజలను భయాందోళకు గురిచేస్తోంది. తాలూకాలోని అత్తికుంటె, కాడ కచ్చిన హళ్లి, చొక్కదొడ్డి, మల్లికచ్చనహళ్లి, ఆవణి తదితర ప్రాంతాలలో చిరుతలు సంచరించిన గుర్తులు కనిపిస్తున్నాయి. ఇటీవల చిరుత అత్తికుంట గ్రామంలో ఓ ఆవుపై దాడి చేసి గాయపరిచింది. చిరుతను బంధించడానికి బోనులు పెట్టినా ఫలితం లేకపోతోంది. తాలూకాలోని గ్రామాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చిరుతలను వెంటనే పట్టుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.